

'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 300

మంగళవారం 21-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




స్వియాటెక్ ఫటాఫట్

59 నిమిషాల్లోనే నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరిన పోలాండ్ టెన్నిస్ స్టార్ -14లో



ఏటా రూ. 2 వేల కోట్లు

వాణిజ్య వాహనాల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్న టాటా మోటార్స్ -15లో



బైడెన్ క్షమాభిక్షలు

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పదవి నుంచి దిగిపోయే ముందు చివరి నిమిషంలో పలువురికి క్షమాభిక్షలు ప్రసాదించారు.

వివరాలు 6లో ▸



రాహుల్‌కు ఊరట

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యల కేసులో ట్రయల్ కోర్టు విచారణపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

వివరాలు 6లో ▸



90 మందికి విముక్తి

హమాస్‌తో కుదిరిన ఒప్పందంలో భాగంగా వెస్ట్ బ్యాంక్‌కు చెందిన 90 మందిని జైళ్ల నుంచి ఇజ్రాయెల్ విడుదల చేసింది.


వివరాలు 6లో ▸



ఎన్‌కౌంటర్‌లో ఏపీ జవాను మృతి

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన జవాను కార్తీక్ మృతిచెందారు.

వివరాలు 6లో ▸



సోమవారం యూఎస్ క్యాపిటల్ భవనంలోని రోటుండా హాల్‌లో దేశాధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న డొనాల్డ్ ట్రంప్. చిత్రంలో భార్య మెలానియా, కుమార్తె ఇవాంకా తదితరులు

> ఈ క్షణం నుంచే అమెరికాకు స్వర్ణయుగం మొదలైంది. నేటి నుంచి దేశం అన్ని రంగాల్లోనూ అద్భుతంగా రాణిస్తుంది. ప్రపంచమంతటి నుంచీ మన్ననలు పొందుతుంది. ప్రతి దేశమూ అసూయపడేలా అభివృద్ధి చెందుతుంది. అన్ని విషయాల్లోనూ 'అమెరికా ఫస్ట్' అన్నదే మన నినాదం. అదే మన మూలమంత్రం.
>
> - డొనాల్డ్ ట్రంప్

ఇక స్వర్ణయుగం

అన్నింటా 'అమెరికాయే ఫస్ట్': తొలి ప్రసంగంలో డొనాల్డ్ ట్రంప్

47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం

హాజరైన దేశాధినేతలు, సీఈఓలు

ప్రధాని మోదీ తదితరుల అభినందనలు

వెంటనే తన మార్కు చూపిన ట్రంప్

తొలి ప్రసంగంలోనే సంచలన ప్రకటనలు

డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయాలు

విదేశాలపై హెచ్చు టారిఫ్‌లు, సుంకాలు

మెక్సికో సరిహద్దుల్లో జాతీయ ఎమర్జెన్సీ

అమెరికాలోకి వలసలపై ఇక ఉక్కుపాదం

గల్ఫ్ ఆఫ్ మెక్సికోకు గల్ఫ్ ఆఫ్ అమెరికాగా పేరుమార్పు

ధరలకు కళ్లెం, న్యాయవ్యవస్థకు సంకెళ్ల నుంచి విముక్తి

పనామా కాల్వ ఇక అమెరికాదేనని ప్రకటన

6లో

సంజయ్‌కు జీవితఖైదు

కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై రేప్, హత్య కేసులో బెంగాల్ కోర్టు తీర్పు

రూ.50,000 జరిమానా కూడా విధింపు 6లో



బాధిత కుటుంబానికి రూ. 17 లక్షల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ సర్కారుకు ఆదేశం

ఉరిశిక్ష విధించాలన్న డిమాండ్లను, సీబీఐ వాదనను తోసిపుచ్చిన కోర్టు.. ఇది ఆ కోవలోకి వచ్చే అత్యంత అరుదైన నేరం కాదని అభిప్రాయపడ్డ జడ్జి

తీర్పుపై తల్లిదండ్రుల అసంతృప్తి.. హైకోర్టులో అప్పీల్ చేస్తామని వెల్లడి.. తమకు పరిహారం వద్దని స్పష్టీకరణ

శిక్ష సరే.. రక్షణ ఏదీ?

కోర్టు తీర్పు నేపథ్యంలో పలు రంగాలకు చెందిన మహిళా ప్రముఖుల స్పందన 13లో

బాయ్‌ఫ్రెండ్‌ను చంపిన యువతికి మరణశిక్ష

కేరళ సెషన్స్ కోర్టు సంచలన తీర్పు



- ఆధారాలను ధ్వంసం చేసిన బంధువుకు మూడేళ్ల జైలు
- ఎంతో అరుదైన కేసుగా పేర్కొన్న న్యాయస్థానం
- శిక్ష తగ్గించాలంటూ గ్రీష్మ చేసిన వినతులను తోసిపుచ్చిన జడ్జి

6లో

అమెరికాలో కాల్పులు.. హైదరాబాదీ మృతి

ఎంఎస్ చదివి ఓ రెస్టారెంట్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్న రవితేజ



- ఆదివారం రాత్రి కేక్ డెలివరీ చేసేందుకు వెళ్లగా కాల్పులు జరిపి పరారైన దుండగులు
- అక్కడికక్కడే రవితేజ మృతి.. కొడుకు మరణవార్తతో తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

5లో

న్యూస్‌రీల్

కొత్త ఏఈఈలకు అందని జీతాలు!



రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల నిర్వాకంతో కొత్తగా నియమితులైన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)లకు నాలుగు నెలలుగా వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. ఎంపికైన జోన్ పరిధిలో కాకుండా ఇతర జోన్‌లో పోస్టింగ్ ఇవ్వడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

- వివరాలు 3లో ▶

కొత్త కోర్సులుంటేనే కాలేజీలకు అనుమతి!



యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిజైన్ చేసిన కోర్సులను అందుబాటులోకి తెచ్చిన డిగ్రీ కాలేజీలకే ఈసారి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఇంటర్ పరీక్షలు పూర్తయ్యేలోగా ఈ మార్పులపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

- వివరాలు 16లో ▶

'కాళేశ్వరం'పై ప్రాథమిక నివేదిక రెడీ!



కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్వహిస్తున్న విచారణ ఓ కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. ఇప్పటివరకు నిర్వహించిన సుదీర్ఘ విచారణలో కమిషన్ గుర్తించిన అంశాలు, అవకతవకలు, ఇతర అంశాలపై సుమారు 204 పేజీలతో ప్రాథమిక నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం.

- వివరాలు 3లో ▶

జ్యూరిక్ ఎయిర్‌పోర్టులో కలిసిన సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబుతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్



జ్యూరిక్‌లో రేవంత్, చంద్రబాబు భేటీ

- ఎయిర్‌పోర్టులో ఇద్దరు సీఎంల సమావేశం
- అక్కడి నుంచి దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం భేటీకి పయనం.. అంతర్జాతీయ కంపెనీలతో భేటీ కానున్న రాష్ట్ర బృందం

2లో

'ప్రైవేటు' చేతికి ఆర్టీసీ డిపోలు!

ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేస్తున్న సంస్థకు డిపోలను అప్పగిస్తున్న రోడ్డు రవాణా సంస్థ

- అక్కడి సొంత బస్సులు, సిబ్బందిని వేరే డిపోలకు తరలింపు.. వరంగల్–2, హైదరాబాద్–1 డిపోలతో శ్రీకారం
- త్వరలో కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట సహా మరికొన్ని డిపోలు కూడా..

2లో

1600 మెగావాట్ల విద్యుత్ కేంద్రం

ఒడిశాలోని నైనీ బ్లాక్ దగ్గర ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

- మార్చి నుంచి నైనీలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తాం
- ఒడిశా సీఎం మోహన్ చరణ్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి

2లో



సోమవారం హైకోర్టులో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేను సన్మానిస్తున్న సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ 16లో

ఇదంజగత్



క్లుప్తంగా...

ప్రజాస్వామ్యానికి మూలస్తంభం మీడియా

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మీడియా రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని రిపోర్టర్లు పనిచేయడం ప్రశంసనీయమని, ప్రజాస్వామ్యానికి మూలస్తంభం మీడియా అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రజలకు, పాలకులకు వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం అందించడం గొప్ప విషయమని తెలిపారు. సోమవారం రాజ్‌భవన్‌లో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (జాట్) 2025 డైరీని గవర్నర్ ఆవిష్కరించి మాట్లాడారు. కాలంతో పోటీపడి క్షణం క్షణం సమాజాన్ని జాగ్రత్త పరుస్తున్న మీడియా రంగానికి ప్రతిఒక్కరూ రుణపడి ఉంటారని తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సమాజ సేవలో నిరంతరం పనిచేస్తున్న విలేకరులు ఆదర్శప్రాయులని అభిప్రాయపడ్డారు. మీడియా రంగంలో వస్తున్న మార్పులు.. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పగడాకుల బాలస్వామి, ఘనపూర్ రాఘవేందర్‌గౌడ్, వార్ల ఆంజనేయులు, జూలూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

గవర్నర్‌కు బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వినతి



సాక్షి, హైదరాబాద్: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని బీజేపీ తరఫున టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్క కొమురయ్య గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. ఆయన సోమవారం గవర్నర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జాతీయ విద్యా విధానం 2020ను తెలంగాణలో అమలుచేసేలా చూడాలని డిమాండ్ చేశారు. టీచర్లకు పెండింగ్ డీఏ, అలవెన్స్‌లు చెల్లించాలని, ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు మెరుగుపర్చాలని, కొత్త పీఆర్సీ అమలు జరిగేలా చూడాలని కోరారు.

పాట్నా సదస్సుకు మండలి చైర్మన్, స్పీకర్



సాక్షి, హైదరాబాద్: బిహార్ రాజధాని పాట్నాలో జరుగుతున్న అఖిల భారత ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఏఐపీఓసీ)లో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. 20, 21 తేదీల్లో జరిగే ఈ సదస్సులో పాల్గొనేందుకు మండలి చైర్మన్, స్పీకర్ ఆదివారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లిన విషయం తెలిసిందే. సోమవారం సదస్సు ప్రారంభానికి ముందు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో మండలి చైర్మన్, స్పీకర్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన ప్రతినిధి బృందంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు తదితరులు ఉన్నారు.

ఎయిమ్స్ వద్ద మానవీయ సంక్షోభం: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) వద్ద మానవీయ సంక్షోభం నెలకొన్నదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఎయిమ్స్ పరిసర ప్రాంతాల్లో వందలాదిగా రోగులు, వారి సంబంధీకులు ఎముకలు కొరికే చలిలో వైద్య సేవల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితులపై రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిమ్స్ దగ్గరి రోడ్లు, ఫుట్‌పాత్‌లతోపాటు సబ్ వేలో జనం వైద్యం కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నారన్నారు. ఈ నెల 16న స్వయంగా వారిని కలిసి మాట్లాడినట్లు రాహుల్ సోమవారం 'ఎక్స్'లో తెలిపారు.

ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడటమే ధ్యేయం

ఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధారెడ్డి

సాక్షి న్యూఢిల్లీ: భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడటానికి, సమాజ శ్రేయస్సును ప్రోత్సహించడంలో తాము ముందున్నట్లు ఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఆర్ ఫౌండేషన్ సహకారంతో 'మహాకుంభ్–2025'లో శ్రీ జగన్నాథ ఆలయ నిర్మాణంలో 'మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), ఎస్‌ఆర్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా భాగస్వామ్యం అయినట్లు తెలిపారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ స్థిరత్వం, సాంస్కృతిక పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సుధారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు.

'ప్రైవేటు' చేతికి ఆర్టీసీ డిపోలు!

- ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేస్తున్న సంస్థకు డిపోలను అప్పగిస్తున్న రోడ్డు రవాణా సంస్థ
- అక్కడి సొంత బస్సులు, సిబ్బంది వేరే డిపోలకు తరలింపు
- వరంగల్–2, హైదరాబాద్–1 డిపోలతో శ్రీకారం
- త్వరలో కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట సహా మరికొన్ని డిపోలు కూడా..
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డ్రైవర్ల ఉద్యోగాలపై ఎఫెక్ట్
- ఆర్టీసీ ఉద్యోగుల్లో అలజడి.. ఇది సంస్థ ప్రైవేటీకరణకు దారితీసినట్టేనని ఆందోళన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పెద్ద ఆర్టీసీ డిపోలు ప్రైవేటు సంస్థ పరిధిలోకి వెళ్లిపోతున్నాయి. అద్దె బస్సుల సంఖ్య మరింతగా పెరిగిపోతోంది. ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగాలకు కోత పడే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిణామాలన్నీ ఆర్టీసీ ఉద్యోగులలో కలకలం రేపుతున్నాయి. ఇది ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడమేమీ కాకపోయినా.. ప్రైవేటీకరణకు దారితీసినట్టేననే ఆందోళనకు దారితీస్తున్నాయి.

ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంలో భాగంగా..

వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించటం, డీజిల్ భారాన్ని తగ్గించుకోవటం లక్ష్యంగా ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకుంటోంది. క్రమంగా వాటి సంఖ్య పెరుగుతోంది. ఇంతకాలం హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఒలెక్ట్రా సంస్థ నుంచి ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకున్న ఆర్టీసీ.. ఇప్పుడు ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ నుంచి తీసుకుంటోంది. ఒక్కో ఎలక్ట్రిక్ బస్సు ధర రూ.కోటిన్నరపైనే కావడంతో వాటిని కొనటం తలకుమించిన వ్యవహారమని భావిస్తున్న ఆర్టీసీ.. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో వాటిని అద్దెకు తీసుకుంటోంది. ఆ సంస్థ ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి సమకూరిస్తే.. ఈ బస్సులు తిరిగిన దూరం ఆధారంగా కిలోమీటరుకు ఇంత అని నిర్ధారిత మొత్తాన్ని ఆర్టీసీ అద్దెగా చెల్లిస్తుంది. బస్సు నిర్వహణ, డ్రైవరు, మెకానిక్ సిబ్బందిని ఆ ప్రైవేటు సంస్థనే సమకూర్చుకుంటుంది. కండక్టర్లు మాత్రమే ఆర్టీసీ తరఫున ఉంటారు. ఇలా జేబీఎం సంస్థ 500 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి అద్దెకిస్తుంది. అందులో ఇప్పటికే దాదాపు 150 బస్సులను సరఫరా చేసింది. మిగతావి విడతల వారీగా రానున్నాయి. ఈ బస్సులను ప్రస్తుతానికి నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ పట్టణాలకు కేటాయించారు. త్వరలో హైదరాబాద్‌లోని ఓ డిపోకు అందనున్నాయి. తర్వాత నల్లగొండ, సూర్యాపేట లాంటి పట్టణాలకు కూడా సమకూర్చుతారు. ఇంతకాలం ఎలక్ట్రిక్ బస్సులు అనగానే ఏసీ బస్సులే ఉండేవి. ఇప్పుడీ సంస్థ నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేస్తోంది. వాటిని సూపర్ లగ్జరీ, డీలక్స్, సెమీ డీలక్స్, ఎక్స్‌ప్రెస్ కేటగిరీల్లో తిప్పుతున్నారు.

ఈ బస్సుల కోసం డిపోలనే అప్పగిస్తూ..

అయితే ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్ డిపోలను సదరు జేబీఎం సంస్థకే అప్పగించేందుకు ఏర్పాట్లు జరుగుతుండటం కలకలం రేపుతోంది. తాజాగా వరంగల్–2 డిపోకు 75 ఎలక్ట్రిక్ బస్సులు అందాయి. మరో 40 బస్సులు రానున్నాయి. హైదరాబాద్‌లోని హైదరాబాద్–1 డిపోకు 75 బస్సులు సమకూరనున్నాయి. ఈ రెండు డిపోల నుంచి ఆర్టీసీ సొంత బస్సులను ఇతర డిపోలకు మార్చేసి... ఆ రెండు డిపోలను పూర్తిగా జేబీఎం సంస్థకు కేటాయించాలని నిర్ణయించారు. ఇప్పటికే వరంగల్ డిపో నుంచి సొంత బస్సులను ఇతర డిపోలకు తరలించేశారు. హైదరాబాద్–1 డిపో బస్సులను హైదరాబాద్–3 డిపోకు బదిలీ చేస్తున్నారు. నిజామాబాద్, కరీంనగర్ డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరిగితే వాటిని.. భవిష్యత్తులో మిగతా బస్సులు సరఫరా అయ్యాక ఆయా డిపోలను కూడా ప్రైవేటు సంస్థకు అప్పగిస్తారన్న ప్రచారం ఆర్టీసీ ఉద్యోగుల్లో జోరుగా సాగుతోంది.

సిబ్బందిని కూడా తరలించేస్తూ...

ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకిస్తున్న సంస్థ ఆ బస్సులు నడిపేందుకు డ్రైవర్లు, వాటి మరమ్మతులు చేపట్టేందుకు మెకానిక్ సిబ్బందిని సొంతంగానే సమకూర్చుకుంటుంది. ఆ డిపోల్లో ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది అవసరం ఉండదు. వీరి వ్యవహారాలు చూసే డిపో అధికారులకూ పని ఉండదు. కేవలం కండక్టర్లు మాత్రమే ఆర్టీసీ పక్షాన పనిచేస్తారు. కేవలం వీరి వ్యవహారాలు చూసేందుకు ఒకరిద్దరు ఆర్టీసీ సిబ్బంది, డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ మాత్రమే డిపోలలో ఉంటారు. డిపోలో కార్యకలాపాలన్నీ ప్రైవేటు సంస్థ అధీనంలోనే నడుస్తాయి. బస్సుల చార్జింగ్ కోసం ఆ సంస్థనే చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకుంటుంది. విద్యుత్ సరఫరా వ్యవస్థను మాత్రం ఆర్టీసీ ఏర్పాటు చేస్తుంది.

ఇకపై నియామకాలు లేనట్టే!

ప్రస్తుతం ఆర్టీసీలో దాదాపు 7 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీ కోసం గతంలో ప్రక్రియ ప్రారంభించినా నిలిచిపోయింది. అయితే ఆర్టీసీలోకి అద్దె బస్సులు భారీగా వస్తుండటం, వాటి నిర్వహణకు ప్రైవేటు సంస్థల సిబ్బందే ఉంటుండటంతో... ఆర్టీసీలో ఇకపై నియామకాలు ఉండక పోవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది ప్రైవేటీకరణకు దారితీసినట్టేనని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు.

హైదరాబాద్‌లో డిపోలన్నీ ప్రైవేటు చేతికే!

హైదరాబాద్ నగరంలో తిప్పుతున్న ఆర్టీసీ డీజిల్ బస్సులను వెలుపలికి తరలించి.. వాటి స్థానంలో 2,800 ఎలక్ట్రిక్ బస్సులు తిప్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బస్సుల కోసం పీఎం ఈ–డ్రైవ్ పథకం కింద కేంద్రానికి దరఖాస్తు చేసింది. ఆ బస్సులను కూడా జీసీసీ పద్ధతిలోనే నడుపుతారు. అంటే ఆ బస్సులు చేరే డిపోలన్నీ ప్రైవేటు సంస్థ అధీనంలోకి వెళతాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని దాదాపు అన్ని డిపోలు ప్రైవేటు నిర్వహణలోకి చేరుతాయనే అభిప్రాయం వినిపిస్తోంది.

వేల మంది డ్రైవర్ల భవిష్యత్ ప్రశ్నార్థకం!

హైదరాబాద్‌లో మొత్తంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనుండటం, అవి అద్దె బస్సులు కానుండటంతో.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 6,000 మంది ఆర్టీసీ డ్రైవర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది. నగరంలో డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించిన కొద్దీ.. ఆర్టీసీ సొంత బస్సులతోపాటు డ్రైవర్లను కూడా ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. ఆయా చోట్ల అవసరానికి మించి డ్రైవర్లు ఉంటే.. స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) దిశగా ఒత్తిడి చేసే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కాలుష్య రహిత, పర్యావరణహిత ప్రజారవాణా సదుపాయం ఆహ్వానించదగ్గదే అయినా.. ఆర్టీసీ సిబ్బంది భవిష్యత్తును దెబ్బతీయకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్న డిమాండ్ వస్తోంది. ''ప్రైవేట్ సంస్థలు తమ ఎలక్ట్రిక్ వాహనాలకు గిరాకీని సృష్టించుకోవడం కోసం ఆర్టీసీలను బలితీసుకుంటున్నాయి. ఇది ఆర్టీసీ ఉద్యోగులకు తీవ్ర నష్టదాయకం''అని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి పేర్కొన్నారు.



ఒడిశా సీఎం మోహన్ చరణ్‌కు లేఖ ఇస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఒడిశాలో 1,600 మెగావాట్ల విద్యుత్ కేంద్రం

- మార్చి నుంచి నైనీలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- నైనీ బ్లాక్ దగ్గర ఏర్పాటుకు స్థలం కేటాయించండి... ఒడిశా సీఎం మోహన్ చరణ్‌ను కోరిన భట్టి
- కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో మార్చి నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒడిశాలోని కోణార్క్‌లో జరుగుతున్న మూడో జాతీయ మైనింగ్ మంత్రుల సదస్సులో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి ఆ రాష్ట్ర సీఎం మోహన్ చరణ్ మాఝీకి ఆయన విజ్ఞాపన లేఖను అందజేశారు. నైనీ బ్లాకు ఏర్పాటుకు ఒడిశా సీఎం కార్యాలయం మద్దతు ఇచ్చినందుకు ఆయన రాష్ట్ర ప్రభుత్వ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. నైనీ గనికి సమీపంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రం స్థాపనకు భూమిని కేటాయించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరగా, ఒడిశా సీఎం సానుకూలంగా స్పందించి సహకరిస్తామని హామీ ఇచ్చారు. 'గత జూలై 24న మీతో జరిగిన సమావేశాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ చర్చలు ఫలవంతమయ్యాయి'అని భట్టి సంతోషం వ్యక్తం చేశారు. నైనీ గనిలో ఉత్పత్తయిన బొగ్గును 1000 కి.మీ. దూరంలో ఉన్న మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తే రవాణా ఖర్చులు పెరిగి విద్యుత్ ధరలూ భారీగా పెరుగుతాయి. ఈ నేపథ్యంలో నైనీ గనికి సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ ఉత్పత్తయ్యే బొగ్గును అక్కడే వినియోగించాలని నిర్ణయించామని భట్టి తెలిపారు. 20వ ఎలక్ట్రిక్ పవర్ సర్వే ప్రకారం వచ్చే మూడు దశాబ్దాలపాటు థర్మల్ విద్యుత్‌కు భారీ డిమాండ్ ఉంటుందన్నారు. బొగ్గు గనుల దగ్గరే కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో బొగ్గు రవాణా ఖర్చులను తగ్గించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా, పర్యావరణ పర్యవేక్షణకు అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. సింగరేణి, ఒడిశా అధికారుల మధ్య జరిగిన చర్చల్లో ప్రాథమికంగా జరపాడ/తుకుడ, హండప్ప/బని నాలిని ప్రాంతాల్లో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తే రెండు రాష్ట్రాలకూ ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయానికి వచ్చారన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

10 ప్రాజెక్టులకు నిధులిప్పించండి

తెలంగాణ చేపడుతున్న పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయంతోపాటు అనుమతులు ఇప్పించేందుకు సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న పది ప్రాజెక్టులకు మొత్తం రూ.1,63,559 కోట్ల వ్యయం కానుందని తెలిపారు. మైనింగ్ మంత్రుల సమావేశంలో ఆయా ప్రాజెక్టుల ఆర్థిక అంచనాలు, అనుమతుల ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని కిషన్‌రెడ్డికి అందజేశారు.

32 ఖనిజ బ్లాకులను వేలం వేస్తాం

సున్నపురాయి, మాంగనీసు వంటి 32 మేజర్ ఖనిజ బ్లాకులను 2024–25, 2025–26 సంవత్సరాలకు సంబంధించి వేలం వేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. 2014లో రూ.1958 కోట్లుగా ఉన్న ఖనిజ ఆదాయం 2023–24 నాటికి రూ.5,540 కోట్లకు పెరిగిందన్నారు. జాతీయ ఖనిజ మంత్రుల సమావేశంలో భట్టి ప్రసంగించారు. 'జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు అనుగుణంగా ఖనిజాన్వేషణ, నిర్వహణ ఉండాలి. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ దేశీయంగా ఖనిజ పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాష్ట్రంలో మొత్తం 2,552 గనుల లీజుల ఉన్నాయని, చిన్న ఖనిజాల లీజు మంజూరు విషయంలో బ్లాక్‌ల వేలం విధానంలో అనుసరించే నిబంధనలు పాటిస్తున్నాం'అని భట్టి వెల్లడించారు. జిల్లా మినరల్ ఫౌండేషన్ ద్వారా 2015 నుంచి ఇప్పటివరకు రూ. 5,537 కోట్లు వసూలైందని, ఈ నిధిని ప్రభుత్వ పాఠశాలలతో పాటు పలు ప్రాధాన్యతా రంగాల్లో వినియోగిస్తున్నామన్నారు.



సోమవారం స్విట్జర్లాండ్‌లో జ్యూరిక్ నుంచి దావోస్‌కు రైలులో ప్రయాణిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. మంత్రి శ్రీధర్‌బాబు

జ్యూరిక్‌లో రేవంత్, చంద్రబాబు భేటీ

- ఎయిర్‌పోర్టులో సమావేశమైన ఇద్దరు సీఎంలు
- అక్కడి నుంచి దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం భేటీకి పయనం
- అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్న రాష్ట్ర బృందం
- రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేలా ప్రణాళికలు

సాక్షి, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'రైజింగ్ తెలంగాణ'బృందం సోమవారం ఉదయం ఆ దేశంలోని జ్యూరిక్ పట్టణానికి చేరుకుంది. జ్యూరిక్ ఎయిర్‌పోర్టులో సీఎం బృందానికి ప్రవాస తెలంగాణ వాసులు స్వాగతం పలికారు. మరోవైపు దావోస్ సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని బృందం కూడా జ్యూరిక్ చేరుకుంది. ఎయిర్‌పోర్టులోనే ఇద్దరు సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ రంగాల్లో పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై వారు చర్చించినట్టు సమాచారం. ఈ భేటీలో కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్, చంద్రబాబులతో ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధి బృందాలు ఫొటోలు దిగాయి.

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా..

రాష్ట్ర ప్రతినిధి బృందం జ్యూరిక్ నుంచి రైలులో దావోస్ నగరానికి చేరుకుని ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొంటుంది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి ఈ సదస్సు ప్రారంభం కానుంది. ఇందులో పలువురు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో సీఎం బృందం భేటీ కానుంది. అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేలా ప్రణాళికలను వెల్లడించనుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోనుంది.

బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ ప్రత్యేక భేటీ

ఈనెల చివరివారం.. లేదంటే వచ్చే నెలలో నిర్వహించే యోచనలో ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర సర్వే ఆధారంగా ఈ ఎన్నికల్లో బీసీలకు కల్పించే రిజర్వేషన్లపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ నెల చివరి వారంలో లేదంటే వచ్చే నెల మొదటి వారంలో ఒక రోజు అసెంబ్లీని సమావేశపరిచి స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని అధికారికంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తారని ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. అదే విధంగా అన్ని రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేలా కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేస్తారనే చర్చ కూడా సాగుతోంది.

నేడు బెల్గావ్‌కు 9మంది మంత్రులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దావోస్ పర్యటనలో ఉండగా, నేడు మరో 9 మంది మంత్రులు కర్ణాటకకు వెళుతున్నారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో కర్ణాటకలోని బెల్గావ్ పట్టణంలో నిర్వహించే సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొనేందుకు జూపల్లి మినహా అందరు మంత్రులు వెళుతున్నట్టు సమాచారం.

'మైనింగ్' అనుమతులు రద్దు చేయండి

- పురుగు మందు డబ్బాలతో రోడ్డెక్కిన మైలారం గ్రామస్తులు
- గ్రామస్తులకు మద్దతు తెలిపేందుకు వెళుతుండగా హరగోపాల్‌ను అడ్డుకున్న పోలీసులు



పురుగు మందు డబ్బాలతో ఆందోళనకు దిగిన మైలారం గ్రామస్తులు

బల్మూర్/వెల్దండ: మైనింగ్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని మైలారం గ్రామస్తులు పురుగుమందు డబ్బాలతో రోడ్డెక్కారు. వివరాల్లోకి వెళితే.. మైలారం గుట్టపై సర్వే నంబర్ 121లోని 35 ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి గ్రామంలో రిలే దీక్షలు చేపట్టేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు. అయితే దీక్షలకు అనుమతి లేదంటూ పోలీసులు కొందరిని ముందస్తుగా అరెస్టు చేశారు. మరోవైపు గ్రామస్తుల ఆందోళనకు మద్దతు ప్రకటించేందుకు, మైలారం గుట్టను పరిశీలించడానికి ప్రొఫెసర్ హరగోపాల్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ వస్తుండగా.. వెల్దండలో పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. దాదాపు గంటసేపు వారిని స్టేషన్‌లోనే ఉంచారు. విషయం తెలియగానే కోపోద్రిక్తులైన గ్రామస్తులు ప్రధాన రహదారిపై ముళ్ల కంచె వేసి పురుగుమందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. అక్రమంగా అరెస్టు చేసిన తమ గ్రామస్తులను విడుదల చేయడంతోపాటు గ్రామానికి ఎమ్మెల్యే వచ్చి..మైనింగ్ అనుమతులు రద్దు చేస్తున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గుట్టపై ప్రజాభిప్రాయం లేకుండానే మైనింగ్ తవ్వకాలకు అధికారులు ఎలా అనుమతులు ఇస్తారని నిలదీశారు.

ఆరు గంటలపాటు ఉద్రిక్తత

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సీఐ రవీందర్, ఎస్‌ఐ రమాదేవి ఆధ్వర్యంలో లింగాల, ఉప్పునుంతల, అమ్రాబాద్, అచ్చంపేట, సిద్దాపూర్ పోలీసులు అక్కడకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. గ్రామస్తులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మైలారం గ్రామం మీదుగా అప్పాయిపల్లి, అంబగిరి, చెన్నంపల్లి గ్రామాలకు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. మధ్యాహ్నం తర్వాత గ్రామానికి చెందిన మైలారం గుట్ట పోరాట సమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, లింగయ్యగౌడ్, లక్ష్మయ్య, సుమిత్ర తదితరులను పోలీసులు విడుదల చేయడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఖనిజ లవణాలపై గద్దల్లా వాలుతున్నారు: ప్రొఫెసర్ హరగోపాల్



దేశవ్యాప్తంగా ఖనిజ, లవణాలను తవ్వేందుకు గద్దల్లా వాలిపోతున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రకృతిని నాశనం చేసే మైనింగ్ తవ్వకాలను ప్రభుత్వాలు నిలిపివేయకుండా వ్యాపారులకు మద్దతు తెలపడం ఏమిటని ప్రశ్నించారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చి అనంతరం హరగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ ప్రకృతిని నాశనం చేయడం వల్ల భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ అందడం కష్టంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి మైలారంలో మైనింగ్ తవ్వకాలను నిలిపివేయాలన్నారు. ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూడటం తగదని చెప్పారు.

ఈటల వైపే బీజేపీ మొగ్గు?

- రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించే చాన్స్
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మపురి అర్వింద్?
- ఈ నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ప్రకటన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో 2029లో అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ అధిష్టానం.. పార్టీని విజయతీరాలకు చేర్చే సత్తావున్న నాయకుడికే రాష్ట్ర పార్టీ పగ్గాలు కట్టబెట్టాలని యోచిస్తోంది. రాజకీయ అనుభవం, సామాజిక వర్గం, పనితీరు, ప్రజాదరణ ఉన్న నేతకే అధ్యక్ష పదవి అప్పగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వైపు అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే సంస్థాగత ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగా.. జిల్లా అధ్యక్షుల ఎంపిక ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అధిష్టానం అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఈ తంతు పూర్తయితే.. ఈ నెల చివరి నాటికి లేదా ఫిబ్రవరి మొదటి వారంలో కొత్త రాష్ట్ర అధ్యక్షుడి నియామకం ఉంటుందని విశ్వసనీయవర్గాల సమాచారం. కాగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, ప్రస్తుతం ఎంపీగా ఉన్న ఈటలకు.. విశేష అనుభవంతో పాటు ప్రజాదరణ ఉందని బీజేపీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. తాము అధికారంలోకి వస్తే.. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతను ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఇప్పటికీ రాష్ట్రంలో బీసీ నినాదంతోనే బీజేపీ ముందుకుసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఈటలకు బీసీల్లో మంచి పట్టు ఉందని భావిస్తున్న జాతీయ నాయకత్వం.. అధ్యక్ష పదవి ఆయనకు అప్పగిస్తే, పార్టీని గెలుపు బాటలో పయనింపజేస్తారని, బీజేపీ బీసీ నినాదానికి కూడా న్యాయం జరుగుతుందనేది అధిష్టానం అభిప్రాయంగా ఉందని సమాచారం. ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేసిన వారు మాత్రమే అధ్యక్షుడు కావాలన్న నిబంధన ఏమీ లేదని, పార్టీలో యాక్టివ్ సభ్యత్వం ఉండి, రెండుసార్లు పార్టీ గుర్తు మీద గెలిచిన వారికి అధ్యక్ష పదవి వస్తుందని చెప్పడం గమనార్హం. కాగా ఈ వ్యాఖ్యలు ఈటల నియామకానికి సంకేతాలని ఆయన సన్నిహిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అధ్యక్ష పీఠం కోసం అర్వింద్ ప్రయత్నాలు

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా అధ్యక్ష పీఠం కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. అవకాశం చిక్కినప్పుడల్లా ఢిల్లీలో అధిష్టానం పెద్దలను కలిసి రాష్ట్ర పగ్గాలు అప్పగించాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే ఈటలనే అధ్యక్షుడిగా నియమించే పక్షంలో అర్వింద్‌ను మహారాష్ట్ర తరహాలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించాలని అధిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా...

రైతుభరోసాలో అర్హులకు అన్యాయం జరగొద్దు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: రైతుభరోసాలో అర్హులెవరికీ అన్యాయం జరగొద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతుభరోసా అమలుకు జరుగుతున్న సర్వే తీరుపై అన్ని జిల్లాల వ్యవసాయాధికారులతో మంత్రి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్క రైతు నష్టపోకుండా రైతుభరోసా అందేలా సర్వే జరగాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సాగుకు అనువుగాని భూములను గుర్తించి, గ్రామసభల్లో ఆ వివరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొత్తగా చేరిన పట్టాదారుల బ్యాంకు వివరాలను సహాయ వ్యవసాయాధికారులు నమోదు చేసే బాధ్యత తీసుకోవాలని, మండల వ్యవసాయాధికారులు వాటిని ధ్రువీకరించి అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ వివరాలు అప్‌లోడ్ చేసే సమయంలో సాంకేతికంగా ఏమైనా సమస్యలు తలెత్తితే.. వెంటనే తెలియ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ సంచాలకులు గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై తెలంగాణ జాగృతి సదస్సు

26న జరిగే సెమినార్‌లో చర్చ

సాక్షి, హైదరాబాద్: భారత 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'గణతంత్ర భారత్ – జాగ్రత్త భారత్'అనే అంశంపై సదస్సు జరగనుంది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరగనున్న ఈ సదస్సులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేస్తారు. రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణ, సవాళ్లు, కేంద్ర రాష్ట్ర సంబంధాలు, మహిళా సాధికారత, మైనారిటీలు, బలహీన వర్గాలు, కులగణన వంటి మొత్తం 16 అంశాలపై ఈ సెమినార్‌లో చర్చిస్తారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడుతూ అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగ ఫలాలు అందజేయడంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా ఈ సదస్సు జరుగుతోంది. సదస్సుకు ప్రజాస్వామిక వాదులు హాజరు కావాలని తెలంగాణ జాగృతి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కవిత కార్యాలయంలో జాగృతి నాయకులు విడుదల చేశారు.

బీఆర్‌ఎస్ అంటే... తెలంగాణ రాద్ధాంత సమితి

ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్






సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అంటే తెలంగాణ రాద్ధాంత సమితి అని, రాక్షస సమితి అని ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్ ధ్వజమెత్తారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఫాం హౌస్‌కి పరిమితమై పాలన చేశాడని, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఏడాదిగా అసెంబ్లీకి కూడా రావడం లేదని అన్నారు. పదేళ్లలో ఏఒక్క కుటుంబానికైనా రేషన్ కార్డుగానీ, పెన్షన్‌గానీ ఇచ్చారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో దేశంలోనే ఆత్మహత్యల్లో తెలంగాణ అగ్రభాగాన ఉన్నప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ నోరు మెదపలేదని నిలదీశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసి ఇప్పుడు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నేతలను గ్రామాల నుంచి ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో చేసిన అభివృద్ధికన్నా ఒక్క ఏడాదిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కువ చేసి చూపిందని, అభివృద్ధి, సంక్షేమం, హామీలు సమపాళ్లలో రేవంత్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందని వారు వెల్లడించారు.


నేరుగా ఎన్నికలు నిర్వహిస్తేనే సమగ్రాభివృద్ధి

రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు



సాక్షి, హైదరాబాద్: సమగ్రాభివృద్ధి జరగాలంటే మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులకు నేరుగా ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మున్సిపల్ చాంబర్స్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానంతరం వెన్‌రెడ్డి రాజు మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా గత ప్రభుత్వం వ్యవహరించిందని.. పురపాలక, పంచాయతీరాజ్ చట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పురపాలక చట్టాలను తెలంగాణలో అమలు చేయాలని, పన్నులు ఖరారు చేసే అధికారం స్థానిక సంస్థలకు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పురపాలికలు, నగరాల్లో విద్యుత్ దీపాల నిర్వహణ చేస్తున్న ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాతో వల.. బీ అలర్ట్!



- మళ్లీ పెరుగుతున్న మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ మోసగిస్తున్న సైబర్ మోసగాళ్లు
- హెల్ప్‌లైన్ నంబర్ 1930, 8712672222లో ఫిర్యాదు చేయాలన్న సైబర్ పోలీసులు
- అనుమానం ఉంటే మాకు సమాచారం ఇవ్వండి: శిఖాగోయల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మళ్లీ మల్టీలెవెల్ మార్కెటింగ్ (పిరమిడ్) మోసాలు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గతానికి భిన్నంగా సైబర్ మోసగాళ్లు వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు ఇస్తూ అమాయకులకు వల వేస్తున్నారని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని, మీరే క్రిప్టోకరెన్సీని అమ్మడం ద్వారా లాభాలు పొందొచ్చని.. వ్యవసాయ ఉత్పత్తులు, హెర్బల్, హెల్త్, ఇతర గృహోపకరణ వస్తువుల విక్రయంతో లాభాలు వస్తాయని, అలాగే మరికొందరిని సభ్యులుగా చేరిస్తే కమీషన్లు వస్తాయని ఊదరగొడుతున్నట్టు తెలిపారు. గతంలో ఇదే తరహాలో ఎంతోమంది నష్టపోయిన విషయాన్ని పోలీసులు గుర్తు చేస్తున్నారు. తాజాగా మరోమారు ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ సైబర్ మోసాలు పెరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. ఈ తరహా మోసాల బారినపడకుండా, ఒకవేళ సైబర్ మోసగాళ్లకు చిక్కితే ఎలా బయటపడాలి.. అన్న విషయాలపై టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు పలు సూచనలు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..



మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలు పెరుగుతున్నాయి. వాస్తవ విరుద్ధంగా.. బాగా లాభాలు వస్తాయని వచ్చే ప్రకటనలు మోసపూరితమైనవని అనుమానించాలి. అనుమానాస్పద మెసేజ్‌లు, మోసపూరిత ప్రకటనలపై వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930, వాట్సాప్ నంబర్ 8712672222లో ఫిర్యాదు చేయాలి. మీ వ్యక్తిగత సమాచారాన్ని, బ్యాంకు ఖాతాల వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు. ఇలాంటి మోసాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– శిఖాగోయల్, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్

ఎలా మోసగిస్తారు.. అప్రమత్తంగా ఎలా ఉండాలి?

- బాగా లాభాలు వస్తాయని, తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదించవచ్చని ఆశచూపి ముగ్గులోకి లాగుతారు. వాస్తవానికి ఈ పిరమిడ్‌లో టాప్‌లో (స్కీంలో తొలుత చేరిన వారు) ఉన్న వారికి మాత్రమే లాభాలు వస్తాయి. ఆ తర్వాత చేరిన వారికి లాభాలు లేకపోగా అసలు సొమ్మునే కొల్లగొడతారు.
- మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీంలు నడిపే కీలక సూత్రధారులు విదేశాల్లోనే ఉండి ఈ మోసాలు చేస్తుంటారు.
- లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్లు, అత్యధిక లాభాలు అని ప్రకటనల్లో ఊదరగొడితే అది పక్కా మోసమని గుర్తించాలి.
- మీకు వచ్చే ప్రకటనల్లో ఉన్న కంపెనీల పేర్లు, వాటి వ్యాపారం గురించి గుడ్డిగా నమ్మకుండా పూర్తి వివరాలు తెలుసుకోవాలి.
- మల్టీలెవెల్ మార్కెటింగ్‌లో ఒకరి ద్వారా మరొకరు చేరుతుంటారు. ఇలాంటి చైన్‌లలో చేరొద్దు. ఆయా కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు వెళ్లొద్దు.
- మీకు వచ్చే ఎస్ఎంఎస్‌లలోని అనుమానాస్పద వెబ్‌లింక్‌లు, ఏపీకే ఫైల్స్‌పై క్లిక్ చేయొద్దు.
- పూర్తి వివరాలు తెలుసుకోకుండానే ఎవరికీ డబ్బులు పంపవద్దు. ఇలా పంపిన సొమ్మును అవతలి వ్యక్తులు దేశవిద్రోహ పనులకు వాడే ప్రమాదం ఉంటుంది.
- ఇలాంటి మోసాలపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులను అప్రమత్తం చేయాలి.

'కాళేశ్వరం'పై ప్రాథమిక నివేదిక రెడీ!

- జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ కొలిక్కి..
- ఇప్పటివరకు గుర్తించిన అంశాలు, అవకతవకలపై 204 పేజీలతో నివేదిక
- నేటి నుంచి మలి విడత క్రాస్ ఎగ్జామినేషన్ షురూ
- తొలిరోజు ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావుకు పిలుపు.. అనంతరం నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించనున్న కమిషన్
- వచ్చే నెలలో కేసీఆర్, హరీశ్‌లను విచారించే చాన్స్
- బడ్జెట్ సమావేశాలకు ముందే ప్రభుత్వానికి నివేదిక



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్వహిస్తున్న విచారణ ఓ కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఇప్పటివరకు నిర్వహించిన సుదీర్ఘ విచారణలో కమిషన్ గుర్తించిన అంశాలు, అవకతవకలు, ఇతర అంశాలపై సుమారు 204 పేజీలతో ప్రాథమిక నివేదికను సిద్ధం చేసినట్టు సమాచారం. నివేదికలో దాదాపుగా 12 అధ్యయనాల వివరాలున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వేల సంఖ్యలోని ఫైళ్లను అధ్యయనం చేయడంతోపాటు సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్‌లో సేకరించిన వివరాలను నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. బరాజ్‌ల నిర్మాణంతోపాటు ఇతర పనుల్లో అవకతవకలు జరిగినట్టుగా కమిషన్ నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. కాంట్రాక్టర్లకు లబ్ధి కలిగించడానికి బరాజ్‌ల అంచనాలను ఏటేటా పెంచడంతోపాటు జరగని పనులకు కూడా రూ.కోట్లలో బిల్లులు జారీ చేసినట్టుగా ఆధారాలను సేకరించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి బరాజ్‌లకు సంబంధించిన విధానపర నిర్ణయాలు, సాంకేతిక, ఆర్థికపర అంశాలపై విచారణ దాదాపు పూర్తయిందని.. మరికొందరు సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తే విచారణ ప్రక్రియ పూర్తవుతుందని అంటున్నాయి. ఇక జనవరి, ఫిబ్రవరిలో రెండు పర్యాయాలు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించి.. మిగతా వారిని ప్రశ్నించేందుకు కమిషన్ సన్నద్ధమైనట్టు తెలిసింది. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందే తుది నివేదికను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు సమాచారం. ప్రభుత్వం శాసనసభలో నివేదికను ప్రవేశపెట్టి చర్చ చేపట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

రామకృష్ణారావుకు క్రాస్ ఎగ్జామినేషన్..

ఇప్పటికే పలు దఫాలుగా క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించి 80 మందికిపైగా ఇంజనీర్లు, ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులను ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్.. మంగళవారం నుంచి మరో దఫా క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించనుంది. తొలిరోజు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ప్రశ్నించనుంది. కాళేశ్వరం కార్పొరేషన్‌కు లేని ఆదాయాన్ని కాగితాలపై చూపి రుణాలను సమీకరించినట్టు వచ్చిన ఆరోపణలపై కమిషన్ ఆయనను విచారించనుంది. బీఆర్‌ఎస్ నేత వి.ప్రకాష్, బరాజ్‌ల నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆడిట్ నిర్వహించిన కాగ్ అధికారులనూ ఇదే విడతలో ప్రశ్నించే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

వచ్చే నెలలో కేసీఆర్, హరీశ్, ఈటలకు పిలుపు

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి విధానపర నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషించిన నాటి సీఎం కేసీఆర్, నీటిపారుదల, ఆర్థిక మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ వచ్చే నెలలో క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనున్నట్టు తెలిసింది. వారికి సమన్లు జారీ చేయడానికి ముందే బలమైన ఆధారాలను సిద్ధం చేసుకోవడంపై దృష్టి పెట్టినట్టు సమాచారం. చివరగా కేసీఆర్‌ను ప్రశ్నించడం ద్వారా కమిషన్ విచారణను ముగించి, ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పించే యోచనతో ఉన్నట్టు తెలిసింది.

కాంగ్రెస్ పాలనలో రైతుల నీటి గోస

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: సాగునీటి కోసం రైతులు రోడ్డెక్కి నిరసన తెలపడం కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ సొంత జిల్లా నల్లగొండలోనే సాగునీటికి కటకట ఉందన్నారు. యాసంగి సాగునీటి విడుదల షెడ్యూల్ పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనంతో ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చిందన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండోదశలో భాగంగా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాల్లోని 3,36,630 ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తామని ప్రకటించిందన్నారు. కానీ సాగు నీరు విడుదల చేయకపోవడంతో ప్రభుత్వం మాట నమ్మి నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. ఈ మేరకు హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అద్భుతాలు చేస్తున్నట్టు భ్రమలు కల్పించడం మానుకొని సీఎం, మంత్రులు ఇప్పటికైనా ఆచరణలోకి దిగాలన్నారు.

ప్రజాపాలన కాదు ఇది నిర్బంధం: రాష్ట్రంలో సీఎం రేవంత్ పాలనలో ఆంక్షలు, కంచెలు, అరెస్టులు, నిర్బంధాలు నిత్యకృత్యంగా మారాయని, ప్రజాపాలన అంటూ నిర్బంధం కొనసాగిస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. మైలారంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్‌ను అరెస్టు చేయడం అమానుషమని చెప్పారు. ప్రతినెలా మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నట్టు సీఎం, మంత్రులు చేస్తున్న ప్రకటనలు నీటి మూటలుగా మారాయన్నారు.

హరీశ్‌ది చిల్లర రాజకీయం: మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: కృష్ణా ట్రిబ్యునల్ విషయంలో హరీశ్‌రావు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నీళ్ల వ్యవహారంలో అప్పట్లో సీఎంగా కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావు లిఖిత పూర్వకంగా సంతకాలు పెట్టారని ఆయన దుయ్యబట్టారు. సోమవారం సచివాలయంలో మరో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. పోతిరెడ్డిపాడు, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ కళ్లు మూసుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలోనే కృష్ణా జలాల్లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని ఉత్తమ్ దుయ్యబట్టారు. కేవలం 298 టీఎంసీలకు సంతకాలు చేసినట్టు డాక్యుమెంట్లు ఉన్నాయని మంత్రి వివరించారు.

రేషన్‌కార్డులపై దుష్ప్రచారం: కొత్త రేషన్‌కార్డుల విషయంలోనూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు ఇస్తామని స్పష్టం చేశారు. కొత్త కార్డులు, పాత కార్డుల్లో కొత్త వ్యక్తులను చేర్చే ప్రక్రియ పూర్తయ్యాక దాదాపు 40 లక్షల మందికి రేషన్ లబ్ధి జరుగుతుందని అంచనా వేసినట్టు మంత్రి చెప్పారు. ప్రజాపాలన, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తున్నామని, జాబితాలో పేర్లు లేని వారు ప్రజావాణిలో, గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్‌కార్డుల అంశంలోనూ హరీశ్‌రావు దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు.

రైతు మహా ధర్నాపై వివరణ ఇవ్వండి

నల్లగొండ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నల్లగొండలో నిర్వహించ తలపెట్టిన రైతు మహా ధర్నాకు అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27న విచారణ చేపడతామని హైకోర్టు చెప్పింది. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు, 26న గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో బందోబస్తు ఇవ్వలేమని ప్రభుత్వ న్యాయవాది (హోం శాఖ) మహేశ్ రాజే కోర్టుకు చెప్పారు. మహాధర్నా నిర్వహణపై వివరాలు తెలుసుకుని చెప్పేందుకు సమయం కావాలని ఆయన కోరడంతో.. కోర్టు అనుమతించింది. దీనిపై వివరణ ఇవ్వాలని పోలీసులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. నల్లగొండలో క్లాక్ టవర్ సెంటర్ వద్ద మంగళవారం (21న) ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైతు మహా ధర్నా నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. ఈ ధర్నాకు అనుమతి కోరుతూ 17న బీఆర్‌ఎస్ నల్లగొండ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ పోలీసులకు దరఖాస్తు చేశారు. క్లాక్‌టవర్ సెంటర్‌లో ధర్నాతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దేవేందర్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. సమయాభావం కారణంగా వాదనలు వినలేకపోయిన న్యాయమూర్తి.. వివరాలు తెలుసుకుని చెప్పాలని జీపీని ఆదేశించారు.

రైతులను చూసి కాంగ్రెస్ భయపడుతోంది

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రైతులను చూసి కాంగ్రెస్ పార్టీ, కేటీఆర్‌ను చూసి సీఎం, మంత్రులు భయపడుతున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. పోలీసుల సూచన మేరకు ఈ నెల 12న జరగాల్సిన నల్లగొండ రైతు దీక్షను 21కి వాయిదా వేశామన్నారు. అధికార పార్టీ ఒత్తిడి మేరకు పోలీసులు అనుమతి రద్దు చేశారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జగదీశ్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. సభ అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు సూచన మేరకు సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. గడిచిన 20–30 ఏళ్లుగా ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి ఎవరెవరి దగ్గర ఎంత వసూలు చేశారో ప్రజలకు తెలుసని ఆయన విమర్శించారు.

రైతుల ఆత్మహత్యలపై బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ

- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి
- సింగిరెడ్డి నేతృత్వంలో మొత్తం 9 మందితో ఏర్పాటు
- రెండు వారాలపాటు క్షేత్రస్థాయిలో పరిస్థితుల పరిశీలన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు తొమ్మిది మంది సీనియర్ నేతలతో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ కమిటీలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ రెండు వారాల పాటు అన్ని జిల్లాల్లో సన్న, చిన్నకారు రైతులను కలిసి సమస్యలను తెలుసుకుంటుంది. ఏడాదిగా రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తుంది. తమ అధ్యయన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ కమిషన్‌తో పాటు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు అందజేస్తుంది..'అని కేటీఆర్ తెలిపారు.

ఏడాదిలో 400కు పైగా ఆత్మహత్యలు

'కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. ఇప్పటికే 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతు రుణమాఫీ 30 శాతం దాటకపోవడం, రైతుబంధు నిలిపివేత, రూ.15 వేల రైతు భరోసా ఎగవేత మూలంగా ఆర్థిక సమస్యలతో రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నారు. మా అధ్యయనంలో వెలుగు చూసిన అంశాలతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రైతు సమస్యలు, వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీస్తాం..' అని కేటీఆర్ ప్రకటించారు.

కాంగ్రెస్ సర్కారుకు చుక్కలు చూపించాలి

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలు కోసం వచ్చే నాలుగేళ్ల పాటు ప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యతను బీఆర్‌ఎస్ కార్మిక విభాగం తీసుకోవాలని కేటీ రామారావు కోరారు. కేసులకు భయపడొద్దని, పార్టీ న్యాయ విభాగం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్మిక విభాగానికి 33 జిల్లాల్లో కొత్త కమిటీలను, నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన బీఆర్‌ఎస్ కార్మిక విభాగం డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కార్మిక పక్షపాతిగా నిలిచారని కొనియాడారు.

కక్ష రాజకీయాలకు నేను వ్యతిరేకం

గతంలో వైఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా ఆ రాజకీయాలు చేయలేదు: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజల రక్తంలో కక్ష సాధింపు గుణం ఉండదని వ్యాఖ్యానించారు. తాను రివేంజ్ రాజకీయాలకు వ్యతిరేకమని, కక్ష రాజకీయాలు ఎవరు చేసినా వారు పదవులు పోయాక బాధ పడక తప్పదని చెప్పారు. తనకు నష్టం చేసిన వారికి కూడా తాను నష్టం చేయబోనని, కానీ వారిపై రాజకీయ యుద్ధం మాత్రం చేస్తానని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'రాజకీయ పోరాటం వేరు.. పరిపాలన వేరు. పోరాటం చేసి అధికారం సాధించిన తర్వాత దేని కోసమైతే పోరాటం చేశామో దాన్ని అమలు చేయాలి. అలా చేయకుండా రివేంజ్ పాలిటిక్స్ చేస్తే ఎవరైనా బాధ పడక తప్పదు. ఇది తెలంగాణలోనూ చరిత్ర చెబుతున్న నిజం. బీజేపీ అయినా, బీఆర్‌ఎస్ అయినా, ఏ పార్టీ అయినా రివేంజ్ రాజకీయం మంచిది కాదు.'అని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులుగా పనిచేసిన వైఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలు కూడా రివేంజ్ రాజకీయాలు చేయలేదని గుర్తు చేశారు. రాజకీయాల్లో డబ్బు అవసరమని, తనతో సహా ఏ పార్టీలోని ఏ నాయకుడైనా పైసలు ముట్టుకోకుండా రాజకీయాలు చేస్తామని చెప్పగలరా అని ప్రశ్నించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి తాను ఓడిపోవడానికి హరీశ్‌రావు కారకుడని, తాను గెలవడం ఎంత ముఖ్యమో, జగ్గారెడ్డి ఓటమి అంతే ముఖ్యమనే రీతిలో అప్పుడు అధికారంలో ఉన్న ఆయన పనిచేశారని చెప్పారు. పోలింగ్‌కు మూడు రోజుల ముందు తాను నిర్వహించే సమావేశం జరగకుండా హరీశ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారని, అక్కడే ఆయన సక్సెస్ అయ్యారన్నారు.

ఓటర్ల జాబితాలో అర్హులందరికీ చోటు

సీఈఓ సుదర్శన్‌రెడ్డి



రాజకీయ పార్టీలతో సమావేశమైన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అర్హులైన ఓటర్లందరికీ చోటు కల్పించడంతోపాటు లోపరహితంగా కచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి పకడ్బందీ చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. జనవరి 6న ప్రకటించిన తుది ఓటర్ల జాబితా తయారీకి తీసుకున్న చర్యలను వివరించారు. రాజకీయ పార్టీలు, ఇతర భాగస్వాముల సహకారంతో అత్యంత పారదర్శకంగా జాబితా తయారు చేశామన్నారు. ఓటర్లలో చైతన్యం పెంచడానికి ఈ నెల 25న నిర్వహించనున్న ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఎంఐఎం, ఆప్, సీపీఐ పార్టీల నేతలు పాల్గొన్నారు.

కొత్త ఏఈఈలకు అందని జీతాలు

- నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల నిర్వాకం.. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా పోస్టింగులు
- ఒక జోన్‌కు ఎంపికైన వారిని మరో జోన్‌లో నియామకం.. కొలువుల్లో చేరి 4 నెలలవుతున్నా అందని వేతనాలు



జీతాల కోసం జలసౌధకు వచ్చిన కొత్త ఏఈఈలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల నిర్వాకంతో శాఖలో కొత్తగా నియమితులైన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)లకు వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. ఎంపికైన జోన్ పరిధిలో కాకుండా ఇతర జోన్‌లో పోస్టింగ్ ఇవ్వడంతో.. విధుల్లో చేరి నాలుగు నెలలు గడిచినా కనీసం ఒక నెల జీతం కూడా అందలేదు. 126 మంది ఏఈఈలు ఈ అంశంపై ఉన్నతాధికారులకు వినతులు సమర్పించినా తమకు సంబంధం లేదంటూ చేతులు దులుపుకోవడమే కాకుండా.. కనీసం ఆ సమస్యను పరిష్కరించే ప్రయత్నం కూడా చేయకపోవడంతో, వారికి వచ్చే నెలలో కూడా వేతనాలు అందే పరిస్థితి కనిపించడం లేదు. నీటిపారుదల శాఖ పరిధిలోని సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ తదితర కేటగిరీల్లో దాదాపు 700 మంది ఏఈఈలకు గతేడాది సెప్టెంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఆ తర్వాత పోస్టింగులు కూడా ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగం దక్కడం.. అందులోనూ గెజిటెడ్ స్థాయి వరించడంతో నిర్దేశించిన గడువులోపే ఉత్సాహంగా విధుల్లో చేరిన ఏఈఈలు వేతనాలు అందకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు.

పోస్టింగుల్లో పొరపాట్లు

కొత్త ఏఈఈలకు పోస్టింగులు ఇచ్చే క్రమంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ కార్యాలయం అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ఏఈఈ పోస్టులు మల్టీజోన్ కిందకు వస్తాయి. అయితే మల్టీజోన్-1కు ఎంపికైన వారిని మల్టీజోన్-2లో.. అదేవిధంగా మల్టీజోన్-2కు ఎంపికైన వారిని మల్టీజోన్-1లో పోస్టింగులు ఇచ్చారు. ఈ అంశంపై అవగాహన లేకపోవడంతో ఏఈఈలు కూడా ఎలాంటి పరిశీలన లేకుండా విధుల్లో చేరిపోయారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా పోస్టింగులు జరపడంతో వారికి వేతనాలు ఇవ్వకుండా పబ్లిక్ అకౌంట్స్ అధికారులు (పీఏఓ) బ్రేకులు వేశారు. నిబంధనలకు లోబడి పోస్టింగులు ఇచ్చిన తర్వాతే వారికి వేతనాలు విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

గుర్తించిన పీఏఓ అధికారులు

రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమలుకు సంబంధించిన నిబంధనలు రాష్ట్రపతి ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉన్నాయి. ఉద్యోగ నియామకాల ప్రక్రియలో స్థానిక, స్థానికేతర నిష్పత్తి 95:5 చొప్పున జరగాలి. కానీ రాష్ట్ర నీటిపారుదల శాఖలో ఏఈఈ పోస్టింగుల విషయంలో ఈ నిబంధనకు విరుద్ధంగా ఉన్నతాధికారులు వ్యవహరించారు. 95:5 నిష్పత్తిలో కాకుండా ఒక జోన్‌లో 80:20 నిష్పత్తిలో... మరో జోన్‌లో 75:25 నిష్పత్తిలో ఉద్యోగులకు పోస్టింగులు ఇచ్చారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా స్థానిక, స్థానికేతర నిష్పత్తిలో ఉన్న ఈ వ్యత్యాసాన్ని పీఏఓ అధికారులు గుర్తించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నిబంధనలను అనుసరించి పోస్టింగులు ఇచ్చిన తర్వాతే వేతనాలు చెల్లిస్తామని తేల్చిచెప్పారు. దీంతో 126 మందికి నాలుగు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. దీనిపై గతంలో ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తాజాగా మరోసారి ఉన్నతాధికారులకు, నీటిపారుదల శాఖ కార్యదర్శికి, సాధారణ పరిపాలన విభాగంతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతులు సమర్పించారు.

మంత్రి ఆదేశాలు బేఖాతర్!

వాస్తవానికి కొత్త ఏఈఈలకు తక్షణమే జీతాలు చెల్లించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ నెల 8న స్వయంగా సీఎస్‌కు ఫోన్ చేసి ఆదేశించారు. కానీ ఫలితం లేకుండా పోయింది. దీంతో బాధిత ఏఈఈలు సోమవారం మళ్లీ జలసౌధకు చేరుకుని ఉన్నతాధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమను సొంత జోన్లకు బదిలీ చేసి జీతాలను చెల్లించాలని బాధిత ఏఈఈలు కోరుకుంటున్నారు.



మనిషి తాను సంకల్పించింది చేయగలడు,
కానీ తన సంకల్పాన్ని సంకల్పించుకోలేడు.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి

మంగళవారం, 21 జనవరి 2025

తప్పు ఎవరిది? శిక్ష ఏమిటి?

దేశాన్ని అట్టుడికించిన కేసులో కోర్టు తీర్పు వెలువడింది. తీరా తీర్పు సైతం ఆ కేసులానే చర్చకు దారి తీస్తోంది. కోల్‌కతాలోని ఆర్.జి. కర్ ఆస్పత్రిలోని సెమినార్ గదిలో విశ్రాంతి తీసుకుంటున్న జూనియర్ డాక్టర్‌పై గత ఆగస్ట్ 9న జరిగిన దారుణ హత్యాచార ఘటనపై తాజా తీర్పు సహేతుకం కాదనే విమర్శ వినిపిస్తోంది. ఆస్పత్రిలో వాలంటీర్‌గా పనిచేసిన సంజయ్ రాయ్ భారతీయ న్యాయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద నేరస్థుడంటూ శనివారమే కోర్ట్ ప్రకటించేసింది. కానీ, ఈ కేసులో అతనికి ఉరిశిక్ష బదులుగా యావజ్జీవ కారాగారవాస శిక్ష మాత్రమే విధిస్తున్నట్టు సియాల్దాలోని అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్ట్ సోమవారం తీర్పు చెప్పేసరికి మళ్ళీ తేనెతుట్టె కదిలింది. బెంగాల్‌లోని మమతా బెనర్జీ సర్కారే కాక, అటు కేంద్ర నేరదర్యాప్తు సంస్థ (సీబీఐ), ఇటు బాధితురాలి కుటుంబం సైతం నేరస్థుడికి ఉరిశిక్ష విధించాలంటూ వాదించింది. కానీ, అంతటి తీవ్ర శిక్ష విధించేందుకు హేతుబద్ధత లేదంటూ కోర్ట్ వ్యాఖ్యానించడం గమనార్హం. దాంతో, మహిళా లోకంలో, బాధిత, వైద్య వర్గాల్లో అసహనం కట్టలు తెంచుకుంది. సామాజిక మాధ్యమాల్లోని దృశ్యాలే అందుకు నిదర్శనం.

హత్యాచారానికి గురైన ఆడకూతురు, ఆమె కుటుంబం బాధను ముగ్గురు ఆడపిల్లలకు తల్లినైన తాను అర్థం చేసుకోగలనంటూ నేరస్థుడి తల్లే స్వయంగా అనడం గమనార్హం. కన్నకొడుకైనా సరే నేరం రుజువైతే, శిక్ష పడాల్సిందేనని ఆ మాతృమూర్తి అన్న మాటలు జరిగిన ఘటన రేపిన భావోద్వేగాలను గుర్తు చేస్తుంది. పైపెచ్చు, ఆగస్ట్ 9 తర్వాత బెంగాల్‌లో అయిదు హత్యాచార ఘటనల్లో, మైనర్లపై దారుణానికి పాల్పడ్డ నేరస్థులకు 'పోక్సో' కోర్టులు ఏకంగా మరణశిక్షే విధించాయి. అందుకే, ఈ కేసులోనూ నేరస్థుడికి ఉరిశిక్ష పడుతుందనీ, పడాలనీ బలమైన భావన వ్యాపించింది. అయితే జరిగింది వేరు. బెంగాల్‌నే కాక అప్పట్లో భారత్ మొత్తాన్నీ కదిలించిన ఈ ఘటనలో బాధిత కుటుంబానికి రూ. 17 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ఈ ఘటన ఉరిశిక్ష విధించాల్సినంత అత్యంత అరుదైన కేసు ఏమీ కాదంటూ కోర్ట్ వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. బెంగాల్ ఏలిక మమతా బెనర్జీ సైతం తీర్పుతో సంతృప్తికరంగా లేమంటూ కుండబద్దలు కొట్టేసి, తీర్పుపై హైకోర్టుకు వెళతామని తేల్చేశారు.

సర్వసాధారణంగా నేరం తాలూకు తీవ్రత, సమాజంపై దాని ప్రభావం, నేరస్థుడి గత చరిత్ర, ప్రవర్తన లాంటివన్నీ మరణశిక్ష విధింపునకు ప్రాతిపదిక అవుతాయి. అయితే, గౌరవ న్యాయస్థానం తన ముందున్న సాక్ష్యాధారాలను బట్టి మాత్రమే ఎలాంటి తీర్పునైనా ఇస్తుంది. తీర్పు చెబుతూ న్యాయమూర్తి సైతం ఆ మాటే అన్నారు. అంతేతప్ప, మీడియాలో సాగుతున్న ప్రచారం సహా ఇతరేతర కారణాలను బట్టి శిక్షపై నిర్ణయం తీసుకోవడం జరగదు. కాబట్టి, తగినంత బలమైన సాక్ష్యాధారాలు లేనందు వల్లనే ఈ కేసులో నేరస్థుడికి కోర్ట్ మరణశిక్ష విధించలేదా అన్నది ఆలోచించాల్సిన అంశం. తీర్పు పూర్తి పాఠం అందుబాటులోకి వచ్చిన తర్వాత కానీ ఆ అంశంపై మరింత స్పష్టత రాదు. ఆస్పత్రి సిబ్బంది భద్రత కోసం పనిచేయాల్సిన వాలంటీర్ రాయ్ అసలు తన ఉద్యోగ ధర్మాన్నే మంటగలిపి, కాపాడాల్సిన డాక్టర్‌నే కాటేశాడన్నది చేదు నిజం. అతడు చేసిన నేరం ఘోరం, హేయమన్నదీ నిర్వివాదాంశం. అయితే, హత్యాచారానికి పాల్పడ్డ సదరు నేరస్థుడు జీవితంలో మారే అవకాశం లేదంటూ ప్రాసిక్యూషన్ బలంగా వాదించలేక పోయింది. ఆ మాటను నిరూపించలేక పోయింది. అది కూడా శిక్ష విషయంలో నేరస్థుడికి కలిసొచ్చిందని నిపుణుల మాట.

కోల్‌కతా కేసు దర్యాప్తు ఆది నుంచి అనుమానాలకు తావివ్వడం దురదృష్టకరం. నిజానిజాలేమో కానీ, అత్యంత హేయమైన ఈ ఘటనలో శిక్షపడ్డ నేరస్థుడే కాక, ఇంకా పలువురి హస్తం ఉందనేది అందరి నోటా వినిపిస్తున్న మాటే. స్థానిక పోలీసుల నుంచి చివరకు సీబీఐ చేతుల్లోకి దర్యాప్తు వెళ్ళినా జనంలో అనుమాన నివృత్తి కాలేదన్నది నిష్ఠురసత్యం. సీసీ టీవీ దృశ్యాల్లో 68 దాకా రాకపోకలు కనిపించినా, రాయ్ ఒక్కరినే గుర్తించారన్న ఆరోపణలే అందుకు సాక్ష్యం. పనికి మాలిన రీతిలో దర్యాప్తు జరిగిందనీ, పలుకుబడి గల బడాబాబులు తప్పించుకున్నారనీ, ఆఖరికి ఒకడే నేరస్థుడని తీర్మానించి యావజ్జీవ ఖైదుతో సరిపెట్టారనీ విమర్శలు వెల్లువెత్తడానికి కారణమూ అదే. ఆర్.జి. కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ప్రిన్సిపాల్ సహా పలువురి వ్యవహారశైలి, ఆశ్రిత పక్షపాతం, అవినీతి ఆరోపణలు, ఆస్పత్రి యంత్రాంగం పనితీరు, వగైరా... ఎన్నో ప్రశ్నల్ని ముందుకు తెచ్చాయి. సాక్ష్యాధారాల తారుమారు యత్నంలో ప్రిన్సిపాల్‌ను సీబీఐ అరెస్ట్ చేసినా, నిర్ణీత 90 రోజుల వ్యవధిలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోయే సరికి నిష్పూచీగా ఆయన బయటకొచ్చారంటే మన నిఘా, దర్యాప్తు సంస్థలు ఎంత ఘనంగా పనిచేస్తున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

కీలకమైన మరో విషయం – ఈ ఘటనకు కారణమైన పరిస్థితులు. ప్రగతి బాటలో ముందున్నామనే దేశంలో... పనిప్రదేశాల్లో సైతం మహిళలకు రక్షణ కొరవడడం, ఉద్యోగస్థలాలు స్త్రీలకు సురక్షితంగా లేకపోవడం శోచనీయం. కోల్‌కతా ఘటనతో పార్టీలు, ప్రజలు కదం తొక్కిన మాట నిజమే కానీ, ఇప్పటికైనా ఈ పరిస్థితుల్ని సమూలంగా మార్చాల్సిన అవసరం పాలకులకుంది. అవినీతి పంకిలమై, లోపభూయిష్ఠంగా నడుస్తున్న అనేక వ్యవస్థల్ని చక్కదిద్దాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లోనే కోర్టులు ఉన్నంతలో సత్వర న్యాయం అందించడం, ప్రజాభిప్రాయం కన్నా ప్రత్యక్ష సాక్ష్యాలే ప్రాతిపదికగా తీర్పులివ్వడం ఆహ్వానించదగ్గదే. అయితే, చాలా సందర్భాల్లో న్యాయం చెప్పడమే కాదు... న్యాయమే చేస్తున్నట్టు కనిపించడం ముఖ్యం. ఈ కేసులో అది జరిగిందా అన్నదే పలువురి ప్రశ్న.

'కనీస' చట్టబద్ధతే సంజీవని!

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

కాలచక్రంలో నెలలు, సంవత్సరాలు పరిగెడుతున్నాయి. కొన్ని రంగాలు రూపు రేఖలు గుర్తుపట్టలేనంతగా మారుతున్నాయి. కానీ, మార్పు లేనిదల్లా వ్యవసాయం మీద ఆధారపడిన రైతుల జీవితాలే. దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు దాటిపోయినా, ఇంకా రైతులు తమ గోడు చెప్పుకోవడానికి రోడ్లపైకి వస్తున్నారు. ప్రాణాలకు తెగించి ఉద్యమిస్తున్నారు. ఇంతా చేసి రైతులు కోరుతున్నదేమీ అన్యాయమైన డిమాండ్లు కావు. ప్రభుత్వాలు నెరవేర్చగల సహేతుక డిమాండ్లే! ఆత్మగౌరవంతో జీవించడం ప్రజల ప్రాథమిక హక్కు. అప్పుల ఊబిలో నుంచి బయటపడేంత వరకూ రైతులకు ఆత్మగౌరవం లభించదు. రైతాంగం ఆత్మగౌరవంతో బతకాలంటే వారికి కనీస మద్దతు ధరలు లభించాల్సిందే. వాటికి చట్టబద్ధత కల్పించాల్సిందే.

2024 ఏడాది ప్రారంభంలో పంజాబ్ రైతులు మరో పోరాటానికి ఉద్యుక్తులయ్యారు. ఏడాది గడిచినా ఆ ఉద్యమాన్ని కొనసాగించడానికి గల కారణాలను విశ్లేషించి చూస్తే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అమానుష వైఖరి బహిర్గతమవుతుంది. దాదాపు మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సంబంధించి మూడు నల్ల చట్టాలను తేవాలని ప్రతిపాదించడం, దానిపై అన్ని రాష్ట్రాల రైతాంగం ఢిల్లీలో చలికి, ఎండలకు, వానలకు తట్టుకొని చేసిన సుదీర్ఘ ఉద్యమం దరిమిలా కేంద్రం దిగొచ్చింది, ప్రతిపాదిత బిల్లుల్ని ఉపసంహరించుకుంది.

అయితే, ఆ సందర్భంగా రైతులకు చేసిన వాగ్దానాలను మాత్రం కేంద్రం నెరవేర్చలేదు. ప్రధానంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనీ, రైతుల్ని అప్పుల ఊబిలోకి నెడుతున్న పంట రుణాలను మాఫీ చేయాలనీ రైతాంగం చేసిన డిమాండ్లను పరిశీలించి నిర్ణయం తీసుకొంటామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. దాంతో 2024 ఫిబ్రవరి 14 నుంచి పంజాబ్ రైతులు హరియాణా సరిహద్దుల్లోని శంభూ అంబాలా, ఖనౌరి-జింద్ కూడళ్ళ వద్ద బైఠాయించి ఉద్యమం నడుపుతున్నారు. రైతుల డిమాండ్ల పరిష్కారానికి సహేతుక ముగింపు లభించాలన్న ఉద్దేశంతో రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ డల్లేవాల్ (నవంబర్ 26న) ఆమరణ దీక్ష మొదలుపెట్టాక, ఈ పోరాటానికి దేశ వ్యాప్త గుర్తింపు లభించింది. నిజానికి ఓ పోరాటాన్ని విరమింపజేసే సమయంలో ఇచ్చిన వాగ్దానాల్ని కేంద్రం నెరవేర్చకపోవడం, వాటిని నెరవేర్చాలన్న డిమాండ్‌తో రైతాంగం మరో పోరాటానికి దిగడం బహుశా చరిత్రలో ఇదే ప్రథమం కావొచ్చు.

కనీస మద్దతు ధర ప్రాథమిక హక్కు లాంటిదే!

మూడేళ్ల క్రితం ఉపసంహరించుకున్న మూడు నల్ల చట్టాల్ని కేంద్రం మరో రూపంలో తీసుకురాబోతోందన్న సంకేతాలతోనే పంజాబ్ రైతులు ఆందోళనకు దిగారు. "దేశానికి స్వాతంత్ర్యం లభించిన ఈ 75 సంవత్సరాలలో పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు లభించక, సాగు గిట్టుబాటు కాక, అప్పుల ఊబిలో చిక్కుకొని గత్యంతరం లేక, తమ జీవితం పట్ల తమకే విరక్తి కలిగి ఇప్పటికి 7 లక్షల మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. నా ప్రాణం పోతే పోతుంది. కానీ ఆత్మహత్యలు చేసుకొన్న రైతుల జాబితాలోకి మరికొన్ని పేర్లు చేరకూడదు" అన్న 70 ఏళ్ల డల్లేవాల్ మాటలు వ్యవసాయరంగ వాస్తవ ముఖచిత్రాన్ని ప్రతిబింబిస్తాయి.

దేశానికి ఆహార భద్రత అందించే రైతులు ఇంకా ఆత్మహత్యలు చేసుకొనే దుఃస్థితి ఎందుకు ఉన్నదో పాలకులు ఆలోచించడం లేదు. గతంలో ఎదుర్కొన్న సమస్యలతో పాటు తాజాగా తెస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సంస్కరణలు రైతుల పాలిట ఉరితాళ్లుగా మారనున్నాయి. పంట ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీ)లను రద్దు చేసి కాంట్రాక్టు సాగుకు పట్టం కట్టాలన్న కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు ప్రతిపాదనకు రైతాంగం ససేమిరా ఇష్టపడటం లేదు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకురాదలిచిన సంస్కరణలకు సంబంధించి 2024లో విడుదల చేసిన ముసాయిదా పత్రంలో పేర్కొన్న అంశాలు దాదాపుగా అంతకుముందు విరమించుకొన్న వ్యవసాయ బిల్లుల్లోని అంశాలకు నకలుగా ఉన్నాయని రైతు సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. అవి: 1. జాతీయ వ్యవసాయ మార్కెట్లను అన్ని రాష్ట్రాలలో ఏర్పాటు చేయడం; 2. ఒకే లైసెన్సు, ఒకే రిజిస్ట్రేషన్ వ్యవస్థ తీసుకురావటం; 3. ఫీజు ఏకమొత్తంలో ఒకేసారి చెల్లింపు చేయటం; 4. గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలను ప్రత్యేక మార్కెట్లుగా గుర్తించడం; 5. ప్రైవేట్ ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ వేదికల ఏర్పాటు... ఇలా పలు ప్రతిపాదనలను ముసాయిదా బిల్లులో చేర్చి, వాటిని రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నం జరుగుతోందని రైతులు అనుమానిస్తున్నారు.



సాధారణంగా వ్యవసాయ రంగంలో కీలక నిర్ణయాలు తీసుకొనే ముందు రైతాంగ ప్రతినిధులతో చర్చించడం, వారిని భాగస్వాముల్ని చేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, కేంద్రం ఆ సంప్రదాయాన్ని పాటించకపోవడాన్ని రైతు సంఘాలు తప్పు పడుతున్నాయి. తమకు అంగీకార యోగ్యం కాని నిర్ణయాలు చేయడం కోసమే కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించిందని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరలు ఆశించడం రాజ్యాంగంలో ప్రజలకు దఖలు పడిన ప్రాథమిక హక్కు లాంటిదేనని డల్లేవాల్ పేర్కొనడం దేశవ్యాప్త చర్చకు ఆస్కారం కల్పించింది.

దేశవ్యాప్త డిమాండ్ కూడా అదే!

తాము పండించే పంటకు ఎంత ధర ఉండాలో నిర్ణయించుకొనే హక్కు ఎలాగూ రైతాంగానికి లేదు. కనీసం పండించే పంటకు ఎంత మొత్తం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)గా ఇస్తారో ముందుగా తెలుసుకోవాలనుకోవడం అత్యాశేమీ కాదు కదా? కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం అంటే పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చుతోపాటు లెక్క గట్టి ధరల్ని ప్రకటించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి గతంలో కొందరు సామాజిక కార్యకర్తలు హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించి కేంద్రానికి తగిన సూచనలు చేయాలని అభ్యర్థించారు. అయితే, ప్రజల జీవన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని... కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించలేమనీ, అలా చేస్తే నిత్యావసర వస్తువుల ధరలు అదుపు తప్పుతాయనీ సాకులు చెప్పి కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానాలను తప్పుదారి పట్టించిందన్నది నిర్వివాదాంశం.

నిజానికి ఈ సమస్యను న్యాయస్థానాలు పరిష్కరించాలని ఆశించడం కూడా సముచితం కాదు. వ్యవసాయ ఉత్పత్తుల ధరల్ని నిర్ణయించే సీఏసీపీ (కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్)లో చైర్మన్ నుంచి సభ్యుల వరకూ అందరూ బ్యూరోక్రాట్లే. రైతాంగ ప్రతినిధులు ఉండరు. పేరుకు 'సీఏసీపీ' స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థగా కనిపిస్తుంది గానీ, దానిపై రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయన్నది బహిరంగ రహస్యమే. సీఏసీపీ నిర్ణయించే కనీస మద్దతు ధరల విధానం ఆమోదయోగ్యం కాదని దశాబ్దాలుగా రైతాంగ సంస్థలు మొత్తుకొంటున్నా, కేంద్రంలో ఎవరు అధికారంలో వున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులే శిరోధార్యం అని ఎందరు చెప్పినా దానికి మొగ్గుచూపడం లేదు. పైగా, తాము అనుసరించే విధానాన్నే స్వామినాథన్ కమిషన్ సూచించిందనీ, ఆ ప్రకారం సాగు వ్యయంపై 50 శాతం జోడించి ఇస్తున్నామనీ దాదాపు ఐదారేళ్ల నుంచి కేంద్రం బుకాయిస్తూనే ఉంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కేంద్రంలో అనేక పార్టీల ప్రభుత్వాలు వచ్చాయి. ప్రతిపక్షంలో ఉండగా ఒకమాట, అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడ్డం జాతీయ రాజకీయ పార్టీలకు అలవాటుగా మారిన నేపథ్యంలోనే రైతాంగ సమస్యలు నేటికీ రావణ కాష్టంగా రగులుతూనే ఉన్నాయి. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే అన్నదాతలతో తక్షణం చర్చలు జరపాలి (ఎట్టకేలకు ఫిబ్రవరి 14న చర్చలకు ఆహ్వానించింది). 'మార్కెటింగ్ ఫ్రేమ్‌వర్క్' పేరుతో తెచ్చిన ముసాయిదాను ఉపసంహరించుకోవాలి. రైతాంగం కోరుతున్నట్లు పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించటం ఒక్కటే దేశ రైతాంగానికి సంజీవనిగా పని చేయగలుగుతుంది.

వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, శాసన మండలి సభ్యులు

సోషల్ మీడియా

శిక్ష చాలదు!



కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రి ఘటన కిరాతకమైనది. దాని అర్థం ఏమిటోగానీ అది అరుదాతి అరుదైనదే. దానికి (జీవిత ఖైదు కాకుండా) మరణ శిక్ష పడాల్సింది! ఒక స్త్రీగా, మనిషిగా చాలా నిరుత్సాహపడ్డాను.

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

వాళ్లకు అనుకూలం



విదేశీ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ఇండియన్ అకడెమిక్స్ 'పరిశోధన' పేరుతో చైనా కమ్యూనిస్టు పార్టీ కోసం 'పెయిడ్' వ్యాసాలు రాయడం అనేది పెను సవాలు. ఏ రంగంలోనైనా తీసుకోండి, అలాంటి ఎన్నో వ్యాసాలు కనబడతాయి. ఖలిస్తానీ తర్వాత అంతటి జాతీయ భద్రతా సవాలు ఇది.

– మోనికా వర్మ, పరిశోధకురాలు

ఏం చూపిస్తారో!



ఐఐటీ బాంబే ఈ వారాంతంలో గర్భ విజ్ఞానం గురించి ప్రసంగం ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ గోమూత్రాన్ని దాని 'ఔషధ విలువ' పేరిట ప్రస్తుతించారు. రేపెప్పుడైనా ఒక ఐఐటీ ఏ లైవ్ స్ట్రీమింగ్ ఈవెంటో ఏర్పాటుచేస్తే నేను అయోమయానికి గురవుతాను.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

కొంత చాలు



మానవ దేహం మారథాన్లు పరుగెత్తడానికి అనుకూలమేనా అని ఒక ప్రశ్న. 50కే, 100కే, ఇంకా దీర్ఘ దూరాలు పరుగెత్తే సామర్థ్యం కూడా మానవ దేహానికి ఉంది. కానీ అసలు ప్రశ్న అది ఆరోగ్యానికి అవసరమా? ఆరోగ్యం కోసమైతే ఒక మోస్తరు వేగంతో వారానికి 75-150 నిమిషాలు పరుగిడితే చాలు.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

ఉంటారు!



ఒక్క 'బిగ్ బాస్' ఎపిసోడ్ కూడా నేను చూడలేదంటే ఒక స్నేహితుడు షాక్ అయ్యాడు. నాలాంటి వాళ్ళు చాలామందే ఉంటారని చెప్పాను. బహుశా నేను సరిగ్గానే చెప్పానని అనుకుంటున్నా.

– ప్రణవ్ మహాజన్, పోలీస్ అధికారి

ఇన్ బాక్స్

నిజాంను ఎదిరించిన యోగి!

త్యాగశీలి, నిరాడంబరజీవి, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన రామానంద తీర్థ 1903 అక్టోబర్ 3న నిజాం రాజ్యంలో గుల్బర్గా జిల్లాలోని సిందిగి గ్రామంలో జన్మించారు. వారి అసలు పేరు వెంకట్రావ్ ఖేడ్గేకర్. వీరు విద్యార్థి దశలోనే ఉద్యమాలలో పాల్గొంటూ గాంధీజీ 'క్విట్ ఇండియా', 'సహాయ నిరాకరణ' ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1932లో స్వామి నారాయణ అనే గురువు దగ్గర సన్యాస దీక్ష స్వీకరించి స్వామి రామానంద తీర్థగా పేరు మార్చుకున్నారు.



రామానంద తీర్థ

జాతీయ కాంగ్రెస్ పార్టీ నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారు. హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో ప్రజలను చైతన్య పరిచారు. స్వామీజీగా, విప్లవవాదిగా రాజ్యధిక్కార నేరం కింద నిర్బంధ జైలు శిక్షను అనుభవించారు. వీరు గాంధీజీ నిర్మాణ కార్యక్రమాల్లో ముఖ్యంగా ఖాదీని ఎంచుకున్నారు. 'హైదరాబాద్ ఖాదీ సమితి' నెలకొల్పారు. భారతదేశంలో హైదరాబాద్ స్టేట్ విలీనం అయిన వెంటనే 1952 ఎన్నికల్లో స్వామీజీ సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యులుగా లోక్‌సభకు ఎన్నికై 1962 వరకు కొనసాగారు.

వినోబా భావే ద్వితీయ పర్యాయం 1955 నుండి 1956 మార్చి 12 వరకు తెలంగాణలో పర్యటించినప్పుడు స్వామీజీ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉంటూ కాంగ్రెస్ కార్యకర్తలు, శాసనసభ్యులతో ఈ యాత్రలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా వినోబాజీని కలవడానికి కొల్లాపురం తాలూకాలోని మాధవరావుపల్లి గ్రామం వచ్చినప్పుడు స్వామీజీ కూడా వీరి అంతరంగిక సమావేశంలో పాల్గొన్నారు.

స్వామీజీతో పర్యటనలలో అచ్యుతభాయ్ వీరి వెంట ఉండేవారు. రాజకీయ వ్యవహారాలు, మిగతా కార్యక్రమాలను అన్నిటిని వారి వ్యక్తిగత కార్యదర్శి దామోదర్ పాంగ్రేకర్ చూస్తూ ఉండేవారు. స్వామీజీ తన ఆశ్రమ జీవనాన్ని హైదరాబాదులోని బేగంపేట బ్రాహ్మణవాడి యందు గడిపారు. తెలంగాణలో గ్రామదాన గ్రామాలు సందర్శించి ఆ గ్రామాలలో ఖాదీ సంస్థల బలోపేతానికి తగిన చర్యలు చేపట్టేవారు. మహబూబ్ నగర్ జిల్లాలో గ్రామదాన గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా నేను కూడా వారితో ఉన్నాను.


ఆదర్శ జీవితం గడిపిన స్వామీజీ హైదరాబాద్ ఖాదీ సమితి అతిథి గృహంలో 1972 జనవరి 22న అస్తమించారు. నేను, మహేంద్రనాథ్ వారి అంతిమ దర్శనం చేసుకున్నాం. రేపటి తరానికి ఆదర్శంగా నిలిచిన స్వామి రామానంద తీర్థ... మాజీ ప్రధాని పీవీ నరసింహారావు రాజకీయ గురువు!

– జి.వి. సుబ్బారావు; తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు

(రేపు స్వామి రామానంద తీర్థ వర్ధంతి)

తెలంగాణోద్యమ క్రియాశీలి

సందర్భం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

సంగంరెడ్డి సత్యనారాయణ పేరు తెలంగాణ పాత తరానికి బాగా పరిచయం. కొత్త తరానికి ఆయన అంతగా తెలియదు. వరంగల్ జిల్లాలోని ముచ్చర్ల గ్రామంలో 1933 జనవరి 21న పుట్టిన ఆయన ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మూలమైన 'నాన్-ముల్కీ' ఉద్యమం 1950లో ప్రారంభమైనప్పుడు దానికి సాహిత్య ప్రాణం పోసిన తొలి విద్యార్థి మేధావి. హన్మకొండలోని మల్టీ పర్పస్ హైస్కూల్ అధ్యక్షుడిగా ఆ స్కూల్‌లోని ఆంధ్ర టీచర్లు, తెలంగాణ భాషను అవమానిస్తుంటే తిరుగుబాటును ఆర్గనైజ్ చేశాడు. అప్పటినుండే పాటలు రాయడం, ఉపన్యాసమివ్వడం, నాటకాలెయ్యడంలో దిట్టగా ఎదిగాడు.

'పచ్చని చెట్ల పైట రెపరెపలాడంగ; పాడిపంటలనిచ్చి కడుపునింపే తల్లి చల్లని మా తల్లి ముచ్చర్ల గ్రామం' వంటి పాటతో మొదలెట్టి, నాన్-ముల్కీ పోరాటంలోనే 'తెలంగాణ సోదర తెలుసుకో నీ బతుకు; మోసపోతివ నీవు గోస పడతావు' అనే పాట రాసి, పాడి ఉద్రుత లూగించాడు. తన గ్రామంపై పాట రాసినందున ఆయనను ముచ్చెర్ల సత్యనారాయణ అనేవారు. ఊరి నుండి బడికి రోజూ 12 మైళ్ళు నడిచొచ్చే, బట్టలు కూడా సరిగా లేని ఆయన 12వ తరగతి ఫెయిల్ అయ్యాడు. సప్లమెంటరీ రాసి పాసై హైదరాబాద్‌కు వచ్చి సంగీత కళాశాలలో చేరాడు. ఉండటానికి చోటు లేక గూటి కోసం వెతగ్గా రవీంద్ర భారతి పక్కన బీసీ హాస్టల్ ఉందని తెలిసి సంగం లక్ష్మీబాయమ్మను కలిసి పాట పాడి ఆమెను మెప్పించి అడ్మిషన్ తెచ్చుకున్నాడు.

ఒక సంవత్సరంలో హిందూస్థానీ, కర్ణాటక సంగీతం నేర్చుకొని సత్యనారాయణ ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో బీఏ తెలుగు, సంస్కృతం, ఎకనామిక్స్ చదువుకున్నాడు. 1956లో తెలంగాణ స్టేట్ ఆంధ్రలో కలిసి ఆంధ్రప్రదేశ్ కావడంతో సత్యనారాయణ, ఆయన మిత్రులు నాన్-ముల్కీ ఉద్యమాన్ని ఆంధ్ర వ్యతిరేక ఉద్యమంగా మార్చారు. ఆ ఉద్యమ మొదటి పాట ఆయన రాసి పాడిందే. అదీ మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మీద.

'అయ్యయ్యో రామరామ సంజీవరెడ్డి మామ / సునోజీ మేరగాన – కహతా రహే తెలంగాణ /..... / ఛోడోజీ తెలంగాణ – భలే జావో రాయలసీమ'... ఈ పాట ఆ కొత్త ఉద్యమాన్ని ఉద్రుతలూగించింది. 1948 తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుండి 1956 మధ్యలో అటు ఆంధ్ర నుండి, ఇటు మహారాష్ట్ర వివిధ ప్రాంతాల నుండి బ్రాహ్మణ మైగ్రేషన్ బాగా జరిగింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రమంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఇంగ్లిష్ డిగ్రీలు సంపాదించిన బ్రాహ్మణ మేధావులు ప్రొఫెసర్లు అయ్యారు. దాదాపు 1960 నాటికి ఇక్కడి రెడ్లు, వెలమలు ఎంఏ, ఎమ్మెస్సీ పట్టాలు పొందినవారు లేరు.

1953–56 మధ్య సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడాలనే చర్చల్లో తెలంగాణ ప్రాంతం బ్రాహ్మణ మేధావులు ఉన్నారు. ఇప్పుడు వరంగల్‌లో ఒక హెల్త్ యూనివర్సిటీ పేరు, ఒక కళాక్షేత్రం పేరు పెట్టిన కాళోజీ 1969 వరకు సమైక్యవాదే. సత్యనారాయణ నాన్-ముల్కీ పోరాటం స్కూలు ప్రెసిడెంట్‌గా నడిపినపుడు జయశంకర్ ఆయన క్లాస్‌మేట్. ఇద్దరు కలిసి నాటకాలు వేశారు. కానీ సత్యనారాయణ లాగా మిలిటెంట్ నాన్-ముల్కీ వ్యతిరేక ఉద్యమంలో ఆయన ఉన్న దాఖలాలు లేవు. సత్యనారాయణ గొల్ల (యాదవ) కులంలో పుట్టినందున ఒక క్రియేటివ్ కవిగా, పాటగాడిగా ఆయనకు రావలసినంత గుర్తింపు రాలేదు. 1950 దశకంలో ఉస్మానియాలో డిగ్రీ పూర్తి చేసిన ఆయన గ్రామానికి పోయి గ్రామ ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచ్, ఆ తరువాత 1970లో హన్మకొండ సమితి ప్రెసిడెంట్ అయ్యాడు. ఆనాటి మొట్టమొదటి దళిత్ కలెక్టర్ కాకి మాధవరావుతో దోస్తీ చేసి గ్రామాలకు అభివృద్ధి పథకాలను తీసుకెళ్లాడు.



సంగంరెడ్డి సత్యనారాయణ

1983 ఎన్టీఆర్ టీడీపీ రాగానే అందులో చేరి ఎమ్మెల్యేగా హయగ్రీవాచారిని చిత్తుగా ఓడించి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అయ్యాడు. అయితే అనతి కాలంలోనే వరంగల్ జిల్లాలో మైగ్రేట్ కమ్మ నాయకుడు శివాజీని, కమ్మ డాక్టర్ కల్పనాదేవిని ఆయనపై అజమాయిషీకి పెట్టడంతో ఎన్టీఆర్ మీద ఆయన తిరుగుబాటు మొదలైంది. ఆయన ఎన్టీఆర్ మీద కోపంతో నాదెండ్ల భాస్కర్ రావు క్యాంపులో చేరి చివరికి పదవి కోల్పోయాడు. ఆ తరువాత మళ్ళీ కడవరకు అంటే 2016లో చనిపోయే వరకు ప్రత్యేక తెలంగాణ కోసం రకరకాల కార్యక్రమాలు చేపట్టాడు. 2001లో కేసీఆర్, టీఆర్‌ఎస్ పార్టీ పెడితే దానిలో చేరి కొంతకాలం పనిచేశాడు.

ఆయన చనిపోయి 8 సంవత్సరాలు అయినా ఆయనకో విగ్రహం గానీ, ఆయన పోతే వరంగల్ ప్రాంతంలో ఏ సంస్థనూ ఎవరూ పెట్టింది లేదు. ఆయనతో పని చేసిన జయశంకర్‌కు, కాళోజీకి, కొండా లక్ష్మణ్‌కి చాలా గుర్తింపు దొరికింది. జీవితంలో సుదీర్ఘకాలం బీదరికంలో బతికిన ఆయన మనకో ఆదర్శాన్ని మిగిల్చాడు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు

(నేడు సంగంరెడ్డి సత్యనారాయణ జయంతి)

అజరామరుడు

కారల్ మార్క్స్, ఎంగెల్స్ ఆవిష్కరించిన 'కమ్యూనిస్టు ప్రణాళిక' అనంతరం ప్రపంచంలోనే మొదటిసారి రష్యాలో కార్మికవర్గ (ప్రజల) ప్రభుత్వాన్ని నిర్మించిన విప్లవ యోధుడు కామ్రేడ్ లెనిన్. వెనుకబడిన రష్యాలో మార్క్సిజాన్ని తన దేశ పరిస్థితులకు అన్వయింప చేసుకుని శాస్త్రీయ ఒరవడితో బోల్షివిక్ పార్టీ పుట్టిన 19 ఏళ్లలోనే విప్లవాన్ని విజయవంతం చేసిన కార్మిక వర్గ పుత్రుడు లెనిన్.

జారిస్ట్ రష్యాలో 1870 ఏప్రిల్ 22న జన్మించిన వ్లాదిమిర్ ఇల్యిచ్ ఉల్యానోవ్ తన కలంపేరు 'లెనిన్'తో ప్రసిద్ధి చెందారు. జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా పోరాడటానికి ఒక విప్లవ సంస్థలో చేరిన అన్నను ప్రభుత్వం ఉరితీసింది. 18 ఏళ్లు కూడా నిండని లెనిన్ తన అన్న మరణంతో జార్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు సిద్ధమయ్యారు. వర్గ పోరాటం ద్వారా దీనిని సాధించవచ్చని నమ్మారాయన. కజాన్ విశ్వవిద్యాలయంలో న్యాయవిద్యను అభ్యసిస్తున్న తరుణం నుండే ఆయనపై పోలీసుల వేట ప్రారంభమైంది. కోర్టు శిక్ష, సైబీరియా ప్రవాసం తర్వాత ఇక రష్యాలో ఉండటం సాధ్యం కాదని విదేశాలకు వెళ్లిపోయారు. 1898లో బోల్షివిక్ పార్టీ ఏర్పాటు సందర్భంగా కూడా లెనిన్ ప్రవాసంలోనే ఉన్నారు. రష్యా వ్యవస్థ స్వభావాన్ని 1897 – 98లోనే ప్రవాసంలోనూ, తర్వాత రోజుల్లో క్షుణ్ణంగా పరిశీలించి 'రష్యాలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధి' అనే గ్రంథాన్ని రాశారు. నరోడ్నిక్ భావాలకు వ్యతిరేకంగా, ఆర్థికవాదానికి వ్యతిరేకంగా 'ఏమి చేయాలి' అనే రచన చేశారు. మొదటి ప్రపంచ యుద్ధం సందర్భంగా 'పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశయే సామ్రాజ్య వాదం' అనే గ్రంథాన్ని రాశారు. ఇలా పుంఖాను పుంఖాలుగా వెలువరించిన గ్రంథాలు ప్రజలను విప్లవోద్యమ ప్రస్థానంలో ముందుకు నడిపించాయి.



లెనిన్

1917 అక్టోబర్ విప్లవం రష్యాకు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని, శాంతిని ఇచ్చింది. ప్రపంచ శాంతిని చేకూర్చింది. తుదకు ఈ మహనీయుడు 1924న జనవరి 21న అనారోగ్యంతో అమరత్వం పొందారు. వందేళ్లుగా భారతదేశంలోని కమ్యూనిస్టు పార్టీ చీలికలు పీలికలుగా తయారై విప్లవానికి దూరమయ్యింది. మార్క్స్, ఎంగెల్స్ రచనలకు తోడు, లెనిన్ అభివృద్ధి పరిచిన సిద్ధాంతాన్ని మన కమ్యూనిస్టులు ఈ దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకుంటూ ఈ దేశ విప్లవోద్యమంలో భాగం కావాల్సిన ఆవశ్యకత నెలకొని ఉంది.

– ఎం. హన్మేశ్, గ్రేటర్ హైదరాబాద్ సి.పి.ఐ. ఎంఎల్ మాస్ లైన్ కార్యదర్శి (నేడు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో లెనిన్ శతవర్ధంతి ముగింపు సందర్భంగా ఆయన రచనలపై సెమినార్)

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.11.13 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** చిత్త రా.10.32 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** తె.4.45 నుండి 6.29 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.53 నుండి 9.41 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.46 వరకు, **అమృత ఘడియలు:** ప.3.19 నుండి 5.06 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.45.

క్లుప్తంగా...

టీపీఎండబ్ల్యూయూ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



టీపీఎండబ్ల్యూయూ రాష్ట్ర నూతన కార్యవర్గం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీపీఎండబ్ల్యూయూ) రాష్ట్ర రెండవ మహాసభల సందర్భంగా సోమవారం సంఘం నూతన కార్యవర్గాన్ని 29 మందితో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, అధ్యక్షుడిగా కె.సూర్యం, ఉపాధ్యక్షులుగా దున్న గురువయ్య, కొలిమి రాములు, అరవపల్లి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా జి.రామయ్య ఎన్నికయ్యారు.

యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.4.17కోట్లు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 47 రోజుల్లో రూ.4,17,13,596 హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. హుండీల్లోని నగదు, నగలను సోమవారం కొండకు దిగువన శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఇందులో నగదు రూ.4,17,13,596 రాగా, మిశ్రమ బంగారం 228 గ్రాములు, మిశ్రమ వెండి 7 కిలోల 50 గ్రాములు వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. అంతేకాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, యూఏఈ, నేపాల్, సౌదీ అరేబియా, సింగపూర్, ఖతార్, ఒమాన్, కెనడా, మలేస/ యా, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, జార్జియా, థాయిలాండ్, ఇండోనేషియా తదితర దేశాలకు చెందిన కరెన్సీ కూడా వచ్చినట్లు తెలిపారు.

అప్పుల బాధతో యువరైతు బలవన్మరణం

దోమ: అప్పుల బాధతో ఓ యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి యాదయ్య (35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే తన పొలంలో బోరు వేసేందుకు ప్రైవేటు బ్యాంకులతో పాటు తన స్నేహితుల వద్ద లక్షన్నర రూపాయలు అప్పు చేశాడు. వేసిన బోర్లు పడకపోవడంతో, చేసిన అప్పులు ఎలా తీర్చాలని నిత్యం భార్య వద్ద మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో సోమవారం తన పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అంజిలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- తిరుపతి జిల్లాలో ఘటన

రేణిగుంట(తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణకు చెందిన సందీప్ షా(41) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య అంజలీదేవి(31), కుమార్తెలు లితికాషా, సోనాలీషా, కుమారుడు రుద్రప్రతాప్ ఉన్నారు.శ్రీవారి దర్శనార్థం వీరంతా, సందీప్ షా స్నేహితుడు నరేష్‌తో కలిసి కారులో తిరుపతి వచ్చారు. సోమవారం హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. రేణిగుంట మండలం మామాండూరు దాటాక ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న సందీప్ షా, ఆయన భార్య అంజలీదేవి(31) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీట్లో కూర్చున్న లితికా షా, సోనాలీషా, రుద్రప్రతాప్, నరేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు.

భక్తులతో కిక్కిరిసిన కొమురవెల్లి



తోటబావి ప్రాంగణంలో వేసిన పెద్దపట్నం, అగ్నిగుండం

కొమురవెల్లి (సిద్దిపేట): సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం పసుపుమయంగా మారింది. సోమవారం హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తులు పెద్ద పట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో మెదటి వారం మానుక పోచయ్య వంశస్తులు అగ్నిగుండాలు, పెద్ద పట్నం నిర్వహించే ఆనవాయితీ ఉంది. పంచ పల్లవాలతో (మామిడి, జువ్వి, రావి, మేడి, మర్రి కర్రలు) నిప్పు కణికలుచేసి అగ్నిగుండాలు నిర్వహించారు. ఆలయం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పూజారులు తీసుకువచ్చి యాదవ సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. స్వామి వారి పెద్ద పట్నం అగ్నిగుండాలు తిలకించేందుకు తరలి వచ్చిన భక్తులతో గ్యాలరీలన్నీ కిక్కిరిసి పోయాయి.



పెద్దపట్నం, అగ్నిగుండాలు తిలకించేందుకు వచ్చిన భక్తులు

యాంత్రీకరణ సగమే!

వ్యవసాయ యంత్ర పరికరాల ఉత్పత్తిలో భారత్ నత్తనడక

- దేశంలోని 8 ప్రధాన పంటల్లోనూ యాంత్రీకరణ స్థాయి 47 శాతమే
- యంత్ర పరికరాలకు సంబంధించిన పరిశోధనలూ అంతంతే
- ట్రాక్టర్లు తప్ప మిగతా యంత్రాలు చాలావరకు విదేశాల నుంచే దిగుమతి
- పత్తితీతకు ఒక్క యంత్రమూ లేని వైనం
- చిన్న రైతులకు ఉపయోగపడేలా యంత్రాలుండాలంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: స్వావలంబన గురించి పాలకులు ఊదరగొడుతున్నప్పటికీ.. దేశంలో వ్యవసాయ పనుల యాంత్రీకరణ మాత్రం నత్తనడకనే నడుస్తోంది. కూలీల కొరతతో పాటు వ్యవసాయ ఖర్చులు తడిసిమోపెడై రైతు నడ్డి విరుస్తున్నప్పటికీ యాంత్రీకరణపై దృష్టి కేంద్రీకరించడానికి ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్ల తర్వాత కూడా వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించిన పరిశోధనలు, పరికరాల ఉత్పత్తిలో వెనుకబడే ఉన్న భారత్, ఈ విషయంలో ఎక్కువగా విదేశాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. దేశంలో విస్తారంగా సాగవుతున్న 8 ప్రధాన పంటల్లో యాంత్రీకరణ స్థాయిని పరిశీలిస్తే సగటున 47% పనులు మాత్రమే యంత్రాల ద్వారా జరుగుతున్నాయి. చిరుధాన్యాలు, చెరుకు పంటల్లో అతి తక్కువగా 33-36% పనులు చేయటానికి మాత్రమే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి కూడా రైతుల్లో 80-90% ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఎంతమేరకు అందుబాటులోకి వచ్చాయంటే చెప్పలేని పరిస్థితి ఉంది.

వరి, గోధుమల్లో అత్యధికంగా..

వ్యవసాయ యాంత్రీకరణ గోధుమ, వరి పంటల్లో ఎక్కువగా జరిగింది. గోధుమలో అత్యధికంగా 69%, వరిలో 53% పనుల యాంత్రీకరణ జరిగిందని కొద్ది నెలల క్రితం ఐసీఏఆర్ నిర్వహించిన జాతీయ అధ్యయనంలో వెల్లడైంది. అదేవిధంగా మొక్కజొన్నలో 46%, పప్పుధాన్యాల్లో 41%, నూనెగింజల్లో 39%, పత్తిలో 36%, చిరుధాన్యాల్లో 33%, చెరుకులో 35% పనులు చేయటానికి యంత్రాలు ఉన్నట్లు తేలింది. ప్రధాన పంటలకు సంబంధించి నారుమళ్ల తయారీ, విత్తనాలు/ నాట్లు వేయటం వంటి పనుల్లో వివిధ పంటల్లో 65 నుంచి 80% వరకు యాంత్రీకరణ జరిగినప్పటికీ, కోత/ నూర్పిడి వంటి పనులకు సంబంధించి మాత్రం యాంత్రీకరణ అతి తక్కువగా ఉంది.

పత్తి 113 లక్షల హెక్టార్లలో సాగవుతున్నా..

దేశంలో ప్రధానమైన వాణిజ్య పంట పత్తి 113 లక్షల హెక్టార్లలో సాగవుతోంది. అయినా పత్తి తీసేందుకు సరైన యంత్రమేదీ ఇప్పటికీ లేకపోవడం శోచనీయం. భోపాల్‌లోని కేంద్రీయ వ్యవసాయ ఇంజినీరింగ్ సంస్థ (సీఐఏఈ) ట్రాక్టర్‌తో పాటు నడుస్తూ పత్తి తీసే ఒక యంత్రాన్ని ఇటీవల రూపొందించింది. ఒక మనిషి గంటకు దాదాపు 5 కిలోల పత్తిని మొక్కల నుంచి సేకరిస్తుంటే.. ఈ యంత్రం గంటకు 150-217 కిలోల పత్తిని తీయగలదు. అయితే ఇది తీసే పత్తిలో 29% వరకు చెత్తాచెదారం కలిసి వస్తుండటం పెద్ద ప్రతిబంధకంగా ఉందని చెబుతున్నారు. సమీప భవిష్యత్తులో ఈ సమస్యను అధిగమించే అవకాశం ఉందని ఐసీఏఆర్ వర్గాలు చెబుతున్నాయి.

చైనా నుంచే 89% యంత్రాల దిగుమతి!


భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఇటీవల నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. 2023-24లో రూ.480.89 కోట్ల విలువైన వ్యవసాయ యంత్రాలు, ఉపకరణాలు దిగుమతయ్యాయి. ఇందులో అత్యధిక శాతం (89%) చైనా నుంచే వచ్చాయి. ఆ తర్వాతి స్థానాల్లో అమెరికా (5%), తైవాన్ (2%), ఇతర దేశాలు (4%) ఉన్నాయి. 2022-23తో పోల్చితే 2023-24లో సుమారు రూ.100 కోట్ల మేర దిగుమతులు పెరిగాయి.

ట్రాక్టర్ల ఎగుమతిలో పైచేయి

భారత్ 2023-24లో రూ.233.95 కోట్ల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను పలు దేశాలకు ఎగుమతి చేసింది. తుర్కియే (18%), అమెరికా (13%), మెక్సికో (12%), కెన్యా (6.4%), నైజీరియా తదితర దేశాలకు (6%)కు ఎగు మతులు జరిగాయి. ముఖ్యంగా ట్రాక్టర్ల విషయంలో మన దేశానిదే పైచేయిగా ఉంది. 2023-24లో 9,214.54 కోట్ల విలువైన ట్రాక్టర్లను ఎగుమతి చేయగా, రూ.254.80 కోట్ల విలువైన విదేశీ ట్రాక్టర్లను దిగుమతి చేసుకున్నాం. అమెరికా, నెదర్లాండ్స్, సౌతాఫ్రికా, బ్రెజిల్, బంగ్లాదేశ్ తదితర దేశా లకు మన ట్రాక్టర్లు భారీగా ఎగుమతి అవుతున్నాయి. అయితే 2022-23 (రూ.11.973.65 కోట్లు)తో పోల్చితే 2023-24లో ట్రాక్టర్ల ఎగుమతులు గణనీయంగా తగ్గడం గమనార్హం.

చిన్న రైతులకు అనుగుణంగా యాంత్రీకరణ జరగాలి

వ్యవసాయ యాంత్రీకరణపై ప్రైవేటు రంగంలో జరిగే పరిశోధనలు చాలా వరకు ఆర్థిక స్తోమత కలిగిన పెద్ద రైతుల అవసరాలకు అనుగుణంగానే ఉంటున్నాయనే విమర్శ ఉంది. చిన్న, సన్నకారు రైతులు తమ అవసరాలను తీర్చుకోవటానికి తామే కొన్ని యంత్ర పరికరాలను తయారు చేసుకుంటున్నారు. స్థానికంగా గ్రామీణ ఆవిష్కర్తలు రైతుల అవసరాలను గుర్తించి అందుబాటు ధరలో తయారు చేసే యంత్ర పరికరాలనే రైతులు ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతుల అవసరాలకు, ముఖ్యంగా మహిళలు ఉపయోగించదగిన రీతిలో వ్యవసాయ యాంత్రీకరణ ప్రక్రియ వేగవంతంగా జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



ఆరోగ్యశ్రీ సేవలు యథాతథం

సేవలు కొనసాగించేందుకు అంగీకరించిన నెట్‌వర్క్ ఆస్పత్రులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ. చిత్రంలో క్రిస్టినా

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశ్రీ సేవలను రాష్ట్రంలో యథావిధిగా కొనసాగించేందుకు నెట్‌వర్క్ ఆస్పత్రులు అంగీకరించాయి. బకాయిలు చెల్లించాలని, ప్యాకేజీల ధరలు పెంచాలని కోరుతూ ఈ నెల 10వ తేదీ నుంచి తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (తాన్హా) ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హాస్పిటల్స్ యాజమాన్యాలతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమావేశమయ్యారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాకేశ్, జనరల్ సెక్రటరీ హరిప్రకాశ్, డాక్టర్ సౌజన్య, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎంప్యానల్‌మెంట్ ఎంవోయూను సవరించాలని, ఆరోగ్యశ్రీ ప్యాకేజీల రేట్లు రివైజ్ చేయాలని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీకి గతంలో ఏడాదికి సగటున రూ.500 కోట్లు చెల్లిస్తే, తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రూ.1137 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. 'గతంలో ఉన్న బకాయిలను కూడా క్లియర్ చేశాం. రెగ్యులర్‌గా పేమెంట్స్ రిలీజ్ చేస్తున్నాం. మరో 6 నెలల్లో బకాయిలు లేకుండా పేమెంట్స్ క్లియర్ చేస్తాం. ఆస్పత్రులను ఇబ్బంది పెట్టాల్సిన అవసరం మాకు లేదు. మీరు నష్టపోకూడదు..అదే సమయంలో ప్రజలకు కూడా ఇబ్బంది కలగకూడదు. ఇది మీ ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వం. మీరు ఎప్పుడైనా వచ్చి మీ సమస్యలను మాకు తెలియజేయడానికి అవకాశం ఉంది. మీరు లేవనెత్తిన ఇతర సమస్యలను కూడా పరిష్కరించే బాధ్యత మాది. ప్యాకేజీల రేట్లను 2013లో రివైజ్ చేశాం. మళ్లీ మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రేట్లను రివైజ్ చేశాం. రివిజన్‌కు సంబంధించి ఆస్పత్రులు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేసి, సానుకూల నిర్ణయం తీసుకుంటాం. ఇతర సమస్యలను సైతం పరిష్కరించే బాధ్యత మాది' అని మంత్రి చెప్పారు. ఇతర సమస్యలపై చర్చించేందుకు హెల్త్ సెక్రటరీ, ఆరోగ్యశ్రీ సీఈవోతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లా డుతూ మంత్రి హామీ మేరకు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలు యథావిధిగా కొనసాగిస్తామని చెప్పారు.

ఇంకెన్నాళ్లు ఇన్‌చార్జ్‌ల పాలన?

- డీహెచ్ పోస్టుకు పదకొండేళ్లుగా రెగ్యులర్ అధికారి ఏరీ ?
- డీఎంఈ, టీవీవీపీ కమిషనర్ పోస్టుల్లో ఇప్పటికీ ఇన్‌చార్జ్‌లే
- ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లోనూ అదే పరిస్థితి
- ఇదీ వైద్యారోగ్య శాఖ తీరు



సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలో ఏళ్లకేళ్లుగా ఇన్‌చార్జ్‌ల పాలనే కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా..రాష్ట్ర స్థాయి కీలక పోస్టుల్లో కూడా రెగ్యులర్ అధికారులను నియమించడం లేదు. రాష్ట్ర విభజన తర్వాత కీలకమైన ప్రజారోగ్య సంచాలకుడు (డీహెచ్), వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) పోస్టులు ఏపీకి కేటాయించడంతో ఇక్కడ అధికారికంగా ఆ హోదాలు లేకుండా పోయాయి. దీంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇన్‌చార్జ్ అధికారులను డీహెచ్‌లుగా, డీఎంఈలుగా నియమించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డీహెచ్, డీఎంఈ పోస్టులను మంజూరు చేశారు. అయితే ఆ హోదాల్లో రెగ్యులర్ అధికారులను నియమించలేదు. దీంతో సీనియారిటీ ప్రాతిపదికన ఇన్‌చార్జ్ అధికారులకు ఆ హోదా ఇచ్చి పని కానిస్తున్నారు.

2014 నుంచి ఏడుగురు డీహెచ్‌లు ఇన్‌చార్జ్‌లే...

2014 నుంచి ఇప్పటిదాకా ప్రజారోగ్య సంచాలకులుగా ఏడుగురు అధికారులు పనిచేశారు. గతంలో ఒకాయన అర్హత లేకపోయినా, ఇన్‌చార్జ్ డీహెచ్‌గా అంతా తానై వ్యవహరించారనే విమర్శలు ఎదుర్కొన్నారు.

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీనియారిటీ జాబితాలో ముందున్న డాక్టర్ రవీంద్రనాయక్‌ను డీహెచ్‌గా నియమించింది. అయితే నాయక్‌కు పూర్తి స్థాయి రెగ్యులర్ హోదా ఇవ్వలేదు.
- గత ప్రభుత్వంలో డీఎంఈగా పనిచేసిన డాక్టర్ రమేశ్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పించి డాక్టర్ త్రివేణికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించింది. గత సంవత్సరం ఫిబ్రవరి 20న ఆమె స్థానంలో డాక్టర్ వాణిని ఇన్‌చార్జ్ డీఎంఈగా ప్రభుత్వం నియమించింది. డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదంతో రెగ్యులర్ డీఎంఈ నియామక ప్రక్రియ పూర్తయినా,ఇన్‌చార్జ్‌తోనే సర్కారు నెట్టుకొస్తోంది.
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా డాక్టర్ అజయ్‌కుమార్ కొనసాగుతున్నారు. ఆయన సీనియారిటీ మేరకు రెగ్యులర్ పోస్టులోనే తీసుకున్నా, ఇంకా పోస్టు క్రియేట్ చేయలేదని సమాచారం. అయితే వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ డైరెక్టరేట్‌గా మార్చాలనే ప్రతిపాదనపై ప్రభుత్వం పనిచేస్తున్న నేపథ్యంలో ఈ పోస్టు కూడా తాత్కాలికమే.
- ఇక నర్సింగ్ కౌన్సిల్‌లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరే ఇన్‌చార్జ్ హోదాలో ఆ పోస్టులో కొనసాగుతున్నారు.

అదనపు డీఎంఈల నియామకంలోనూ ఉదాసీనత

రాష్ట్రంలో ప్రస్తుతం 34 ప్రభుత్వ వైద్య కళాశాలలు, వాటికి అనుబంధంగా మరో 34 బోధనాస్పత్రులు ఉన్నాయి. అయితే ఈ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లుగా, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లుగా అదనపు డీఎంఈ హోదా ఉన్న వారినే నియమించాలి. ప్రస్తుతం రెగ్యులర్ అదనపు డీఎంఈలుగా 17 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన 47 పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లే కొనసాగుతున్నారు.

- రాష్ట్రంలో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచినా, అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లోని వారి వయోపరిమితి మాత్రం 60గానే ఉండిపోయింది. శాసనసభలో చట్ట సవరణ ద్వారా అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల వయోపరిమితిని 65కి పెంచారు. ఇది జరిగి నెలలు కావొస్తున్నా, సీనియారిటీ జాబితా రూపొందించినా, సంబంధిత ఉత్తర్వులు రాకపోవడంతో అడుగు ముందుకు పడడం లేదని సమాచారం.
- నర్సింగ్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లను కూడా రెగ్యులర్ పోస్టుల్లో కాకుండా ఇన్‌చార్జ్‌లనే నియమిస్తున్నట్టు తెలిసింది.

అమెరికాలో కాల్పుల్లో హైదరాబాదీ మృతి

- చేతికంది వచ్చిన కొడుకు మరణించడంతో కన్నీరుమున్నీరు అవుతున్న తల్లిదండ్రులు
- ఆర్కే పురంలో విషాదఛాయలు



రవితేజ

దిల్‌సుఖ్‌నగర్ (హైదరాబాద్)/చౌటుప్పల్ రూరల్: ఉన్నత చదువులు, ఉన్నతమైన జీవితం కోసం అమెరికా వెళ్లిన యువకుడు అక్కడ దుండగుల కాల్పులకు బలయ్యా డు. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసిన రవితేజ.. మాస్టర్స్ చదివేందుకు 2022లో అమెరికాకు వెళ్లాడు. వాషింగ్టన్‌లో మాస్టర్స్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్న కొడుకు మృతిచెందాడన్న వార్త తల్లిదండ్రులను కలచివేసింది. యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కోయిల గూడెంకు చెందిన కొయ్యడ చంద్రమౌళి-సువర్ణ దంపతులు కొంతకాలం నుంచి ఆర్కే పురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. చంద్రమౌళి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి కుమారుడు రవితేజ (26), ఒక కుమార్తె ఉన్నారు. రవితేజ ప్రస్తుతం కనెక్టికట్‌లో ఓ రెస్టారెంట్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం కారు అద్దెకు తీసుకొని కేక్ డెలివరీ చేయడానికి వెళ్లారు. అయితే, దుండగులు అప్పటికే చోరీకి పాల్పడి.. పారిపోయే క్రమంలో రవితేజ ప్రయాణిస్తున్న కారుపై కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడిక్కడే మృతిచెందారు. రవితేజ ఎంతసేపటికీ తిరిగి రెస్టారెంట్‌కు రాకపోవడంతో యజమానికి అనుమానం వచ్చి ఫుడ్ ఆర్డర్ పెట్టిన లొకేషన్‌కు వెళ్లి చూడగా రవితేజ మృతదేహం కనిపించింది. ఈ సమాచారాన్ని సోమవారం తెల్లవారుజామున రవితేజ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న రవితేజ సోదరి ఆస్పత్రికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించారు. చేతి కొచ్చిన కొడుకు మృతి చెందడంతో హైదరాబాద్‌లోని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రీన్‌హిల్స్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. తాను మాస్టర్ డిగ్రీ పట్టా అందుకునే కార్యక్రమానికి రావాలని రవితేజ తల్లిదండ్రులకు చెప్పగా వారు పాస్‌పోర్ట్, వీసా తీసుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారని, ఇంతలోనే కుమారుడు మృతి చెందడంతో వారు విషాదంలో మునిగిపోయారని బంధువులు చెప్పారు.



విలపిస్తున్న రవితేజ కుటుంబ సభ్యులు

డాడీ త్వరలోనే మంచి గిఫ్టు ఇస్తానన్నాడు

తాను గత శనివారం కొడుకుతో మాట్లాడానని చంద్రమౌళి చెప్పారు. తనకు త్వరలోనే మంచి జాబ్ వస్తుందని... మిమ్మల్ని చూసుకుంటానని చెప్పాడన్నారు. త్వరలోనే నీకు మంచి గిఫ్టు ఇస్తానన్నాడని, అయితే అది ఇదేనా అంటూ ఆయన భోరున విలపించారు. తన కొడుకు మృతదేహాన్ని వెంటనే హైదరాబాద్‌కు వచ్చేలా చూడాలని చంద్రమౌళి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్.. రవితేజ కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి సహాయం చేస్తానని చెప్పారని ఆయన కార్యాలయం తెలిపింది.

మాలలకు కొమ్ముకాస్తే కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోవాల్సిందే

- దేశంలోనే ముందుగా వర్గీకరణ అమలు చేస్తామని మాటతప్పిన రేవంత్
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

హనుమకొండ: మాలలకు కొమ్ము కాస్తే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. సోమవారం హనుమకొండలో లక్ష డప్పులు..వేల గొంతుకల సన్నాహక మహా ప్రదర్శన జరిగింది. మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడగానే రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. అప్పటికే వచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉద్యోగాల భర్తీలో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని, అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తానని చెప్పి నాలుగున్నర నెలలవుతున్నా అమలు చేయకుండా మాట తప్పారని చెప్పారు. కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నాడని ధ్వజమెత్తారు. రెడ్ల పార్టీగా చెప్పుకుంటున్న కాంగ్రెస్‌లో మాలల ఆధిపత్యమే నడుస్తుందన్నారు. ఇప్పుడు వెంకటస్వామి కుమారులు వర్గీకరణ జరగనివ్వబోమని సభలు, సమావేశాలు నిర్వహిస్తూ అడ్డుకుంటున్నారని చెప్పారు. చిన్నపాటి విమర్శలకు మాదిగలైన బక్క జడ్సన్, సర్వే సత్యనారాయణలను సస్పెండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే సమక్షంలో చేసిన ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్, మేనిఫెస్టోను వ్యతిరేకిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు..వేల గొంతుకల మహా ప్రదర్శనకు ప్రతి గ్రామం నుంచి డప్పులతో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, తాటికొండ రాజయ్య, కొండేటి శ్రీధర్, గోనె ప్రకాశ్‌రావు, గాయకులు మిట్టపల్లి సురేందర్, ఏపూరి సోమన్న తదితరులు పాల్గొన్నారు.



ఓ మహిళా కార్యకర్తతోపాటు డప్పు కొడుతున్న మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



విక్టరీ ర్యాలీలో ట్రంప్ డ్యాన్స్


ఆశ్చర్యపరిచిన విలేజ్ పీపుల్ ప్రదర్శన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్'విక్టరీ ర్యాలీని తన ఐకానిక్ డ్యాన్స్ మూవ్స్‌తో ముగించారు. 1978 నుంచి హిట్ అయిన 'విలేజ్ పీపుల్' ట్రాక్ మరోసారి మార్మోగింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ విలేజ్ పీపుల్ బ్యాండ్ ఈ పాటను ప్రదర్శించగా వారి వెనుక నిలబడిన ట్రంప్ అప్పుడప్పుడు పాడారు. స్టేజ్ మీద విలేజ్ పీపుల్ ఏడో సభ్యుడిగా చేరి ట్రంప్ డ్యాన్స్ చేశారు.



మార్పుకోసం ఎదురుచూస్తున్నా

వాషింగ్టన్: ట్రంప్ సారథ్యంలో అమెరికాలో చాలా మార్పులు చేయడానికి తాను ఎదురు చూస్తున్నానని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారానికి ముందు వాషింగ్టన్‌లోని క్యాపిటల్ వన్ ఏరీనాలో ఆదివారం రాత్రి జరిగిన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ విజయోత్సవ ర్యాలీలో మస్క్ పాల్గొని ప్రసంగించారు. ''మేం చాలా మార్పులు చేయాలని చూస్తున్నాం. శతాబ్దాలపాటు అమెరికా బలీయశక్తిగా కొనసాగేందుకు వీలుగా మార్పులు చేయడం ముఖ్యం. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చుదాం''అని మస్క్ అన్నారు. మస్క్... లిటిల్ ఎక్స్ అని పిలుచుకునే తన కుమారుడు ఎక్స్ ఎ-12 ను కూడా వేదికపైకి తీసుకొచ్చారు.



ప్రమాణస్వీకారానికి ముందు వైట్‌హౌస్‌లో తేనీటి విందు సందర్భంగా బైడెన్ దంపతులతో ట్రంప్ దంపతులు



కేపిటల్ హిల్ రోటుండా హాల్‌లో అధ్యక్షునిగా ప్రమాణం చేస్తున్న ట్రంప్. చిత్రంలో భార్య మెలానియా, కుమార్తె ఇవాంకా తదితరులు



ఉపాధ్యక్షునిగా ప్రమాణం చేస్తున్న జేడీ వాన్స్. చిత్రంలో భార్య ఉష

ఇక స్వర్ణయుగం

అన్నింటా 'అమెరికాయే ఫస్ట్': ట్రంప్ • 47వ అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం

- హాజరైన దేశాధినేతలు, సీఈఓలు
- తొలి ప్రసంగంలోనే సంచలన ప్రకటనలు

వాషింగ్టన్: అమెరికాకు తిరిగి స్వర్ణయుగాన్ని తీసుకొస్తానని నూతన అధ్యక్షుడు డొనాల్డ్ జె.ట్రంప్ ప్రకటించారు. దేశ 47వ అధ్యక్షునిగా సోమవారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఆ వెంటనే జాతినుద్దేశించి ఉద్వేగపూరితంగా ప్రసంగించారు. నాలుగేళ్ల డెమొక్రాట్ల పాలనలో అమెరికాకు అన్ని రంగాల్లోనూ తీరని ద్రోహం జరిగిందని ఆక్షేపించారు. దాన్ని సమూలంగా సరిదిద్దేలా ప్రజలు ఎన్నికల్లో తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చారన్నారు. ''అమెరికా పతనానికి ఈ క్షణమే అడ్డుకట్ట పడింది. స్వర్ణయుగం మొదలైంది. ఈ జనవరి 20 అమెరికా పాలిట విముక్తి దినం. భవిష్యత్తంతా ఇక మనదే. మన దేశం నేటినుంచి అన్నిరంగాల్లోనూ అద్భుతంగా రాణిస్తుంది. భూమిపైనే అత్యంత శక్తిమంతమైన, గౌరవప్రదమైన దేశంగా ప్రపంచమంతటా మన్ననలు పొందుతుంది. ప్రతి దేశమూ అబ్బురపడేలా, అసూయ చెందేలా, అభినందించేలా అభివృద్ధి చెందుతుంది. అన్ని విషయాల్లోనూ 'అమెరికా ఫస్ట్' అన్నదే మన నినాదం. అదే మన మూలమంత్రం'' అని 78 ఏళ్ల ట్రంప్ ప్రకటించారు. ''మీ నమ్మకాన్ని మీ సంపదను, ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను మీకు తిరిగిస్తా'' అని అమెరికా ప్రజలకు వాగ్దానం చేశారు. అరగంట పాటు సాగిన తొలి ప్రసంగంలో ట్రంప్ పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మంటలు రేపే నిర్ణయాలు ప్రకటించారు. మెక్సికో సరిహద్దుల్లో తక్షణమే జాతీయ ఎమర్జెన్సీ విధిస్తున్నట్టు ప్రకటించారు. ''అమెరికాలోకి వలసలపై ఉక్కుపాదం మోపుతాం. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా పేరు మారుస్తున్నాం. పనామా కాల్వను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది'' అని ప్రకటించారు. పనామా కాల్వపై చైనా పెత్తనం సాగుతోందని, వద్ద అమెరికా నౌకలపై భారీగా సుంకాలు విధిస్తున్నారని ఆక్షేపించారు. ''వరక్త వ్యవస్థను సమూలంగా మారుస్తాం. అమెరికన్లను సంపన్నులుగా మార్చడమే లక్ష్యంగా పలు దేశాలపై సుంకాలు, ఇతర టారిఫ్‌లను పెంచుతాం. వాటి వసూలుకు ప్రత్యేక ప్రభుత్వ విభాగాన్ని ఏర్పాటు చేస్తాం. డ్రగ్ కార్టల్స్‌ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటిస్తాం. 1978 నాటి విదేశీ శత్రువుల చట్టాన్ని తిరిగి తెచ్చి వాటిని అంతం చేస్తాం. పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతోంది'' అని ప్రకటించారు.

లూథర్‌కింగ్ కలలను నిజం చేస్తా

ట్రంప్ తన ప్రసంగంలో బైడెన్ పాలనపై నిప్పులు చిమ్మారు. ''ఆర్థిక, విద్య, ఆరోగ్య వ్యవస్థలన్నింటినీ బైడెన్ యంత్రాంగం కుప్పకూల్చింది. లాస్ ఏంజెలెస్ మంటల వంటి మామూలు సమస్యలను కూడా పరిష్కరించలేకపోయింది. భయంకరమైన నేరగాళ్లకు, డ్రగ్స్ బానిసలకు దేశాన్ని స్వర్గధామంగా మార్చింది. న్యాయవ్యవస్థను విషపూరితంగా, హింసాత్మకంగా మార్చి ఆయుధంలా వాడుకుంది'' అని ఆరోపించారు. ''న్యాయవ్యవస్థకు సంకెళ్ల నుంచి విముక్తి కల్పిస్తా. అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్న ధరలకు, ద్రవ్యోల్బణానికి కళ్లెం వేస్తా. దేశీయ చమురు ఉత్పత్తిని భారీగా పెంచుతా. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నాం'' అని ప్రకటించారు. ''250 ఏళ్ల అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడూ ఎదుర్కోనన్ని పరీక్షలను ఎనిమిదేళ్లుగా ఎదుర్కొంటూ వచ్చా. బహుశా అమెరికాను తిరిగి గొప్పగా తీర్చిదిద్దేందుకే దేవుడు నన్ను హత్యాయత్నం నుంచి కాపాడాడేమో'' అన్నారు. దాంతో రిపబ్లికన్ నేతలంతా పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. బైడెన్, హారిస్ మౌనంగా వీక్షించారు. ''ఈ రోజు హక్కుల ఉద్యమకారుడు మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ డే. అమెరికా కోసం ఆయన కన్న కలలను సాకారం చేసి చూపిస్తా. మార్టిన్ లూథర్ లక్ష్యాల సాధనకు మనమంతా సమైక్యంగా కృషి చేద్దాం'' అని ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు.

వైట్‌హౌస్‌కు స్వాగతం: బైడెన్

అంతకుముందు సోమవారం ఉదయం బైడెన్ తన వారసుడు ట్రంప్‌ను అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లోకి ఆత్మీయంగా ఆహ్వానించారు. ట్రంప్ దంపతులు వాహనం దిగగానే ప్రధాన ద్వారం వద్ద భార్య జిల్‌తో కలిసి స్వాగతించారు. 'వైట్‌హౌస్‌కు మరోసారి స్వాగతం' అంటూ అభినందనలు తెలిపారు. అధ్యక్ష సంప్రదాయం ప్రకారం ట్రంప్ కోసం ఓవల్ కార్యాలయంలో లేఖ రాసిపెట్టారా అని మీడియా ప్రశ్నించగా, 'అది మా ఇద్దరి మధ్య వ్యవహారం' అంటూ చమత్కరించారు. అనంతరం ట్రంప్ దంపతులను లోనికి తీసుకెళ్లారు. సంప్రదాయం ప్రకారం వారికి తేనీటి విందు ఇచ్చారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ దంపతులు కూడా కాబోయే ఉపాధ్యక్షుడు వాన్స్, ఉష దంపతులకు స్వాగతం పలికారు. వాన్స్‌కు హారిస్ అభినందనలు తెలిపారు. ఫొటోలకు పోజులిచ్చాక వాన్స్ దంపతులను హారిస్ దంపతులు వైట్‌హౌస్ లోనికి తోడ్కొని వెళ్లారు. అంతకుముందు ట్రంప్ తన కుటుంబీకులతో కలిసి వైట్‌హౌస్ సమీపంలోని చారిత్రక సెయింట్ జాన్ ఎపిస్కోపల్ చర్చి వద్ద సంప్రదాయ ప్రార్థనలు జరిపారు. అర్జెంటీనా ప్రెసిడెంట్ మెయిలీతో పాటు కూడా పారిశ్రామిక దిగ్గజాలంతా వాటిలో పాల్గొనడం విశేషం.

ఉత్తర్వులే ఉత్తర్వులు!

బాధ్యతలు చేపట్టిన తొలి రోజే ట్రంప్ భారీగా అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. వలసలపై ఉక్కుపాదం, మెక్సికో సరిహద్దుల్లో మరిన్ని సైనిక దళాల మోహరింపు, జన్మతః పౌరసత్వ విధానం రద్దు, చైనా, కెనడాలపై టారిఫ్‌ల పెంపు, గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చడం వంటివి వీటిలో ఉన్నట్టు వైట్‌హౌస్ వర్గాలు చెప్పాయి. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించాయి. అయితే చాలా ఉత్తర్వుల అమలుపై న్యాయపరమైన సవాలు ఎదురవడం ఖాయమంటున్నారు. ట్రంప్ రాకతో వైట్‌హౌస్ వెబ్‌సైట్ కూడా కొత్త రూపు సంతరించుకుంది. 'అమెరికా ఈజ్ బ్యాక్' అనే హెడ్డింగ్‌తో 'నా ప్రతి శ్వాసతోనూ అమెరికన్ల కోసమే పోరాడతా' అంటూ ట్రంప్ సందేశాన్ని హోం పేజీలో హైలైట్ చేసింది. ట్రంప్ తాజా నిర్ణయాలను పోస్ట్ చేసింది. ''పన్నులు, చమురు ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గుతాయి. సైన్యాన్ని ఆధునికీకరిస్తారు. విఫల విధానాలు రద్దవుతాయి. పలు దేశాల్లో జరుగుతున్న యుద్ధాలకు తెర దించేందుకు ట్రంప్ ప్రాధాన్యమిస్తారు'' అని పేర్కొంది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి వైట్‌హౌస్ సోషల్ మీడియా ఖాతాలకు కూడా కొత్త రూపు వచ్చింది.

ప్రమాణస్వీకారం ఇలా..

ట్రంప్ నాలుగేళ్ల విరామం అనంతరం వైట్‌హౌస్‌లో తిరిగి అడుగుపెట్టారు. సోమవారం మధ్యాహ్నం క్యాపిటల్ హిల్ భవనంలోని రొటుండా హాల్లో డెమొక్రాట్ నేత 82 ఏళ్ల జో బైడెన్ నుంచి లాంఛనంగా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. విపరీతమైన చలి నేపథ్యంలో ఇండోర్‌లో జరిగిన కార్యక్రమంలో అమెరికా మాజీ అధ్యక్షులు జార్జి డబ్ల్యు.బుష్, బిల్ క్లింటన్ దంపతులు, బరాక్ ఒబామా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మెయిలీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుని ప్రమాణస్వీకారానికి దేశాధినేతలు రావడం ఇదే తొలిసారి. దిగ్గజ టెక్ కంపెనీల సారథులు, పారిశ్రామికవేత్తలు ఎలాన్ మస్క్, సుందర్ పిచాయ్, మార్క్ జుకర్‌బర్గ్, జెఫ్ బెజోస్, టిమ్ కుక్, ముకేశ్ అంబానీ దంపతులు, రూపర్ట్ మర్డోక్ షౌ చూ తదితరులు కూడా హాజరయ్యారు. అంతకుముందు ట్రంప్ దంపతులు వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు జో బైడెన్ దంపతుల నుంచి సంప్రదాయ తేనీటి విందు స్వీకరించారు. తర్వాత బైడెన్‌తో కలిసి ట్రంప్ ఒకే కారులో క్యాపిటల్ హిల్‌కు చేరుకున్నారు. ఇద్దరూ కలిసే రొటుండా హాల్లో అడుగుపెట్టారు. వెంటనే హాలంతా చప్పట్లతో దద్దరిల్లిపోయింది. ఆహూతులంతా ట్రంప్‌కు, ఆయన రన్నింగ్‌మేట్ జె.డి.వాన్స్, ఉష దంపతులకు ఘనస్వాగతం పలికారు. తొలుత వాన్స్‌తో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బ్రెట్ కవనా ఉపాధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మరో న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ట్రంప్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. ''అమెరికా అధ్యక్షునిగా నా బాధ్యతలను విశ్వాసపాత్రునిగా నెరవేరుస్తా. అమెరికాను, దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు శాయశక్తులా కృషి చేస్తా'' అంటూ తన తల్లి ఇచ్చిన వ్యక్తిగత బైబిల్‌తో పాటు లింకన్ బైబిల్‌పై ప్రమాణం చేశారు. అనంతరం భార్య మెలానియా చెంపపై ముద్దాడారు. ఆమె హ్యాట్ అడ్డురావడంతో చిరునవ్వులు చిందించారు. ట్రంప్‌కు ప్రపంచం నలుమూలల నుంచీ అభినందనల సందేశాలు వెల్లువెత్తాయి. 'నా ప్రియమిత్రుడు ట్రంప్‌కు హృదయపూర్వక అభినందనలు' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మొండిఘటం మరోచరిత్ర! | సాక్షిప్లస్ జాతీయంలో...

సంజయ్‌కు జీవిత ఖైదు

ఆర్‌జీ కర్ హత్యోదంతంలో కోర్టు తీర్పు

- అరుదైన కేసేమీ కాదన్న కోర్టు
- బాధిత కుటుంబానికి 17 లక్షల పరిహారం
- పశ్చిమబెంగాల్ సర్కారుకు ఆదేశం
- ఉరిశిక్ష విధించాలి: బాధితురాలి తల్లిదండ్రులు
- హైకోర్టుకు వెళ్తామని ప్రకటన



కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్‌జీ కర్ బోధనాస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌కు జీవితఖైదు పడింది. స్థానిక సీల్దా కోర్టు సోమవారం ఈ మేరకు తుది తీర్పు వెలువరించింది. దోషికి ఉరిశిక్ష విధించాలన్న డిమాండ్లను, సీబీఐ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఇది ఆ కోవకు వచ్చే అత్యంత అరుదైన నేరం కాదని అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ అభిప్రాయపడ్డారు. 2024 ఆగస్ట్ 9న బోధనాస్పత్రి సెమినార్ హాల్‌లో నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి గొంతు నులిమి చంపేయడం తెలిసిందే. కోల్‌కతా పోలీసు విభాగంలో పౌర వలంటీర్‌గా పనిచేసిన సంజయ్‌ను ఈ కేసులో దోషిగా జడ్జి శనివారం నిర్ధారించారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 64 (అత్యాచారం), 66 (మరణానికి కారణమవడం), 103 (1) (హత్య) కింద దోషిగా తేల్చారు. సోమవారం మధ్యాహ్నం శిక్ష ఖరారు చేశారు. నిందితుడు, బాధితురాలి కుటుంబం, సీబీఐల వాదనలు విన్నమీదట తీర్పు వెలువరించారు. సంజయ్ బతికినంతకాలం జైల్లోనే గడపాలని పేర్కొన్నారు. అతనికి రూ.50,000 జరిమానా కూడా విధించారు. బాధిత కుటుంబానికి రూ.17 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ''బాధితురాలు విధి నిర్వహణలో చనిపోయినందున రూ.10 లక్షలు, అత్యాచారానికి గురైనందుకు రూ.7 లక్షలు ఆమె కుటుంబానికి పరిహారమివ్వాలి'' అని పేర్కొన్నారు. తీర్పును హైకోర్టులో సవాల్ చేసే వీలుంది.

అప్పీలు చేస్తాం: బాధిత కుటుంబం

జీవితఖైదుపై బాధితురాలి తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ''దోషికి ఉరిశిక్ష వేయాల్సిందే. మాకు పరిహారం ఇచ్చినంత మాత్రాన న్యాయం జరగదు. సరైన న్యాయం కోసం పై కోర్టును ఆశ్రయిస్తాం. నేరంలో ఇతర భాగస్వాములను వదిలేశారు. ఇది అత్యంత అరుదైన కేసు కాదా? వైద్యురాలు విధి నిర్వహణలో అత్యాచారానికి, హత్యకు గురైంది. దీనివెనక పెద్ద కుట్ర దాగుంది'' అని జూనియర్ వైద్యురాలి తండ్రి అన్నారు. ''నష్టపరిహారం మాకు వద్దు. మిగతా నేరస్తులూ బోనెక్కేదాకా పోరాడతాం'' అన్నారు. వైద్యురాలి తల్లి కోర్టుకు రాలేదు. తీర్పుపై స్పందించేందుకు నిరాకరించారు. ''ఇది చాలా సిగ్గుపడాల్సిన విషయం. మీరంతా వెళ్లిపొండి'' అంటూ మీడియా ప్రతినిధులపై ఆగ్రహించారు. ''ఘటన జరిగినప్పుడు సంజయ్‌తో పాటు మరికొందరు ఉన్నట్టు వార్తలొచ్చాయి. ఇందులో కచ్చితంగా ఇతరుల పాత్ర ఉంది. వాళ్లనూ చట్టం ముందు నిలబెట్టాలి'' అని వైద్యురాలి అక్కలు డిమాండ్ చేశారు.

వైద్యుల తీవ్ర అసంతృప్తి

పని ప్రదేశాల్లో తమ భద్రత గాల్లో దీపమని చాటిచెప్పిన ఈ ఉదంతంలో దోషికి ఉరిశిక్ష పడకపోవడం దారుణమంటూ ఆర్‌జీ కర్ ఆస్పత్రి వైద్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ''ఇది ఒక్కని పని కాదు. వ్యవస్థీకృత నేరమిది. ఈ కుట్రలో చాలామంది పాత్ర ఉంది. పరిహారం ప్రకటించేసి జీవితఖైదు విధించడం అసంబద్ధం. తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తాం'' అని సీనియర్ వైద్యుడు రాజీవ్ పాండే అన్నారు.

మా వాళ్లయితే ఉరి వేయించేవాళ్లు: మమత

తామైతే ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి కచ్చితంగా ఉరిశిక్ష వేయించేవాళ్లమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ''మేమంతా దోషికి ఉరిశిక్షే కోరుకున్నాం. కేసును సీబీఐ మా నుంచి బలవంతంగా లాక్కుంది. సమగ్రంగా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయలేదు. గట్టిగా వాదించలేదు. కోల్‌కతా పోలీసులైతే సమగ్రంగా దర్యాప్తు చేసేవాళ్లు'' అన్నారు. మమత వ్యాఖ్యలపై బీజేపీ ఐటీ విభాగ సారథి అమిత్ మాలవీయ ఆగ్రహం వెలిబుచ్చారు. ''ఈ కేసులో సాక్ష్యాధారాలను ధ్వంసం చేసినందుకు అసలు కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను, వెనకుండి సహకరించిన మమతను విచారించాలి'' అని డిమాండ్ చేశారు. ఘటన జరిగిన మర్నాడు సంజయ్‌ను కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేయడం తెల్సిందే. విచారణ నత్తనడకన సాగుతోందని, బోధనాస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను, ఇతరలను రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తడంతో కేసును కలకత్తా హైకోర్టు సీబీఐకి బదిలీచేసింది.

బాయ్ ఫ్రెండ్‌ను చంపిన

యువతికి మరణ శిక్ష

ఆధారాలను ధ్వంసం చేసిన బంధువుకు మూడేళ్ల జైలు

- తిరువనంతపురం సెషన్స్ కోర్టు సంచలన తీర్పు
- ఎంతో అరుదైన కేసుగా పేర్కొన్న న్యాయస్థానం



గ్రీష్మ

తిరువనంతపురం: బాయ్‌ఫ్రెండ్ షరోన్ రాజ్(23)కు విష మూలికల కషాయమిచ్చి చంపిన కేసులో కేరళ యువతి గ్రీష్మ(22)కు కోర్టు మరణ శిక్ష విధించింది. ఆధారాలను ధ్వంసం చేసేందుకు యత్నించిన ఆమె మామ నిర్మల కుమారన్ నాయర్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గ్రీష్మ తల్లిని నిర్దోషిగా ప్రకటించింది. గ్రీష్మ ఎంతో తెలివైన నేరస్థురాలు, ఈ దారుణ హత్యకు ఆమె చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసిందని, ఇది ఎంతో అరుదైన కేసుగా న్యాయస్థానం పేర్కొంది. శాస్త్రీయ పద్ధతిలో విచారణ జరిపిన దర్యాప్తు అధికారులను మెచ్చుకుంది. వాదోపవాదాలను శుక్రవారమే పూర్తి చేసిన నెయ్యాటింకరలోని అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం ఈ మేరకు సంచలన తీర్పు వెలువరించింది. తల్లిదండ్రులకు తను ఒక్కతే కుమార్తెనని, ఎటువంటి నేర చరిత్ర లేదని, ఉన్నత చదువులు చదవాలని ఉన్నందున శిక్ష తగ్గించాలంటూ గ్రీష్మ చేసిన వినతులను జడ్జి తోసిపుచ్చారు. నేర తీవ్రత దృష్ట్యా దోషి వయస్సు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. 2022 ఆగస్ట్ 22న కూడా ఆమె షరోన్ రాజ్‌కు ఫ్రూట్ జూస్‌లో పారాసెటమాల్ టాబ్లెట్లను కలిపి చంపేందుకు ప్రయత్నించిందని తెలిపారు. ఆ తర్వాత హత్య కేసు దర్యాప్తును పక్కదోవ పట్టించేందుకు ఆత్మహత్యకు ప్రయత్నించిందని జడ్జి తెలిపారు. ఆమె చర్యలు సమాజానికి చెడు సందేశాన్ని పంపాయని, ప్రేమ పవిత్రతను దెబ్బతీశాయని అన్నారు. తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాకు చెందిన గ్రీష్మ, తిరువనంతపురం జిల్లా పరస్సలకు చెందిన షరోన్ రాజ్ ప్రేమించుకున్నారు. అయితే, గ్రీష్మకు మరో వ్యక్తితో పెళ్లి కుదిరింది. తనను మర్చిపోవాలని షరోన్‌ను కోరగా అతడు ఒప్పుకోలేదు. తన పెళ్లికి అడ్డుగా వస్తున్న షరోన్‌ను అంతం చేయాలని గ్రీష్మ పథకం వేసింది. దీని ప్రకారం షరోన్‌ను 2022 అక్టోబర్ 14న కన్యాకుమారిలోని తమ ఇంటికి రప్పించుకుంది. అక్కడే అతడితో విష మూలికల కషాయం తాగించింది. ఆ తర్వాత షరోన్ రాజ్ ఆరోగ్యం క్రమేపీ క్షీణించి, 11 రోజులకు ఆస్పత్రిలో చనిపోయాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో కళ్లు చెదిరే విషయాలు వెలుగుచూశాయి. ఆమె పక్కా ప్రణాళికతో షరోన్‌పై ప్రయోగించిన విషం ఆనవాళ్లు 24 గంటల తర్వాత శరీరంలో కనిపించవని తేలింది. పారాక్వాట్ అనే ప్రమాదకరమైన స్లో పాయిజన్ కోసం గ్రీష్మ గూగుల్‌ను శోధించినట్లు వెల్లడైంది. కోర్టు తీర్పుపై షరోన్ రాజ్ తల్లి ప్రియ హర్షం వ్యక్తం చేశారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

నేల కొరిగిన ఆంధ్రా జవాను



పంగల కార్తీక్ (ఫైల్)

శ్రీనగర్/బంగారుపాళ్యం: జమ్మూకశ్మీర్‌లోని సాపోర్ జిల్లాలో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక జవాను ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం జలూర గుజ్జర్పటి ప్రాంతంలో ఉగ్రవాదుల స్థావరాన్ని జవాన్లు చుట్టుముట్టారు. ఈ సందర్భంగా పంగల కార్తీక్(32) అనే జవాను బుల్లెట్ గాయాలతో తీవ్రంగా గాయపడ్డారు. వైద్యం కోసం తరలిస్తుండగానే ఆయన తుదిశ్వాస విడిచారని అధికారులు సోమవారం తెలిపారు. ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన బలగాలు ముష్కరుల కోసం కూంబింగ్ కొనసాగిస్తున్నాయన్నారు. కార్తీక్ వీరమరణంపై శ్రీనగర్ కేంద్రంగా పనిచేసే ఆర్మీ విభాగం చినార్ కార్ప్స్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన కార్తీక్ యొక్క అత్యున్నత త్యాగానికి చినార్ కార్ప్స్ సెల్యూట్ చేస్తోంది చినార్ వారియర్స్ కార్తీక్ అపారమైన పరాక్రమానికి, త్యాగానికి వందనం చేస్తోంది. ఆయన కుటుంబానికి సానుభూతి తెలుపుతోంది. వారికి సంఘీభావంగా నిలుస్తుంది'అని 'ఎక్స్'లో తెలిపింది. కాగా, కార్తీక్‌ది ఏపీలోని చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం ఎగువరాగిమాను పెంట గ్రామం. వరద మందడి, సెల్వి దంపతుల రెండో కుమారుడైన కార్తీక్ పదేళ్ల క్రితం ఆర్మీలో చేరారు. ఈయన చనిపోయిన విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం రాత్రికల్లా మృతదేహం గ్రామానికి రావచ్చని చెబుతున్నారు.

ఇజ్రాయెల్ చెర నుంచి

90 మంది విడుదల

రమల్లా(వెస్ట్ బ్యాంక్): ఇజ్రాయెల్– హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతోంది. హమాస్ ముందుగా ముగ్గురు ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయడం తెలిసిందే. దీంతో తమ జైళ్లలోని వెస్ట్ బ్యాంక్‌కు చెందిన 90 మంది మహిళలు, చిన్నారులకు సోమవారం ఇజ్రాయెల్ స్వేచ్ఛనిచ్చింది. రెడ్ క్రాస్‌కు చెందిన బస్సుల్లో వచ్చిన వీరికి వెస్ట్ బ్యాంక్‌లోని రమల్లాలో కుటుంబసభ్యులు, బంధువులు, ఆత్మీయులు ఘనంగా స్వాగతం పలికారు. ఒక్కసారిగా అందరిలోనూ ఆనందం వెల్లివిరిసింది. వారిని కొందరు భుజాలపైకి ఎత్తుకోగా మరికొందరు నినాదాలు, ఈలలతో సంతోషం వ్యక్తం చేశారు. ఇంకొందరు ఫతా, హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్, ఇతర సాయుధ గ్రూపుల జెండాలు పట్టుకుని గుమికూడారు. వేడుకలు చేసుకోవద్దంటూ ఇజ్రాయెల్ బలగాలు చేసిన హెచ్చరికలను వారెవరూ పట్టించుకోలేదు. సోమవారం రమల్లాకు చేరుకున్న వారిలో 69 మంది మహిళలు, 21 మంది టీనేజీ బాలురు ఉన్నారు. వీరిలో 12 ఏళ్ల బాలుడు సైతం ఉన్నాడు. ఒప్పందం మొదటి విడతలో హమాస్ 33 మంది బందీలను 42 రోజుల్లో విడుదల చేయాల్సి ఉంది. అదే సమయంలో, ఇజ్రాయెల్ వెయ్యి నుంచి రెండు వేల మంది ఖైదీలను విడిచి పెట్టాల్సి ఉంటుంది.

చివరి నిమిషంలో బైడెన్ క్షమాభిక్షలు

ట్రంప్ వ్యతిరేకులపై ఉదారత

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పదవి నుంచి దిగిపోయే ముందు చివరి నిమిషంలో పలువురికి క్షమాభిక్షలు ప్రసాదించారు. నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వారిపై ప్రతీకార చర్యలు ఉంటాయన్న భయంతోనే ఆయన ఈ క్షమాభిక్షలకు తెరతీసినట్లు తెలుస్తోంది. 2021 జనవరి 6వ తేదీన యూఎస్ క్యాపిటల్ భవనంపై దాడి కేసులో ట్రంప్ పాత్రపై విచారణ చేపట్టిన స్టాఫ్ ఆఫ్ ద హౌస్ కమిటీ సభ్యులతోపాటు ట్రంప్ వ్యతిరేకులుగా పేరుగాంచిన డాక్టర్ ఆంథోనీ ఫౌసీ, రిటైర్డ్ జనరల్ మార్క్ మిల్లీ, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ మాజీ చైర్మన్‌కు బైడెన్ సోమవారం క్షమాభిక్ష ప్రసాదించడం చర్చనీయాంశంగా మారింది. ఇందుకోసం ఆయన అధ్యక్షుడిగా తనకున్న అసాధారణ అధికారాలను ఉపయోగించుకున్నారు. 2020లో అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడంతోపాటు తనకు వ్యతిరేకంగా పనిచేసిన వారి భరతం పట్టడం ఖాయమని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించిన సంగతి తెలిసిందే. అమెరికా ప్రగతి కోసం అవిశ్రాంతంగా శ్రమించిన ప్రజాసేవకులకు మనం రుణపడి ఉండాలని బైడెన్ స్పష్టంచేశారు. ఈ క్షమాభిక్షలను తప్పుగా అర్థం చేసుకోవద్దని కోరారు.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ట్రయల్ కోర్టు విచారణపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. 2019లో లోక్‌సభ ఎన్నికల సమయంలో జార్ఖండ్‌లోని చైబాసా పట్టణంలో బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన హంతకుడు అని మండిపడ్డారు. రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకుడు నవీన్ ఝా 2019లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమిత్ షా పరువుకు నష్టం కలిగించేలా రాహుల్ మాట్లాడారని ఆరోపించారు. రాహుల్‌పై పరువునష్టం కేసు పెట్టారు. ఈ కేసు విచారణలో భాగంగా తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని రాహుల్ గాంధీని రాంచీలోని మెజిస్ట్రీరియల్ కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ ఆయన తొలుత జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. కింది కోర్టు ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝాకు నోటీసు జారీ చేసింది. రాహుల్ దాఖలు పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా కింది కోర్టులో రాహుల్‌పై విచారణ నిలిపివేయాలని తేల్చిచెప్పింది. రాహుల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 21 । జనవరి । 2025



అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

ఏటీఎంలలో ఖాతాదారుల దృష్టి మరల్చి నగదు డ్రా చేసుకుంటున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును దక్షిణ మండలం పోలీసులు బహిర్గతం చేశారు. ముగ్గుర్ని సోమవారం అరెస్ట్ చేశారు. -8లో



సాఫ్ట్ కార్నర్..

సాఫ్ట్‌వేర్ సంస్థలకు నగరం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఈ మేరకు మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు భారీగా విస్తరిస్తున్నారు. అతిపెద్ద ఆర్అండ్‌డీ సెంటర్ సహా మరెన్నో ఏర్పాటు చేస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/15.0

నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సాయంత్రం నుంచి చల్లని గాలులు వీస్తాయి.



కబడ్డీలో తలపడిన ఇరు జట్లు

ఉల్లాసం.. ఉత్సాహం..

గోషామహల్ పోలీస్ స్టేడియంలో సోమవారం పోలీస్ కమిషనరేట్ స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా జరిగింది. బ్యాడ్మింటన్ ప్లేయర్లు సైనా నెహ్వాల్, కశ్యప్, సీపీ సీవీ ఆనంద్ ఈ మీట్‌లో పాల్గొని సందడి చేశారు.

- వివరాలు సిటీప్లస్‌లో





చిల్డ్రన్స్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న గవర్నర్

రోడ్డు భద్రత..అందరి బాధ్యత

'వాహనాలు నడిపేటప్పుడు అందరూ జాగ్రత్తగా ఉండాలి. రోడ్డు భద్రతను అందరూ బాధ్యతగా భావించాలి. అలా అయితేనే అంతా 'సేఫ్‌గా ఉంటాం' అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్, చిల్డ్రన్స్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. -8లో

ఫోర్త్‌సిటీ మెట్రోపై అధ్యయనం

- ఎయిర్‌పోర్టు నుంచి స్కిల్‌వర్సిటీ మార్గంలో పర్యటించిన ఎన్వీఎస్
- మెట్రో రెండో దశలో ఆరో కారిడార్‌గా ఫోర్త్‌సిటీ లైన్
- 40 కిలోమీటర్లు నిర్మించనున్న హెచ్ఏఎంఆర్ఎల్

సాక్షి, సిటీబ్యూరో: మెట్రోరెండో దశలో భాగంగా ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు ప్రతిపాదించిన ఆరవ కారిడార్ రూట్‌లో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సోమవారం పర్యటించారు. సుమారు 40 కిలోమీటర్ల వరకు నిర్మించనున్న ఈ రూట్‌పైన ఆయన క్షేత్రస్థాయిలో ప్రాథమిక సర్వే నిర్వహించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి స్కిల్ వర్సిటీ వరకు ఈ కారిడార్ నిర్మాణం కోసం సుమారు రూ.6000 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండో దశలో ప్రస్తుతం 5 కారిడార్లకు మాత్రమే డీపీఆర్ పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రం అనుమతికి పంపించారు. అలాగే ఫోర్త్‌సిటీతో పాటు నార్త్‌సిటీలో రెండు కారిడార్లకు సైతం డీపీఆర్‌లను రూపొందించేందుకు హెచ్ఏఎంఎల్ కసరత్తు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆదివారం నార్త్‌సిటీ కారిడార్‌లలో ఇంజనీరింగ్ నిపుణులతో కలిసి ఎన్వీఎస్ పర్యటించారు. సోమవారం ఫోర్త్‌సిటీ రూట్‌ను సర్వే చేశారు. త్వరలో ఈ మూడు కారిడార్‌లపైన డీపీఆర్‌లను రూపొందించే అవకాశం ఉంది. మరోవైపు రెండో దశ 'బి' విభాగం కింద జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కిలోమీటర్లు, మేడ్చల్ వరకు 23 కిలోమీటర్లు నిర్మించనున్న సంగతి తెలిసిందే. రెండో దశలో మొదట ప్రతిపాదించిన 5 కారిడార్లు కలిపి 76.4 కిలోమీటర్లు కాగా, ఫోర్త్‌సిటీతో రెండో దశ 116.4 కిలోమీటర్లకు పెరగనుంది. అలాగే నార్త్‌సిటీ రెండు కారిడార్‌లతో కలిపి మొత్తం రెండో దశ ప్రాజెక్టు 161.4 కిలోమీటర్లకు చేరనుంది. దీంతో నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఐదు కారిడార్ల నిర్మాణానికి రూ.24 వేల కోట్లకు పైగా ఖర్చు కానుంది. ఫోర్త్‌సిటీ, నార్త్‌సిటీ కారిడార్‌లతో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.40 వేల కోట్లు దాటే అవకాశం ఉందని అధికారుల అంచనా.

ప్రశ్నలు 133!

సాక్షి, సిటీబ్యూరో: సుదీర్ఘ విరామం తర్వాత ఫిబ్రవరి ఒకటో తేదీన జీహెచ్ఎంసీ పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సిద్ధమయ్యారు. ఎంతోకాలంగా సమావేశం జరగకపోవడంతో..ఎప్పుడెప్పుడు సమావేశం జరుగుతుందా? నిలదీద్దామని ఎదురు చూస్తున్న సభ్యులు.. సమావేశం కోసం ఏకంగా 133 ప్రశ్నల్ని సిద్ధం చేశారు. అజెండాలో ఈ అంశాలను చేర్చాల్సిందిగా మేయర్‌ను కోరారు. వాటిల్లో ఎన్నింటిపై చర్చించేందుకు మేయర్ స్వీకరిస్తారో మరికొద్ది రోజుల్లో వెల్లడి కానుంది. నగరంలో పారిశుధ్యం నుంచి మొదలుపెడితే వీధిదీపాల దాకా పలు సమస్యలు ప్రజల్ని పట్టి పీడిస్తున్నాయి. వాటి పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్లను, సర్కిల్‌స్థాయి అధికారులను సంప్రదించినా, సోషల్ మీడియా ద్వారా జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా మొక్కుబడి రొటీన్ సమాధానాలు తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదు. సోషల్ మీడియా ఖాతాల్లో కొద్దిరోజుల తర్వాత సమస్య పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు క్లోజ్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయాల దాకా కాళ్లీడ్చుకుంటూ సోమవారాలు 'ప్రజావాణి'కి హాజరై వేదన వెళ్లబోసుకుంటున్నా అక్కడా అదే తీరు. విసిగి వేసారిన ప్రజలు, తమ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు సైతం ఆత్మహత్య యత్నాలు చేసిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో తమ గళం వినిపించేందుకు సిద్ధమైన పలువురు కార్పొరేటర్లు ప్రశ్నలు పంపించారు.

ఎన్నెన్నో సమస్యలు..

వాటిల్లో వివిధ రకాల సమస్యలున్నాయి. వీధి దీపాలు, దోమల బెడద, పారిశుధ్యం, అక్రమ నిర్మాణాలు, జీహెచ్ఎంసీ స్థలాల కబ్జాలు, ప్రకటనల పన్నులు, ట్రేడ్‌లైసెన్సుల ఫీజులు, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లకు సంబంధించినవి తదితరమైనవి ఉన్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నుంచి గెలిచిన మేయర్ కాంగ్రెస్‌లోకి మారడంతో ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ సభ్యులు తమ వాణి వినిపించేందుకు సిద్ధమవుతున్నారు.

సమాధానాలివ్వండి..

బల్దియా పాలకమండలి కోసం సభ్యుల ప్రశ్నలు

- ఎజెండాలో చేర్చాలని మేయర్‌కు విజ్ఞప్తి
- ఫిబ్రవరి 1న సర్వసభ్య సమావేశం

బడ్జెట్ ఆమోదం పొందాలి

స్టాండింగ్ కమిటీ ఇటీవల ఆమోదించిన 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను పాలకమండలి సమావేశంలో ఆమోదించాల్సి ఉంది. నిర్దిష్ట వ్యవధి కంటే ఇప్పటికే ఆలస్యం జరిగింది. అందుకే బడ్జెట్ సమావేశం, సాధారణ సమావేశం రెండు సమావేశాల్ని ఒకేరోజు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. వాస్తవానికి బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, గత కొంతకాలంగా రెండింటినీ ఒకేరోజు నిర్వహిస్తున్నారు.



ఎఫ్‌టీఎల్ నిర్ధారణతో సమస్యలకు చెక్

ఈ ప్రక్రియ నాలుగైదు నెలల్లో పూర్తికి నిర్ణయం

- ప్రజావాణిలో ప్రకటించిన హైడ్రా కమిషనర్
- మొత్తం 89 ఫిర్యాదుల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) నిర్ధారణ పూర్తయితే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. నాలుగైదు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు సోమవారం నాటి ప్రజావాణిలో ప్రకటించారు. భవిష్యత్తులో చెరువుల కబ్జాకు ఎలాంటి అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 89 ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. ఉదయం 11 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై వచ్చిన ఫిర్యాదులను రంగనాథ్ పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్‌తో పాటు సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ ఇమేజీలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి వాస్తవాలను ఆరా తీశారు. గతంలో ఆయా చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఎలా ఉండేవి..హైడ్రా వచ్చిన తర్వాత ఎలా ఉన్నాయనేది గుర్తిస్తున్నామని, హైడ్రా వచ్చిన తర్వాత వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. అమీన్‌పూర్ లేక్ చుట్టూ ఉన్న ప్రాంతాలపై అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆ మున్సిపాలిటీ పరిధిలో పూర్తి స్థాయి సర్వే చేయించాలని హైడ్రా కమిషనర్ నిర్ణయించారు. నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోనే మేడికుంట చెరువు 45 ఎకరాల పరిధిలో ఉండేదని, కబ్జాలతో చెరువు కుంచించుకుపోయిందని వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు.



సమస్యలు ఆలకిస్తున్న రంగనాథ్

మల్కాజిగిరిలోని డిఫెన్స్ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన వెయ్యి గజాల స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేస్తున్నారంటూ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. మూసాపేటలోని ఆంజనేయనగర్ రోడ్డు నంబరు 9లో 2 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురి అవుతోందని, అడ్డుకున్న తమపై కబ్జాదారులు దాడికి దిగుతున్నారని స్థానికులైన భార్యా భర్తలు ఫిర్యాదు చేశారు. ఈ పార్కు అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించడంతో పాటు శిలాఫలకం కూడా వేసిందని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించాలని నిర్ణయించారు.

పార్కు స్థలం అన్యాక్రాంతం.. మేయర్ ఆగ్రహం



నిచ్చెన ఎక్కి పార్కు స్థలం పరిశీలించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36లో జీహెచ్ఎంసీకి చెందిన పార్కు స్థలం అన్యాక్రాంతంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్యాక్రాంతం అయిన పార్కు స్థలాన్ని డీసీ ప్రశాంతి, ఇతర విభాగాల అధికారులతో కలిసి మేయర్ సోమవారం పరిశీలించారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో గల పార్కు స్థలంలో బయట ఉన్న జీహెచ్ఎంసీ బోర్డును ఓ ప్రైవేటు వ్యక్తి తొలగించి..ఆ బోర్డును ఎవరికీ కనిపించకుండా పెట్టి జీహెచ్ఎంసీ పార్కు స్థలంలో పైప్‌లైన్ వేసి కూరగాయలు పండించుకుంటున్నట్లు పరిశీలనలో మేయర్ దృష్టికి వచ్చింది. పార్కు పక్క ఫ్లాట్ యజమాని తన సరిహద్దులో పెద్ద ప్రహరీగోడ నిర్మించుకోవడంతో నిచ్చెన వేసుకుని పార్కులోకి దిగి ఖాళీ స్థలంలో కూరగాయలు పండించుకుంటున్నట్లు తెలిసింది. ప్రైవేటు వ్యక్తి పార్కు స్థలాన్ని ఆక్రమించుకుని కూరగాయలు పండించుకుంటున్న నేపథ్యంలో వెంటనే టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే చేసి పార్కు స్థలంలో ఉన్న కాంపౌండ్ వాల్, పార్కులోని కూరగాయల మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, జీహెచ్ఎంసీ బోర్డును యథావిధిగా ఏర్పాటుచేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పార్కు స్థలాన్ని గానీ, ఖాళీ స్థలాలను ఆక్రమించిన ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గోదావరి జలాల తరలింపునకు.. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు!

నిర్మాణానికి ప్రణాళికలు

- కోకాపేట్, నియోపోలిస్ ప్రాంతాల్లో పర్యటన
- జలమండలి, హెచ్ఎండీఏ సంయుక్త పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: గోదావరి ఫేజ్–2 ప్రాజెక్టు నుంచి జలాలను ఖానాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తరలించడానికి..నియోపోలిస్‌లో మరో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు జలమండలి సిద్ధమవుతోంది. మహానగరానికి భవిష్యత్తులో తాగునీటి అవసరాల దృష్ట్యా..రిజర్వాయర్ల నిర్మాణాలకు స్థలాల పరిశీలన కోసం సోమవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక అవసరాలకు కూడా రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా పరిసర ప్రాంతాలకు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఖానాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు. మంజీరా, కృష్ణా, గోదావరి పథకాల ద్వారా ఎక్కడి నుంచి వచ్చే నీటినైనా ఇక్కడ నుంచి గ్రావిటీ ద్వారా నగరానికి సరఫరా చేసే అవకాశం ఉన్నందున..భవిష్యత్తు అవసరాల కోసం ఇక్కడ రిజర్వాయర్, నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎండీ సూచించారు. కోకాపేట్ గ్రామంలోని జలమండలి రిజర్వాయర్ ప్రాంగణంలో నిర్మిస్తున్న ప్రెజర్ ఫిల్టర్స్‌ను పరిశీలించారు. ఫిబ్రవరి 15 లోపు వీటి నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ ఫిల్టర్స్ ద్వారా నేరుగా కాండ్యూట్ నుంచి నీటిని సేకరించి శుద్ధి చేసి పరిసర ప్రాంతాలకు సరఫరా చేసే వెసులుబాటు ఉందన్నారు. వేసవి అవసరాల కోసం ఇక్కడ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

కాండ్యూట్ లీకేజీలపై ఆరా

గండిపేట్ నుంచి ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్స్ వరకు ఉన్న కాండ్యూట్‌ని ఎండీ పరిశీలించారు. కాండ్యూట్‌కు రెండు వైపులా మెయింటెనెన్స్ రోడ్లు ఉన్నందున, ఆ భాగం వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడక్కడ జరుగుతున్న కాండ్యూట్ లీకేజీలను గమనించి..వెంటనే వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఎక్కడైనా కాండ్యూట్ కబ్జాకు గురైనట్లు గమనిస్తే, జలమండలి విజిలెన్స్ అధికారుల సాయంతో తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎం రవీందర్ రెడ్డి, జీఎంలు, డీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

దుండగుల గమ్యం గజ్వేల్!

సికింద్రాబాద్ నుంచి ఆటో మాట్లాడుకుంది అక్కడికే..

- డ్రైవర్‌పై అనుమానంతో తిరుమలగిరిలో దిగిన ద్వయం
- అక్కడి నుంచి మళ్లీ బోయిన్‌పల్లి వైపు వచ్చినట్టు గుర్తింపు
- కాల్పుల కేసులో కొనసాగుతున్న నగర పోలీసుల దర్యాప్తు



సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకతో పాటు నగరంలో తుపాకీతో కాల్పులకు తెగబడిన దుండగులు అఫ్జల్‌గంజ్ ఫైరింగ్ తర్వాత గజ్వేల్ వెళ్లాలని భావించారు. సికింద్రాబాద్ నుంచి ఆటోను ఆ ప్రాంతానికే మాట్లాడుకున్నారు. అయితే మార్గమధ్యంలో డ్రైవర్ వ్యవహారశైలిపై వారికి అనుమానం రావడంతో తిరుమలగిరిలో దిగిపోయారని పోలీసుల తాజా దర్యాప్తులో తేలింది. రోషన్ ట్రావెల్స్‌కు చెందిన మేనేజర్ జహంగీర్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తు చేస్తున్న నగర పోలీసులు వివిధ కోణాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నారు. బీదర్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం సైతం దర్యాప్తులో పాలు పంచుకుంటోంది.

ఆటో దిగి బ్యాగులు, వస్త్రాలు కొని...

ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే సీఎంఎస్ ఏజెన్సీ వాహనంపై బీదర్‌లో దాడి చేసి, ఒకరిని కాల్చి పంపిన దుండగులు నగదుతో హైదరాబాద్ చేరుకున్న విషయం విదితమే. అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ నుంచి రాయ్‌పూర్‌కు టిక్కెట్లు బుక్ చేసుకోవడం, మినీ బస్సులో బ్యాగుల తనిఖీ, జహంగీర్‌పై కాల్పులు తర్వాత దుండగుల గమ్యం మారింది. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటో ఎక్కిన ఇద్దరూ రైలు మిస్ అవుతుందని, తొందరగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తీసుకువెళ్లాలని డ్రైవర్‌ను కంగారు పెట్టారు. సికింద్రాబాద్‌లోని అల్ఫా హోటల్ వరకు వెళ్లిన ఈ ద్వయం అక్కడ కొత్త బ్యాగ్‌లు, వస్త్రాలు ఖరీదు చేసుకుంది. రైల్వే స్టేషన్ సమీపంలో లాడ్జిల్లో గదులు ఇప్పించే దళారులు తిరుగుతూ ఉంటారు. అలాంటి ఓ వ్యక్తి వీరి వద్దకు వచ్చి రూమ్ కావాలా అంటూ ప్రశ్నించాడు.

గజ్వేల్‌లో మకాం వేయాలని ప్లాన్...

తాము ఉండటానికి రూమ్ కావాలని చెప్పిన దుండగులు అయితే ఇక్కడ వద్దని, గజ్వేల్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాల్సి ఉందని చెప్పారు. అక్కడ అద్దె ఇల్లు దొరికే వరకు హోటల్‌లో రూమ్ కావాలని చెప్పారు. దీంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద దళారి తనకు పరిచయస్తుడైన గజ్వేల్‌లోని దళారితో మాట్లాడాడు. అతడు రోజుకు రూ.1500 అద్దెకు రూమ్ సిద్ధంగా ఉందని చెప్పడంతో ఇరువురినీ గజ్వేల్ వెళ్లమని ఇక్కడి దళారి సూచించాడు. అలా వెళ్లడానికి ఆటో మాట్లాడి పెట్టమని దుండగులు కోరడంతో సికింద్రాబాద్ దళారి రూ.1500 కిరాయికి ఆటో సైతం మాట్లాడి పెట్టాడు. గజ్వేల్ దళారి నెంబర్ ఆటోడ్రైవర్‌కు ఇచ్చి, ఇద్దరినీ అతడి వద్ద దింపి రమ్మని చెప్పాడు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతూనే ఆటోడ్రైవర్ ఓసారి దళారితో మాట్లాడాడు.

పదేపదే దళారీతో మాట్లాడుతుండటంతో...

వీరి ఆటో బయలుదేరిన తర్వాత గజ్వేల్ దళారి రెండుసార్లు డ్రైవర్‌కు ఫోన్ చేసి మాట్లాడాడు. ఆటో తిరుమలగిరి వరకు వెళ్లిన తర్వాత మరోసారి కాల్ చేయడంతో దుండగులకు అనుమానం వచ్చింది. అక్కడ ఓ నిర్మానుష్య ప్రాంతంలో ఆటో ఆపమని చెప్పిన ఇరువురూ బ్యాగ్‌లతో సహా ఆటో దిగి రూ.500 చెల్లించి వెళ్లిపోయారు. అక్కడి నిర్మానుష్య ప్రాంతంలో నగదును ట్రాలీ బ్యాగ్‌ల నుంచి మరో బ్యాగుల్లోకి మార్చుకున్నారు. ఆపై కొద్దిదూరం వెళ్లిన తర్వాత వస్త్రాలు సైతం మార్చేశారు. అక్కడ నుంచి మళ్లీ తిరుమలగిరి ప్రధాన రహదారి మీదికి వచ్చి బోయిన్‌పల్లి వైపు వెళ్లినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా ఈ విషయాలు గుర్తించిన పోలీసులు ఇప్పటికే ఆటోడ్రైవర్లు, దళారుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేశారు.

బీ-క్లాస్ పట్టణాలనే ఎంచుకుని...

ఈ నేరాలు జరిగిన తీరు ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను పరిగణలోకి తీసుకున్న పోలీసులు దుండగులు బీ–క్లాస్ సిటీలు, పట్టణాలనే ఎంపిక చేసుకుంటున్నట్లు భావిస్తున్నారు. పోలీసుల అప్రమత్తత, హడావుడి తక్కువగా ఉంటుందనే ఉద్దేశంతోనే దుండగులు ఇలా చేస్తున్నారని అంచనా వేస్తున్నారు. కర్ణాటకలోని ఈ తరహాకు చెందిన పట్టణం బీదర్‌ను టార్గెట్‌గా చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్‌లో ఫైరింగ్ తర్వాత తమ స్వస్థలాలకు వెళ్లకుండా ఇలాంటి పట్టణమే అయిన గజ్వేల్ వెళ్లడానికి ప్రయత్నించారు. ఈ కీలకాంశాన్ని సైతం పరిగణలోకి తీసుకున్న దర్యాప్తు అధికారులు గాలింపు కొనసాగిస్తున్నారు. మరోపక్క బీదర్‌లో నేరం చేయడానికి, అక్కడ నుంచి సిటీ రావడానికి నిందితులు వినియోగించిన వాహనాన్ని సైతం హైదరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపింది.



నగరంలోని ఓ రెస్టారెంట్ వద్ద దుండగులు

డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

120 మిల్లీ గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్ స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: పూణే నుంచి హైదరాబాద్‌కు వాహనంలో ఎండీఎంఏ క్రిస్టల్స్ డ్రగ్స్‌ను తీసుకొని వస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను సంగారెడ్డి, డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జమ్ము, కశ్మీర్‌కు చెందిన హర్షత్ సింగ్(35) అనే వ్యక్తి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడ్డాడు. అతడు తన తోటి ఉద్యోగులకు డ్రగ్స్ విక్రయించేవాడు. మహారాష్ట్రలోని పూణే ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచి 120 మిల్లీ గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్ డ్రగ్స్‌ను తీసుకొని హైదరాబాద్‌కు వస్తుండగా సంగారెడ్డి డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు సంగారెడ్డి మల్కాపూర్ ఫ్లైఓవర్ తనిఖీలు నిర్వహించి వాహనాన్ని పట్టుకున్నారు. ఈ డ్రగ్స్ విలువ రూ.21.06 లక్షలు ఉంటుందని అంచనా.

సీఎస్ఏఎం కేసుల్లో ముగ్గురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారులకు సంబంధించిన చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్‌ను (సీఎస్ఏఎం) డౌన్‌లోడ్ చేసి, చూసి, ఇతరులకు పంపిణీ చేసిన ఆరోపణలపై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు హైదరాబాద్‌కు చెందినవారని డీసీపీ దార కవిత సోమవారం వెల్లడించారు. సీఎస్ఏఎంను కనిపెట్టడానికి అంతర్జాతీయంగా ఎన్‌సీఎంఈసీ అనే సంస్థ పనిచేస్తోంది. ఇది ప్రపంచంలో ఎవరైనా ఆయా సోషల్ మీడియా వేదికలపై సీఎస్ఏఎంను సెర్చ్ చేసినా, వీక్షించినా, డౌన్‌లోడ్/అప్‌లోడ్ చేసినా తక్షణం గుర్తిస్తుంది. భారత్‌కు సంబంధించిన వివరాలను నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ)కు పంపించింది. ఎన్సీఆర్బీ రాష్ట్ర నోడల్ ఏజెన్సీ సీఐడీకి ఈ వివరాలు అందించగా ఆ అధికారులు వినియోగదారుల ఐపీ అడ్రస్‌లను కనుగొన్నారు. ఈ మేరకు వారి నివాస పరిధిలోని సైబర్ క్రైమ్ ఠాణాల్లో కేసులు నమోదు చేయించారు. ఈవిధంగా ఇటీవల సిటీ సైబర్ క్రైమ్ ఠాణాల్లో మూడు కేసులు నమోదయ్యాయి. మెదక్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి(35) వివిధ వెబ్‌సైట్ల నుంచి చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు డౌన్‌లోడ్ చేశాడు. వీటిని వీక్షించడంతోపాటు ఇన్‌స్టాగామ్ ద్వారా తన స్నేహితులకు పంపాడు. నగరానికి చెందిన ఓ వెల్డర్(36) ఇలానే చేసి స్నాప్‌చాట్ ద్వారా షేర్ చేశాడు. సిటీకే చెందిన మరో విద్యార్థి సైతం ఇలానే చేశాడు. దీంతో ఈ ముగ్గురి వివరాలు సీఐడీ నుంచి పొందిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు.

రూ.లక్ష విరాళం



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా సర్వే ల్యాండ్ రికార్డుల విభాగం ఫ్లాగ్ డే సందర్భంగా విరాళంగా లక్ష రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందజేసింది. విధి నిర్వహణతోపాటు సామజిక కార్యక్రమాల్లో కూడా సర్వేయర్‌లందరు ముందు ఉంటారని జిల్లా సర్వే అధికారి శ్రీరాం తెలిపారు. విందులు, వినోదాల కన్నా ఇలాంటి సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

● అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ● సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్. చిత్రంలో అనుదీప్, ఇలంబర్తి, శ్రీలత

సాక్షి, సిటీబ్యూరో: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారు వరకు వాటిని అందిస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నగర పరిధిలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పురోగతిపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి,హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రేషనింగ్ అధికారి, జిల్లా సరఫరా అధికారి, జోనల్ కమిషనర్లతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ వాటిని ఇస్తామని స్పష్టం చేశారు. ఇంటి స్థలం ఉన్నవారు, లేనివారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల్లేని వారు వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, వీటితోపాటు గతంలో ప్రజాపాలన, సేవాకేంద్రాలు, ప్రజావాణిల్లో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులను ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

అవగాహన కల్పించాలి

రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందనే అంశంపై అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ఆదేశించారు. అధికారులందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, అలివేలు మంగతాయారు, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, రవికిరణ్, ఉపేందర్‌రెడ్డి, వెంకన్న, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత ఫొటోల మార్ఫింగ్‌పై ఫిర్యాదు



సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫొటోలను మార్ఫింగ్ చేసి, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ జాగృతి మహిళా విభాగం సోమవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణా పోలీసులను కోరారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా తెలంగాణ జాగృతి మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్ లలిత యాదవ్ ఆధ్వర్యంలో పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ రాజకీయ పార్టీ సంబంధించిన కీలక నాయకుడి ఆర్మీ అంటూ కొందరు సోషల్ మీడియాలో విచ్చలవిడిగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

హైదరాబాద్ కిడ్నీ సెంటర్ వ్యవస్థాపకుడి మృతి



విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

చౌటుప్పల్: మలకపేటలోని హైదరాబాద్ కిడ్నీ సెంటర్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ ఎర్రబోతు విష్ణువర్ధన్ రెడ్డి(68) సోమవారం మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం స్థానికంగానే జరిగింది. ఆయన వైద్య వృత్తిలోకి వచ్చాక హైదరాబాద్ నగరంలో మొట్టమొదటి కిడ్నీ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎంతోమంది కిడ్నీ రోగులకు వైద్య సేవలందించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉదయం మృతి చెందారు.

మద్యానికి బానిసై.. పురుగుమందు తాగి..



తిరుపతి (ఫైల్)

దుండిగల్: భార్యకు వాట్సాప్ వీడియో కాల్ చేసి పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ కథనం ప్రకారం... ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి తండాకు చెందిన బానోత్ తిరుపతి(30) ఏడాది క్రితం కుటుంబంతో కలిసి నగరానికి వచ్చి గండి మైసమ్మలోని నిరంజన్ కాలనీలో నివసిస్తున్నాడు. ఇతడికి భార్య శారద, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తిరుపతి డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, అతడు మద్యానికి బానిసైన తరుచూ భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంటికి వచ్చిన తిరుపతి భార్యతో గొడవపడి కొట్టాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లి గండిమైసమ్మలోని ఓ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేసి సమీపంలో ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లాడు. అక్కడి నుంచి తన భార్యకు వాట్సాప్ వీడియో కాల్ చేసి తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే శారద అక్కడికి వెళ్లి చూసేసరికి చనిపోయి ఉన్నాడు. శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉన్న సంపును శుభ్రపరిచేందుకు వెళ్లిన ఓ హౌస్ కీపింగ్ బాయ్ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. రాజేంద్రనగర్ ఎస్ఐ మామిడి కిశోర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ ప్రేమావతిపేట్ ప్రాంతానికి చెందిన కోరని మల్లేష్(27) 17 రోజుల నుంచి ఓ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ పనిచేస్తున్నాడు. సోమవారం అపార్ట్‌మెంట్‌పైనున్న సంపు క్లీనింగ్ కోసం పైకి వెళ్లాడు. కొద్దిసేపటికే ప్రమాదవశాత్తు పిట్టగోడ పై నుంచి కిందపడ్డాడు. అతడి తల రెండుగా చీలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతానికి గురై కార్మికుడి మృతి



సిద్ధార్థ వర్మ

దుండిగల్: విద్యుదాఘాతానికి గురైన ఓ కార్మికుడు భవనంపై నుంచి కింద పడి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రామ్మోహన్‌రెడ్డి కథనం ప్రకారం... మల్లంపేట ప్రాంతానికి చెందిన సిద్ధార్థ వర్మ(31) మల్లంపేటలోని ఆకాశ్ లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం భవనంలోని మొదటి అంతస్తులో సెంట్రింగ్ రాడ్లు బిగిస్తుండగా ఆ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో విద్యుఘాతానికి గురైన సిద్ధార్థ వర్మ కింద పడిపోయాడు. వెంటనే తోటి కార్మికులు అతన్ని బాచుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో 'సాక్షి' ఉద్యోగి మృతి



శేషాచలపతిరావు (ఫైల్)

ఖైరతాబాద్: గుండెపోటుతో 'సాక్షి'ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... విశాఖపట్టణం జిల్లా ఎలమంచిలి ప్రాంతానికి చెందిన పి.శేషాచలపతిరావు(55) కుటుంబంతో కలిసి అల్వాల్‌లో నివాసముంటున్నారు. బంజారాహిల్స్‌లోని 'సాక్షి'దినపత్రిక కార్యాలయంలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో స్థానిక బస్టాప్‌లో బస్ కోసం ఎదురుచూస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలారు. ప్రయాణికులు గమనించి 100 డయల్‌కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో ఎస్ఐ అమర్‌నాథ్, ఏఎస్ఐ శ్రీరాములు సంఘటనాస్థలానికి చేరుకొని ఆయనను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఆయన బ్యాగ్‌లో లభించిన 'సాక్షి'దినపత్రిక ఐడీ కార్డు, బస్‌పాస్ ఆధారంగా కుటుంబసభ్యుల వివరాలు సేకరించారు. వైజాగ్‌లో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

● ఏటీఎం కేంద్రాల్లో దృష్టి మరల్చి దోపిడీలకు పాల్పడుతున్న నిందితులు
● ముగ్గురిని అరెస్టు చేసిన దక్షిణ మండలం పోలీసులు
● రూ.7.60 లక్షల నగదు, 105 ఏటీఎం కార్డుల స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా

చాంద్రాయణగుట్ట: ఏటీఎంలలో ఖాతాదారుల దృష్టి మరల్చి నగదు డ్రా చేసుకుంటున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును దక్షిణ మండలం పోలీసులు బహిర్గతం చేశారు. ముగ్గురు నిందితులను సోమవారం అరెస్ట్ చేశారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. హరియాణా రాష్ట్రానికి చెందిన వకీల్ అలీ(45), ఇస్లాం కొన్నాళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం చార్మినార్ ప్రాంతానికి వలస వచ్చి వస్త్రాల వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే వీరికి యూపీకి చెందిన ఫర్మాన్(23), గుల్లు, హైదరాబాద్‌కు చెందిన ఒబేద్ ఆరీఫ్(30)లు పరిచయమయ్యారు. విలాసవంతమైన జీవనం కోసం సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఏటీఎంల వద్ద వినియోగదారుల దృష్టి మరల్చి దోపిడీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నవారికి సాయం చేసినట్లుగా ఈ నిందితులు నటిస్తూ, రహస్యంగా పిన్ నంబర్ చూసేవారు. ఏటీఎం కార్డును వినియోగించినట్లు మభ్యపెట్టి రెప్పపాటులో ఒరిజినల్ ఏటీఎం కార్డు తీసుకొని, దాని స్థానంలో అదే బ్యాంక్‌కు చెందిన డూప్లికేట్ ఏటీఎం కార్డును తిరిగి ఇచ్చేవారు. వెంటనే అక్కడి నుంచి జారుకొని మరోచోట నగదును డ్రా చేసుకునేవారు. ఈ విధంగానే ఈ నిందితులు గత డిసెంబర్ 22న బహదూర్‌పురాకు చెందిన అతిక్యా ఖాన్ అనే మహిళ దృష్టి మరల్చి ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.2.30 లక్షలు విత్ డ్రా చేసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బహదూర్‌పురా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు నేతృత్వంలోని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఫలక్‌నుమా ఏసీపీ జావెద్, బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్, డీఐ శ్రీకాంత్‌రెడ్డి బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టి వకీల్, ఫర్మాన్, ఒబేద్‌లను సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.7.60 లక్షల నగదు, వివిధ బ్యాంక్‌లకు చెందిన 105 నకిలీ ఏటీఎం కార్డులు, కారు, ద్విచక్ర వాహనం, నకిలీ పోలీస్ గుర్తింపు కార్డు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇప్పటివరకు 18 దోపిడీ(తెలంగాణలో 10, ఆంధ్రప్రదేశ్-02, ఒడిశా-04, కర్ణాటక-02)లకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మిగిలిన ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

● అతివేగం ప్రాణాలను తీస్తుంది.. జాగ్రత్త!
● రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మల్లాపూర్: 'సింగిల్ లైన్, డబుల్ లైన్, హైవే.. వంటి రకరకాల రహదారులు ఉంటాయి. అతివేగంగా వాహనాలను నడిపేటప్పుడు త్రిల్‌గా ఉంటుంది. కానీ, అది ప్రాణాల్ని తీస్తుంది. యువత దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి'అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ట్రాఫిక్ అవేర్నెస్, పార్క్ చిల్డ్రన్ ట్రాక్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి గవర్నర్ ప్రారంభించారు, అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను స్కూల్లో చేపట్టడం చాలా అవసరమని, ఒక జీవితాన్ని అయినా రక్షించగలిగితే అది స్ఫూర్తిదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆటలతో అనేక అంశాలపై అవగాహన కలుగుతుందని, ఫుట్‌బాల్ ఆటతో సమాజంలో ఎలా బతకాలో ఒకరికొకరు ఎలా సహాయం చేసుకోవాలో తెలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సాంకేతిక, సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జై జవాన్, జై కిసాన్ నినాదాలతోపాటు జై విజ్ఞాన్, జై అనుసంధాన్‌లను కలుపుకోవాలని ఆకాంక్షించారు.

కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు జరగవని, ఈ విషయాలపై విద్యార్థులు తమ కుటుంబాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, సురభి వాణీదేవి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్రమోహన్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, డీపీఎస్ విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, డీటీవో రఘునందన్ గౌడ్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు 'సిప్ సేవ్ స్టైల్'

• సామాజిక సేవలతో కూడిన వినూత్న ప్రాజెక్ట్
• విద్యార్థులను అభినందించిన జీహెచ్ఎంసీ కమిషనర్



సిప్ సేవ్ స్టైల్ ప్రాజెక్ట్ గురించి కమిషనర్‌కు వివరిస్తున్న విద్యార్థులు

లక్డీకాపూల్: పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలతో కూడిన వినూత్న ప్రాజెక్ట్ 'సిప్, సేవ్, స్టైల్'ను చేపట్టిన భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామా స్కూల్ విద్యార్థులు సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఇలంబర్తి ని కలిసి ప్రాజెక్ట్ గురించి వివరించారు. విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లో ఉపయోగించిన పాల ప్యాకెట్లను పారవేయకుండా వాటిని ఒక దృఢమైన ఫ్యాబ్రిక్‌లా మార్చి, బ్యాగులు, పెన్సిల్ పౌచ్‌లు, ఫోల్డర్లు వంటి పునర్వినియోగ ఉత్పత్తులను రూపొందించారు. పర్యావరణహితం, సామాజిక బాధ్యతతో కూడిన ఈ ప్రాజెక్ట్‌తో ప్రజల్లో అవగాహన పెంచడమే విద్యార్థుల లక్ష్యమని చెప్పారు. విద్యార్థులు ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని నిరుపేదల ఆహార పంపిణీకి వినియోగించు కుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక బాధ్యతకు నూతన దృక్పథాన్ని పరిచయం చేశారన్నారు. విద్యార్థుల సృజనాత్మకతను ఆయన అభినందించారు.

అర్హత పరీక్షల పేరిట తొలగించడం అన్యాయం

విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్న ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లు



ఇందిరాపార్కు వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లు

కవాడిగూడ: తొలగించిన తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని 39 మంది ఇంటిగ్రేటెడ్ కంప్యూటర్ ట్రెయినింగ్(ఐసీటీ) ఇన్‌స్ట్రక్టర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఐసీటీ ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ గురుకుల సొసైటీ 103 కొత్త గురుకుల పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను అందించేందుకు తమను 2018లో విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. తొలగించిన ఇన్‌స్ట్రక్టర్లు స్రవంతి, పల్లవి, అశ్వినీ, మురళి, నజీర్, శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఏ ఒక్క ఉద్యోగికి కూడా ప్రతియేటా అర్హతపరీక్ష ఉండదని, కంప్యూటర్ ట్రైనింగ్ సిబ్బందికి మాత్రమే ఎందుకు పరీక్ష నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నవంబర్‌లో ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ కోసం మొయినాబాద్‌కు ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లను పిలిపించి ఉన్నపళంగా తొలగించారని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోని సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల ఆగడాలకు అడ్డుకట్టవేసి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

నగర వైద్యుడికి ప్రతిష్టాత్మక అవార్డు!



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ దంతవైద్యుడు డాక్టర్ వికాస్ గౌడ్‌కు 'ఫ్యామ్‌డెంట్ అవుట్ స్టాండింగ్ డెంటిస్ట్ ఆఫ్ ద ఇయర్'అవార్డు లభించింది. దంత వైద్య రంగంలో అత్యుత్తమ ప్రతిభతోపాటు రీసెర్చ్, బోధన, రోగులకు అందించే సేవల వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇచ్చే ఈ అవార్డుకు 'దంత వైద్య ఆస్కార్'అనే పేరు కూడా ఉంది. ఈ నెల 18న ముంబైలో ఫ్యామ్‌డెంట్ ఫౌండర్ డాక్టర్ అరోరాతోపాటు ప్రఖ్యాత దంతవైద్య నిపుణులు డాక్టర్ సబితా రామ్, కుమారస్వామి ఆయనకు అవార్డును అందజేశారు. డాక్టర్ వికాస్ గౌడ్ ఇంప్లాంటాలజిస్ట్ ఆఫ్ ద ఇయర్, ఈస్థెటిక్ డెంటల్ ప్రాక్టీషనర్ ఆఫ్ ద ఇయర్ అనే మరో రెండు విభాగాలకు కూడా ఎంపికయ్యారు. ఆయన పాతికేళ్లుగా దంతవైద్యంలో ఉత్తమ సేవలందిస్తున్నారు. 'ఈ అవార్డు దక్కడం నా వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, నా టీమ్, గురువులు, రోజూ స్ఫూర్తినిచ్చే నా దంత రోగులందరి తరపున నాకు లభించినట్లు భావిస్తున్నాను'అని డాక్టర్ గౌడ్ పేర్కొన్నారు.

కమ్యూనిటీ ఆర్గనైజర్‌ను మార్చాలని వినతి

ఫిలింనగర్‌: విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు జూబ్లీహిల్స్‌ డివిజన్‌లో మహిళా సమాఖ్యలు కుదేలవడానికి కారణమైన అధికారిణిని వెంటనే మార్చాలని జూబ్లీహిల్స్‌ మహిళా కాంగ్రెస్‌ కమిటీ నేతలు యూసీడీ అడిషనల్‌ కమిషనర్‌ చంద్రకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. డివిజన్‌కు ఆ అధికారిణి నియామకం జరిగినప్పటి నుంచి సమాఖ్యల్లో ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రుణాలు ఇప్పించే సమయంలో కూడా అవినీతిని ప్రోత్సహిస్తున్నారని సదరు అధికారిణిపై చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్‌లో ఈ మధ్యకాలంలో జరిగిన కులగణన సర్వే కూడా సరిగ్గా జరగలేదని ఎంతో మంది నిజమైన లబ్ధిదారులను గుర్తించలేకపోయామని అన్నారు. ఇందిరమ్మ ఇంటి సర్వేలో తనకున్న లాగిన్‌ డిటైల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులకు ఇచ్చి సర్వే చేయించినట్లు ఆరోపించారు. ఎంతోమంది అర్హులైన లబ్ధిదారులు సదరు అధికారిణి వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. వెంటనే జూబ్లీహిల్స్‌ డివిజన్‌కు చెందిన సమర్థివంతమైన అధికారిని నియమించాలని వారు అడిషనల్‌ కమిషనర్‌ను కోరారు.

భగత్‌సింగ్‌ కాలనీలో కార్పొరేటర్‌ పర్యటన



భగత్‌సింగ్‌కాలనీలో పర్యటిస్తున్న జూబ్లీహిల్స్‌ కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేష్‌

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్‌కాలనీలో సోమవారం జూబ్లీహిల్స్‌ కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేష్‌ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు తదితర పనులు చేయించామని కార్పొరేటర్‌ స్థానికులకు తెలియజేశారు. డ్రైనేజీ పనులు పూర్తి కావడంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకటేష్‌, స్థానిక నాయకులు సహదేవ్‌, లింగాచారి, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

రహమత్‌నగర్‌: ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఆ పార్టీ నాయకుడు శేషగిరిరావు స్పష్టం చేశారు. బోరబండ డివిజన్‌ సైట్‌–3 పెద్దమ్మగుడి నగర్‌లో డివిజన్‌ సీపీఎం కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపై ఇప్పటికే నివేదికలు రూపొందించడం జరిగిందన్నారు. త్వరలోనే సమస్యలపై ఆందోళన చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కృష్ణ, విష్ణుమూర్తి, నయూం, పటేల్‌, సికిందర్‌, గంగులప్ప, సాబేర్‌, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రూ.84 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు

హామీ నెరవేర్చిన మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి, చిత్రంలో ఎమ్మెల్యే దానం నాగేందర్‌

బంజారాహిల్స్‌: గ్రేటర్‌ హైదరాబాద్‌లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి ప్రజలకు ఇచ్చిన హామీలను అనతికాలంలోనే నెరవేర్చారు. జూబ్లీహిల్స్‌ శ్రీనగర్‌కాలనీ డివిజన్‌లోని పలు కాలనీల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో గత శనివారం (జనవరి 18) మేయర్‌ ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌, స్థానిక కార్పొరేటర్‌ మన్నె కవితారెడ్డి, జోనల్‌ కమిషనర్‌తో కలిసి పలు కాలనీల్లో పర్యటించినప్పుడు ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కారం చేశారు. వెంకటేశ్వరనగర్‌ డివిజన్‌లోని ప్రతాప్‌నగర్‌లో బై లైన్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని కాలనీవాసులు విన్నవించారు. రోడ్ల పరిస్థితిని స్వయంగా చూసిన మేయర్‌ మూడు రోజుల్లో అన్ని బై లైన్‌లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే హామీని నెరవేర్చేందుకు సోమవారం రూ.84 లక్షల వ్యయంతో సుమారు 7బై లైన్‌లలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దానం నాగేందర్‌, కార్పొరేటర్‌ మన్నె కవితారెడ్డిలతో కలిసి మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మీ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ తన డివిజన్‌లో కంటే వెంకటేశ్వరనగర్‌ డివిజన్‌లో ఎక్కువ పనులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి ఇచ్చిన ఆర్థిక ప్రోద్బలంతో నగరంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరాలని మేయర్‌ సూచించారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రేటర్‌ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రుణాలతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి



బంజారాహిల్స్‌: మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థిక స్వావలంబనతో మరింత ఉన్నతంగా ఎదగాలని మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి ఆకాంక్షించారు. సోమవారం ఖైరతాబాద్‌ జోనల్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మేయర్‌ ప్రారంభించారు. ఎస్‌.బి.టినగర్‌ ఎస్‌ఎల్‌ఎఫ్‌ –5 గణేష్‌ ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు రూ.10 లక్షల బ్యాంక్‌ లింకేజీ రుణం మంజూరు కాగా, అందులో రూ.5 లక్షలతో ఐదు మంది మహిళలు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి, స్త్రీలకు ఆర్థిక స్వావలంబన అందించడానికి ఏర్పాటు చేయబడిందన్నారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించడానికి ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు.

ఆర్టిజన్ల కన్వర్షన్‌ కోసం రిలే నిరాహార దీక్షలు

బంజారాహిల్స్‌: ఆర్టిజన్ల కన్వర్షన్‌ కోసం టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెంట్రల్‌, సౌత్‌ సర్కిళ్లు కలిసి ఖైరతాబాద్‌లోని మింట్‌ కాంపౌండ్‌లో సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ నెల 24 వరకు ఈ దీక్షలు కొనసాగనున్నాయి. సెంట్రల్‌ సర్కిల్‌ హైదరాబాద్‌ చైర్మన్‌ ఎం.ధనరాజ్‌, కన్వీనర్‌ శంకర్‌నాయక్‌, మల్లేష్‌, అనంతరావు,, ఫైజిల్లాఖాన్‌, సునీత, అనిత, దీపక్‌, సౌత్‌ సర్కిల్‌ హైదరాబాద్‌ నుంచి చైర్మన్‌ రాము, కో–కన్వీనర్లు లక్ష్మీనారాయణ, తైసీన్‌ షరీఫ్‌, ఉమాశంకర్‌, కిషోర్‌కుమార్‌, బాలు, నర్సింగ్‌రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కష్టనష్టాలు, బాధలు భరిస్తూ ప్రమాదకరమైన డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వాలు గానీ, యాజమాన్యం గానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

విద్యుత్‌ ఉండని ప్రాంతాలు


వెంగళరావునగర్‌: ఎస్‌వీఎస్‌ టెంపుల్‌, ఎస్‌ఆర్‌నగర్‌ 11కెవీ ఫీడర్లు బేగంపేట సబ్‌స్టేషన్‌ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల మంగళవారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గ్రీన్‌లాండ్స్‌ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్‌ సోమవారం తెలిపారు.

◆ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్‌వీఎస్‌ టెంపుల్‌ లైన్‌, బి.టైప్‌, 2ఆర్‌టీ, 3 ఆర్‌టీ క్వార్టర్‌ ఎస్‌ఆర్‌నగర్‌ కమ్యూనిటీహాల్‌, మెయిన్‌రోడ్డు, గౌతమీ దామంస్కూల్‌ ఏరియా, ఓల్డ్‌ రిలయన్స్‌ ఫ్రెష్‌, జ్ఞాన సరస్వతి, ఆంధ్రాబ్యాంక్‌, ఎస్‌బీహెచ్‌, లైన్‌, చైతన్య కాలేజీ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. అదేవిధంగా సూర్యోదయ 11కెవీ ఫీడర్‌, హెచ్‌పీఎస్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల సూర్యోదయ కాంప్లెక్స్‌, నెల్లి శిల్క్‌ శారీస్‌ ఏరియాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్‌ ఉండదని, దీనిని వినియోగదారులకు గమనించగలరని ఆయన కోరారు.

జనరేటర్‌ పొల్యూషన్‌తో ఇబ్బందులు

పంజగుట్ట: కమ్మ సంఘంలోని జనరేటర్‌ నుంచి వెలువడుతున్న పొల్యూషన్‌ వల్ల తీవ్ర ఇబ్బందులలు పడుతున్నామని దీనిపై తగుచర్యలు తీసుకోవాలని బాధితుడు వి.పురుషోత్తం రెడ్డి కోరారు. ఇదే విషయమై ఇప్పటికే పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు వారికి ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను శ్రీనగర్‌కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటామని తమ అపార్ట్‌మెంట్‌ వెనక కమ్మసంఘం ఫంక్షన్‌ హాల్‌ ఉందన్నారు. రాత్రీ, పగలు అన్న తేడా లేకుండా కరెంటు ఉన్నప్పటికీ జనరేటర్లే వాడుతున్నారని ఆరోపించారు. దీంతో విపరీతమైన పొగ, శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇదే విషయమై పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు వారికి ఫిర్యాదు చేస్తే వారు పరిశీలించి దీన్ని వెంటనే తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు రిపోర్టు ఇచ్చారని ఆయన తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జనరేటర్లను తొలగించాలని ఆయన వేడుకున్నాడు.

అమ్మో కోతులు



దుర్గానగర్‌ కాలనీలో ఇళ్ల మీద తిరుగుతున్న కోతులు

బంజారాహిల్స్‌: వానరాలు గుంపులుగా వచ్చి కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పంజగుట్ట, దుర్గానగర్‌కాలనీ, సోమాజిగూడ ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా వానరాలు గుంపులుగా తిరుగుతూ స్థానికులను భయపెడుతున్నాయి. కాలనీలో వానరాలు తిరుగుతున్నాయని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో మేడలపై ఎక్కి నానా బీభత్సం చేస్తున్నాయని, అలాగే దాడులు సైతం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు ఉండటంతో భయంగా గడుపుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీల్లో తిరుగుతున్న వానరాలను బంధించి పట్టుకెళ్లాలని కోరుతున్నారు.

మాదకద్రవ్యాలు వినియోగిస్తే సమాచారం ఇవ్వండి

డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి



అవగాహన కలిగిస్తున్న యాంటీ నార్కోటిక్‌ డీఎస్పీ హరిశ్చచంద్రారెడ్డి

బంజారాహిల్స్‌: మాదకద్రవ్యాలు వినియోగిస్తున్న వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని యాంటీ నార్కోటిక్‌ డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. సోమవారం రాజ్‌భవన్‌ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో గానీ, ఇంటి పరిసరాల్లో గానీ ఎవరైనా వ్యక్తులు మాదకద్రవ్యాలు సేవిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1908కు తెలియజేయాలన్నారు. పాఠశాలలో ఎవరైనా విద్యార్థులపై అనుమానం కలిగితే వెంటనే ప్రహరీ క్లబ్‌ సభ్యులు సంబంధిత ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు సమాచారాన్ని తెలియజేయాలన్నారు. దీంతో పాటు విద్యార్థులకు ట్రాకింగ్‌ డాగ్‌, పోస్టర్ల ప్రదర్శన, వీడియో ప్రదర్శన చేసి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బుచ్చయ్యతో పాటు ఇన్‌స్పెక్టర్లు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్‌ పాల్గొన్నారు.

మార్షల్‌ ఆర్ట్స్‌తో ఆరోగ్యం, ఆత్మరక్షణ



రహమత్‌నగర్‌: మార్షల్‌ ఆర్ట్స్‌తో ఆరోగ్యం, ఆత్మరక్షణ సాధ్యమవుతుందని కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి అన్నారు. తార్నాకాలోని మర్రి కృష్ణ హాల్లో నిర్వహించిన రెండో జోనల్‌ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌ పోటీల్లో ఎస్పీఆర్‌హిల్స్‌ చెందిన పది మంది విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. ఇందులో మొదటి స్థానంలో ఏ. ధనుంజయ్‌, ఏ.పావని, రెండో స్థానంలో డి. పావని, బి. ప్రశాంత్‌, కె. చందన, కె. పవన్‌తేజ్‌, మూడో స్థానంలో ఇస్థిఫిన్‌, షేక్‌ ఇర్ఫాన్‌, ఏ.దీక్షిత మహి, ఏ. శ్రీచంద్రలు నిలిచారు. బహుమతులు సాధించిన చిన్నారులకు సోమవారం తన కార్యాలయంలో సీఎన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యతో పాటు మార్షల్‌ ఆర్ట్స్‌ను నేర్పించాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్‌ యాముల మనోహర్‌ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన దొంగ అరెస్టు

బంజారాహిల్స్‌: వరుసగా ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్న వ్యక్తిని జూబ్లీహిల్స్‌ పోలీసులు సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహ్మద్‌ ఇర్ఫాన్‌ జూబ్లీహిల్స్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో టీవీఎస్‌ రైడర్‌ బైక్‌ను, శంషాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో హీరో హోండా స్ప్లెండర్‌ బైక్‌ను దొంగతనం చేశాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్‌ పోలీసులు చాకచక్యంగా మహ్మద్‌ ఇర్ఫాన్‌ను పట్టుకొని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్‌



జశ్వంత్‌ను అభినందిస్తున్న కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి

బంజారాహిల్స్‌: జాతీయ స్థాయి ఖోఖోలో పాల్గొన్న హైదరాబాద్‌కు చెందిన ఏకైక విద్యార్థి జశ్వంత్‌ను జిల్లా కలెక్టర్‌ అభినందించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 10 నుంచి 13 వరకు ఎస్‌జీఎఫ్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 68వ జాతీయ స్థాయి ఖోఖోలో తెలంగాణ రాష్ట్రం తరుపున హైదరాబాద్‌ నుంచి రాజ్‌భవన్‌ పాఠశాలలోని తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి బైరి జశ్వంత్‌ పాల్గొన్నారు. అండర్‌–14 విభాగంలో పాల్గొన్న తెలంగాణ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో విద్యార్థి జశ్వంత్‌ను జిల్లా కలెక్టర్‌ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఇదే మాదిరిగా భవిష్యత్తులో క్రీడలో మరింతగా రాణించి నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌ జిల్లా డీఈఓ రోహిణి కూడా జశ్వంత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పీర్కోండ, లత పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల అరెస్ట్‌

వెంగళరావునగర్‌: గంజాయి తాగడానికి ప్రయత్నిస్తున్న ఇరువురు యువకులను మధురానగర్‌ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... జగిత్యాల ప్రాంతానికి చెందిన ఎం.కార్తీక్‌ (ర్యాపిడో డ్రైవర్‌), జి.రవివర్మ (క్యాబ్‌ డ్రైవర్‌)లు స్థానిక ఎల్లారెడ్డిగూడలోని హాస్టల్‌లో ఉంటున్నారు. ఈనెల 18వ తేదీన రాత్రి మధురానగర్‌ పోలీసులు గస్తీ తిరుగుతుండగా ఎల్లారెడ్డిగూడలోని కోవెల బాయ్స్‌ హాస్టల్‌ సమీపంలో ఇరువురు యువకులు సిగరెట్‌ తాగుతున్నట్టుగా గుర్తించారు. పోలీసులు వారి వద్దకు వెళ్లగా పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోనికి తీసుకుని విచారించగా వారి వద్ద 3 గ్రాముల గంజాయి, 4 యూనిట్స్‌ సిగరెట్‌ పాకెట్లు, అగ్గిపెట్టె లభ్యమయ్యాయి. వాటిని వారు ట్యాంక్‌బండ్‌ వద్ద కొనుగోలు చేసుకుని తీసుకువచ్చారని యువకులు వెల్లడించారు. దీంతో పోలీసులు యువకులను అదుపులోనికి తీసుకుని గంజాయి, సిగరెట్‌ పాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేజ్రీవాల్‌పై రాళ్ల దాడి గర్హనీయం

లిబర్టీ: ఆప్‌ జాతీయ కన్వీనర్‌ అరవింద్‌ కేజ్రీవాల్‌పై బీజేపీ నాయకులు రాళ్ల దాడి చేయడం గర్హనీయమని ఆప్‌ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌ డాక్టర్‌ దిడ్డి సుధాకర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరవింద్‌ కేజ్రీవాల్‌ ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా బీజేపీ నేత పర్వేశ్‌ వర్మకు చెందిన కొందరు అరవింద్‌ కేజ్రీవాల్‌ కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారని తెలిపారు. ఈ ఘటనలో కారు అద్దాలు పగలగా అదృష్టవశాత్తు అరవింద్‌ కేజ్రీవాల్‌కు ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీజేపీకి భయం పట్టుకుందని, అందుకే ఆప్‌ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఇలాంటి నీచమైన దాడులకు పాల్పడుతుందని మండిపడ్డారు. బీజేపీ పిరికిపంద చర్యలకు అరవింద్‌ కేజ్రీవాల్‌ భయపడరని, ఢిల్లీ ప్రజలు ఆప్‌ వెంటనే ఉన్నారని ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అరవింద్‌ కేజ్రీవాల్‌పై బీజేపీ గుండాల రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ప్రమాద స్థలంలో టీకొట్టు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్‌..

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–14లోని బసవతారకం కేన్సర్‌ ఆస్పత్రికి వెళ్లే రోడ్డులో అనుభూతి బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ ముందు ట్రాన్స్‌ఫార్మర్‌కు, విద్యుత్‌ స్తంభానికి మధ్య ప్రమాదకరంగా నిర్మించిన టీ కొట్టు డబ్బాలను టీజీఎస్‌పీడీసీఎల్‌ బంజారాహిల్స్‌ సెక్షన్‌ ఏఈ రమేష్‌ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. 'ప్రమాదకరంగా వ్యాపారాలు' పేరుతో పొంచి ఉన్న ప్రమాదాన్ని సోమవారం 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన విద్యుత్‌ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి ప్రమాదకరమైన ప్రాంతంలో నిర్మించిన ఆక్రమణలను తొలగించారు. మరోసారి ఏర్పాటు చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సాక్షి మంగళవారం । 21 । జనవరి । 2025

కొత్త ఉద్యోగాల వేట షురూ

– వెల్లడించిన లింక్డ్ ఇన్ అధ్యయనం

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా నగరాల్లోని 82% మంది వృత్తి నిపుణులు ఈ ఏడాది కొత్త ఉద్యోగంలో చేరాలని కోరుకుంటున్నారు. ప్రముఖ అంతర్జాతీయ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్ఇన్ ఈ విషయాన్ని వెల్లడించింది. నగరంతో పాటు పలు నగరాల వ్యాప్తంగా చేసిన అధ్యయన ఫలితాలను వెల్లడించింది. మార్పు కోసం ఆశిస్తున్నప్పటికీ.. గత సంవత్సర కాలంలో ఈ ప్రక్రియ కష్టతరంగా మారిందని 55% మంది నిపుణులు చెబుతున్నారు. వీరిలో 49% మంది ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నా తక్కువ స్పందన మాత్రమే వస్తోందంటున్నారు. హెచ్‌ఆర్ నిపుణులలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది(69%) కూడా ఇదేవిధంగా భావిస్తున్నారు. అయినప్పటికీ.. ఉద్యోగ మార్కెట్ మెరుగుపడుతుందని నమ్ముతున్న 58% మంది కొత్త ఉద్యోగం పొందుతామని ఆశావాదంతో ఉన్నారు.

ముగిసిన హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్



సాక్షి, సిటీబ్యూరో: మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన 20వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. దేశవ్యాప్తంగా 220 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. విజేతలకు రూ.2 లక్షల నగదు బహుమతిని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్(హెచ్‌ఓటీఏ) అధ్యక్షుడు నంద్యాల నరసింహారెడ్డి, ఇతర ఆఫీస్‌బేరర్లు సింగిల్స్, డబుల్స్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పురుషులు 30 సంవత్సరాల కేటగిరీ సింగిల్స్‌లో ఈశ్వర్ సాయి విజేతగా నిలిచారు. డబుల్స్‌లో ఈశ్వర్ సాయి, విశాఖ్ టైటిల్ సాధించారు. 40 సంవత్సరాల కేటగిరీలో సింగిల్స్‌లో జి.రాజ, డబుల్స్‌లో జి.రాజ, లగ్గాని శ్రీనివాస్ జోడీ విజయం సాధించింది. 50 సంవత్సరాల కేటగిరీ సింగిల్స్‌లో శ్రీధర్ గెలుపొందగా.. డబుల్స్‌లో కుమారస్వామి, వెంకటేశ్వర్లు గెలుపొందారు. 60 సంవత్సరాల కేటగిరీ సింగిల్స్‌లో ప్రియదర్శిని రామ్‌రెడ్డి, డబుల్స్‌లో పాల్ మనోహర్, రమేశ్ విజయం సాధించారు. 70 సంవత్సరాల కేటగిరీలో సింగిల్స్‌లో వెంకట సన్యాసి రాజు, డబుల్స్‌లో కల్నల్ అంకయ్య, గజపతి నాయుడు జోడీ చాంపియన్లుగా నిలిచారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1,415 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో అత్యధికంగా గృహ నిర్మాణశాఖకు 1,272, రేషన్ కార్డుల కోసం 87, పెన్షన్ 33, జీహెచ్‌ఎంసీ 8, డీఈఓ 9, ఇతర శాఖలకు సంబంధించి 6 దరఖాస్తులు అందాయని అధికారులు పేర్కొన్నారు.

పోస్టల్ ఫ్రాంఛైజీ అవుట్ లెట్లకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాల్లో పోస్టల్ ఫ్రాంఛైజీ అవుట్‌లెట్ల కోసం హైదరాబాద్ సిటీ పోస్టల్ డివిజన్ విభాగం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. స్పీడ్ పోస్టు, పార్సిల్ బుకింగ్, స్టాంప్స్ విక్రయం కోసం బంజారాహిల్స్, లింగంపల్లి శ్రీనగర్, బజార్‌ఘాట్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, మణికొండ, సోమాజిగూడ, చిత్రపురికాలనీ, హనుమాన్‌నగర్, ఖైరతాబాద్, మోతీనగర్, విజయ్‌నగర్ కాలనీ, సైబరాబాద్, హిమాయత్‌నగర్, కార్వాన్, సనత్‌నగర్, యూసుఫ్‌గూడ, ఫిలింనగర్, కొత్తగూడ, సంజీవ్‌నగర్, ప్రశాంత్‌నగర్, కొండాపూర్, ఖాజాగూడ, షేక్‌పేట, ల్యాంకోహిల్స్, ముసాపేట తదితర ప్రాంతాల్లో పోస్టల్ ఫ్రాంఛైజీ అవుట్‌లెట్లను తెరిచేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ సిటీ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ చిట్టూరి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు సమాచారం కోసం అబిడ్స్‌లోని సిటీ డివిజన్ ఆఫీస్‌లో సంప్రదించవచ్చన్నారు.

అన్ని ఆస్పత్రుల్లో ఈహెచ్ఎస్ వర్తింపజేయాలి



ఫోరం చైర్‌పర్సన్‌కు నియామకపత్రం ఇస్తున్న రాజేంద్రబాబు

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య బీమా ఈహెచ్ఎస్ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మహిళా పింఛన్‌దారుల ఫోరం డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా స్టేట్ పింఛనర్స్ ఫెడరేషన్ బాధ్యులు రాజేంద్రబాబు చేతులమీదుగా ఫోరం ప్రతినిధులు సోమవారం నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఫోరం చైర్‌పర్సన్ ఆర్.ఉమాదేవి, కన్వీనర్ ఎల్.నాగమాంబ, కో చైర్మన్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమకు నగదురహిత ఆరోగ్య బీమా కల్పించాలని విజ్ఞప్తి చేశామని, దానికి ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు నాగమణిరెడ్డి, లక్ష్మి, జ్యోతిశ్రీ, సాఫియా సుల్తానా, వరూదిని, గీతాంజలి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో భద్రత మరింత పటిష్టం

- ప్రయాణికుల భద్రతకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీల వినియోగం
- సత్ఫలితాలు సాధిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు



సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌లో మానిటరింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు (ఫైల్)

అడ్డగుట్ట: భారతీయ రైల్వేలో భద్రతను మరింత పటిష్టం చేసే లక్ష్యంతో ఆర్పీఎఫ్ పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తూ ముందుకు సాగుతున్నారు. దేశవ్యాప్తంగా నిత్యం 23 మిలియన్ల ప్యాసింజర్లు వేలకొద్దీ రైల్వే స్టేషన్ల నుంచి వారి ప్రయాణాలు సాగిస్తుంటారు. వారందరికీ సురక్షితమైన ప్రయాణం కల్పించడంతో పాటు భద్రత అందించే బాధ్యత ఆర్పీఎఫ్ పోలీసులపై ఉంది. అర్బన్ ప్రాంతాల్లో మాత్రమే కాకుండా రూరల్ ప్రాంతాల్లో కూడా నేరాలను అరికట్టే విధంగా నూతన టెక్నాలజీ వినియోగిస్తూ ప్రయాణికుల రక్షణ, వివిధ గూడ్స్ రవాణాకు పూర్తిస్థాయి భద్రత కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నూతన సంవత్సరం నుంచి కొత్త ఒరవడితో ముందుకు సాగుతూ రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్)లో డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ తీసుకువస్తున్నట్లు ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్‌సీ డెబస్మిత సీ బెనర్జీ వివరించారు.

సాంకేతికంగా..

అధునాతన టెక్నాలజీ వినియోగిస్తూ నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ముప్పును ముందుగానే గుర్తించే విధంగా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్), బిగ్ డేటా అనాలిటిక్స్‌ను వినియోగిస్తున్నారు. ఫేస్ గుర్తింపు కోసం బయోమెట్రిక్ ఆధారిత కోచ్ ఎంట్రీలతో పాటు సీసీ సర్వేలెన్స్‌లు పెంచారు. అదేవిధంగా రైళ్లలో వివిధ సరుకుల రవాణా సమయంలో భద్రత కోసం జీపీఎస్‌లు అమర్చారు. దీన్ని ఎప్పటికప్పుడు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు మానిటరింగ్ చేస్తుంటారు.

మొబైల్ అప్లికేషన్లు..

సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన యాప్‌లను ప్యాసింజర్లు తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. రైల్వే స్టేషన్, రైళ్లలో ప్యాసింజర్లకు ఎటువంటి సమస్యలున్నా 'రైల్ మదద్' యాప్ ద్వారా సత్వర పరిష్కారం పొందవచ్చు. అదేవిధంగా మహిళల భద్రత కోసం 'మేరీ సహేళి' యాప్‌ను వినియోగించుకోవాలి. చట్టపరమైన రిపోజిటరీ యాప్ అయిన 'సంగ్యాన్' ద్వారా అధికారులకు అప్‌డేటెడ్ లీగల్ రిసోర్సెస్ అందుబాటులో ఉంటాయి.

ప్రత్యేక చొరవ..

టికెట్ టౌటింగ్‌తో పాటు మానవ అక్రమ రవాణాను ఎదుర్కొనేందుకు బిగ్ డేటా అనాలిటిక్స్ కోసం ప్రబల్ ఉపయోగపడుతుంది. దీంతో పాటు ఈ–టౌటింగ్ వంటి డిజిటల్ నేరాలను ఎదుర్కోవడానికి సైబర్ సెల్స్ ఉన్నాయి.

సత్ఫలితాలు..

'ఆపరేషన్ నన్హే ఫరిష్తే' ద్వారా 84 వేల మందికి పైగా పిల్లలను రక్షించడం జరిగింది. బెంగళూరులో నేరస్తులను పట్టుకోవడానికి ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు ఎంతో దోహదపడినట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ టికెట్ టౌటింగ్ సిండికేట్లను కూడా న్యూట్రలైజ్ చేసినట్లు చెప్పారు.

మహిళా ప్రయాణికులకు రక్షణ



భారతీయ రైల్వేలో ప్రయాణికుల భద్రత విషయంలో మరింత టెక్నాలజీ వినియోగించేందుకు ఆర్పీఎఫ్ డీజీ పర్యవేక్షణలో ముందుకు సాగుతున్నాం. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల రక్షణ విషయంలో నిఘా మరింత ముమ్మరం చేశాం. వారి భద్రతకు రైళ్లలో శక్తి టీమ్, నాగమ్మ టీమ్‌లు అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా ఈ అధునాతన టెక్నాలజీ వాడకంతో రైల్వేలకు సంబంధించి ఎటువంటి ఆస్తి నష్టం జరగకుండా చూసుకుంటున్నాం. రైళ్లు, రైల్వే స్టేషన్లలో ఎటువంటి నేరాలు, అక్రమ రవాణా జరగకుండా జీఆర్పీ పోలీసుల సహకారం తీసుకుంటూ ఆర్పీఎఫ్ పోలీసులు తమదైన శైలిలో కృషి చేస్తున్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా 139 నంబర్‌కు ఫోన్ చేయాలి.

– డెబస్మిత్ బెనర్జీ, ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్‌సీ(డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్)

నగరంలో నేడు

- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో రసరంజని, సరసిజ ఆధ్వర్యంలో కథా రచయిత్రులకు నాటకం రాయడం ఎలా అన్న అంశంపై నాంపల్లిలోని తెలుగు వర్సిటీలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత శిక్షణ శిబిరం జరుగుతుంది.
- శ్రేష్టకీర్తి క్రియేషన్స్ ఆధ్వర్యంలో డాక్టర్ రాజాగారి ఆ పాత మధురం(రెండవ సంపుటి) పుస్తకావిష్కరణ బేగంపేట్ కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ 8వ అంతస్తులో ఉదయం 9.30 గంటలకు జరుగుతుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇన్నోవేటివ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఘనంగా ముగిసిన అసఫ్ జాహి అంతర్జాతీయ సదస్సు



సాక్షి, సిటీబ్యూరో: పూర్వీకుల వారసత్వాన్ని మాత్రమే కాకుండా సాంస్కృతిక వారసత్వంగా హైదరాబాద్ నగరం అభివృద్ధిని ఉత్సవాలుగా జరుపుకోవడం సంతోషంగా ఉందని అసఫ్ జాహి రాజవంశానికి చెందిన వారసుడు రౌనాక్ యార్‌ఖాన్ తెలిపారు. నగరంలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వేదికగా అసఫ్ జాహి రాజవంశంపై మూడు రోజుల పాటు కొనసాగిన అంతర్జాతీయ సమావేశం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా రౌనాక్ యార్‌ఖాన్ మాట్లాడుతూ.. భారతదేశ సాంస్కృతిక, ప్రజాస్వామ్య నిర్మాణంపై అసఫ్ జాహి రాజవంశం శాశ్వత ప్రభావాన్ని బలోపేతం చేసిందన్నారు. 1724 నుంచి 2024 వరకు 300 సంవత్సరాల కాలంలో రాచరికం మూలాల నుంచి ప్రజాస్వామ్యానికి పరివర్తలో తమ వంశీయుల సాంస్కృతిక ముద్ర ఇప్పటికీ కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో 24 మంది ప్రతిభావంతులైన కవులు, పరిశోధకులను సత్కరించారు. ఇందులో భాగంగా 1724 నుంచి 2024 వరకు నిజాంలు, వారి వారసత్వంపై పరిశోధనలు చేసిన డాక్టర్ మార్సెల్ల సిర్థండి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారెక్ అజీజ్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ సూర్య ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పుస్తక పరిక్రమ మొబైల్ బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభం



జెండా ఊపి మొబైల్ బుక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ సూర్య ధనుంజయ

సుల్తాన్‌బజార్: సంచార పుస్తక పరిక్రమలో ఈనెల 20 నుంచి మార్చి 20 వరకు తెలంగాణ జిల్లాలో 2 వేల కిలోమీటర్ల మేర సంచార పుస్తక పరిక్రమ కొనసాగుతుందని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య సూర్యధనుంజయ్ తెలిపారు. ఈ మేరకు మహిళా విశ్వవిద్యాలయంలో ప్రముఖ రచయిత, జర్నలిస్టు గుండు వల్లీశ్వర్ సమక్షంలో తెలంగాణ పుస్తక పరిక్రమ మొబైల్ బుక్ ఎగ్జిబిషన్‌ను సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పుస్తకాలను సామాన్యుల కోసం అందించడంలో ఏడు దశాబ్దాలుగా ఎన్‌బీటీ చేస్తున్న సేవ వెలకట్టలేనిదన్నారు. తాను చిన్ననాటి నుంచి ఆ పుస్తకాలను కొనుగోలు చేశానని, తర్వాత అదే ఎన్‌బీటీ తాను అనువాదం చేసిన పుస్తకాలను ప్రచురించిందని తెలిపారు. పల్లెల్లోకి బడిపిల్లల చెంతకు పుస్తకాలను తీసుకువెళ్లే గొప్ప పనిని ఈ పరిక్రమ ద్వారా చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. పోటీ పరీక్షలకు తయారవుతున్న అభ్యర్థులు మొదలుకొని భారతీయ భాషల్లోని గొప్ప సాహిత్యాన్ని చదివే వారికి, పిల్లలకు ఇది గొప్ప అవకాశమని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలుగు సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ నామోజు బాలచారి, డాక్టర్ కృష్ణ, డాక్టర్ లోక పావని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శైలజ, లెక్చరర్లు దేవేంద్ర, రోహిణి, దత్తాత్రేయ, రాజ్‌కుమార్, జ్యోతి, పద్మ, డాక్టర్ సునీల, డాక్టర్ సునీత, డాక్టర్ దీపిక తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు ఆందోళన



చలో హైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నేతలు

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీలతో పాటు మొత్తం 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, 14 నెలలు గడుస్తున్నా ఒకటి, ఆరా తప్ప అత్యధిక హామీల అమలు ఊసేలేదని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, కె.గోవర్ధన్, జె.వి.చలపతిరావు విమర్శించారు. ఈ మేరకు చలో హైదరాబాద్‌కు సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు చేస్తానన్న రుణమాఫీ సగం మంది రైతులకు అమలు కాలేదని, రైతుబంధును రైతు భరోసాగా పేరుమార్చి ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, రూ.12 వేలు మాత్రమే ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. కౌలు రైతులకు హక్కులు కల్పిస్తామని, రుణమాఫీ చేస్తామని, ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు పరిహారం కల్పిస్తామని చెప్పి వారి గురించి ఆలోచించడం లేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో ధరణి పేరుతో భూకబ్జాలు జరిగాయని, ఆ భూములను వెలికితీసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో మధ్య తరగతి పేదల ఇళ్లను కూల్చివేయడం సరి కాదన్నారు. సమావేశంలో ఝాన్సీ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌లో

సత్తాచాటిన తెలంగాణ విద్యార్థులు



స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

లక్డీకాపూల్: జాతీయ స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌లో తెలంగాణ విద్యార్థులు సత్తాచాటారు. లీగ్ దశలో వివిధ రాష్ట్రాల జట్లపై విజయం సాధించిన తెలంగాణ జట్టు ఫైనల్‌లో ఢిల్లీపై విజయం సాధించి విజేతగా నిలిచింది. ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో లాన్ టెన్నిస్ 68వ జాతీయ స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ జరిగింది. టోర్నీకి తెలంగాణ రాష్ట్రం నుంచి సాయిఅనన్య వారణాసి, వెన్నెల రెడ్డి, దియా మట్టిపాటి, రత్న సహస్ర ప్రాతినిధ్యం వహించారు. సాయిఅనన్య, వెన్నెల రెడ్డి ప్రతిభ కనబర్చి ఫైనల్‌కు చేరుకున్నారు. ఫైనల్ ఢిల్లీతో ఉత్కంఠ భరితంగా జరిగింది. ట్రై బ్రేకర్లో ఢిల్లీపై విజయకేతనం ఎగురవేశారు.

ఏఐజీ ఆస్పత్రిలో న్యూరో క్యాథ్ ల్యాబ్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో అత్యున్నత ఫిలిప్స్ అజ్యూరియన్ 2.2 బైప్లాన్ సిస్టమ్‌తో కూడిన అత్యాధునిక న్యూరో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటైంది. దీన్ని రాష్ట్ర సీఎం ముఖ్యకార్యదర్శి డా.జి.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ ల్యాబ్‌లో రోజంతా సేవలు అందించే స్ట్రోక్(పక్షవాతం) స్పెషలిస్ట్స్, అలాగే న్యూరో సమస్యలకు ప్రత్యేకించిన ఐసీయూ ఉంటాయి. న్యూరోవాస్క్యులర్ ఎమర్జెన్సీలు, మరీ ముఖ్యంగా ఇటీవల కాలంలో అత్యధిక మరణాలు, వైకల్యాలకు కారణమవుతున్న స్ట్రోక్స్‌కు సంబంధిత రోగులకు సేవలు అందించడంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి న్యూరాలజీ విభాగం డైరెక్టర్ డా.అఫ్సాన్ జబీన్, క్లినికల్ లీడ్ డా.చైతన్య కోడూరి తదితరులు పాల్గొన్నారు.

హిందీ ప్రచారసభ కేలండర్ ఆవిష్కరణ



హిందీ ప్రచార సభ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

కాచిగూడ: హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాజ్‌భవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనను హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ ఎస్.గైబువల్లి, అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్‌తో కూడిన ప్రతినిధుల బృందం శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ హిందీ ప్రచార సభ హైదరాబాద్ ద్వారా నిర్వహిస్తూ దేశ అధికార భాష హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో జె.వెంకటరామ్ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ సురేష్ పురీ, ఆర్.బిచ్చయ్య, శృతికాంత్ భారతి, వెంకటేష్, నామ్‌దేవ్, శివలింగం, కె.రామచందర్, ఏకే రాజు పాల్గొన్నారు.

అపోలో, లీసెస్టర్ విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం



సాక్షి, సిటీబ్యూరో: దీర్ఘకాల, తీవ్ర ఆరోగ్య సమస్యలను పరిస్థితులకు తగినట్లు అంచనా వేయడం, రోగనిర్ధారణ, నిర్వహణను మెరుగుపర్చడం ద్వారా ఆరోగ్య సంరక్షణ డెలివరీని మార్చాలని కోరుకుంటున్నామని అపోలో ఆస్పత్రుల వ్యవస్థాపక చైర్మన్ సి.ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసిన్ ఏర్పాటు చేయడానికి లీసెస్టర్ విశ్వవిద్యాలయంతో చిత్తూరులో అపోలో క్యాంప్‌లో భాగస్వామ్యం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన పరిశోధనా కేంద్రం రెండు సంస్థల నైపుణ్యం వనరులను ఒకే చోటుకు తీసుకురానుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంరక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. సీడీహెచ్‌పీఎంతో ప్రపంచవ్యాప్తంగా రోగులకు ప్రయోజనం చేకూరుస్తాయని పేర్కొన్నారు. లీసెస్టర్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించినందుకు సంతోషంగా ఉందని వివరించారు. లీసెస్టర్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిషాన్ కనగరాజా మాట్లాడుతూ ఈ కేంద్రం భవిష్యత్ ఆరోగ్యాన్ని సంరక్షిస్తుందన్నారు.

పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



పంజగుట్ట: కర్నాటక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 2025– 26 సంవత్సరానికి వివిధ పీజీ కోర్సులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లింగమూర్తి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ సురేష్, డాక్టర్ వి.గోవింద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేవలం హైదరాబాద్ నుంచి 230 కిలోమీటర్ల దూరంలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు ఎంతో సమీపంలో ఇక్కడి వాతావరణంలోనే తమ 654 ఎకరాల సువిశాలమైన యూనివర్సిటీ ఉందని వారు పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం దేశవ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ పరీక్షను నిర్వహిస్తోందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు వచ్చేనెల 2వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షలు ఎంట్రెన్స్ పరీక్షలు మార్చి 13 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్సు పూర్తికాగానే 100 శాతం ప్లేస్‌మెంట్‌తో విద్యార్థులు బయటకు వెళ్తారని తెలిపారు. త్వరలోనే గ్రాడ్యుయేట్ కోర్సులకు, పీహెచ్‌డీకి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు అత్యాధునిక ల్యాబ్ సౌకర్యం, పీహెచ్‌డీ చేసేందుకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంచాలి



మాట్లాడుతున్న దేశ్‌పాండే

పంజగుట్ట: 29 ఏళ్లుగా పెన్షన్ పెరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని, కేంద్ర ప్రభుత్వం చొరవచూపి పెన్షన్ పెంచాలని ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.ఎమ్.దేశ్‌పాండే తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌సీ.జైన్‌తో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులకు 1995 నుంచి పెన్షన్ సౌకర్యం కల్పించారని, కానీ 29 ఏళ్లుగా ఉద్యోగ విరమణ చేసిన వారి బేసిక్ పెన్షన్‌లో ఎటువంటి పెరుగుదల లేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, కేంద్రమంత్రులకు వినతి పత్రాలు అందజేశామని గుర్తుచేశారు. వెంటనే తమకు పెన్షన్ పెంచడంతో పాటు ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు లక్డీకాపూల్ అశోకా హోటల్‌లో సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు, వివిధ రాష్ట్రాల నుంచి 170 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. సమావేశంలో ప్రతినిధులు విశ్వనాథ్ నాయక్, ఆర్.లక్ష్మణ్‌రావు, ఎమ్.ఎన్.రావు, కృష్ణమూర్తి, ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

మానసిక వ్యాధుల పట్ల చైతన్యం తీసుకురావాలి

తెలంగాణ స్టేట్ ఎలక్షన్ మాజీ కమిషనర్ పార్థసారథి

శ్రీనగర్‌కాలనీ: మానసిక ఆరోగ్యం, మానసిక వ్యాధుల పట్ల చైతన్యం రావాలని, మానసిక వ్యాధి నివారణకు కలిసికట్టుగా ముందుకు సాగాలని, వైద్యులు, మీడియా మరింత అవగాహన కల్పించి మార్పు తీసుకురావాలని మాజీ ఐఏఎస్ అధికారి, తెలంగాణ స్టేట్ ఎలక్షన్ మాజీ కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ హైదరాబాద్ అలుమ్నీ అసోషియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఎండోమెంట్ ఒరే షన్ అవార్డు ప్రదానోత్సవం, మీడియా రోల్ ఇన్ క్రియేటింగ్ అవేర్‌నెస్ ఇన్ పబ్లిక్ ఆన్ మెంటల్ హెల్త్‌పై సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఎండోమెంట్ ఒరేషన్ అవార్డును సీనియర్ జర్నలిస్ట్, మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా మేనేజింగ్ ట్రస్టీ, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్‌కు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఐఏఎస్ అధికారి పార్థసారథి మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలి ద్వారా మానసిక సమస్యలు అధికమవుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 15శాతం మానసిక సమస్యలతో బాధపడుతుండటం ఆందోళన కలిగించే అంశం అన్నారు. మానసిక రుగ్మతలను తగ్గించడానికి సైకాలజీ, సైక్రాటరీ, న్యూరాలజీ కలికట్టుగా ముందుకు సాగాలన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ మానసిక వ్యాధుల పట్ల అపోహలు తొలగించి, అవగాహన కార్యక్రమాలను చేపట్టడంలో మీడియా ముందుకు సాగాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయల, అసోషియేషన్ సెక్రటరీ డాక్టర్ హృషికేష్‌గిరి ప్రసాద్, ట్రెజరర్ డాక్టర్ శివఅనూప్, డాక్టర్ సుధాకర్‌రావు, డాక్టర్ ఉమాశంకర్ పాల్గొన్నారు.



డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఒరేషన్ అవార్డు అందుకుంటున్న దేవులపల్లి అమర్

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి


లక్డీకాపూల్: ప్రజల నుంచి వచ్చిన విన్నపాలకు ప్రాధాన్యత ఇచ్చి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డితో కలిసి కమిషనర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఆయా విభాగాల అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం అనంతరం సంబంధిత అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మొత్తం 55 అర్జీలు, ఆరు జోన్ల నుంచి 108 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, రఘు ప్రసాద్, అశోక్ సామ్రాట్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 21, జనవరి, 2025

దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం 1990లో, దేశంలో తన మొదటి కార్యకలాపాలను ప్రారంభించింది. నాటి నుండి విండోస్ సృష్టికర్త, టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ దేశంలో తన పాదముద్రను వేగంగా విస్తరిస్తోంది. నగరంతో పాటు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్, ఢిల్లీ, నోయిడా, కోల్‌కతా, ముంబై, పూణేతో సహా 10 నగరాల్లో ఉన్నప్పటికీ.. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో దాదాపుగా సగం మంది నగరంలోనే ఉండడం గమనార్హం. ఐటీ ఉద్యోగాలు, కార్యకలాపాలపైనే ఈ కథనం..

- సాక్షి,సిటీబ్యూరో





సాఫ్ట్ కార్నర్..

సాఫ్ట్‌వేర్.. కేరాఫ్ హైదరాబాద్..

- నగరంలో విస్తరిస్తున్న మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు
- దేశంలోని మిగిలిన సిటీల కన్నా మన దగ్గరే అధికం
- అతిపెద్ద ఆర్ అండ్ డీ సెంటర్ సహా మరెన్నో ఏర్పాటు
- త్వరలోనే నగరానికి సమీపంలో ఏఐ డేటా సెంటర్





ఉద్యోగుల సంఖ్యలో మాత్రమే కాదు, హైదరాబాద్ చాలా కాలంగా మైక్రోసాఫ్ట్ ఇష్టపడే నగరంగా ముందంజలో ఉంది. నగరంలో మైక్రోసాఫ్ట్ ప్రయాణం 1998లో ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ (ఐడీసీ) స్థాపనతో ప్రారంభమైంది. ప్రస్తుతం అమెరికాకు ఆవల మైక్రోసాఫ్ట్‌కి ఉన్న అతిపెద్ద ఆర్ అండ్ డీ కేంద్రం ఏదంటే.. అది 54 ఎకరాలలో విస్తరించిన ఐడీసీ హైదరాబాద్ మాత్రమే.

అడ్వాంటేజ్ తెలంగాణ ఒప్పందం..

తెలంగాణ ప్రభుత్వం మైక్రోసాఫ్ట్ గత ఏడాది జరిగిన తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో అడ్వాంటేజ్ తెలంగాణను ప్రారంభిస్తూ అవగాహనా ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ప్రోగ్రామ్ 2025 నాటికి 20 లక్షల మందికి ఏఐ నైపుణ్యాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తన విస్తరణ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లేందుకు భారత పర్యటనలో భాగంగా ఇటీవలే హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన, జనరేటివ్ ఏఐ, క్లౌడ్ డెవలప్‌మెంట్‌తో సహా రాష్ట్ర సాంకేతిక ప్రాధాన్యతలపై చర్చించారు. ఏడాది వ్యవధిలో భారత్‌కు ఆయన రావడం ఇది వరుసగా రెండోసారి. దేశంలోని మొదటి మైక్రోసాఫ్ట్ తన ఓపెన్ ఏఐ కార్యాలయాన్ని కూడా నగరంలోనే ఏర్పాటు చేయవచ్చని భావిస్తున్నారు.

మేకగూడలోనూ మైక్రోసాఫ్ట్..

మైక్రోసాఫ్ట్ తన మౌలిక సదుపాయాలను విస్తరించడానికి నగరాన్ని కేంద్రంగా మార్చుకుంది. దేశంలో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్‌లను నిర్మించడానికి మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఇటీవల నగరానికి సమీపంలోని మేకగూడలో 181.25 కోట్లతో 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. గత సంవత్సరం, కూడా నగరంలో దాదాపు 267 కోట్ల రూపాయలతో 48 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ ప్రదేశాల్లో కొత్త డేటా సెంటర్‌ను అభివృద్ధి చేయాలని కంపెనీ యోచిస్తోంది.

అనుకూల వాతావరణం..

మైక్రోసాఫ్ట్ ఇప్పటికే నగరంలో, పూణెలో నిర్వహిస్తున్న రెండు డేటా సెంటర్లలో ప్రస్తుతం 90 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2026 చివరి నాటికి ఈ సంఖ్య 289 మంది కావచ్చని సమాచారం. 'హైదరాబాద్, పూణేలలో ఐటీకి మంచి మౌలిక సదుపాయాలు, అనుకూలమైన విధాన వాతావరణాలు ఉన్నాయి. అలాగే డేటా సెంటర్ పెట్టుబడులకు అనువుగా ఉండే టాలెంట్ కారిడార్‌లకు ఇవి సమీపంలో ఉన్నాయి' అని అనరాక్‌లోని ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ డేటా సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవి శంకర్ అంటున్నారు. ఇటీవలి తన భారత పర్యటన సందర్భంగా, మైక్రోసాఫ్ట్ ఏఐ చీఫ్ ముస్తఫా సులేమాన్ బెంగళూరు హైదరాబాద్ కార్యకలాపాలు తమ కంపెనీకి బలం అని పేర్కొన్నారు.





పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం

హాజరైన క్రీడాకారులు సైనా నెహ్వాల్, కశ్యప్

క్రీడలతో పని ఒత్తిడిని అధిగమించొచ్చు : నగర సీపీ సీవీ ఆనంద్

ఉల్లాసం.. ఉత్సాహం..

గన్‌ఫౌండ్రీ: క్రీడలు శారీరక ధారుఢ్యంతో పనిఒత్తిడిని అధిగమించి ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో నగర పోలీస్ కమిషనరేట్ స్పోర్ట్స్ మీట్‌ను బాడ్మింటన్ క్రీడారులు సైనా నెహ్వాల్, కశ్యప్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకాశంలోని పావురాలను, బెలూన్లను ఎగరవేశారు. అనంతరం సీవీ ఆనంద్ మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల సమయం వృథా అవుతుందని అనుకోవద్దని, దీని వల్ల పోలీసులకు మోటివేషన్‌తో పాటు అంతర్లీనంగా దాగివున్న నైపుణ్యాలు బహిర్గతమవుతాయని అన్నారు. తాను కూడా ఒక క్రీడాకారుడినేనని, క్రికెట్ ఆడితే సెంచరి చేయాలి, పరుగు పందెం ఆడితే 100 మీటర్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలి అనే పట్టుదలతో ఆడేవాడినన్నారు.

నాలుగు రోజుల పాటు..

నగర పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రతి సంవత్సరం ఆనవాయితిగా నిర్వహించాలని సూచించారు. 2025లో 24 రకాల క్రీడలు, ఆటలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మీట్‌లో 14 జట్లు పాల్గొనడం ఇదే మొదటిసారి. నాలుగు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు, ప్రతిభ కనబరిచిన క్రీడాకరులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంట్టారని వెల్లడించారు. పలువురు క్రీడాకారులను అభినందించారు.

క్రీడలతో ఆరోగ్యం..

ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని, దీని వల్ల ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ కలుగుతుందని భారత బాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ అన్నారు. స్వతహాగా తనకు ఆటలు అంటే చాలా ఇష్టమని భారతదేశం తరపున ఆడినప్పుడు ఎంతో గర్వంగా ఉంటుందని తెలిపారు. మన దేశంలో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు. బాడ్మింటన్ క్రీడాకారుడు కశ్యప్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం చాలా టఫ్ అని, ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌పై శ్రద్ధ చూపాలని సూచించారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ పి విశ్వప్రసాద్, సీఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తితో పాటు పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





25న నగరంలో

బూమ్ బాక్స్ ఫెస్ట్..

సాక్షి, సిటీబ్యూరో: సమకాలీన హిప్-హాప్ బీట్స్‌తో బాలీవుడ్‌లో ప్రసిద్ధి చెందిన శ్రావ్యమైన పాటల్ని మిశ్రమం చేసి సంగీత విందు అందించే మ్యూజిక్ ఫెస్టివల్ 'సీగ్రమ్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్' నగరానికి రానుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ స్థాయి కార్యక్రమం హైదరాబాద్, ముంబయి, గురుగ్రామ్, గౌహతిలో జరుగనుందని, గేమింగ్ కూడా ఇందులో భాగంగా ఉంటుందని వివరించారు. ఈ సంగీతోత్సవంలో గాయకుడు అర్మాన్ మాలిక్, అమిత్ త్రివేది, నికితా గాంధీ, నీతీ మోహన్, ప్రముఖ రాప్తార్‌లతో పాటు స్థానిక కళాకారులు పాల్గొంటారన్నారు.





అభాగ్యులకు అండగా..
రెడీ టూ సర్వ్..

అయినవారు ఉండీ బాగోగులు చూసేవారు లేక అనాథలుగా మారుతున్న వృద్ధులు కొందరు. ఆర్థిక ఇబ్బందులతో కన్నవారిని సాకలేక రోడ్డుపై వదిలేస్తున్నవారు మరికొందరు.. ఇలా అనేకమంది అనాథలుగా మారుతున్నారు. అలాంటి వారిని చేరదీసి, అక్కున చేర్చుకుని వారి బాగోగులు చూస్తూ, వారికి వైద్యసేవలు అందిస్తూ ముందుకు సాగుతోంది 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్. అంతేకాకుండా రోగుల కోసం పలు ఆస్పత్రుల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ గురించి మరిన్ని వివరాలు.. - వనస్థలిపురం

→ వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ

→ పౌండేషన్ ద్వారా రోగులు, పేదల ఆకలి తీరుస్తూ

→ అవసరమైన వారికి ఆక్సీజన్ మిషన్లు, బెడ్లు, వీల్‌చైర్స్ వెసులుబాటు

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గార్లకుంటపాలేనికి చెందిన పెద్ది శంకర్ గౌడ్ చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయాడు. డిగ్రీ వరకూ చదువుకుని నగరంలో ఓ ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరాడు. అప్పుడే ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకుల ఇబ్బందులు గమనించి 2011లో 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ ఏర్పాటుచేసి, ఆ పేరున వారికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ప్రతి ఆదివారం ఒక్కో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వందలాది మంది రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేస్తున్నారు.



వంద రోజులు.. వంద మందికి..

ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి, వనస్థలిపురం ప్రాంతాల్లో ఆస్పత్రుల వద్ద ఇప్పటికే పలుమార్లు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఎల్‌బీనగర్ చౌరస్తాలో ఇటీవల 100 రోజులపాటు రోజు 100 మందికి అల్పాహారం అందించారు. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓల్డ్ ఏజ్ హోం.. నిర్వహిస్తున్నారు. రెండున్నర ఏళ్ల క్రితం వనస్థలిపురం వనస్థలిహిల్స్ కాలనీలో ఓల్డేజి హోంను ఏర్పాటు చేశాడు. ఒకరిద్దరితో ప్రారంభమైన హోంలో నేడు 24 మంది వృద్ధులను అక్కున చేర్చుకుంది.

నెలకోసారి వైద్య పరీక్షలు..

హోమ్ లోని వృద్ధులకు కామినేని ఆస్పత్రి సహకారంతో నెలకోసారి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ముత్తూట్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు తరచూ బీపీ, షుగర్ పరీక్షలు చేయిస్తున్నారు. దీంతోపాటు అవసరమైన వారికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్, వీల్ చైర్స్, ఐసీయు బెడ్స్, వాకర్స్ ఉచితంగా ఇస్తున్నారు. అవసరం తీరిన తర్వాత వాటిని తిరిగి ఫౌండేషన్‌కు అప్పగించాల్సి ఉంటుంది. వెసులుబాటు ఉన్న వారు ఫౌండేషన్‌కు డొనేషన్ ఇవ్వవచ్చు.

మరింత సహకారం అవసరం..

నర్సింగ్ కేర్, కేర్ టేకర్, ఫిజియోథెరఫీ సేవలు అందిస్తున్నాం. వాటి ద్వారా వచ్చే డబ్బు, దాతల విరాళాలతో ఓల్డేజీ హోం నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం హోమ్‌లో 24 మంది ఉన్నారు. నెలకు సుమారు రూ. 50 వేల ఖర్చు అవుతోంది. ప్రస్తుతం ఉన్న ఇల్లు సరిపోవడం లేదు. సేవలను విస్తరించేందుకు దాతల కోసం చూస్తున్నాం. ప్రభుత్వం సహకారం అందిస్తే మరింత మందికి తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. వివరాలకు 8790815527లో సంప్రదించవచ్చు.



- పెద్ది శంకర్‌గౌడ్, ఓల్డేజ్ హోం నిర్వాహకుడు

కృష్ణా జలాలు ఎవరికెంత?

నేడు జలసౌధలో కృష్ణా బోర్డు కీలక సమావేశం.. పాల్గొననున్న ఏపీ, తెలంగాణ అధికారులు

- ఎజెండాలో కృష్ణా జలాల తాత్కాలిక పంపిణీ, పలు ఇతర అంశాలు
- అపెక్స్ కౌన్సిల్ నీటి పంపకాల జోలికి వెళ్లదన్న కేంద్ర జలశక్తి శాఖ
- మళ్లీ కృష్ణా బోర్డు ముందుకే జలాల తాత్కాలిక పంపిణీ అంశం
- నాగార్జున సాగర్ నిర్వహణ, గోదావరి–బనకచర్ల అనుసంధానంపై వాడీవేడీ చర్చకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల తాత్కాలిక పంపిణీపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) మంగళవారం చర్చించనుంది. ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో బోర్డు కీలక సమావేశం నిర్వహిస్తోంది. ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల జోలికి అపెక్స్ కౌన్సిల్ వెళ్లదని కేంద్ర జలశక్తి శాఖ ఇటీవల తేల్చిచెప్పిన నేపథ్యంలో... కృష్ణా జలాల తాత్కాలిక సర్దుబాటుపై కృష్ణా బోర్డు నిర్ణయమే అనివార్యంగా మారింది.



తెలంగాణ అభ్యంతరాలతో..

కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల వాటా ఉండగా.. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర జలశక్తిశాఖ తాత్కాలిక సర్దుబాటుగా 66:34 నిష్పత్తిలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను కేటాయించింది. ఇది 2021–22 వరకు కొనసాగింది. అయితే 2023 మే 23న జరిగిన కృష్ణా బోర్డు సమావేశంలో దీనిపై తెలంగాణ అభ్యంతరం తెలిపింది. 50:50 నిష్పత్తిలో తాత్కాలిక పంపిణీ జరపాలని డిమాండ్ చేసింది. మరోవైపు 66:34 నిష్పత్తినే కొనసాగించాలని ఏపీ పట్టుబట్టింది. దీనితో ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర జలశక్తి శాఖ పరిధిలోని అపెక్స్ కౌన్సిల్‌కు విజ్ఞప్తి చేస్తూ అప్పట్లో కృష్ణాబోర్డు నిర్ణయం తీసుకుంది. ఈలోగా రెండు రాష్ట్రాల అవసరాలను, కృష్ణా జలాల లభ్యతను ఎప్పటికప్పుడు చర్చించి, కేటాయింపులు చేసే బాధ్యతను త్రిసభ్య కమిటీకి అప్పగించింది. కానీ జలాల పంపిణీ అంశంలో అపెక్స్ కౌన్సిల్ జోక్యం చేసుకోబోదని కేంద్రం స్పష్టం చేయడంతో.. ఈ అంశం మళ్లీ కృష్ణా బోర్డు పరిధిలోకి వచ్చింది. బోర్డు చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన సోమవారం ఉదయం జరిగే 19వ బోర్డు సమావేశంలో నీటి వాటాలపై రెండు రాష్ట్రాల మధ్య వాడీవేడిగా చర్చలు జరిగే అవకాశం ఉంది. తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ జి.అనిల్‌కుమార్, ఏపీ తరఫున జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు, బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే తదితరులు పాల్గొననున్నారు.

'బనకచర్ల'పై తెలంగాణ అభ్యంతరాలు

ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై కృష్ణాబోర్డు సమావేశంలో తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్–బొల్లపల్లి రిజర్వాయర్లను అనుసంధానం చేస్తామని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించడాన్ని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కృష్ణా బోర్డును కోరనుంది.

ఎజెండాలో కృష్ణాబోర్డు ప్రతిపాదించిన అంశాలివీ..

- కృష్ణా బోర్డు కార్యాలయం ఏపీకి తరలించే అంశంపై నిర్ణయం తీసుకోవాలి.
- కేంద్ర గెజిట్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ కృష్ణా బోర్డుకు అప్పగించాలి.
- ఇరు రాష్ట్రాల్లోని అనధికార ప్రాజెక్టులకు అనుమతులు తీసుకోవడానికి గెజిట్ నోటిఫికేషన్‌లో కేంద్రం విధించిన గడువు ముగియడంతో ఆ ప్రాజెక్టులకు నీటి విడుదలపై చర్చించాలి.
- రెండో విడతలో 9 టెలీమెట్రీ స్టేషన్ల ఏర్పాటు కోసం ఇరు రాష్ట్రాలు నిధులు కేటాయించాలి.

ఎజెండాలో తెలంగాణ ప్రతిపాదనలు..

- ఆనకట్టల భద్రత చట్టం–2021 ప్రకారం నాగార్జున సాగర్ నిర్వహణ, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలు తెలంగాణ పరిధిలోకే వస్తాయి. రాష్ట్ర విభజన నాటి నుంచి సాగర్ డ్యామ్, కుడి, ఎడమ కాల్వల రెగ్యులేటర్ల నిర్వహణ, పర్యవేక్షణ తెలంగాణ చేతిలో ఉండగా... 2023 నవంబర్ 28న ఏపీ సగం డ్యామ్‌ను తన అధీనంలోకి తీసుకుంది. ఇది సరికాదు. మొత్తం తెలంగాణకే అప్పగించాలి.
- తెలంగాణ వాడుకోకపోవడంతో నాగార్జునసాగర్‌లో మిగిలిపోయిన వాటా జలాలను తదుపరి నీటి సంవత్సరంలో వాడుకోవడానికి అనుమతించాలి.
- సాగర్ టెయిల్‌పాండ్ డ్యామ్ గేట్ల నిర్వహణను తెలంగాణకే అప్పగించాలి.
- ఆర్డీఎస్ ఆనకట్ట ఆధునీకరణకు ఏపీ అడ్డుకోకుండా సహకరించాలి. ఆర్డీఎస్ కుడికాల్వ పనులను ఏపీ చేపట్టరాదు.
- ఏపీ నీటి వినియోగాన్ని కచ్చితంగా లెక్కించడానికి శ్రీశైలం, సాగర్, ప్రకాశం, సుంకేశుల బరాజ్‌ల వద్ద టెలిమెట్రీ స్టేషన్లను ఏర్పాటు చేయాలి.
- కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు ప్రకారం తాగునీటి అవసరాల కోసం తీసుకున్న జలాల్లో 20శాతాన్నే లెక్కించాలి.
- రాయలసీమ ఎత్తిపోతలతో సహా అనుమతుల్లేకుండా కృష్ణా బేసిన్‌లో ఏపీ చేపడుతున్న ఇతర ప్రాజెక్టులు, ఎస్ఆర్ఎంసీ కాల్వ లైనింగ్ పనులను నిలుపుదల చేయాలి.
- శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు, ఎస్ఆర్బీసీ, జీఎన్ఎస్ఎస్, తెలుగు గంగ, హెచ్ఎన్ఎస్ఎస్, నిప్పులవాగు ఎస్కేప్ చానల్ ఇతర మార్గాల ద్వారా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ కృష్ణా జలాలు తరలించకుండా నిలువరించాలి.
- ఏపీ పరిధిలో శ్రీశైలం జలాశయం ప్లంజ్ పూల్‌కు అత్యవసర మరమ్మతులు నిర్వహించాలి.

ఏపీ ప్రతిపాదించిన అంశాలు..

- శ్రీశైలం, నాగార్జునసాగర్, ఇతర ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించే వరకు సాగర్ కుడికాల్వ వద్ద సీఆర్పీఎఫ్ బలగాలను ఉపసంహరించుకోవాలి.
- నీటి కేటాయింపులు లేకుండా తెలంగాణ చేపట్టిన సుంకిశాల ఇన్‌టెక్ వెల్ నిర్మాణాన్ని ఆపాలి.
- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను ఏపీకి అందించాలి.
- పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తే.. ప్రత్యామ్నాయంగా సాగర్ ఎగువన ఉమ్మడి ఏపీకి లభ్యతలోకి వచ్చిన 45 టీఎంసీలను తెలంగాణ పాలమూరు–రంగారెడ్డికి కేటాయించింది. కానీ వాటిపై తెలంగాణకు ఎలాంటి హక్కులు లేవు.
- కల్వకుర్తి లిఫ్టు ద్వారా అదనంగా 15 టీఎంసీల తరలింపు పనులకు గెజిట్ నోటిఫికేషన్‌లో అనుమతుల నుంచి మినహాయింపు కల్పించడం సరికాదు.
- నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు ఏపీ, తెలంగాణ సరిహద్దుల వద్ద తగిన నీటి సరఫరా జరగడం లేదు.
- అనుమతులు లేకుండా తెలంగాణ చేపట్టిన అచ్చంపేట, నారాయణపేట–కొడంగల్ లిఫ్టు పనులను నిలువరించాలి.

తగ్గిన ఉష్ణోగ్రతలు

- సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ పతనం
- రానున్న మూడురోజులు మరింత తగ్గే అవకాశం


చలి మంటలు కాచుకుంటున్న ప్రజలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. గతవారం వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో నమోదు కాగా, ప్రస్తుతం 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత మహబూబ్‌నగర్‌లో 34 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 8.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అత్యంత తక్కువగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 6.5 డిగ్రీలసెల్సియస్‌గా నమోదైంది. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణశాఖ తెలిపింది. రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరిగింది. ఉదయం పూట చాలాచోట్ల పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

అత్యంత తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు (సెల్సియస్‌లలో)

జిల్లా	ప్రాంతం	కనిష్ట ఉష్ణోగ్రత
ఆసిఫాబాద్	సిర్పూర్	6.5
ఆదిలాబాద్	బేలా	8.0
సంగారెడ్డి	కోహీర్	8.9
నిర్మల్	పెంబి	9.3
రంగారెడ్డి	మొయినాబాద్	9.4

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	31.3	8.7
భద్రాచలం	31.8	17.4
దుండిగల్	31.5	15.0
హకీంపేట్	31.6	15.4
హనుమకొండ	29.0	13.5
హైదరాబాద్	31.8	15.0
ఖమ్మం	33.2	18.0
మహబూబ్‌నగర్	34.0	19.0
మెదక్	30.8	12.6
నల్లగొండ	28.5	16.0
నిజామాబాద్	32.0	15.1
రామగుండం	30.6	12.6

జహీరాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రతల నమోదు

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్‌లో 8.9, న్యాల్‌కల్‌లో 10.2, జహీరాబాద్‌లో 9.9, మొగుడంపల్లి 10.9 ఝరాసంగంలో 11.1 డిగ్రీల సెల్సియస్ చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మోహన్ భగవత్, అమిత్ షాలపై కేసులు నమోదు చేయాలి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో రాముడి గుడి కట్టినప్పుడే నిజమైన స్వాతంత్య్రం వచ్చిందన్న ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్‌పై కేసు ఎందుకు పెట్టలేదని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ప్రశ్నించారు. సోమవా రం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడిన మోహన్ భగవత్‌పై అంబర్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అదేవిధంగా పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షాపై కేసు ఎందుకు పెట్టలేదని వీహెచ్ నిలదీశారు. దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని వదిలేసి, వ్యవస్థలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ అధీనంలో ఉన్నాయన్న ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీపై కేసు పెట్టడం అన్యాయమని వీహెచ్ ఆవేదన వ్యక్తం చేశారు.


తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం కేలండర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం కేలండర్‌ను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మోహన్ నారాయణ, నర్సరాజు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సమస్యలు పరిష్కరించాలని మంత్రిని సంఘం నేతలు కోరారు.



ఆ ఎగుమతులు డీలా

మనదేశ వృద్ధి 2030 వరకు ఇలాగే కొనసాగాలంటే ఏటా 78.5 లక్షల ఉద్యోగాల కల్పన జరగాలి... గతేడాది ఆర్థిక సర్వే కీలక సూచన ఇది. కానీ, అది అంత సులభం కాదు. అత్యధిక కార్మికులు అవసరమయ్యే కొన్ని కీలక రంగాలకు ఉద్యోగాల కల్పనే ఆక్సిజన్ లాంటిది. అది సరిగ్గా లేకనే జౌళి, రత్నాభరణాలు, సముద్ర ఉత్పత్తులు, లెదర్ ఉత్పత్తులు వంటి రంగాల్లో ఎగుమతులు గతంతో పోలిస్తే తగ్గాయి. గత 5 ఏళ్లలో మనదేశ మొత్తం ఎగుమతులు 32 శాతం పెరిగితే, ఈ 4 రంగాలవి మాత్రం 11 శాతం తగ్గాయి.



డిమాండ్ వారిదే.. వారించేదీ వారే

లోకేశ్ 'డిప్యూటీ' కాదు.. కాబోయే సీఎం!
దావోస్‌లో చంద్రబాబు ఎదుటే మంత్రి భరత్ వ్యాఖ్య
టీడీపీ పెద్దల డ్రామాపై జనసేన శ్రేణుల మండిపాటు



సాక్షి, అమరావతి: మంత్రి నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎంగా ప్రమోషన్ ఇవ్వాలంటూ టీడీపీ నేతలు చేసిన హడావుడితో కూటమిలో కాక రేగడంతో సీఎం చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారు. ఇకపై ఈ విషయం గురించి మాట్లాడొద్దంటూ దావోస్ నుంచి పార్టీ నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. స్వయంగా తన సమక్షంలోనే పార్టీ నేతలు ఈ డిమాండ్ చేసినప్పుడు స్పందించని సీఎం చంద్రబాబు... రాజకీయంగా నష్టం జరిగే పరిస్థితి ఉండడంతో దావోస్ నుంచి స్పందించడం గమనార్హం. మరోవైపు ఇదే వేదికగా మంత్రి టీజీ భరత్ మరో అడుగు ముందుకు వేసి కాబోయే సీఎం లోకేశేనని తాజాగా వ్యాఖ్యానించడం టీడీపీ పెద్దల రెండు నాలుకల ధోరణికి నిదర్శనంగా నిలుస్తోంది.

డిప్యూటీ కాదు.. కాబోయే సీఎం

టీడీపీ పెద్దల రాజకీయాలు కూటమి పార్టీల్లో రక్తి కట్టిస్తున్నాయి. డిమాండ్ చేసేదీ.. వార్నింగ్‌లు ఇచ్చేదీ పచ్చ నేతలేనని జనసేన నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. లోకేశ్‌ని డిప్యూటీ సీఎంగా చేయాలని గత నాలుగు రోజులుగా టీడీపీ నేతలు పోటీలు పడి ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. మైదుకూరులో ఎన్టీఆర్ వర్ధంతి సభలో మొదలైన ఈ డిమాండ్ల పర్వం... తాజాగా దావోస్‌కి చేరింది. కాబోయే ముఖ్యమంత్రి నారా లోకేశేనని జ్యూరిక్‌లో జరిగిన తెలుగు పారిశ్రామికవేత్తల సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రకటించేశారు. లోకేశ్‌ని డిప్యూటీ సీఎంగా చేయాలని రాష్ట్రంలో టీడీపీ నేతలు హోరెత్తిస్తుంటే టీజీ భరత్ దావోస్ వెళ్లి ఏకంగా కాబోయే సీఎం అని ప్రకటించడంతో కూటమిలో రాజకీయాలు రంజుగా మారాయి. చంద్రబాబు సమక్షంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేయటాన్ని బట్టి ఇదంతా టీడీపీ పెద్దలు ఆడుతున్న డ్రామాగా స్పష్టమవుతోంది.

స్పందన తెలుసుకునేందుకే..

లోకేశ్‌ను డిప్యూటీ సీఎంగా చేయాలని మైదుకూరులో ఎన్టీఆర్ వర్ధంతి సభ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి... సీఎం చంద్రబాబు ఎదుటే డిమాండ్ చేశారు. ఆ తర్వాత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు ఇదే పల్లవి వినిపించారు. ఎల్లో మీడియా, సోషల్ మీడియాలో ఈ అంశం హోరెత్తుతున్నా చంద్రబాబు పట్టించుకోలేదు. తనయుడికి ప్రమోషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న చంద్రబాబు కూటమిలో నేతల స్పందన తెలుసుకునేందుకే తన పార్టీ నేతలతో డిమాండ్లు చేయించినట్లు తెలుస్తోంది. అయితే జనసేన నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, కూటమిలో చిచ్చు రగిలే పరిస్థితి కనిపించడంతో ఒక్కసారిగా రూటు మార్చారు.

జన సైనికులు 'రివర్స్'..



టీడీపీ నేతల డిమాండ్లపై జనసేనకు చెందిన పలువురు నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకు పడుతున్నారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన విశ్వం రాయల్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు తమ నేత పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చేయాలనే వాదన వినిపించారు. పవన్ సీఎం కావాలని తమకు కోరిక ఉన్నట్లు తిరుపతికి చెందిన జనసేన నాయకుడు కిరణ్ రాయల్ చెప్పారు. సోషల్ మీడియాలో ఇది రెండు పార్టీల మధ్య పెద్ద వార్‌గా మారిపోయింది. లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఏమిటని జనసేన మద్దతుదారులు సెటైర్లు వేస్తుంటే.. పవన్‌కి సీఎం పదవా? ఆయనకు అంత సీనుందా? అంటూ టీడీపీ నేతలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

ఫీజు కట్టలేదని విద్యార్థిని బయటకు గెంటేశారు

- శ్రీ చైతన్య కళాశాల నిర్వాకం

కంకిపాడు: ఫీజు కట్టలేదని విజయవాడ సమీపంలోని గోసాల శ్రీచైతన్య కళాశాల నుంచి యాజమాన్యం ఓ విద్యార్థిని అర్ధరాత్రి వేళ బయటకు పంపించేసింది. దీంతో ఆ విద్యార్థి, అతని తండ్రి కళాశాల గేటు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. మీడియాకు సమాచారం వెళ్లటంతో అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం విద్యార్థిని కళాశాలలోకి అనుమతించింది. బాధితుడి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు అబోతు టార్జాన్ కుమారుడు గౌతమ్ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. సంక్రాంతికి ఇంటికి వెళ్లిన గౌతమ్ ఆదివారం రాత్రి తన తండ్రితో కలసి కళాశాలకు వచ్చాడు. ఫీజు చెల్లిస్తేనే కళాశాలలోకి అనుమతిస్తామని కళాశాల సిబ్బంది చెప్పారు. టార్జాన్ తన వద్ద ఉన్న రూ 20 వేలు నగదును చెల్లించాడు. మిగిలిన రూ. 50 వేలు చెల్లించేందుకు కొంత సమయం ఇవ్వాలని బతిమలాడారు. అందుకు యాజమాన్యం ససేమిరా అని విద్యార్థిని కళాశాల నుంచి పంపించేసింది. దీంతో విద్యార్థి గౌతమ్, అతని తండ్రి టార్జాన్ అర్ధరాత్రి కళాశాల గేటు వద్దే నిరసన వ్యక్తం చేశారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఏప్రిల్‌లో పరీక్షలు ఉన్నాయని, ఆ లోపు ఫీజు చెల్లిస్తానని చెప్పినా యాజమాన్యం అంగీకరించలేదని వాపోయారు. నిర్దాక్షిణ్యంగా తమను బయటకు పంపించేశారని తెలిపారు. పోలీసులు కూడా కళాశాలకు చేరుకుని ఆరా తీశారు. దీంతో యాజమాన్యం విద్యార్థి, అతని తండ్రితో మాట్లాడి విద్యార్థిని కళాశాలలోకి అనుమతించింది.

మార్కెట్లోకి మళ్లీ కింగ్ ఫిషర్ బీర్లు!

- సరఫరాకు అంగీకరించిన యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ
- తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్‌తో చర్చలు జరుగుతున్నట్టు ప్రకటన
- బేసిక్ ధర పెంచడంతోపాటు బకాయిల చెల్లింపునకు హామీ వచ్చిందని వెల్లడి
- కొంతకాలం పాటు బీర్లు యథాతథంగా సరఫరా చేస్తామని వెల్లడి
- ఈ అంశంపై సచివాలయంలో సమావేశమైన ఎక్సైజ్ ఉన్నతాధికారులు
- మద్యం కంపెనీలకు ధరల పెంపు, కొత్త నోటిఫికేషన్ అంశాలపై చర్చ?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కింగ్ ఫిషర్ బ్రాండ్ బీర్ల సరఫరా తిరిగి కొనసాగనుంది. బీర్లను యథాతథంగా సరఫరా చేసేందుకు యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) సంస్థ అంగీకరించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ''తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే బీర్ల సరఫరాను పునరుద్ధరించాలని నిర్ణయించాం. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్)తో నిర్మాణాత్మక చర్చలు జరుగుతున్నాయి. మేం అడుగుతున్న విధంగా నిర్దీత కాల వ్యవధిలో ధరలను సవరించేందుకు, బకాయిలను చెల్లించేందుకు కార్పొరేషన్ హామీ ఇచ్చింది. ఈ క్రమంలో బీర్ వినియోగదారులు, మా సంస్థలో పనిచేసే కార్మికులు, ఇతర భాగస్వామ్య పక్షాల ప్రయోజనాల మేరకు కొంతకాలం వరకు బీర్లు సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్నాం''అని యూబీ కంపెనీ ప్రతినిధి నిఖిల్ మల్పాని బాంబే స్టాక్ ఎక్చేంజీ లిమిటెడ్‌కు సోమవారం రాసిన లేఖలో వెల్లడించారు. సోమవారం నుంచే యూబీ బ్రూవరీస్ నుంచి టీజీబీసీఎల్ డిపోలకు కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరా ప్రారంభమైంది.

తగ్గిపోయిన బీర్ల నిల్వలు

రాష్ట్రంలో అమ్ముడయ్యే బీర్లలో 70 శాతం యూబీ కంపెనీకి చెందినవే. ఈ నెల 8వ తేదీన ఆ కంపెనీ తీసుకున్న నిర్ణయం మేరకు.. కింగ్‌ఫిషర్, హెన్‌కీన్ బీర్ల సరఫరా నిలిచిపోయింది. అయితే అప్పటికే రాష్ట్రంలోని మద్యం డిపోల్లో సుమారు 11 లక్షల కేసుల కింగ్‌ఫిషర్ బీర్లు నిల్వ ఉన్నాయి. వాటితోపాటు ఇతర కంపెనీలు తయారు చేసే మరో ఏడు రకాల బ్రాండ్లు కలిపి మొత్తం 15 లక్షల కేసుల స్టాక్ ఉంది. అయితే యూబీ కంపెనీ నిర్ణయం నేపథ్యంలో బీర్ల కొరత రాకుండా ఎక్సైజ్ శాఖ జాగ్రత్త పడింది. టీజీబీసీఎల్ డిపోల నుంచి గత 12 రోజులుగా రేషన్ పద్ధతిలో బీర్లను మార్కెట్‌లోకి పంపింది. సంక్రాంతి పండుగ కూడా ఉండటంతో ఎక్కడా బీర్ల కొరత రాకుండా ఉండేలా చూసింది. అయినా ఆదివారం నాటికి బీర్ల నిల్వ లక్ష కేసులకు తగ్గిపోయింది. ఇంకో రెండు రోజులైతే రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడే అవకాశం ఉండేది. ఈలోగానే యూబీ కంపెనీ బీర్ల సరఫరా ప్రారంభించింది.

రేట్ల పెంపుపై ఏం చేద్దాం?

ఈ పరిణామాల నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై ఎక్సైజ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జరిగిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించేందుకు సోమవారం సచివాలయంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. మద్యం కంపెనీలు అడుగుతున్న విధంగా బేసిక్ ధరల పెంపు, సీఎం ఆదేశించిన మేరకు కొత్త కంపెనీల నుంచి మద్యం సరఫరా కోసం నోటిఫికేషన్ విడుదల తదితర అంశాలపై చర్చించినట్టు తెలిసింది.

'కింగ్ ఫిషర్'బీర్ల ఉత్పత్తి వేగవంతం!

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణలో బీర్ల సరఫరాను పునరుద్ధరించాలని నిర్ణయించిన యూబీ కంపెనీ వేగంగా బీర్ల ఉత్పత్తి చేపట్టింది. సంగారెడ్డి జిల్లాలో ఈ కంపెనీకి ఉన్న రెండు బీర్ ఫ్యాక్టరీల్లో సోమవారమే బీర్ల తయారీని మొదలుపెట్టింది. నిజానికి రాష్ట్రంలో బీర్ల సరఫరాను బట్టి రోజుకు సుమారు 15 లక్షల బాటిళ్ల బీర్ల ఉత్పత్తి జరుగుతోంది. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఇక్కడి నుంచి బీర్లు సరఫరా చేస్తుంది. అయితే తెలంగాణలో బీర్ల సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించిన సమయంలో.. ఈ రెండు ఫ్యాక్టరీల్లో లేఆఫ్‌ను ప్రకటించింది. ఉత్పత్తిని నిలిపివేస్తున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కార్మికశాఖకు లేఖ కూడా రాసింది. దీంతో ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న సుమారు 600 మంది ఉద్యోగులు, కార్మికులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల నేతలతో జిల్లా కలెక్టర్ క్రాంతి సోమవారం చర్చలు జరిపారు కూడా. అయితే బీర్ల సరఫరా పునరుద్ధరణకు నిర్ణయం తీసుకోవడంతో ఫ్యాక్టరీల్లో లేఆఫ్ ఎత్తివేశారు.

జగన్ కేసులతో మీకేం పని?

- రఘురామకృష్ణరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు
- ఆ కేసులను మరో రాష్ట్రానికి బదిలీ చేసే ప్రసక్తే లేదు
- ఎలా పడితే అలా ఆదేశాలు ఇవ్వలేం
- తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- తదుపరి విచారణ ఈ నెల 27కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసులతో మీకేం పనంటూ మాజీ ఎంపీ, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు సుప్రీం కోర్టు అక్షింతలు వేసింది. ఈ కేసుల విచారణను వేరే రాష్ట్రానికి బదలాయించాలన్న ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. ఆ కేసులను మరో రాష్ట్రానికి బదలాయించే ప్రసక్తే లేదని, మహా అయితే ఈ కేసుల్లో విచారణను వేగవంతం చేయాలని కింది కోర్టుకు చెప్పగలమని స్పష్టం చేసింది. అంతే తప్ప ఎలా పడితే అలా ఆదేశాలు ఇవ్వలేమంది. జగన్ బెయిల్ రద్దు చేయాలని రఘురామకృష్ణరాజు కోరుతున్న నేపథ్యంలో, అసలు ఆ కేసులతో మీకేం సంబంధమని ఆయన్ని నిలదీసింది. వాదనలు వినిపించేందుకు సీబీఐ గడువు కోరడంతో విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రఘురామకృష్ణరాజుకు ప్రత్యేక కోర్టు, హైకోర్టుల్లో చుక్కెదురు..

జగన్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి సీబీఐ, ఈడీ పలువురిపై కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో జగన్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. జగన్‌పై నమోదైన కేసుల్లో సీబీఐ ప్రత్యేక కోర్టు విచారణ కొనసాగిస్తోంది. ఇదిలా ఉండగా, జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ రఘురామకృష్ణరాజు సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని ఆ కోర్టు కొట్టేసింది. ఆ తరువాత హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టులో సైతం రఘురామకృష్ణరాజుకు చుక్కెదురైంది. దీంతో జగన్ బెయిల్‌ను రద్దు చేయడంతో పాటు, ఆయనపై నమోదైన కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ ఆయన 2023లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా సోమవారం ఈ వ్యాజ్యంపై జస్టిస్ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జగన్‌పై నమోదైన కేసుల్లో విచారణ ముందుకు సాగడం లేదన్నారు. సీబీఐ, నిందితులు కుమ్మక్కై కేసును ముందుకు వెళ్లనీయట్లేదని తెలిపారు. డిశ్చార్జ్ పిటిషన్లపై ఎలాంటి నిర్ణయాలు వెలువరించకుండా ఐదుగురు జడ్జీలు బదిలీ కావడం వెనుక కుట్ర కోణం ఉందన్న అనుమానం వ్యక్తమౌతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతున్నామన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. అసలు జగన్ కేసులతో మీకేం సంబంధమంటూ ప్రశ్నించింది. కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేసే ప్రసక్తేలేదని తేల్చి చెప్పింది.

రాజకీయ విద్వేషంతోనే పిటిషన్

అనంతరం జగన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. రాజకీయపరమైన విద్వేషంతోనే రఘురామకృష్ణరాజు ఈ పిటిషన్ దాఖలు చేశారన్నారు. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసులపై సీబీఐ ప్రత్యేక కోర్టులో జరుగుతున్న విచారణను హైకోర్టు పర్యవేక్షిస్తోందని తెలిపారు. ప్రత్యేక కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సీబీఐ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. కేసుల వివరాలు, వాటి ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేశామని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సీబీఐ తరఫున వాదనలు వినిపిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) మరో కేసులో వాదనలు వినిపిస్తున్నారని, అందువల్ల ఈ వ్యాజ్యంలో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని సీబీఐ తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది.

నెవర్ అగైన్.. దేశంలో ఎక్కడ ఏ మహిళపై ఏ నేరం జరిగినా ప్లకార్డ్ మీద కనిపించే స్లోగన్! కానీ ఆ నేరాలూ అగైన్ అండ్ అగైనే.. ఈ ప్లకార్డూ అగైన్ అండ్ అగైనే! లేకపోతే నిర్భయ ప్రజాగ్రహానికి పార్లమెంట్ దద్దరిల్లి.. ప్రత్యేక చట్టం, మహిళల భద్రత, రక్షణకు ప్రత్యేక ఫండ్, హెల్ప్ లైన్స్, అలర్ట్ యాప్స్.. ఎన్ని వచ్చాయి! అయినా కోల్‌కతా ఆర్జీ కర్ దారుణం జరిగింది.. మనమంతా మళ్లీ ఉలిక్కిపడేలా చేసింది. పనిచేసే చోటే డాక్టర్ లైంగిక దాడికి.. హత్యకు గురైంది. దోషి సంజయ్ రాయ్ అనే వలంటీరని తేల్చిన సియల్దా జిల్లా సెషన్స్ కోర్ట్ అతనికి జీవిత ఖైదు విధించింది. ఇలాంటివి జరిగినప్పుడల్లా అల్టిమేట్ శిక్షలను చేర్చుకుంటూ చట్టాలను మార్చుకుంటున్నాం! అయినా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో హెచ్చరిస్తూనే ఉంది ఏ ఏటికా ఏడు మహిళలపై పెరుగుతున్న నేరాలతో! కారణం మనం విక్టిమ్‌కే సుద్దులు చెబుతున్నాం. విక్టిమ్‌కే హద్దులు పెడుతున్నాం. విక్టిమ్‌నే బ్లేమ్ చేస్తున్నాం! అంటే నేరాన్ని ప్రేరేపించే భావజాలాన్ని పెంచి పోషిస్తున్నాం! ఆ సుద్దులేవో అక్యూజ్డ్‌కి చెప్పడం మొదలు పెడితే, తన హద్దులేంటో అక్యూజ్డ్ గుర్తించేలా చేయగలిగితే, అమ్మాయి అంటే సెక్సువల్ ఆబ్జెక్ట్ కాదు, వ్యక్తిత్వమున్న తనలాంటి మనిషే అనే అవగాహన కల్పించగలిగితే... నెవర్ అగైన్ ప్లకార్డ్ అవసరం రాదు! శిక్షల మీద మొమెంటరీ కామెంట్స్‌కి స్పేస్ ఉండదు! మహిళ హాయిగా పనిచేసుకుంటుంది. ఎన్‌సీఆర్‌బీ ఆశ్చర్యపోతుంది.

ఆర్జీ కర్ డాక్టర్ సంఘటనలో కోర్టు జీవితఖైదు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శిక్ష సరే మహిళకు రక్షణేది అంటూ తెలుగు రాష్ట్రాల్లోని పలు రంగాలకు చెందిన మహిళా ప్రముఖులు కొందరు వెలిబుచ్చిన అభిప్రాయాలు.

శిక్ష సరే.. రక్షణ ఏది?



ఒక్కటి నెరవేరక పోయినా..

ఆర్జీ కర్ సంఘటన తర్వాత ఆ హాస్పిటల్లోని జూనియర్ డాక్టర్లు నిరహార దీక్ష చేశారు. సీసీటీవీ కెమెరాలు, ట్రాన్స్‌పోర్టేషన్, వాష్ రూమ్స్, ఇంటర్నల్ కంప్లయింట్ సెల్ వంటి వాటికోసం డిమాండ్ చేశారు. అవన్నీ నెరవేరాయో లేదో తెలియదు. ఒక్కటి నెరవేరకపోయినా ఉద్యమించాల్సిందే. మళ్లీ ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా ఉండటానికి! ఇక నేరస్థుడి శిక్ష విషయానికి వస్తే సంజయ్ రాయ్ నిజంగా దోషి అయితే అతనికి శిక్ష అవసరమే! అది అతనిలో పరివర్తన తీసుకురావాలి. అందులో అనుమానమే లేదు. అయితే అంతకన్నా ముందు అలాంటి నేరాలను ప్రేరేపించే పురుషాధిపత్య భావజాలాన్ని రూపుమాపాలి. ఆ మార్పు కోసం అందరం పాటుపడాలి.



– బి. జ్యోతి, రాష్ట్ర కన్వీనర్, చైతన్య మహిళా సంఘం.

రియాక్షన్స్ మాత్రమే ఉంటాయి

ఆర్జీ కర్ కేస్ జడ్జిమెంట్ రాగానే దోషికి డెత్ పెనాల్టీ విధించాలని సోషల్ మీడియాలో డిమాండ్ చేస్తున్నారు. ఈ క్షణికావేశాలు, కోపాల వల్లే లాంగ్ టర్మ్ సొల్యూషన్ వైపు వెళ్లనివ్వకుండా మహిళా భద్రత, రక్షణ విఫలమవుతూ వస్తోంది. మన దగ్గర నివారణ చర్యలుండవు. రియాక్షన్సే ఉంటాయి. న్యాయం కోసం పోరాడేవాళ్లనే వేధిస్తుంటారు. నేరస్థులను పూజిస్తారు. మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించడాన్ని ప్రభుత్వాలే అడ్డుకుంటున్నాయి. ఇక ట్రాన్స్ విమెన్‌పై జరిగే నేరాలనైతే నేరాలుగానే చూడట్లేదు. మార్పును మతం మీదో, సంస్కృతి మీదో దాడిలాగా చూస్తున్నంత కాలం ఈ నేరాలు ఆగవు. నేరం జరిగిన తర్వాత ఏం చేయాలి, ఎలాంటి శిక్షలు పడాలి అని కాకుండా అసలు నేరాలు జరగకుండా ఏం చేయాలి, ఎలాంటి సిస్టమ్స్‌ను డెవలప్ చేయాలనే దాని మీద దృష్టిపెట్టాలి. ప్రాథమిక స్థాయిలోనే జెండర్ సెన్సిటైజేషన్, సెక్స్ ఎడ్యుకేషన్ మొదలవ్వాలి. సమానత్వం, పరస్పర గౌరవం, కన్‌సెంట్ గురించి పిల్లలకు నేర్పాలి.



– దీప్తి సిర్ల, జెండర్ యాక్టివిస్ట్

తల్లిదండ్రులే కల్పించాలి

పైశాచికంగా ప్రవర్తించిన ఒక వ్యక్తికి న్యాయస్థానం సరైన శిక్షనే విధించింది. స్త్రీ–పురుష సమానత్వం, స్త్రీల మీద గౌరవం లేకనే ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అంతటా ఇలాంటి పరిస్థితే! సామాజిక మార్పే దీనికి పరిష్కారం. స్త్రీ–పురుషులు ఇద్దరూ సమానమనే అవగాహన వస్తే స్త్రీల పట్ల పురుషులకు గౌరవం ఏర్పడుతుంది. తల్లిదండ్రులే ఆ అవగాహన కల్పించాలి.



– డా.రుక్మిణీరావు, సామాజిక కార్యకర్త

ఆ ప్రయత్నం లేకపోతే రక్షణ ఎండమావే!



సంజయ్ రాయ్‌కి పడిన శిక్ష గురించి అసంతృప్తి వినిపిస్తోంది మరణ శిక్ష విధిస్తే బాగుండేదంటూ! రేప్ చేసిన వాళ్లను ఎన్‌కౌంటర్ చేసిన దాఖలాలున్నాయి. లైంగిక దాడులు, హత్యలు ఆగలేదే! దీన్ని బట్టి పురుషాధిపత్య సమాజానికి సైకలాజికల్ ట్రీట్‌మెంట్ అవసరమని అర్థమవుతోంది. విచ్చలవిడి శృంగారం, క్రైమ్ సినిమాలు, డ్రగ్స్‌ను కట్టడి చేయాలి. మహిళలను సెక్సువల్ ఆబ్జెక్ట్‌గా చూసే తీరును సంస్కరించాలి. మగపిల్లలకు చిన్నప్పటి నుంచే జెండర్ సెన్సిటివిటీని బోధించాలి. ఇందుకోసం పౌర సంస్థలు, విద్యావంతులు, ఎన్జీవోలు ఉద్యమించాలి. ఈ ప్రయత్నం లేకుండా ఎంతటి కఠిన శిక్షలు విధించినా మహిళా రక్షణ ఎండమావే! కార్యాచరణ మహిళా భద్రత, రక్షణ లక్ష్యంగా ఉండాలి తప్ప శిక్షల ధ్యేయంగా కాదు!

– జూపాక సుభద్ర, రచయిత్రి, అడిషనల్ సెక్రటరీ గవర్నమెంట్ రిటైర్డ్

నేరాలు పుట్టకుండా ఆపాలి



శిక్ష ఉద్దేశం నేరాన్ని తొలగించడం కానీ నేరస్థుడిని కాదు. ఇక్కడ మనం నేరస్థుడి గురించే మాట్లాడుతున్నాం. కానీ నేరం జరగకుండా ఉండే వాతావరణ కల్పన గురించి ఆలోచించట్లేదు. చర్చించట్లేదు. మాట్లాడట్లేదు. నేరస్థుడిని శిక్షించడం ఒక ఎత్తు. మరోవైపు మహిళల పట్ల జరుగుతున్న నేరాలను నిరోధించగలగాలి, నేరాలు పుట్టకుండా ఆపగలగాలి, నేరప్రవృత్తి ప్రబలకుండా చేయగలగాలి. ఇది సమాజం బాధ్యత. అయితే లోపమెక్కడంటే.. నువ్విలా ఉండు, ఇలా నడుచుకో అంటూ విక్టిమ్‌నే డిక్టేట్ చేస్తున్నాం. ఆర్డర్ వేస్తున్నాం. అక్యూజ్డ్‌ని అడ్రస్ చేయం. ఈ ఆలోచనలో, ఆచరణలో మార్పు రావాలి. పురుషుడి లైంగిక స్వేచ్ఛకి హద్దులున్నాయని నేర్పాలి. మగ పిల్లలకు జెండర్ కాన్షస్ కల్పించాలి. మహిళలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత రావాలి. ఇవన్నీ సాధ్యమైతేనే స్త్రీలపై జరిగే నేరాలు తగ్గుతాయి.

– జహా ఆరా, సీనియర్ అడ్వకేట్, విశాఖపట్టణం

పెద్ద తలకాయల కుట్ర

ఆర్జీ కర్ కేస్ ఒక వ్యవస్థాగత హత్య. ఆ దారుణానికి పాల్పడిన నేరస్థుల్లో సంజయ్ రాయ్ ఒకడు తప్ప కేవలం అతనొక్కడే నేరస్థుడు కాదు. ఈ విషయాన్ని ఫోరెన్సిక్ నివేదిక కూడా చెప్పింది.. మల్టిపుల్ డీఎన్ఏ ఆనవాళ్లున్నాయని తేల్చి! అందుకే సంజయ్ రాయ్ ఒక్కడికే శిక్ష పడటం పట్ల అంతటా అసంతృప్తి కనపడుతోంది. ఇందులో రూలింగ్ పార్టీ ఇన్‌వాల్వ్ అయినట్టు తోస్తోంది. బాధిత కుటుంబాన్ని రకరకాలుగా మభ్యపెట్టేందుకు చేసిన ప్రయత్నాలే అందుకు నిదర్శనం. అసలు నేరస్థులు వెలుగులోకి రాకుండా సాక్ష్యాలను మాయం చేయడం, ఒక్కడినే దోషిగా నిలబెట్టడం వంటివన్నీ చూస్తే నిజంగా దీని వెనక పెద్ద తలకాయలున్నట్లు, వాళ్లే ఈ నేరానికి కుట్ర పన్నినట్టు అనిపిస్తోంది.



– మోక్ష, నటి

ప్రధాన సమస్య

ఖైదీకి ఉరి శిక్ష నుంచి లైఫ్ పడిందంటే దీని వెనకాల ఎంత మంది ప్రమేయం ఉందో! ఇది దోషిని బతికించే ప్రయత్నమే. మెడికల్ కాలేజీలలో సెక్యూరిటీ అనేది ప్రధాన సమస్య. సాధారణంగా ప్రభుత్వాసుపత్రుల్లో డాక్టర్లందరికీ ఒక్కటే విశ్రాంతి గది ఉంటుంది. లేడీ డాక్టర్లు తెల్లవారు జామున రెండు–మూడు గంటలకు రెస్ట్ తీసుకోవాల్సి వస్తే బోల్ట్ లేని ఆ గదిలోని పడుకోవాల్సి వస్తుంది. అలాంటప్పుడు ఆ బ్లాక్‌లో సెక్యూరిటీ ఉండదు.

లేడీ డాక్టర్లకు అనుకోని అవాంతరం ఎదురైనప్పుడు ఒక అలారం కోడ్ ఉంటే బాగుంటుంది. దానికి వెంటనే ఆ సిస్టమ్ రెస్పాండ్ అవ్వాలి. అప్పుడు నైట్ షిఫ్టుల్లోనూ అమ్మాయిలు ధైర్యంగా పనిచేయగలుగుతారు. అప్రమత్తంగా ఉండాల్సిన విషయాల పట్ల అమ్మాయిలకు అవగాహన పెంచాలి.



– డాక్టర్ మనోరమ, గైనకాలజిస్ట్

ట్రెండ్



షాంగ్ సావెద్ర అనీ కోల్

సెకండ్ హ్యాండ్ సంపన్నులు!

ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ఆడంబర జీవనశైలికి అలవాటుపడి అప్పులపాలైన వాళ్లను ఎంతోమందిని చూస్తుంటాం. అయితే దీనికి భిన్నంగా ఆర్థిక స్థోమత హై లెవెల్‌లో ఉన్నప్పటికీ నిరాడంబరశైలిని అనుసరించే ధోరణి సంపన్నులలో పెరుగుతోంది. దీనికి ఉదాహరణ షాంగ్ సావెద్ర, అనీ కోల్...

మిలియనీర్‌లు అయిన సావెద్ర, ఆమె భర్త ఇంద్రభవనం లాంటి ఇళ్లెన్నో నిర్మించుకునే ఆర్థిక స్థోమత ఉంది. అయినా సరే ఆ దంపతులు లాస్ ఏంజిల్స్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. వారికి విడి విడిగా కార్లు లేవు. ఇద్దరూ కలిసి సెకండ్ హ్యాండ్ కారును ఉపయోగించుకుంటారు.

పిల్లలు సెకండ్‌హ్యాండ్ బొమ్మలతో ఆడుకుంటారు. వృథా ఖర్చుకు దూరంగా ఉంటారు.

'అఫ్‌కోర్స్, నేను కూడా లగ్జరీ ఐటమ్స్ చూసి టెంప్ట్ అవుతుంటాను. అయితే తొందరపడకుండా కొద్దిసేపు ఆలోచిస్తాను. వెంటనే కొనేయాలనే ఆలోచన నుంచి బయటపడతాను. మనసు పడ్డాం కాబట్టి కొనడం కాకుండా ఆ వస్తువు నిజంగా మనకు ఎంత అవసరమో అని ఆలోచిస్తే సమస్య ఉండదు' అంటుంది షాంగ్ సావెద్ర.

రీసెర్చర్, పర్సనల్ ఫైనాన్స్ కోచ్ అనీ కోల్ మిలియనీర్. అయితే ఆమె సంపాదనతో పోల్చితే చేసే ఖర్చు చా... లా తక్కువ!

ఎన్నో సంవత్సరాల క్రితం కారును అమ్ముకుంది. ఇంట్లో పనివాళ్లు అంటూ ఎవరూ ఉండరు. వంట చేయడం నుంచి జుత్తు కత్తిరించుకోవడం వరకు తానే చేస్తుంది!

సెలవు రోజుల్లో ఎంజాయ్ చేయడానికి ఖర్చు అవసరం లేని ఫ్రీ యాక్టివిటీలకు ప్రాధాన్యత ఇస్తుంది.

పొదుపుకు ప్రాధాన్యత ఇచ్చే జీవనశైలిని అనుసరిస్తోంది. దుస్తుల నుంచి వస్తువుల వరకు సెకండ్ హ్యాండ్ వాటికి ప్రాధాన్యత ఇస్తోంది.

ఈ సంపన్నులది పీనాసితనంగా అనిపించవచ్చుగానీ.. కొద్దిగా ఆలోచించినా అర్థమవుతుంది వారి ఆచరణ ఎంత అనుసరణీయమో.

పసుపు @ 11 వెరైటీలు

సాగుబడి
ఉత్తరాషాఢ కార్తె : జనవరి 24 వరకు
శ్రవణ కార్తె : జనవరి 25 నుంచి





పసుపు అంటే సాధారణంగా సేలం.. దుగ్గిరాల వంటి వంగడాలు గుర్తుకు వస్తుంటాయి. అరుదుగా పండే 11 రకాల దేశీ పసుపు రకాలను పండిస్తున్నారు మహిళా రైతు నడింపల్లి కవిత. కస్తూరి.. లకడాండ్.. నల్ల పసుపు.. రోమ్.. తెల్ల పసుపు.. చింతపల్లి.. సోనియా.. రాజాపూరి.. ప్రతిమ.. వీఐపీ(848), వీఐపీ (849) వంటి ప్రత్యేక పసుపు రకాలను ఆమె పండిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం మద్దికుంట గ్రామంలో తనకున్న ఐదెకరాల వ్యవసాయక్షేత్రంలో మామిడిలో అంతర పంటగా ఈ రకాలను ఆమె సాగు చేస్తున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సుభాష్ పాలేకర్ కృషి పద్ధతిలో రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వాడకుండా కవిత వ్యవసాయం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ భీమవరం సమీపంలోని మొగల్లుకు చెందిన కవిత కుటుంబం హైదరాబాద్ గచ్చిబౌలిలో స్థిరపడ్డారు. వ్యవసాయంపై మక్కువ కలిగిన కవిత సంగారెడ్డి జిల్లాలో ఐదెకరా సొంత భూమిలో ఈ ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు.

విజయనగరం జిల్లా నుంచి చింతపల్లి రకం, మేఘాలయ, అస్సాం, డెహ్రాడూన్ తదితర ప్రాంతాల నుంచి మరికొన్ని పసుపు రకాలను సేకరించిన కవిత గత మూడు సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు.

పసుపులో రారాజు కస్తూరి..

కస్తూరి రకం పసుపులో రారాజుగా పేరుంది. పసుపు నాణ్యతకు ప్రామాణికమైన కర్క్యుమిన్ ఈ కస్తూరి రకంలో సుమారు 15 శాతం వరకు ఉంటుందన్నారామె. దీన్ని ఔషధాల్లో ఎక్కువగా వినియోగిస్తుంటారు. సుమారు 3 సంవత్సరాలు పెరిగిన కస్తూరి రకం పసుపునకు క్యాన్సర్‌ను కూడా నయం చేయగల ఔషధ సామర్థ్యం ఉంటుందని ఆమె చెబుతున్నారు. లకడాంగ్ రకం పసుపు ముఖ సౌందర్యానికి, చర్మ సౌందర్యానికి ఉపయోకరమన్నారు. పండించిన పసుపు కొమ్ములను ఉడికిస్తే ఔషధ గుణాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పసుపు కొమ్ములను సోలార్ డ్రయ్యర్‌లో ఎండబెడుతున్నారు. పసుపును పొడితో పాటు ద్రవ రూపంలోకి, ట్యాబ్‌లెట్ల రూపంలోకి కూడా మార్చుతున్నారు. పసుపు ఉత్పత్తులను అమెరికా, దుబాయ్ వంటి విదేశాల్లో నివాసం ఉండే పరిచయస్తులకు ఆమె ఇస్తున్నారు.

– పాత బాలప్రసాద్, సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

వ్యవసాయం అంటే ఇష్టం..

ప్రకృతి వ్యవసాయం అంటే నాకు ఎంతో ఇష్టం. అరుదైన పసుపు రకాలను సాగు చేయాలని అనుకొని సేకరిస్తున్నాను. ఇప్పటి వరకు 11 వెరైటీల పసుపును పండిస్తున్నాను. అస్సాం రకాన్ని కూడా సాగు చేయాలనుకుంటున్నాను. దేశీ ఆవులను పెంచుతూ పాలేకర్ పద్ధతిలో నేను చేస్తున్న వ్యవసాయానికి మా కుటుంబ సభ్యులు ఎంతో సహకరిస్తున్నారు.

– నడింపల్లి కవిత (76809 67818), పసుపు రైతు



ఏపీమాస్‌లో పాలేకర్ సభ నేడు



హైదరాబాద్ మణికొండ జాగిర్ తానీషా నగర్‌లోని మహిళా అభివృద్ధి సొసైటీ (ఏపీమాస్)లో జనవరి 21 మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభలో పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ ప్రసంగిస్తారని ఏపీమాస్ డైరెక్టర్ సి.ఎస్.రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పికె) సాగు పద్ధతి విస్తరణలో ఎఫ్‌పిఓలు, పిఎసిఎస్‌ల పాత్ర అనే అంశంపై పాలేకర్ ప్రసంగిస్తారన్నారు. సేవ్ స్వచ్ఛంద సంస్థ, మాపల్లె చారిటబుల్ ట్రస్ట్‌తో కలసి ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

25,27,28 తేదీల్లో తిరుపతి వర్సిటీల్లో సభలు

పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ ఈ నెలాఖరులో తిరుపతిలో జరిగే మూడు సభల్లో ఎస్వీ, పద్మావతి యూనివర్సిటీల విద్యార్థులు, రైతులను ఉద్దేశించి ప్రకృతి సేద్యంపై ప్రసంగించనున్నట్లు 'వర్డ్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కోటపాటి గంగాధరం తెలిపారు. 'రసాయనాల్లేకుండా సుభాష్ పాలేకర్ కృషి పద్ధతిలో పంటల సాగు–ఆహారోత్పత్తుల వ్యాపార మెళకవలు' అనే అంశంపై 25 (శనివారం)న ఉ. 9 గం.కు ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థుల కోసం శ్రీనివాస ఆడిటోరియంలో పాలేకర్ ప్రసంగిస్తారు. 27 (సోమవారం)న ఉ. 9 గం.కు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విద్యార్థిలను ఉద్దేశించి పాలేకర్ ప్రసంగిస్తారు. 28 (మంగళవారం) న ఉ. 9 గం.కు ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోని శ్రీనివాస ఆడిటోరియంలో రైతులు, ఎఫ్‌పిఓలు, సొసైటీల నిర్వాహకులు, వినియోగదారులను ఉద్దేశించి పాలేకర్ ప్రసంగిస్తారు. ఎస్వీయూ, పద్మావతి వర్సిటీల ఆహ్వానం మేరకు పాలేకర్ పర్యటిస్తున్నారని డా. గంగాధరం (98490 59573) వివరించారు.

ఇంట్లో సాఫ్ట్‌వేర్ కొలువు... పొలంలో ప్రకృతి సేద్యం

- అటు సింగపూర్ కంపెనీలో డైరెక్టర్ స్థాయి ఉద్యోగం.. ఇటు 8.5 ఎకరాల్లో ప్రకృతి సేద్యం
- పండ్ల తోటలతో పాటు.. 75 సెంట్లలో పాలీహౌస్ నిర్మించి 35 రకాల పంటల సాగు
- బ్రకోలి, పైనాఫిల్, ఎర్ర క్యాబేజీ, ఎర్ర బెండ తదితర కొత్త పంటల సాగు
- ఉద్యాన పంటల సాగులో చక్కగా రాణిస్తున్న బాల భాస్కర శర్మ

ఇంటి దగ్గరి నుంచే విదేశీ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉన్నతోద్యోగం చేస్తూనే 8.5 ఎకరాల్లో పండ్లు, కూరగాయలు సాగు చేస్తూ చక్కని ఫలితాలు సాధిస్తున్నారు కర్నూలుకు చెందిన యు. బాల భాస్కర శర్మ. ఎంటెక్ చదివి సింగపూర్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉన్నత స్థాయిలో డైరెక్టర్ స్థాయికి ఎదిగిన ఆయన కరోనా సమయంలో కర్నూలుకు వచ్చారు. ఇప్పటికీ అదే హోదాలో ఇంటి నుంచే ఉద్యోగం చేస్తూనే నిబద్ధతతో కూడిన ప్రకృతి వ్యవసాయంలో అద్భుతంగా రాణిస్తున్నారు. సొంత స్టోర్ నిర్వహించటంతో పాటు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ అమ్మకాలతో పాటు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కూరగాయలు విక్రయిస్తూ అందరి చేతా ఔరా అనిపిస్తున్నారు.



సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నతోద్యోగిగా పనిచేస్తూనే ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న బాల భాస్కర శర్మ కృషి ప్రశంసనీయం. కర్నూలు జిల్లా కల్లూరు మండలం నాయకల్లు గ్రామం వద్ద వారసత్వంగా సంక్రమించిన 8.5 ఎకరాల భూమిలో అంబా గో ఆధారిత వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు చేసి ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. 75 సెంట్లలో పాలీహౌస్ ఏర్పాటు చేసుకొని అందులో అనేక కొత్త పంటలు పండిస్తున్నారు.

పెనుగాలులు, భారీ వర్షాలకు దెబ్బతింటున్నందున సాధారణంగా ఉద్యాన శాఖ పాలీ హౌస్‌లను ప్రోత్సహించటం లేదు. అయితే, శర్మ తన పొలం చుట్టూ గాలులను తట్టుకునేలా నేరేడు, రేగు తదితర పండ్ల చెట్లు పెంచి, మధ్యలో పాలీహౌస్ నిర్మించి, సమర్థవంతంగా నిర్వహించటం విశేషం. జిల్లాకు పరిచయమే లేని వెల్లుల్లి, బ్రకోలి తదితర అనేక రకాల కూరగాయలను పాలీ హౌస్‌లో సాగు చేస్తున్నారు.

బ్రకోలిని కిలో రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. పాలిహౌస్‌లో వంగ, బీర, టొమాటో, పచ్చి మిరప, కాళీఫ్లవర్, క్యాబేజీ, ఎర్ర క్యాబేజి, ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్, బీన్స్, చిక్కుడు, కాకర, క్యాప్సికం, ఎర్రబెండ, సొర, పొట్ల, తంబ కాయ, బుడం కాయ, కీరదోసతో పాటు.. ఎర్ర తోట కూర, కొత్తిమీర, పుదీన, గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చలి, చుక్కకూర, మెంతి కూర వంటి 35 పంటలు సాగు చేస్తున్నారు. ఎత్తైన బోదెలు ఏర్పాటు చేసుకొని మల్చింగ్, వీడ్ మ్యాట్ వేసి మొక్కలు నాటుకున్నారు. ఆరుబయట పొలాల్లో 3 నెలలు దిగుబడినిచ్చే కూరగాయలు పాలీహౌస్‌లో 5 నెలల వరకు దిగుబడినిస్తున్నాయి.

పండ్ల చెట్లు.. పైనాపిల్ కూడా..

7.75 ఎకరాల్లో చాలా రకాల పండ్ల చెట్లను పూర్తిగా ప్రకృతి సేద్య పద్ధతుల్లో శర్మ పెంచుతున్నారు. నిమ్మ 250, జామ 200, సీతాఫలం 200, మామిడి 40, అంజూర 100, నేరెడు 200, మునగ 200, అరటి 80 చెట్లతో పాటు కొన్ని సపోటా, కొబ్బరి, ఉసిరి, నేరేడు, రేగు, రామాఫలం చెట్లు పెంచుతున్నారు. రాయలసీమ ప్రాంతంలో ఇంతవరకూ లేని పైనాపిల్ మొక్కలను కూడా పెంచుతున్నారు. మధురై నుంచి ఎర్రబెండ సీడ్ తెప్పించి నాటుకున్నారు.







ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెటింగ్

కర్నూలులోని నంద్యాల చెక్ పోస్టు దగ్గర ఆర్గానిక్ స్టోర్ ఏర్పాటు చేయటంతో పాటు బాలబాస్కర శర్మ ఆన్‌లైన్ మార్కెటింగ్ కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందించారు. తను పండించిన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో పాటు కెమికల్స్ లేకుండా ఆహార పంటలు పండిస్తున్న రైతుల నుంచి బియ్యం, పప్పులు, పసుపు తదితరాలను సేకరించి విక్రయిస్తున్నారు. 8 దేశీ ఆవులను పోషిస్తూ నాలుగు ట్యాంకుల ద్వారా ద్రవ జీవామృతం పంటలకు ఇస్తున్నారు.

వర్మీ కంపోస్టుతో పాటు రోజుకు 40 లీటర్ల వర్మీవాష్ కూడా ఉత్పత్తి చేసి డ్రిప్ ద్వారా అందిస్తున్నారు. చీడపీడల నివారణకు అవసరాన్ని బట్టి కషాయాలు, వేపనూనె తదితరాలను వాడుతున్నారు. సోలార్ ట్రాప్స్, తెలుపు, పసుపు జిగురు అట్టలను ఏర్పాటు చేశారు. పండ్ల తోటలకు నష్టం కలిగించే పండు ఈగ ట్రాప్‌కు ఏర్పాటు చేశారు. అన్ని పంటలకు డ్రిప్ సదుపాయం కల్పించారు.

రసాయనాల్లేకుండా పండించిన పంట కావడం వల్ల కూరగాయలు, ఆకు కూరలకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. శర్మ కృషిని గుర్తించిన కర్నూలు జిల్లా యంత్రాంగం.. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రత్యేకంగా కెమికల్స్ లేకుండా పండించిన కూరగాయలు విక్రయించేందుకు అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తుండటం విశేషం.

– గవిని శ్రీనివాసులు, సాక్షి కర్నూలు (అగ్రికల్చర్)

రసాయనాల్లేని ఆహారం అందిస్తున్నా..!

సింగ్‌పూర్‌లో 2020 వరకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశా. కరోనా కారణంగా ఇంటికి వచ్చేశా. ఇంటి నుంచే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని అభివృద్ధి చేసుకున్నా. 8 ఆవులను పెంచుతూ పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. మా వ్యవసాయ క్షేత్రంలో కెమికల్స్ వాసన అనేది ఉండదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో కూరగాయల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ అవకాశం ఇచ్చారు. ప్రత్యేక స్టోర్‌తో పాటు వెబ్‌సైట్ ద్వారా కూడా విక్రయిస్తున్నాం. రసాయనిక అవశేషాలు లేని నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు తదితర ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తున్నామనే సంతోషం ఉంది. ఎర్ర బెండకాయకు మంచి ఆదరణ ఉంది. పోషకాలు ఎక్కువగా ఉండటం వల్ల ఎర్ర బెండకాయను ప్రజలు ఇష్టంగా తీసుకుంటున్నారు.

– యు. బాల భాస్కర శర్మ (62817 00553), సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కమ్ ప్రకృతి రైతు, కర్నూలు

కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌లో జ్యోతి సురేఖ




ప్రపంచ ఆర్చరీ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ మరోసారి కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. సోమవారం విడుదల చేసిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ర్యాంకింగ్స్‌లో విజయవాడకు చెందిన 28 ఏళ్ల జ్యోతి సురేఖ రెండు స్థానాలు పురోగతి సాధించి రెండో ర్యాంక్‌లో నిలిచింది. గత ఏడాది ఏప్రిల్‌లో జ్యోతి సురేఖ కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌ను సాధించింది. 2011 నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జ్యోతి సురేఖ అంతర్జాతీయస్థాయిలో 30 కంటే ఎక్కువ పతకాలు సొంతం చేసుకుంది.

హరికృష్ణ ఖాతాలో తొలి 'డ్రా'



టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్ మాస్టర్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ తొలి 'డ్రా' నమోదు చేశాడు. నెదర్లాండ్స్‌లోని విక్ ఆన్ జీ నగరంలో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. భారత్‌కే చెందిన లియోన్ ల్యూక్ మెండో కాతో సోమవారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హరికృష్ణ 44 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు.

స్వియాటెక్ ఫటాఫట్



స్వియాటెక్

59 నిమిషాల్లోనే నెగ్గిన పోలాండ్ స్టార్

- రెండోసారి క్వార్టర్ ఫైనల్లోకి
- ప్రత్యర్థికి ఒక్క గేమ్ మాత్రమే ఇచ్చిన రెండో సీడ్
- ఆరో సీడ్ రిబాకినాకు చుక్కెదురు



రిబాకినా

మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్ జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ తన ప్రత్యర్థికి కేవలం ఒక్క గేమ్ మాత్రమే ఇచ్చి ఈ మాజీ నంబర్‌వన్ విజయాన్ని దక్కించుకుంది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ స్వియాటెక్ 6-0, 6-1తో ఇవా లిస్ (జర్మనీ)పై గెలిచి ఈ టోర్నీలో రెండోసారి క్వార్టర్ ఫైనల్లోకి చేరింది. వరుసగా ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న 23 ఏళ్ల స్వియాటెక్ 2022లో సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇవా లిస్‌తో 59 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో స్వియాటెక్ మూడు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 10 సార్లు దూసుకొచ్చి తొమ్మిదిసార్లు పాయింట్లు గెలిచింది. మూడో రౌండ్‌లో యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్)తో జరిగిన మ్యాచ్‌లోనూ ఒక్క గేమ్ మాత్రమే చేజార్చుకున్న స్వియాటెక్... రెబెకా స్రామ్‌కోవా (స్లొవేనియా)తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో రెండు గేమ్‌లు మాత్రమే కోల్పోయింది. క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా)తో స్వియాటెక్ తలపడుతుంది.

కీస్ సంచలనం

మరోవైపు టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరైన ఆరో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్‌కే పరిమితమైంది. అమెరికా ప్లేయర్, 19వ సీడ్ మాడిసన్ కీస్ 6-3, 1-6, 6-4తో రిబాకినాపై సంచలన విజయం సాధించి నాలుగోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో 28వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 6-4, 6-1తో కుదెర్‌మెటోవా (రష్యా)పై, ఎమ్మా నవారో 6-4, 5-7, 7-5తో తొమ్మిదో సీడ్ కసత్‌కినా (రష్యా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. 12వసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న స్వితోలినా మూడోసారి క్వార్టర్ ఫైనల్ చేరగా... నవారో తొలిసారి ఈ ఘనత సాధించింది.

సినెర్ ముందంజ

పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. 13వ సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ ఇటలీ స్టార్ 6-3, 3-6, 6-3, 6-2తో గెలుపొందాడు. 3 గంటల 13 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సినెర్ 14 ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 35 విన్నర్స్ కొట్టిన సినెర్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఎనిమిదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) 6-0, 7-6 (7/5), 6-3తో మికిల్సన్ (అమెరికా)పై, లొరెంజో సొనెగో (ఇటలీ) 6-3, 6-2, 3-6, 6-1తో క్వాలిఫయర్ లెర్నర్ టియెన్ (అమెరికా)పై విజయం సాధించి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)తో జరిగిన మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో బెన్ షెల్టన్ (అమెరికా) 7-6 (7/3), 6-7 (3/7), 7-6 (7/2), 1-0తో ఆధిక్యంలో ఉన్నదశలో మోన్‌ఫిల్స్ గాయంతో వైదొలిగాడు. దాంతో బెన్ షెల్టన్ రెండోసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు.

పంత్‌కే లక్నో పగ్గాలు

కెప్టెన్‌ను ప్రకటించిన సూపర్ జెయింట్స్

- నాయకత్వ బాధ్యతలపై కీపర్ సంతోషం



జెర్సీ ఆవిష్కరిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్ జహీర్, యజమాని సంజీవ్ గోయెంకా, పంత్

కోల్‌కతా: ఐపీఎల్ ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్ తమ కెప్టెన్ పేరును అధికారికంగా ప్రకటించింది. ఊహించిన విధంగానే వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్‌ను సారథిగా నియమిస్తున్నట్లు టీమ్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. లక్నో ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా సోమవారం జరిగిన కార్యక్రమంలో కెప్టెన్ పంత్‌కు టీమ్ జెర్సీని అందిస్తూ తమ ఎల్‌ఎస్‌జీ కుటుంబంలోకి ఆహ్వానించారు. ఐపీఎల్ వేలంలో రూ. 27 కోట్లకు పంత్‌ను లక్నో సొంతం చేసుకోవడంతోనే అతనే కెప్టెన్ కావడం దాదాపు ఖాయమైంది. 'కొత్త ఆశలు, ఆశయాలతో పాటు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో కొత్తగా మేం మొదలు పెడుతున్నాం. మీకందరికీ మా కొత్త కెప్టెన్ రిషభ్ పంత్‌ను పరిచయం చేస్తున్నాం. మా జట్టుకు సంబంధించి ఇదో కీలక క్షణం. మూడేళ్లు ముగిసిన తర్వాత మా ప్రణాళికల్లో మార్పులతో ముందుకు వెళ్లబోతున్నాం' అని గోయెంకా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీమ్ మెంటార్ జహీర్ ఖాన్ కూడా పాల్గొన్నాడు. ఐపీఎల్‌లో మూడు సీజన్లు ఆడిన లక్నోకు కేఎల్ రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. తొలి రెండు సీజన్లలో ప్లే ఆఫ్స్‌కు చేరిన ఆ జట్టు గత ఏడాది పూర్తిగా విఫలమైంది. దాంతో పాటు కెప్టెన్ కేఎల్ రాహుల్ బ్యాటింగ్‌పై కూడా విమర్శలు రావడంతో మార్పు అనివార్యమైంది. వేలంలో పంత్‌ను సొంతం చేసుకున్న టీమ్ ఇప్పుడు కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించింది. 2016 నుంచి 2024 వరకు ఢిల్లీ టీమ్ సభ్యుడైన పంత్... మూడేళ్లు నాయకుడిగా కూడా పని చేశాడు.

200 శాతం ప్రదర్శన కనబరుస్తా...

దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ తరఫున ఆడినా... పంత్ స్వస్థలం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్. గతంలో ఇది ఉత్తరప్రదేశ్‌లోనే భాగం. ఇప్పుడు అదే రాష్ట్రానికి చెందిన ఐపీఎల్ టీమ్‌కు అంటే దాదాపుగా సొంత టీమ్‌కు అతను ప్రాతినిధ్యం వహించబోతున్నాడు. లక్నో మేనేజ్‌మెంట్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని పంత్ విశ్వాసం వ్యక్తం చేశాడు. 'నా వైపు నుంచి ఎలాంటి లోపం లేకుండా 200 శాతం కష్టపడతానని మీకు మాటిస్తున్నా. కొత్త ఉత్సాహంతో కొత్త జట్టు తరఫున బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నా. నాకు ఇచ్చిన బాధ్యతలతో సంతోషంగా ఉన్నా. టీమ్‌లో యువకులు, అనుభవజ్ఞులు ఉన్నారు. కొత్త లక్ష్యాలతో మా ప్రయాణం మొదలైంది' అని పంత్ వ్యాఖ్యానించాడు. కెప్టెన్‌గా తాను ఇప్పటికే ఎంతో నేర్చుకున్నానని పంత్ అన్నాడు. 'ఇక్కడ కొత్త ఫ్రాంచైజీ, కొత్త ఆరంభం అని నాకు తెలుసు. కానీ కెప్టెన్సీ బాధ్యతలు నాకు కొత్త కాదు. అయితే మా జట్టు అవసరాలను బట్టి నేనేం చేయాలో మేనేజ్‌మెంట్‌తో చర్చిస్తా. సహచరులకు అండగా ఎలా నిలవాలో, వారినుంచి మంచి ప్రదర్శన ఎలా రాబట్టాలో రోహిత్ శర్మ నుంచి, ఇతర సీనియర్ ఆటగాళ్ల నుంచి కూడా ఎంతో నేర్చుకున్నా. ఎవరికి ఎలాంటి బాధ్యతలు ఇవ్వాలనే విషయంపై నాకు స్పష్టత ఉంది' అని పంత్ వివరించాడు.

పంత్‌లో సత్తా ఉంది...

భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ ఢిల్లీ కెప్టెన్‌గా ఉన్న 2016లో పంత్ మొదటిసారి ఐపీఎల్‌లోకి అడుగు పెట్టాడు. ఇప్పుడు లక్నో మెంటార్‌గా ఉన్న జహీర్‌తో పంత్ మళ్లీ కలిసి పని చేయనున్నాడు. 'ఎన్నో ఆటుపోట్లను దాటి పంత్ క్రికెటర్‌గా ఎదగడం నేను ప్రత్యక్షంగా చూశాను. తన ఆటతో అతను అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పాడు. ఇకపై అతను సాధించాల్సింది ఎంతో ఉంది. ఇక్కడ పంత్ ఆ పని చేయగలడు' అని జహీర్ వ్యాఖ్యానించాడు. మరోవైపు తమ జట్టు మిడిలార్డర్‌లో అంతా ఎడంచేతి వాటం బ్యాటర్లు ఉండటం కూడా ఒకరకమైన వ్యూహమని తెలిపాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

2012 తర్వాత విరాట్ కోహ్లి ...



న్యూఢిల్లీ: ఇన్నాళ్లు ఆడితే టీమిండియా జెర్సీ... సమ్మర్ మొదలైతే ఐపీఎల్ ఫ్రాంచైజీ జెర్సీలకే పరిమితమైన భారత స్టార్ క్రికెటర్లు తాజాగా రంజీ బాటపడుతున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ ముంబై తరఫున జమ్మూ కశ్మీర్‌తో ఆడనుండగా... 'కింగ్' కోహ్లి ఓ పుష్కర కాలం తర్వాత ఢిల్లీ జెర్సీ ధరించనున్నాడు. 2012లో చివరిసారిగా ఉత్తరప్రదేశ్‌తో రంజీ ఆడిన విరాట్ మళ్లీ ఇప్పుడు 13 ఏళ్ల తర్వాత దేశవాళీ టోర్నీ బరిలోకి దిగుతున్నాడు. అయితే ఢిల్లీ ఆడే తదుపరి మ్యాచ్‌లో కాకుండా... ఈ నెల 30 నుంచి రైల్వేస్ జట్టుతో జరిగే మ్యాచ్‌లో భారత మాజీ కెప్టెన్ అందుబాటులో ఉంటాడు. ఢిల్లీ ఈనెల 23 నుంచి రాజ్‌కోట్‌లో జరిగే తదుపరి మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టును ఢీకొట్టనుంది. ప్రస్తుతం మెడనొప్పితో బాధపడుతున్న కోహ్లి ఈ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా లేడు. ఈ మేరకు అతను ఢిల్లీ క్రికెట్ సంఘం (డీడీసీఏ) అధ్యక్షుడు రోహన్ జైట్లీకి సమాచారమిచ్చినట్లు ఢిల్లీ కోచ్ శరణ్‌దీప్ సింగ్ సోమవారం వెల్లడించారు. భారత వికెట్ కీపర్, డాషింగ్ బ్యాటర్ రిషభ్ పంత్ కూడా రైల్వేస్‌తో మ్యాచ్ ఆడేందుకు సై అంటున్నాడు.

భైరవం గొప్ప అనుభూతినిస్తుంది

- బెల్లంకొండ సాయి శ్రీనివాస్

''జయ జానకి నాయక' సినిమాకి మించి ఒక చిత్రం చేయాలని నిర్మాత శ్రీధర్‌గారితో చెప్పాను. అలా మంచి కథ కోసం వేట మొదలెట్టగా 'భైరవం' కుదిరింది. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులకు గొప్ప అనుభూతినిస్తుంది'' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చెప్పారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా, అదితీ శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భైరవం'. పెన్ స్టూడియోస్‌పై డాక్టర్ జయంతిలాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ నిర్మించారు. సోమవారం నిర్వహించిన ఈ మూవీ టీజర్ లాంచ్‌లో మనోజ్ మంచు మాట్లాడుతూ– ''ఈ సినిమా గొప్ప విజయం సాధించి, మాకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''నా కెరీర్‌లో ఎప్పుడూ చేయని పాత్రని ఈ సినిమాలో ఇచ్చిన విజయ్‌కి ధన్యవాదాలు'' అని నారా రోహిత్ తెలిపారు. ''నేను తీసిన 'నాంది' సినిమా చూసినప్పుడు ఎంత థ్రిల్ అయ్యారో 'భైరవం' చూశాక కూడా అంతే థ్రిల్, ఎమోషన్ ఫీల్ అవుతారు'' అన్నారు విజయ్ కనకమేడల. ''భైరవం' తెలుగులో నా మొదటి సినిమా'' అని అదితీ శంకర్ చెప్పారు. ''సినిమా అద్భుతంగా వచ్చింది.. అందరూ సపోర్ట్ చేయాలి'' అన్నారు కేకే రాధామోహన్. ఈ కార్యక్రమంలో చిత్ర సహ నిర్మాత శ్రీధర్, సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల మాట్లాడారు.



- రాధామోహన్, నారా రోహిత్, మనోజ్ మంచు, సాయి శ్రీనివాస్, విజయ్, అదితీ శంకర్

యాక్షన్ అలరిస్తుంది

''ఐడెంటిటీ' చిత్రం మలయాళంలో ఈ నెల 2న విడుదలై.. ఇప్పటికే రూ.40 కోట్లకు పైగా వసూలు చేసింది. సంక్రాంతికి తెలుగులో పెద్ద సినిమాలు ఉండటం వల్ల 'ఐడెంటిటీ'ని ఈ నెల 24న విడుదల చేస్తున్నాం. ఈ మూవీలో యాక్షన్ అలరిస్తుంది'' అని మామిడాల శ్రీనివాస్ చెప్పారు. టోవినో థామస్, త్రిష జోడీగా, వినయ్ రాయ్, మందిరా బేడీ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఐడెంటిటీ'. దర్శకద్వయం అఖిల్ పాల్, అనాస్ ఖాన్ దర్శకత్వంలో రాజు మల్లియాత్, రాయ్ సీజే నిర్మించారు. మలయాళంలో హిట్‌గా నిలిచిన ఈ చిత్రాన్ని మూవీ మ్యాక్స్ మామిడాల శ్రీనివాస్ సమర్పణలో శ్రీ వేదాక్షర మూవీస్‌పై చింతపల్లి రామారావు ఈ నెల 24న తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ మూవీ తెలుగు ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చింతపల్లి రామారావు మాట్లాడుతూ–''ఐడెంటిటీ' చిత్రం తెలుగు ప్రేక్షకులకు మంచి వినోదం అందిస్తుంది'' అన్నారు. ''ఈ మూవీలో యాక్షన్, సస్పెన్స్‌తో పాటు మంచి కథ ఉంది'' అని అఖిల్ పాల్, నటుడు వినయ్ రాయ్ పేర్కొన్నారు.



- శ్రీనివాస్, వినయ్ రాయ్, రామారావు, అఖిల్ పాల్




- విజయ్ దేవరకొండ

డేట్ మారిందా?

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారని సమాచారం. విజయ్ దేవరకొండ కెరీర్‌లో 12వ సినిమా ఇది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమాను తొలుత మార్చి 28న రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. అయితే ఆ డేట్‌కి రిలీజ్ వాయిదా పడిందని తెలిసింది. మే 30న రిలీజ్ చేయాలనే ఆలోచనలో చిత్రయూనిట్ ఉందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ చిత్రంలో విజయ్ ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారని, రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదల కానుందనే టాక్ ప్రచారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం తర్వాత దర్శకులు రాహుల్ సంకృత్యాన్, రవికిరణ్ కోలా సినిమాల్లో విజయ్ దేవర కొండ నటించనున్నారు.

ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రీతి ముకుందన్ హీరోయిన్. మోహన్ బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటివారు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. కాగా 'కన్నప్ప' సినిమాలో శివుడి పాత్రలో అక్షయ్ కుమార్ నటించినట్లు వెల్లడించి, ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు భక్తికి మాత్రం దాసుడు' అని ఫస్ట్ లుక్ పోస్టర్‌పై ఉంది. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది.



- అక్షయ్ కుమార్

ప్రకృతి, మనుషుల మధ్య అహింస అవసరం

- పద్మావతి మల్లాది



''గాంధీ తాత చెట్టు' సినిమా మహాత్మాగాంధీగారి బయోపిక్ కాదు. గాంధీ, తాత, చెట్టు.. ఈ మూడింటి కథే ఈ చిత్రం. గాంధీగారి సిద్ధాంతాలు ఉన్న గాంధీ అనే అమ్మాయి అహింసావాదంతో తన ఊరిని, చెట్టును ఎలా కాపాడింది? అనేది కథ. ప్రకృతి, మనుషుల మధ్య అహింస చాలా అవసరం అనే సందేశాన్ని మా సినిమా ద్వారా ఇస్తున్నాం'' అని డైరెక్టర్ పద్మావతి మల్లాది చెప్పారు. ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ మూవీ ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకురాలు పద్మావతి మల్లాది మాట్లాడుతూ–''నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. పీజీ పూర్తిచేసిన తర్వాత డైరెక్టర్ చంద్రశేఖర్ యేలేటిగారి దగ్గర రచనా విభాగంలో పనిచేశాను. 'రాధే శ్యామ్, 'మహానటి, చూసీ చూడంగానే, అమ్ము' అనే సినిమాలతో పాటు 'బృంద' అనే వెబ్ సిరీస్‌కు రచయితగా పని చేశాను. 'గాంధీ తాత చెట్టు' విషయానికొస్తే.. చెట్టుకు, మనిషికి మధ్య ఉండే ప్రేమకథతో పాటు మొక్కల గురించి తర్వాతి తరం వాళ్లకు చెప్పాలనే సంకల్పంతో ఈ కథ రాశాను. సందేశం, భావోద్వేగాలు, వాణిజ్య అంశాలున్న ఈ సినిమా అందరి హృదయాలకు హత్తుకుంటుంది. సుకృతి వేణి గాంధీ పాత్ర కోసం నిజంగా గుండు చేయించుకుంది. ఈ సినిమాకు రీ అందించిన సంగీతం, నేపథ్య సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంది'' అని పేర్కొన్నారు.

వారియర్స్

లూయిస్ కూ, సమ్మో కామ్ బో హంగ్, రిచీ లీడ్ రోల్స్‌లో నటించిన యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'హాంగ్ కాంగ్ వారియర్స్'. ఈ చిత్రానికి సోయ్ చీయాంగ్ దర్శకత్వం వహించారు. హాంగ్‌కాంగ్‌లో విజయం సాధించిన ఈ చిత్రం ఈ నెల 24న తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సినిమాను తెలుగు రాష్ట్రాలతో పాటుగా తమిళంలోనూ ఎన్వీఆర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది.



- 'హాంగ్ కాంగ్ వారియర్స్' పోస్టర్

నటుడు విజయ రంగరాజు కన్నుమూత



సీనియర్ నటుడు విజయ రంగరాజు(69) చెన్నైలో కన్నుమూశారు. ఇటీవల ఓ సినిమా షూటింగ్‌లో ప్రమాదానికి గురైన ఆయన చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే సోమవారం వేకువజామున గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. మహారాష్ట్రకు చెందిన ఆయన బీఏ పట్టభద్రుడు. స్వతహాగా క్రీడాకారుడు కూడా. బాడీ బిల్డింగ్‌లోనూ ప్రవేశం పొందారు. అయితే సినిమాలపై ఆసక్తితో చెన్నైకి వచ్చారు. విజయ రంగరాజు అసలు పేరు రాజ్‌కుమార్. అయితే సినీ రంగంలో ఆ పేరుతో వేరే నటుడు ఉండటంతో తన పేరును విజయ రంగరాజుగా మార్చుకున్నారు. చెన్నైలో పలు నాటకాల్లో నటించిన ఈయన 'వియత్నాం కాలనీ' అనే మలయాళ చిత్రం ద్వారా నటుడిగా పరిచయమయ్యారు. మలయాళ, తమిళ సినిమాల్లో ఆయన నటించినా, తెలుగు చిత్ర పరిశ్రమ విజయ రంగరాజును బాగా ఆదరించింది. 1994లో విడుదలైన 'భైరవద్వీపం' చిత్రంలో మాంత్రికుడిగా నటించి, మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'మేడమ్, మగరాయుడు, యజ్ఞం, విశాఖ ఎక్స్‌ప్రెస్, వీర తెలంగాణ, ఢమరుకం, బ్యాండ్ బాజా, శ్లోకం' వంటి పలు చిత్రాల్లో నటించి, తన కంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. చెన్నైలోని లోకయ్య కాలనీలో నివాసం ఉంటున్న విజయ రంగరాజుకు భార్య కస్తూరి, కుమార్తెలు దీక్షిత, పద్మిని ఉన్నారు. ఈయన మృతికి పలువురు సినీ ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు. కాగా విజయ రంగరాజు భౌతిక కాయానికి సోమవారం సాయంత్రం చెన్నైలో అంత్యక్రియలు నిర్వహించారు.

– సాక్షి తమిళ సినిమా

సాక్షి బిజినెస్

మంగళవారం
21-1-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
454	142
77,073	23,345

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	19,630	▲	292
డోజోన్స్	43,488	▲	335
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,531	▲	26
డాక్స్	20,913	▲	10
షాంఘై	3,244	▲	3
నికాయ్	38,808	▽	3

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	79,345
బంగారం (99.5 స్వచ్ఛత)	79,027
వెండి (కిలో)	90,200

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		86.12	87.14
£	బ్రిటన్ పౌండ్		104.30	107.10
€	యూరో		87.92	90.53
¥	జపాన్ ఎన్ (100)		54.21	55.55
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.53	54.72
S$	సింగపూర్ డాలర్		60.95	65.62
SAR	సౌదీ రియాల్		22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్		22.62	24.41
¥	చైనా యువాన్		10.91	12.73



రంగులు మార్చే రియల్‌మి ఫోన్

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల బ్రాండ్ రియల్‌మి పరిశ్రమలోనే తొలిసారిగా ఉష్ణోగ్రతలను బట్టి రంగు మార్చే కోల్డ్ సెన్సిటివ్ రియల్‌మి 14 ప్రో 5జీ, 14 ప్రో ప్లస్ 5జీ సిరీస్ స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. ఉష్ణోగ్రత 16 డిగ్రీల కన్నా దిగువకు పడిపోతే ఇవి ఒక దాన్నుంచి మరో రంగులోకి, ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ పూర్వ రంగులోకి మారతాయి. ఆఫర్ కింద 14 ప్రో 5జీ ఫోన్ల ధర రూ. 22,999 నుంచి ప్రారంభమవుతుంది. 14 ప్రో ప్లస్ 5జీ ఫోన్లలో డీఎస్‌ఎల్‌ఆర్ స్థాయి సోనీ ఐఎంఎక్స్896 ఓఐఎస్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్ 3 చిప్‌సెట్, 6000 ఎంఏహెచ్ బ్యాటరీ మొదలైనవి ఉంటాయి. వీటి ధర రూ. 27,999 నుంచి ప్రారంభమవుతుంది. ఫోన్లపై నిర్దిష్ట డిస్కౌంట్లు లభిస్తాయి. 14 ప్రో సిరీస్ 5జీ ఫోన్ల విక్రయం జనవరి 23 నుంచి మొదలవుతుంది. అటు వైర్‌లెస్ ఇయర్‌బడ్స్ 5 ఏఎన్‌సీ ఉత్పత్తులను కూడా కంపెనీ ఆవిష్కరించింది. వీటి ధర రూ. 1,599గా ఉంటుంది.

ఏటా పెట్టుబడి.. 2,000 కోట్లు

- వాణిజ్య వాహనాల అభివృద్ధికి వ్యయం
- టాటా మోటార్స్ ఈడీ గిరీశ్ వాఘ్



న్యూఢిల్లీ: కొత్త వాణిజ్య వాహనాలు, యంత్ర పరికరాల అభివృద్ధిపై ఏటా దాదాపు రూ.2,000 కోట్ల పెట్టుబడిని కొనసాగిస్తామని టాటా మోటార్స్ ఈడీ గిరీశ్ వాఘ్ వెల్లడించారు. ఇందులో ఎలక్ట్రిఫికేషన్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్, కనెక్టెడ్ వెహికిల్ ప్లాట్‌ఫామ్ వంటి నూతన సాంకేతికతలపై 40 శాతం పైగా వెచ్చిస్తామన్నారు. సంస్థకు చెందిన వాణిజ్య వాహన విభాగం ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఉద్గారాలను వెదజల్లని బ్యాటరీ ఎలక్ట్రిక్, ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్, హైడ్రోజన్ ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ వంటి వివిధ సాంకేతికతలపై పని చేస్తోందని చెప్పారు. సున్నా ఉద్గారాల దిశగా పరివర్తన వెంటనే జరగదు కాబట్టి అన్ని ప్రత్యామ్నాయ ఇంధనాలపై పని చేస్తున్నామని అన్నారు. 'నగరాలు, సమీప దూరాలకు బ్యాటరీ వాహనాలు పనిచేస్తాయి. సుదూర ప్రాంతాలకు, అధిక సామర్థ్యానికి హైడ్రోజన్ వంటి సాంకేతికత అవసరం. ఇటువంటి అవసరాలన్నింటినీ పరిష్కరించే సాంకేతికతలలో పెట్టుబడి పెట్టాం' అని వివరించారు.

హైడ్రోజన్ ట్రక్స్..

హైడ్రోజన్ ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ కలిగిన ట్రక్స్‌ను మార్చిలోగా పైలట్ ప్రాతిపదికన వినియోగిస్తామని గిరీశ్ వాఘ్ వెల్లడించారు. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా ఐవోసీఎల్‌తో కలిసి కంపెనీ 18 నెలల పాటు మూడు రూట్లలో ఈ ట్రక్కులను నడుపనుంది. ఫలితాలను బట్టి వాహనాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను పరిచయం చేసేందుకు రెడీ అవుతున్నట్టు వాఘ్ పేర్కొన్నారు. కంపెనీ తయారు చేసిన 15 ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ బస్‌లు ఐవోసీఎల్ 10 నెలలుగా వినియోగిస్తోందని వివరించారు. ఒకట్రెండేళ్లలో హైడ్రోజన్ ఫ్యూయల్ వాహనాలను వాణిజ్యపరంగా ప్రవేశపెడతామని చెప్పారు.

జొమాటో లాభం నేలచూపు



క్యూ3లో రూ. 59 కోట్లు

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 57 శాతం క్షీణించి రూ. 59 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 138 కోట్లు ఆర్జించింది. క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్ ఆర్డర్లను త్వరితగతిన సరఫరా చేసేందుకు చేపట్టిన స్టోర్ల విస్తరణ మార్జిన్లపై ప్రతికూల ప్రభావం చూపింది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం రూ. 3,288 కోట్ల నుంచి రూ. 5,405 కోట్లకు జంప్‌చేసింది. ఫుడ్ డెలివరీ, బీటూబీ (హైపర్‌ప్యూర్), క్విక్‌కామర్స్, గోయింగ్ ఔట్ తదితర విభాగాలు ఫలితాలలో కలసి ఉన్నట్లు మాతృ సంస్థ జొమాటో పేర్కొంది. ప్రణాళికలకంటే మూడు నెలలు ముందుగానే బ్లింకిట్ స్టోర్ల సంఖ్య 1,000ను అధిగమించినట్లు వాటాదారులకు రాసిన లేఖలో జొమాటో పేర్కొంది. 2026 డిసెంబర్‌కల్లా వీటి సంఖ్యను 2,000కు చేర్చే లక్ష్యంతో ఉన్నట్లు తెలియజేసింది.

బీఎస్‌ఈలో జొమాటో షేరు 3 శాతం క్షీణించి రూ. 241 వద్ద ముగిసింది.

పేటీఎం నష్టాలు తగ్గాయ్

క్యూ3లో రూ. 209 కోట్లు

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్(పేటీఎమ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో మరోసారి నష్టాలు చవిచూసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 209 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే గతేడాది(2023–24) ఇదే కాలంలో నమోదైన రూ. 222 కోట్లతో పోలిస్తే నష్టాలు దాదాపు 6% తగ్గాయి.



పేమెంట్ ప్రాసెసింగ్ చార్జీలు, ఉద్యోగ వ్యయాలు తగ్గడం ప్రభావం చూపింది. అయితే మొత్తం ఆదాయం 36% క్షీణించి రూ. 1,828 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో రూ. 2,851 కోట్ల టర్నోవర్ సాధించింది. పేమెంట్, ఫైనాన్షియల్, మార్కెటింగ్ సర్వీసులు నీరసించడం ఇందుకు కారణంకాగా.. జపనీస్ పేమెంట్స్ కంపెనీ పేపేలో వాటాను రూ.2,372 కోట్లకు సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్‌నకు విక్రయించడం ఇందుకు దోహదపడినట్లు కంపెనీ పేర్కొంది.

పేటీఎమ్ షేరు 0.7% తగ్గి రూ. 894 వద్ద క్లోజైంది.

స్మార్ట్ బజార్ 'ఫుల్ పైసా వసూల్' సేల్



హైదరాబాద్: రిలయన్స్ స్మార్ట్ బజార్ 'ఫుల్ పైసా వసూల్ సేల్' ప్రకటించింది. నిత్యావసర, కిరాణా సరుకులు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులపై భారీ తగ్గింపు ఇస్తుంది. జనవరి 22–26 తేదీల మధ్య ఆఫర్ అందుబాటులో ఉంటుంది. అధిక ధరల కట్టడికి, బడ్జెట్‌లో ప్రతి పైసాను సద్వినియోగం చేసుకునేందుకు 'ఫుల్ పైసా వసూల్ సేల్'ను వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో కొనుగోళ్లు

అర శాతానికిపైగా పెరిగిన సూచీలు



ముంబై: బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం అరశాతం లాభపడ్డాయి. దేశీయ కార్పొరేట్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పిస్తుండటం కలిసొచ్చింది. సెన్సెక్స్ 454 పాయింట్లు పెరిగి 77,073 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 142 పాయింట్లు బలపడి 23,345 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపడంతో రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 700 పాయింట్లు ఎగసి 77,319 వద్ద, నిఫ్టీ 188 పాయింట్లు దూసుకెళ్లి 23,391 వద్ద గరిష్టాన్ని అందుకున్నాయి. ఇటీవల పతనంలో భాగంగా దిగివచ్చిన చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ లభించడంతో బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.82%, 0.66 శాతం పెరిగాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

➡ లక్ష్మీ డెంటల్ షేరు లిస్టింగ్ ఈ రోజు మెరిసింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.428)తో పోలిస్తే 23% ప్రీమియంతో రూ.528 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 36% దూసుకెళ్లి రూ.584 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 29% లాభంతో రూ.551 వద్ద నిలిచింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

బీమా పరిశ్రమకు ధీమా జీడీపీ వృద్ధి 7%: మూడీస్	ప్రపంచ ఎకానమీపై ట్రంప్ ఎఫెక్ట్: బిర్లా



ఈ-త్రీవీలర్స్‌లోకి టీవీఎస్..

టీవీఎస్ మోటార్ కంపెనీ ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల రంగంలోకి ప్రవేశించింది. ఎక్స్‌పోలో భాగంగా కింగ్ ఈవీ మ్యాక్స్‌ను పరిచయం చేసింది. ఇది భారత్‌లో బ్లూటూత్‌తో అనుసంధానించిన తొలి ఎలక్ట్రిక్ త్రీ-వీలర్. స్థిర సాంకేతికతతో పట్టణ మొబిలిటీని పెంచే లక్ష్యంతో దీనిని రూపొందించినట్టు కంపెనీ తెలిపింది. టీవీఎస్ స్మార్ట్‌కనెక్ట్‌తో తయారైంది. ఇది స్మార్ట్‌ఫోన్ ఇంటిగ్రేషన్ ద్వారా రియల్ టైమ్ నావిగేషన్, అలర్ట్స్, వాహన స్థితిగతులను తెలియజేస్తుంది. ఒకసారి చార్జింగ్‌తో 179 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని టీవీఎస్ తెలిపింది. 3 గంటల 30 నిమిషాల్లో 100 శాతం చార్జింగ్ పూర్తి అవుతుంది. 51.2 వోల్ట్ ఎల్‌ఎఫ్‌పీ బ్యాటరీ పొందుపరిచారు. గంటకు గరిష్ట వేగం 60 కిలోమీటర్లు. ఎక్స్ షోరూం ధర రూ.2.95 లక్షలు.

మళ్లీ స్కోడా డీజిల్ కార్లు

- ఈ ఏడాదే డీజిల్ సూపర్బ్ మార్కెట్లోకి
- డీజిల్‌కు ఇప్పటికీ దేశంలో డిమాండ్
- స్కోడా ఇండియా హెడ్ పీటర్ యానిబా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ కంపెనీ స్కోడా ఆయిదేళ్ల తర్వాత భారత్‌లో డీజిల్ ఇంజన్స్‌ను మళ్లీ ప్రవేశపెడుతోంది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో వేదికగా సూపర్బ్ డీజిల్ కారును ప్రదర్శించింది. కొడియాక్ డీజిల్ సైతం త్వరలో వచ్చే అవకాశాలు ఉన్నాయి. భారతీయ కస్టమర్లు ఇప్పటికీ డీజిల్ కార్లను డిమాండ్ చేస్తున్నారని స్కోడా ఇండియా హెడ్ పీటర్ యానిబా తెలిపారు. 'స్కోడా కార్ల విక్రయాల్లో గతంలో 80 శాతం యూనిట్లు డీజిల్ విభాగం కైవసం చేసుకుంది. హ్యుందాయ్, కియా, టాటా, మహీంద్రా అమ్మకాల్లో గణనీయ భాగం డీజిల్ వాహనాలు సమకూరుస్తున్నాయి. లగ్జరీ కార్ల తయారీ సంస్థలైన మెర్సిడెస్, బీఎండబ్ల్యూలకు కూడా అంతే. కాబట్టి లగ్జరీ, ఎగ్జిక్యూటివ్ సెగ్మెంట్ల మధ్యలో ఉన్న స్కోడా ఈ మార్పు నుండి గణనీయంగా ప్రయోజనం పొందుతుంది. మేము కచ్చితంగా డిమాండ్‌ను నెరవేర్చడానికి చూస్తున్నాం' అని వివరించారు.

బ్రేక్స్ ఇండియా రూ.1,000 కోట్లు..

బ్రేకింగ్ సిస్టమ్స్ తయారీలో ఉన్న బ్రేక్స్ ఇండియా వివిధ ప్లాంట్లలో సామర్థ్యం పెంపునకు 2030 నాటికి రూ.1,000 కోట్లు పెట్టుబడి చేయాలని నిర్ణయించింది. నూతన ప్లాంట్లు సైతం ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ ఎండీ శ్రీరామ్ విజి వెల్లడించారు. రాబోయే 4–5 సంవత్సరాలలో పెద్ద పెట్టుబడులతో సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్ సామర్థ్యాలను మెరుగుపరుస్తామని ఆయన చెప్పారు. జపాన్‌కు చెందిన ప్రీమియం బ్రేక్ సిస్టమ్ సరఫరాదారు యాడ్‌విక్స్‌తో కలిసి జేవీ నెలకొల్పింది. ఈ జేవీలో బ్రేక్స్ ఇండియాకు 51 శాతం వాటా ఉంది. తమిళనాడులోని హోసూరు వద్ద రూ.500 కోట్లతో జేవీ ప్లాంటు ఏర్పాటవుతోంది. తొలి ఉత్పాదన అయిన ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్స్‌ను 2027 నుంచి తయారు చేయనున్నారు. సంస్థకు దేశవ్యాప్తంగా 17 ప్లాంట్లు ఉన్నాయి. 2023–24లో రూ.7,500 కోట్ల టర్నోవర్ సాధించింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బీటెక్ అర్హతతో ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలు

అవివాహిత ఇంజనీరింగ్ పురుష, మహిళా అభ్యర్థులకు ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ) 379 టెక్ పోస్టులకు ప్రకటన విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ప్రీ-కమిషనింగ్ ట్రెనింగ్ అకాడమీ (పీసీటీఏ)లో అక్టోబర్-2025 కోర్సు ప్రారంభవవుతుంది.

» **మొత్తం ఖాళీలు:** 379
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 01.10.2025 నాటికి 20 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి
» **వేతనం:** నెలకు రూ.56,000 – రూ.2,50,000
» **ఎంపిక ప్రక్రియ:** షార్ట్‌లిస్ట్,ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 05.02.2025
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

నిట్‌లో అధ్యాపక పోస్టులు

కాలికట్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

» **మొత్తం పోస్టులు:** 10
» **పోస్టు వివరాలు:** అసోసియేట్ ప్రొఫెసర్ గ్రేడ్2
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు బోధనలో అనుభవం ఉండాలి. జాతీయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
» **వయసు:** 50 ఏళ్లలోపు వారై ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక ప్రక్రియ:** రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 10.02.2025
» **వెబ్‌సైట్:** https://facultyrecruit.nitc.ac.in

యుకో బ్యాంకులో 250 ఉద్యోగాలు

కోల్‌కతాలోని యునైటెడ్ కమర్షియల్ బ్యాంకు (యుకో బ్యాంకు) 250 లోకల్ బ్యాంకు ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 250
» **పోస్టు వివరాలు:** లోకల్ బ్యాంకు ఆఫీసర్
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. పనిచేసే రాష్ట్రాల్లో స్థానిక భాష వచ్చి ఉండాలి. **వయసు:** 01.01.2025 నాటికి 30 ఏళ్లకు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు,ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.48,480 – రూ.85,920.
» **ఎంపిక ప్రక్రియ:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా.
» **పని ప్రదేశాలు:** తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,గుజరాత్,మహారాష్ట్ర,అస్సాం,కర్ణాటక,త్రిపుర, సిక్కిం, నాగాలాండ్,మేఘాలయ, కేరళ, జమ్మూ కశ్మీర్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 05.02.2025.
» **వెబ్‌సైట్:** https://ucobank.com

ఉస్మానియా యూనివర్శిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్శిటీలో కేటగిరీ–2 కింద సైన్స్, ఆర్ట్స్, ఓరియంటల్ లాంగ్వేజెస్, సోషల్ సైన్సెస్, కామర్స్, ఎడ్యుకేషన్, లా, మేనేజ్‌మెంట్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ, టెక్నాలజీ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **ఫ్యాకల్టీలు:** సైన్స్, ఆర్ట్స్, ఓరియంటల్ లాంగ్వేజెస్, సోషల్ సైన్సెస్, కామర్స్, ఎడ్యుకేషన్, లా, మేనేజ్‌మెంట్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ, టెక్నాలజీ అండ్ ఇన్ఫర్మేటిక్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో పీజీ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు 50 శాతం) ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు యూజీసీ/సీఎస్ఐఆర్ /ఐసీఏఆర్/ఐసీఎంఆర్/డీఎస్‌టీ-ఇన్‌స్పైర్ నుంచి జేఆర్ఎఫ్ అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.01.2025.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.02.2025
» **రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 05.03.2025.
» **వెబ్‌సైట్:** https://www.osmania.ac.in

సీబీఎస్‌ఈ వర్సెస్ స్టేట్ బోర్డ్.. ఏది బెటర్!

జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్-యూజీ.. ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో.. ప్రవేశానికి నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లు! ఇంటర్మీడియెట్/10+2 అర్హతతో.. ఈ ఎంట్రన్స్‌లకు హాజరయ్యే అవకాశం లభిస్తుంది! ఇందుకోసం ఇంటర్‌లో చేరిన మొదటి రోజు నుంచే విద్యార్థులు కృషి చేస్తున్నారు!! మరోవైపు జేఈఈ, నీట్ పరీక్షల్లో రాణించేందుకు ఏ బోర్డ్ సిలబస్ మంచిది.. సీబీఎస్‌ఈలో చేరాలా లేదా స్టేట్ బోర్డు బెటరా?!అనే సందేహాలు. ఈ నేపథ్యంలో.. జేఈఈ, నీట్ పరీక్షలకు సంబంధించి సీబీఎస్‌ఈ, ఇంటర్మీడియెట్ బోర్డ్‌ల సిలబస్ సానుకూల, ప్రతికూల అంశాలపై విశ్లేషణ..

» నీట్, జేఈఈలకు ఏ బోర్డ్ బెటర్ అనే సందేహం
» సైన్స్‌కు అనుకూలంగా సీబీఎస్‌ఈ
» మ్యాథ్స్‌కు అనుకూలంగా స్టేట్ బోర్డ్



జేఈఈ, నీట్ ఎగ్జామ్స్

ప్రస్తుతం 10+2/ఇంటర్మీడియెట్ అర్హతగా జాతీయ స్థాయిలో నిర్వహించే అన్ని పరీక్షలు సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగానే ఉంటున్నాయి. దీంతో సీబీఎస్‌ఈలో చేరితే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరికొందరు మాత్రం జేఈఈ పరీక్షలను ఇంటర్మీడియెట్ బోర్డ్ సిలబస్‌తోనే బాగా రాణించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

సీబీఎస్‌ఈ గ్రూప్స్

సీబీఎస్‌ఈ +2 స్థాయిలో.. సైన్స్ స్ట్రీమ్‌లో మెడికల్, నాన్-మెడికల్ పేరుతో రెండు సబ్ స్ట్రీమ్‌ల విధానం అమలవుతోంది. నాన్-మెడికల్ స్ట్రీమ్‌లో.. విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్,ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లతోపాటు ఏదైనా ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌ను చదవాల్సి ఉంటుంది. దీన్ని పీసీఎం గ్రూప్‌గా పిలుస్తున్నారు. మెడికల్ స్ట్రీమ్‌లో.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లతోపాటు ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌ను చదవాలి. దీన్నే పీసీబీ గ్రూప్‌గా పేర్కొంటున్నారు.

స్టేట్ బోర్డ్

రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూప్‌లు ప్రధానంగా నిలుస్తున్నాయి. వీటిలో చేరిన అభ్యర్థులు ఫస్ట్ లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్ తోపాటు గ్రూప్ సబ్జెక్ట్‌లుగా నిర్దేశించిన మూడు సబ్జెక్ట్‌లను చదవాల్సి ఉంటుంది. సీబీఎస్‌ఈ బోర్డ్ మాదిరిగా ఆప్షనల్ సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకునే అవకాశం స్టేట్ బోర్డ్ సిలబస్‌లో ఉండదు. ఇంజనీరింగ్‌లో చేరాలనుకునే విద్యార్థులు ఎంపీసీ(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ); మెడికల్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు బైపీసీ(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లను ఎంచుకుంటున్నారు.

'మెడికల్' లక్ష్యమైతే

10+2/ఇంటర్మీడియెట్ తర్వాత ఎంబీబీఎస్‌లో చేరాలనుకునే విద్యార్థులు నీట్-యూజీ పరీక్షలో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది. నీట్ లక్ష్యంగా చేసుకునే విద్యార్థులు సీబీఎస్‌ఈ బోర్డ్‌లో చేరితే మంచిదనే వాదన వినిపిస్తోంది. అదే విధంగా జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌లలో మెరుగ్గా రాణించాలంటే కూడా సీబీఎస్‌ఈ బోర్డ్ మేలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరీక్షల సిలబస్ అంతా సీబీఎస్‌ఈ కరిక్యులం ఆధారంగా రూపొందించడమే ఇందుకు కారణం. మరికొంతమంది మాత్రం స్టేట్ బోర్డ్ ఎంపీసీ విద్యార్థులు జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ముందంజలో నిలిచేందుకు అవకాశముందని చెబుతున్నారు. దీనికి కారణం.. స్టేట్ బోర్డ్ స్థాయిలో మ్యాథమెటిక్స్ సిలబస్ విస్తృతంగా ఉండటమే. కానీ..సైన్స్ సబ్జెక్ట్‌లు(ఫిజిక్స్, కెమిస్ట్రీ) విషయానికొస్తే సీబీఎస్‌ఈనే బెస్ట్ అంటున్నారు.

అప్లికేషన్ అప్రోచ్

సీబీఎస్‌ఈలో అప్లికేషన్ అప్రోచ్‌తో బోధన సాగిస్తున్నారు. లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో ప్రాక్టికల్ ఆధారిత, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఉంటోంది. ఫలితంగా ప్రవేశ పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు అడిగినా.. సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తోంది. అదే స్టేట్ బోర్డ్ విషయానికొస్తే.. వార్షిక విధానంలో నిర్వహించే ప్రాక్టికల్స్ మినహా.. మిగతా సమయంలో ప్రాక్టికల్ అప్రోచ్ ఆధారిత టీచింగ్, లెర్నింగ్ చాలా తక్కువగా కనిపిస్తోంది.

బోర్డ్ ఎంపిక.. ముఖ్యాంశాలు

- నీట్‌కు అనుకూలంగా సీబీఎస్‌ఈ బోర్డ్.
- జేఈఈకి అనుకూలంగా స్టేట్ బోర్డ్.
- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ఆధారంగా నీట్, జేఈఈ ప్రశ్నల రూపకల్పన.
- బోర్డ్ ఏదైనా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలంటున్న సబ్జెక్ట్ నిపుణులు.

స్టేట్ బోర్డ్.. ఇలా

స్టేట్ బోర్డ్‌లో రెండేళ్ల ఇంటర్మీడియెట్‌లో తొలి రోజు నుంచే జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్, ఎంసెట్ పరీక్షల కోణంలో బోధన సాగిస్తున్నారు. ఆయా పరీక్షల పాత ప్రశ్న పత్రాల సాధన, వీక్లీ టెస్ట్‌ల నిర్వహణ వంటి విధానాలతో విద్యార్థులు పుస్తకాలకే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది. ఫలితంగా వాస్తవ దృక్పథాన్ని, అప్లికేషన్ అప్రోచ్‌ను కోల్పోయే ఆస్కారం ఏర్పడుతోంది. దీంతో పరీక్షల్లో అప్లికేషన్ ఆధారిత ప్రశ్నలు ఎదురైనప్పుడు స్టేట్ బోర్డు విద్యార్థులు కొంత వెనుకంజలో ఉంటున్నారని చెబుతున్నారు.

సిలబస్ మార్చినా

స్టేట్ బోర్డ్‌లో చదివే విద్యార్థులు సైతం జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో రాణించాలనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం ఇంటర్మీడియెట్ స్టేట్ బోర్డ్ సిలబస్‌లో మార్పులు చేశారు. ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో దాదాపు 80 శాతం సిలబస్ సీబీఎస్‌ఈ సిలబస్‌కు సరితూగే విధంగా మార్చారు. కానీ.. బోధన పరంగా అందుకు అనుగుణమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం,టీచింగ్ సిబ్బంది కొరత వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

జేఈఈ.. స్టేట్ బోర్డ్

గత మూడేళ్ల జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ యూజీ ఫలితాలను చూస్తే.. తెలుగు రాష్ట్రాల నుంచి ర్యాంకులు సాధించిన వారిలో అధికశాతం మంది స్టేట్ బోర్డ్ విద్యార్థులే ఉన్నారు. నీట్-యూజీలో టాప్ పర్సంటైల్ కోణంలో మాత్రం సీబీఎస్‌ఈ బోర్డ్ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీనికి స్టేట్ బోర్డ్‌లో మ్యాథమెటిక్స్‌కు, సీబీఎస్‌ఈలో సైన్స్‌కు అధిక ప్రాధాన్యం ఉండటమే కారణమని చెబుతున్నారు.

సీబీఎస్‌ఈ నుంచి స్టేట్ బోర్డ్‌కి

తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి వరకు సీబీఎస్‌ఈ బోర్డ్‌లో చదివిన విద్యార్థులు సైతం ఇంటర్మీడియెట్‌లో స్టేట్ బోర్డ్‌ను ఎంచుకుంటున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌లలో ఉండే మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో స్టేట్ బోర్డ్ సిలబస్‌తో ముందంజలో నిలవొచ్చనే అభిప్రాయమే దీనికి కారణమని పేర్కొంటున్నారు.

బోర్డ్ ఏదైనా.. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలే

ఇంటర్మీడియెట్‌లో ఏ బోర్డ్‌ను ఎంచుకున్నా.. జాతీయ స్థాయిలో జేఈఈ, నీట్‌లలో రాణించాలంటే.. అకడమిక్ పుస్తకాలతో పాటు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోని టాపిక్స్‌తోపాటు ప్రతి యూనిట్ తర్వాత ఇచ్చే ఎక్సర్‌సైజ్‌లను ప్రాక్టీస్ చేయడం ద్వారా నీట్, జేఈఈలలో రాణించే సత్తా లభిస్తుందని స్పష్టం చేస్తున్నారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోని అంశాల ఆధారంగా జేఈఈ, నీట్ ప్రశ్న పత్రాల రూపకల్పన జరుగుతుందని చెబుతున్నారు. కాబట్టి స్టేట్ బోర్డ్, సీబీఎస్‌ఈ బోర్డ్‌ల విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలని సూచిస్తున్నారు.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్

జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేందుకు సిలబస్‌కు అనుగుణంగా ఆయా అంశాలను లోతుగా ప్రిపేర్ అవడంతోపాటు ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. బేసిక్స్, కాన్సెప్ట్స్, అప్లికేషన్స్‌కు ప్రాధాన్యమివ్వాలని పేర్కొంటున్నారు. ఆయా ప్రశ్నలకు, వాటి ఫార్ములా ఆధారంగా పలు విధానాల్లో సమాధానం రాబట్టేలా ప్రాక్టీస్ కొనసాగించాలని చెబుతున్నారు.

ఏకరూప సిలబస్‌తో.. మేలు

నూతన విద్యా విధానం-ఉమ్మడి సిలబస్ అంశాన్ని సిఫార్సు చేసింది. దీనివల్ల అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలలో అన్ని రాష్ట్రాల సిలబస్ ఒకే మాదిరిగా ఎన్‌సీఈఆర్‌టీ ఆధారంగా రూపొందించాలని; హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీ తదితర గ్రూప్‌ల విషయంలో 70 శాతం ఉమ్మడి సిలబస్‌ను, 30 శాతం సంబంధిత రాష్ట్ర పరిస్థితులకు సంబంధించిన అంశాలను జోడించి రూపొందించాలని పేర్కొంది. ఉమ్మడి సిలబస్ విధానం ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. అయితే సీబీఎస్‌ఈ, స్టేట్ బోర్డు.. రెండింటిలోనూ సానుకూల, ప్రతికూల అంశాలున్నాయని.. విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ఆధారంగా ప్రిపరేషన్ సాగించడం ద్వారా జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- మెంటల్ ఎబిలిటీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

వీసా కష్టం.. పైసా నష్టం..

దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న వీసా తిరస్కరణల సంఖ్య



ఇందులో తెలుగు రాష్ట్రాల బాధితులూ ఎక్కువ సంఖ్యలోనే

కరోనా తర్వాత కఠినంగా మారిన నిబంధనలు

వీసా తిరస్కరణలతో గత ఏడాది రూ. **664** కోట్ల నష్టం

32.5% భారతీయ దరఖాస్తులకు నో చెప్పిన న్యూజిలాండ్ | అదే క్రమంలో ఆస్ట్రేలియా, యూకే.. అమెరికా కాస్త నయం!

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యార్జన, ఉజ్వల భవిష్యత్తు కోసం, ఇతర కారణాలతో విదేశాలకు వెళ్లే వారు ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోగా.. మరోవైపు వీసా తిరస్కరణ బాధితుల సంఖ్యా పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారి వీసాలూ అధిక సంఖ్యలోనే తిరస్కరణకు గురవుతున్నాయి. దేశవ్యాప్తంగా వీసాల తిరస్కరణ కారణంగా గత ఏడాదిలో నష్టపోయిన మొత్తం రూ.660 కోట్ల పైమాటేనని నిపుణులు అంచనా వేస్తున్నారు. పర్యాటకులను స్వాగతించే దేశంగా పేరున్న యూఏఈ వీసాలు పొందడంలో సైతం ఎదుర్కొన్న ఇబ్బందులను చాలామంది గత ఏడాది చివరిలో సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. జనవరి నుంచి అక్టోబర్ 2024 మధ్యకాలంలో యూఏఈని సందర్శించిన వారిలో 24.8% మంది భారతీయులే. భారతీయ పర్యాటకులకు అత్యంత ప్రసిద్ధ గమ్యస్థానాలలో ఒకటిగా యూఏఈ ఉంది. అయితే కొంతకాలం క్రితం దుబాయ్ ఇమ్మిగ్రేషన్ విభాగం ప్రవేశపెట్టిన కఠినమైన నిబంధనల కారణంగా భారీ స్థాయిలో వీసాలు తిరస్కరణలకు గురయ్యాయి. కోవిడ్ అనంతరం ఇతర అనేక దేశాలు కూడా తమ వీసా నిబంధనలను సవరించాయి. ఈ నేపథ్యంలో వీసాల తిరస్కరణ కారణంగా గత ఏడాది భారతీయులు రూ.664 కోట్లను నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి.

తిలా పాపం తలా పిడికెడు

వీసా నిబంధనలు కఠినతరం చేసిన దేశాలలో యూఏఈతో పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే ప్రధానంగా ఉన్నాయి. గత ఏడాది న్యూజిలాండ్ 32.5 శాతం భారతీయ వీసా దరఖాస్తులను తిరస్కరించింది, ఆస్ట్రేలియా 29.3 శాతం, యూకే 17 శాతం మందిని తిరస్కరించాయి. స్కెంజెన్ ఏరియా (యూరప్) 15.7 శాతం వీసాల్ని తిరస్కరించింది. యూఏఈ భారతీయ వీసాల తిరస్కరణ రేటు గత ఏడాది 6 శాతానికి చేరుకుంది. అయితే 2019లో వీసా ఆమోదం రేట్లతో పోల్చినప్పుడు. 2024లో భారతీయుల కోసం అధిక శాతం వీసాలను ఆమోదించిన దేశంగా అమెరికా నిలిచింది. 2019లో 28 శాతం భారతీయ వీసా దరఖాస్తులను యూఎస్ తిరస్కరించగా, 2024లోకి వచ్చేసరికి ఇది 16 శాతానికి తగ్గింది. అయితే అమెరికా వెళ్లేందుకు మనవారి వీసా దరఖాస్తుల సంఖ్య పరంగా చూస్తే ఈ 16 శాతం కూడా ఎక్కువేనని నిపుణులు చెబుతున్నారు.

కోవిడ్ తర్వాత కఠినంగా..

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే, యూఏఈ వంటి దేశాలు వీసా నిబంధనలను కఠినతరం చేయడం అనేది..కరోనా మహమ్మారి అనంతరం ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన వీసా దరఖాస్తుల సూక్ష్మస్థాయి పరిశీలన, ఎంపిక ధోరణిని ప్రతిబింబిస్తోంది. వీసాల తిరస్కరణ రేటు పెరుగుదల భారతీయ ప్రయాణీకులను ఆందోళనకు గురిచేస్తోంది. దరఖాస్తుదారులు.. తమకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సరిగ్గానే ఉన్నాయని, తమ దరఖాస్తులు పూర్తి దోష రహితంగా ఉన్నాయని నిర్ధారించుకోవాల్సిన ఆవశ్యకతను ఈ పరిస్థితి స్పష్టం చేస్తోంది.

'ఎంఫార్మ్ కోసం అమెరికా వీసాకు దరఖాస్తు చేస్తే రెండుసార్లు తిరస్కరణకు గురైంది. మరోసారి అప్లయ్ చేయబోతున్నా. ఇప్పటివరకు రూ.42 వేలు ఖర్చయ్యింది. నా స్నేహితుడు ఒకరికి 10 సార్లు వీసా నిరాకరించారు..' అని పంజాగుట్ట నివాసి ప్రవీణ్ చెప్పాడు. ఇక రెండుసార్లు, మూడుసార్లు వీసా తిరస్కరణలకు గురి కావడమనేది సర్వసాధారణంగా మారుతోంది. యూకేకి రూ.12 వేలు మొదలుకుని రూ.లక్ష పైగా వీసా దరఖాస్తు ఫీజులు ఉన్నాయి. అలాగే ఆస్ట్రేలియాకు రూ.4 వేల నుంచి రూ.60 వేలు వరకూ, న్యూజిలాండ్‌కు రూ.11 వేల నుంచి రూ.1.15లక్షల వరకూ, యూఏఈకి రూ.8 వేల నుంచి

సర్వ సాధారణంగా మారిన తిరస్కరణలు

రూ.35 వేలు ఆపైన ఉన్నాయి. అమెరికాకు రూ.20 వేల వరకూ వీసా ఫీజులు ఉన్నాయి. అయితే వెళ్లే కారణాన్ని బట్టి, వీసా పొందడానికి ఎంచుకున్న విధానాన్ని బట్టి ఈ ఫీజులు ఇంతకంటే పెరగవచ్చు కూడా. 'మా అబ్బాయి అమెరికా వీసాకి మొదటిసారి రూ.70 వేల దాకా పెట్టిన ఖర్చు వృథా అయ్యింది. రెండవసారి దాదాపు అంతే ఖర్చు పెట్టి వీసా తెచ్చుకున్నాం..'అని మల్కాజిగిరికి చెందిన లక్ష్మి చెప్పారు. మొత్తంగా చూస్తే వీసా తిరస్కరణల కారణంగా పెద్ద మొత్తంలోనే నష్టం జరుగుతోందనేది నిర్వివాదాంశం. ఈ నేపథ్యంలో వీసా నిబంధనలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని, డాక్యుమెంట్లన్నీ పూర్తి కచ్చితత్వంతో ఉండేలా చూసుకున్న తర్వాతే దరఖాస్తు చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా...

ప్రయాగ్‌రాజ్‌కు తొలి 'భారత్ గౌరవ్'



సాక్షి, హైదరాబాద్: మహాకుంభమేళా మొట్టమొదటి భారత్ గౌరవ్ రైలు సోమవారం సికింద్రాబాద్ నుంచి బయలుదేరింది. ఈ పర్యటనలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌తోపాటు పలు ప్రాంతాలను సందర్శించనున్నారు. ఈ నెల 26వ తేదీ వరకు మొత్తం 7 రాత్రులు, 8 పగళ్ల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసిన ఈ ట్రైన్‌ను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో యాత్రికుల్లో ఒకరైన సీనియర్ సిటిజన్ తపన్ చంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో వారణాసి, ప్రయాగ్‌రాజ్, అయోధ్యలోని దివ్య క్షేత్రాలను భక్తులు సందర్శించనున్నారు. రెండవ 'మహా కుంభమేళా పుణ్య క్షేత్ర యాత్ర' భారత్ గౌరవ్ రైలు ఫిబ్రవరి 15వ తేదీన బయలుదేరనుంది. ప్యాకేజీ వివరాల కోసం ఫోన్ : 040-27702407, 9701360701 నంబర్లలో సంప్రదించవచ్చు.

ముగిసిన టెట్... 74.44 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సోమవారంతో ముగిసింది. ఈనెల 2 నుంచి ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో మొదలైంది. పది రోజుల పాటు, రోజుకు రెండు సెషన్లుగా నిర్వహించారు. పరీక్షకు 2,75,753 మంది దరఖాస్తు చేసుకోగా, 2,05,278 మంది హాజరయ్యారు. 70,475 మంది పరీక్ష రాయలేదు. మొత్తంగా 74.44 శాతం హాజరు నమోదైనట్టు విద్యాశాఖ వెల్లడించింది.

హెచ్‌సీయూలో ఎంబీఏ సీటుకు చివరి అవకాశం

దరఖాస్తుకు చివరి తేదీ జనవరి 31



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ కోర్సు (2025–27)లో సీటు కోసం దరఖాస్తు చేసుకోవడానికి చివరి అవకాశం కల్పిస్తున్నారు. క్యాట్–2024లో సాధించిన స్కోరు, గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం పైగా మార్కుల ద్వారా ప్రవేశం కల్పిస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 31 చివరి తేదీ. ప్రస్తుతం గ్రాడ్యుయేషన్ ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులకు కూడా దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నారు. ఎంబీఏ అడ్మిషన్ నోటిఫికేషన్, ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ అప్లికేషన్ లింకు, మరిన్ని వివరాలకు హెచ్‌సీయూ వెబ్‌సైట్ http://acad.uohyd.ac.in/mba25.html ను సందర్శించాలి. ఇప్పటివరకు ఈ కోర్సు పూర్తి చేసిన వారు టీసీఎస్, డిలాయిట్, సింక్రోని, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హిటాచీ, ఫెడరల్ బ్యాంకు వంటి సంస్థలలో ఉద్యోగ అవకాశాలు పొందారని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుద్దాల అశోక్ తేజకు వేటూరి పురస్కారం

తుని: తెలుగు సినిమా పాటల రచయిత సుద్దాల అశోక్ తేజకు వేటూరి చతుర్ధశ పురస్కారాన్ని అందజేయనున్నట్టు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కె.ఆర్.జె.శర్మ, శ్రీ ప్రకాశ్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు సీహెచ్.విజయ్‌ప్రకాశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న వేటూరి జయంతిని పురస్కరించుకుని కాకినాడ జిల్లా, తునిలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ.. సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక..

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

- దేశంలోని అత్యున్నత హైకోర్టుల్లో తెలంగాణ ఒకటి
- మహిళా న్యాయమూర్తుల సంఖ్య సాధికారతకు నిదర్శనం
- ఈ-వారెంట్లు, ఈ-సమన్ల కోసం 'ఎన్-స్టెప్' తెచ్చామన్న సీజే

సీజేకు ఘనంగా ఫుల్‌కోర్టు వీడ్కోలు • హైకోర్టు సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పిన సీజే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు స్వాగతించదగినవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. తెలంగాణలోని వారసత్వాన్ని, సమగ్రతను హైకోర్టు కొనసాగిస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. దేశంలోని అత్యున్నత హైకోర్టుల్లో తెలంగాణ ఒకటన్నారు. 2019లో కొత్తగా ఏర్పాటైన తెలంగాణ హైకోర్టులో అత్యధిక సంఖ్యలో మహిళా న్యాయమూర్తులు ఉండటం సాధికారతకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తున్న రాష్ట్రానికి ఎప్పటికీ ప్రత్యేకత ఉంటుందని చెప్పారు. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయిన జస్టిస్ అరాధేను సోమవారం హైకోర్టు ఆవరణలోని మొదటి కోర్టు హాల్‌లో ఫుల్‌కోర్టు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా జస్టిస్ అరాధే మాట్లాడుతూ.. 'సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రధాన న్యాయమూర్తిగా నాకు సహకరించిన న్యాయమూర్తులకు, ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు. 100 శాతానికి మించి కేసుల పరిష్కారానికి అంతా కలిసికట్టుగా పనిచేశాం. ఈ-కమిటీ సభ్యుల సహకారంతో న్యాయాన్ని సత్వరం అందించగలిగాం. క్రిమినల్ కేసుల్లో వారెంట్లు, సమన్లను అందించడానికి దేశంలోనే ఎన్-స్టెప్‌ను అమల్లోకి తెచ్చిన రెండో కోర్టుగా నిలిచాం. కోర్టు గౌరవాన్ని కాపాడటానికి, అనవసర వాయిదాలు ఇవ్వకుండా నిరంతరం కృషి చేశా. కోర్టు నిర్వహణలో కఠినంగా, క్రమశిక్షణతో వ్యవహరించా. ఇది కొందరిని బాధించవచ్చు. కోర్టు గౌరవాన్ని కాపాడటం కోసమే అలా వ్యవహరించాల్సి వచ్చింది. పేరుపేరునా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని చెప్పారు.

డిజిటల్ బాట పట్టించిన సీజే

న్యాయవ్యవస్థను డిజిటల్ బాట పట్టించడంలో, సాంకేతికత వినియోగంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరాధే పాత్ర మరువలేనిదని సీనియర్ న్యాయమూర్తి (కాబోయే తాత్కాలిక సీజే) జస్టిస్ సుజోయ్ పాల్ పేర్కొన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు, సిబ్బంది, ప్రజల కోసం అనేక కొత్త కార్యక్రమాలు అమల్లోకి తెచ్చారని ప్రశంసించారు. కొత్త హైకోర్టు నిర్మాణానికి ఎంతో కృషి చేశారని, అందులో భాగంగానే గత ఏడాది శంకుస్థాపన జరిగిందని, రూ.2,580 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయని చెప్పారు. 'జస్టిస్ అరాధే హైకోర్టు ప్రత్యక్ష ప్రసారాలకు, హైబ్రిడ్ (ఫిజికల్, లైవ్‌లో వాదనలు వినిపించేలా) విధానానికి శ్రీకారం చుట్టి పారదర్శకతకు పెద్దపీట వేశారు. పెండింగ్ కేసులను తగ్గించడం కోసం విశేష కృషి చేశారు. 2023, జూలై 21 నాటికి పెండింగ్ కేసుల సంఖ్య 2,38,173 ఉండగా, ఈ జనవరి 10 నాటికి 2,29,148కు తగ్గింది. సీజేగా జస్టిస్ అరాధే 8,404 కేసులు పరిష్కరించగా, 6,177 అత్యంత ప్రధానమైనవి కావడం విశేషం' అంటూ సీజే సేవలను కొనియాడారు.



మాట్లాడుతున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ శామ్ కోషి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి కావాలి..

అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసుల నమోదు సంఖ్య కంటే ఎక్కువ కేసులను పరిష్కరించారని జస్టిస్ అరాధేను కొనియాడారు. ఐఎంజీ భారత లాంటి కేసుల్లో వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారంటూ పలు కీలక తీర్పులు వినిపించారు. వీధి కుక్కల దాడులపై సుమోటోగా విచారణ జరిపి వాటి నివారణకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. జస్టిస్ అరాధే భవిష్యత్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, అదనపు సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, రిజిస్ట్రార్ జనరల్, ఇతర రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీజేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ చైర్మన్ ఎ.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు దీప్తి తదితరులు పాల్గొన్నారు.



ఆ ఖాళీలను పిటిషనర్లతో భర్తీ చేయండి

- 553 జూనియర్ లైన్‌మెన్ పోస్టులను మెరిట్ ప్రకారం భర్తీ చేయండి
- రాష్ట్రపతి ఉత్తర్వులు జీఎల్‌ఎంలకు వర్తించవు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్‌మన్ (జేఎల్‌ఎం) పోస్టులను పిటిషనర్లతో భర్తీ చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)ను హైకోర్టు ఆదేశించింది. ఇతరులను అనుమతించవద్దని పేర్కొంది. ఇప్పటికే స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తే వారితో పోస్టులను భర్తీ చేయాలని, ఒకవేళ ఆ పరీక్షను పూర్తిచేసిన వారు లేకుంటే వెంటనే నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని స్పష్టం చేసింది. 2019లో టీఎస్ఎస్పీడీసీఎల్ 2,500 జేఎల్‌ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. దీనికి రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయడాన్ని సవాల్ చేస్తూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తిరుమలేశ్ సహా దాదాపు 110 మంది 2020లో హైకోర్టును ఆశ్రయించారు. జిల్లాల విభజన కారణంగా అటు ఉమ్మడి జిల్లాకు, ఇటు కొత్త జిల్లాకు కాకుండా తాము నష్టపోయామని పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిచ్చారు. రాష్ట్రపతి ఉత్తర్వులను జేఎల్‌ఎం పోస్టులకు వర్తింపజేయలేరని టీఎస్ఎస్పీడీసీఎల్‌కు తేల్చిచెప్పారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాలను యూనిట్‌గా తీసుకుని 95 శాతం స్థానిక రిజర్వేషన్లు అమలు చేయడాన్ని తప్పుబడుతూ.. కొత్త జిల్లాల అభ్యర్థులు ఉమ్మడి జిల్లాకు నాన్ లోకల్ కారని చెప్పారు. ఇప్పటికే 1,900కు పైగా పోస్టులను అధికారులు భర్తీ చేయగా.. మిగిలిన 553 ఖాళీలను మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని సింగిల్ జడ్జి ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ టీఎస్ఎస్పీడీసీఎల్ అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి విచారణ చేపట్టారు. వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది.

తొలిసారిగా గవర్నర్ ప్రతిభా పురస్కారాలు

4 రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు వేర్వేరుగా పురస్కారాలు.. వివరాలు వెల్లడించిన రాజ్‌భవన్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా తొలిసారిగా ఇవ్వనున్న గవర్నర్ ప్రతిభా పురస్కారాలు–2024 వివరాలను రాజ్‌భవన్ కార్యదర్శి దానకిషోర్ ప్రకటించారు. ఈ నెల 26న సాయంత్రం రాజ్‌భవన్‌లో నిర్వహించే తేనేటి విందులో ఈ పురస్కారాలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రదానం చేయనున్నారు. మొత్తం 4 రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు వేర్వేరుగా పురస్కారాలను అందజేస్తామని దానకిషోర్ చెప్పారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆ వివరాలు ప్రకటించారు. పురస్కారాలకు ఎంపికైన వారికి రూ.2 లక్షల నగదుతోపాటు ప్రశంసాపత్రం అందజేస్తారన్నారు. వివిధ రంగాల్లో వ్యక్తులు, సంస్థలు చేస్తున్న సేవలను గుర్తించి ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలొస్తాయని గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. మొత్తం 594 దరఖాస్తులు రాగా, కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య నేతృత్వంలోని జ్యూరీ అర్హులను ఎంపిక చేసిందన్నారు. పురస్కార గ్రహీతల ఎంపికలో లింగ నిష్పత్తితో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు సమప్రాధాన్యం ఇచ్చామని పద్మనాభయ్య తెలిపారు.

రంగం	వ్యక్తిగత కేటగిరీ	సంస్థ
పర్యావరణ పరిరక్షణ	దుశ్చర్ల సత్యనారాయణ	ధ్రువాంశ్ ఆర్గనైజేషన్
క్రీడలు	దీప్తి జీవాంజి	ఆదిత్య మెహతా ఫౌండేషన్
సంస్కృతి	పీబీ కృష్ణభారతి	సంస్కృతి ఫౌండేషన్
దివ్యాంగుల సంక్షేమం	అరికెపూడి రఘు	ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి

దుశ్చర్ల సత్యనారాయణ తన 80 ఎకరాల భూమిలో అడవిని ఏర్పాటు చేయడంతోపాటు జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవడంతో ఆయన్ను పర్యావరణ పరిరక్షణ విభాగం కింద ఎంపిక చేశామన్నారు.

దివ్యాంగుల కేటగిరీ కింద పారా ఒలింపియన్ దీప్తి జీవాంజిని తాము ఎంపిక చేశామని, ఇటీవల కేంద్రం ఆమెకు అర్జున పురస్కారం ప్రకటించిందని గుర్తు చేశారు.

హిందూ సాంప్రదాయాలు, సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు గాను సాంస్కృతిక విభాగం కింద సంస్కృతి ఫౌండేషన్‌ను ఎంపిక చేశామన్నారు.

ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి 2023లో రూ.10 కోట్లు విలువైన ఉచిత వైద్యం పేదలకు అందించిందన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో జ్యూరీ సభ్యులు పర్యావరణవేత్త అనిల్‌కుమార్, దివ్యాంగుల హక్కుల కార్యకర్త పి.హనుమంతరావు, కూచిపూడి నృత్యకారిణి పద్మజారెడ్డి పాల్గొన్నారు.

ఇంట్లో ఏ నూనె వాడుతున్నారు?



దీప్ ఫ్రైలు తరచూ చేస్తున్నారా?
- వంట నూనెల వినియోగంపై సర్వే..
- శ్రీకారం చుట్టిన కేంద్ర వ్యవసాయ శాఖ

న్యూఢిల్లీ: దేశంలో వంటనూనెల వినియోగ తీరుతెన్నులను అంచనా వేయడానికి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మొట్టమొదటి సర్వేను ప్రారంభించింది. ఈ ఏడాది జూలై నుంచి అందుబాటులోకి రానున్న న్యూ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్‌సీడ్స్‌ను (ఎన్ఎంఈఓ-ఆయిల్‌సీడ్స్) సమర్థవంతంగా అమలు చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఒక సీనియర్ అధికారి తెలిపారు. జనవరి 9న ప్రారంభమైన ఈ సర్వే ఫిబ్రవరి 23 వరకు కొనసాగుతుంది. 7 సంవత్సరాల్లో రూ.10,103 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ మిషన్ దేశీయ నూనెగింజల ఉత్పత్తిని 2030–31 నాటికి 69.7 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌లో 2022–23లో 39 మిలియన్ టన్నుల నూనెగింజలు ఉత్పత్తి అయ్యాయి. ప్రస్తుతం దేశీయ మొత్తం నూనెల అవసరాలలో 55–60% ఇండోనేషియా, మలేషియా, అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్‌తో సహా పలు దేశాల నుండి భారత్ దిగుమతి చేసుకుంటోంది. 2023–24 నూనెల మార్కెటింగ్ సంవత్సరంలో దిగుమతులు 15.96 మిలియన్ టన్నులు నమోదయ్యాయి.

ఏం తెలుసుకుంటారంటే..: ఉపయోగిస్తున్న నూనెల రకాలు, డీప్ ఫ్రైయింగ్ ఎన్నిసార్లు చేస్తున్నారు?, సీజన్‌నుబట్టి వినియోగిస్తున్నారా? వంటి సమాచారం ఈ సర్వే ద్వారా తెలుసుకుంటారు. అలాగే ఆరోగ్య ప్రయోజనాలు, ధరలను పరిగణనలోకి తీసుకోవడం సహా నూనెల ఎంపికను ప్రభావితం చేసే అంశాలను సేకరిస్తారు. ట్రాన్స్‌ఫ్యాట్‌లు, నూనెల పునర్వినియోగంపై వినియోగదార్ల వైఖరి, ప్యాక్ చేసిన ఆహారాలలో వాడిన నూనెల గురించిన ఆందోళనలు, తలెత్తే ఆరోగ్య సమస్యల గురించి ఏ మేర కు అవగాహన కలిగి ఉన్నారో అంచనా వేస్తారు. ప్రకటనలు, ప్యాక్‌పై ఉన్న సమాచారాన్ని చదువుతున్నారా, ఆరోగ్యకర నూనెల కోసం ప్రీమియం ధరలను చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారా వంటి అంశాలనూ అధ్యయనం చేస్తారు.

సగటున 20 కిలోలు..

వంట నూనెల వినియోగంలో, దిగుమతిలో ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా భారత్ నిలిచింది. అయితే నూనెల వినియోగ తీరుతెన్నులపై తాజా సమాచారం లేకపోవడంతో ప్రభుత్వం ఈ సర్వే చేపట్టింది. భారత్‌లో తలసరి వంట నూనెల వినియోగం ఏటా 20 కిలోలు దాటిందని పరిశ్రమ నివేదికలు చెబుతున్నాయి. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) 12 కిలోలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సిఫార్సు చేసిన 13 కిలోల కంటే వినియోగం ఎక్కువగా ఉండడం గమనార్హం. తలసరి వినియోగం 1950–60లో 2.9 కిలోలు. పెరుగుతున్న ఆదాయాలు, పట్టణీకరణ, మారుతున్న ఆహారపు అలవాట్ల వంటి కారణాలు ఈ వృద్ధిని నడిపిస్తున్నాయి.

కొత్త కోర్సులుంటేనే కాలేజీలకు అనుమతి!

- డిగ్రీలో సమూల మార్పులపై ఉన్నత విద్యా మండలి దృష్టి
- ప్రాజెక్టు వర్క్ ఉండేలా కొత్త సిలబస్ ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు
- డిమాండ్ లేని కోర్సులకు సంబంధించి లక్ష సీట్లు తగ్గించే యోచన
- ఈ ఏడాది వంద డిగ్రీ కాలేజీలకు అనుమతి కష్టమే..: అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది సమగ్రంగా మారబోతోంది. 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్)'తెరమరుగుకానుంది. దీని స్థానంలో పాత పద్ధతిలోనే కాలేజీలు సొంతంగా అడ్మిషన్లు చేపట్టబోతున్నాయి. ఇందుకు సంబంధించి కసరత్తు పూర్తి చేసినట్టు ఉన్నత విద్య మండలి వర్గాలు తెలిపాయి. త్వరలోనే దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు వెల్లడించాయి. ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే డిగ్రీ ప్రవేశాల విధి విధానాలను ఖరారు చేస్తామని అధికారులు చెప్తున్నారు. అయితే కోర్సుల ఏర్పాటు, అనుమతులు విద్యా మండలి అధీనంలోనే ఉంటాయని.. ఏయే కోర్సులకు, ఏయే కాలేజీలకు అనుమతించాలనేది మండలి నిర్ణయిస్తుందని వివరిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. దాదాపు వంద డిగ్రీ కాలేజీలకు ఈ ఏడాది అనుమతి కష్టమే. కొత్త విధి విధానాలు వచ్చిన తర్వాత అందుకు తగ్గట్టుగా కోర్సులు ఉంటే తప్ప అనుమతించేది లేదని ఉన్నతాధికారులు తేల్చి చెబుతున్నారు.

లక్ష సీట్లకు కోత..

'దోస్త్'పరిధిలో ప్రస్తుతం 1,055 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, రెసిడెన్షియల్, గురుకులాల్లో కలిపి మొత్తం 4,75,704 డిగ్రీ సీట్లున్నాయి. అయితే కొన్నేళ్లుగా డిగ్రీ ప్రవేశాలు 45శాతానికి మించడం లేదు. ముఖ్యంగా ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 32శాతమే సీట్లు భర్తీ అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో అయితే ఇది 29 శాతమే. నిజానికి రాష్ట్రంలో ఏటా 3.90 లక్షల మంది ఇంటర్ ఉత్తీర్ణులవుతున్నారు. వారంతా డిగ్రీలో చేరినా ఇంకా దాదాపు 80వేల సీట్లు మిగిలిపోయే పరిస్థితి. ఇలా విద్యార్థులు తక్కువ, సీట్లు ఎక్కువ ఉండటంపై ఉన్నత విద్యా మండలి సమగ్ర అధ్యయనానికి ఆదేశించింది. వివిధ వర్గాల నుంచి నివేదికలు తెప్పించుకుంది. రాష్ట్రంలోని డిగ్రీకాలేజీల్లో భర్తీ అవుతున్న సీట్లలో సగానికిపైగా సీట్లు కొత్త కోర్సులకు సంబంధించినవే ఉంటున్నాయి. బీకాం ఫైనాన్స్, కంప్యూటర్స్, ఇన్సూరెన్స్ వంటి కాంబినేషన్ సబ్జెక్టులకు డిమాండ్ ఉంది. ఆ తర్వాత స్థానంలో బీఎస్సీ కంప్యూటర్స్, లైఫ్‌సైన్స్ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. కానీ ఈ కోర్సులు అన్ని కాలేజీలలో లేవు. సుమారు 400 కాలేజీల్లో ఇప్పటికీ సాధారణ డిగ్రీ కోర్సులే ఉన్నాయి. కాంబినేషన్ కోర్సులు ఎక్కువ భాగం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీల్లోనే ఉంటున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని.. యూజీసీ, ఉన్నత విద్యా మండలి డిజైన్ చేసిన కోర్సులను అందుబాటులోకి తెచ్చిన కాలేజీలకే అనుమతివ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. దీంతో దాదాపు లక్ష సీట్లను తగ్గించే వీలుందని మండలి వర్గాలు అంటున్నాయి.





కొత్త సిలబస్ అందుబాటులోకి..

ఉన్నత విద్యా మండలి 2025–26 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. సాధారణ డిగ్రీలో కంప్యూటర్ కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి సబ్జెక్టులను అందుబాటులోకి తేనుంది. ఈ దిశగా నిపుణులు సిలబస్‌ను రూపొందించారు. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలను కాలేజీలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో ఈ కోర్సులను బోధించేందుకు నిపుణులైన అధ్యాపకులు అవసరం. కొత్త సిలబస్‌లో తరగతి గదిలో బోధనతో సమానంగా నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రెండో ఏడాది నుంచే ప్రాజెక్టు వర్క్ ప్రవేశపెడుతున్నారు. ఏఐ కోర్సు తీసుకునే విద్యార్థులు ఏదైనా ప్రముఖ కంపెనీ తోడ్పాటుతో సొంతంగా సరికొత్త ప్రాజెక్టు చేయాల్సి ఉంటుంది. రెండో ఏడాది మినీ ప్రాజెక్టు, మూడో ఏడాది పెద్ద ప్రాజెక్టును చేపట్టాలి. దీనికోసం కాలేజీలు కొన్ని సంస్థలతో భాగస్వామ్య ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ఎంఓయూ ఉన్న కాలేజీలకు మాత్రమే ఈసారి అనుబంధ గుర్తింపు ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి భావిస్తున్నట్టు తెలిసింది. ఇంటర్ పరీక్షలు పూర్తయ్యేలోగా ఈ మార్పులపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
మంగళవారం ♦ 21-1-2025



సింగరేణి కార్మికులు



గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

డుమ్మాలో యువ కార్మికులే ఎక్కువ!

అకారణంగా గైర్హాజరవుతున్న 'కారుణ్య' ఉద్యోగులు

105 మంది సింగరేణి కార్మికులకు డిస్మిస్ లేఖలు

నీరుగారుతున్న తల్లిదండ్రుల ఆశలు

ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, డిగ్రీలతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం తండ్రి నుంచి వారసత్వంగా వచ్చే సింగరేణి ఉద్యోగం చేయాలని ఆశతో బొగ్గు గనుల్లో అడుగుపెడుతున్నారు. తీరా ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడక కొందరు.. వర్క్‌కల్చర్ నచ్చక.. మరికొన్ని కారణాలతో ఇంకొందరు ఉద్యోగాల్లో చేరిన కొద్దిరోజులకే విధులకు అకారణంగా డుమ్మా కొడుతూ డిస్మిస్ పాలవుతున్నారు. వీరిసంఖ్య ఏటా పెరుగుతుండటంతో తల్లిదండ్రుల ఆశలు నీరుగారుతున్నాయి. - సాక్షి, పెద్దపల్లి

తట్టచెమ్మాస్ కనుమరుగైనా..

గతంలో భూగర్భ గనుల్లోకి దిగి, పైకి ఎక్కడం, తట్టచెమ్మాస్ పూర్తిగా కనుమరుగై మ్యాన్ రైడింగ్, చైర్‌కార్, చైర్‌లిఫ్ట్ లాంటి విధానం ద్వారా తీసుకెళ్లి తిరిగి తీసుకొస్తున్నారు. దీంతో కార్మికులకు శ్రమ చాలా తగ్గింది. అయినా, చాలామంది యువ కార్మికులు ఆఫీస్ కార్యాలయాలు, ఓసీపీల్లో లైట్‌జాబ్ కోసం పైరవీలు చేసుకుంటూ గైర్హాజరవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మూడుసార్లు కౌన్సెలింగ్

అకారణంగా గైర్హాజరైతే మూడు దఫాలుగా కార్మికులకు కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటారు. ఎన్నిసార్లు కౌన్సెలింగ్ చేసినా పద్ధతి మార్చుకోకపోతే విధుల నుంచి తప్పిస్తారు. ఉద్యోగం కోల్పోతే ఎదుర్కోవాల్సిన ఇబ్బందులను వివరిస్తూ, పద్ధతి మార్చుకోవాలని కౌన్సెలింగ్ ఇస్తారు. అయినా, పద్ధతి మార్చుకోని వారికి చార్జిషీట్ ఇచ్చి గైర్హాజరైన కారణాలకు సరైన సమాధానాలు ఇవ్వాలని సూచిస్తారు. అయినా స్పందించకపోతే వారిని డిస్మిస్ చేస్తారు.

కారుణ్య నియామకాలు ఇలా..

సింగరేణిలో పనిచేసే కార్మికుడు మెడికల్ ఇన్వాలిడేషన్‌తో విధుల నుంచి తప్పుకుంటే వారిస్థానంలో కారుణ్య నిమామకం ద్వారా ఉద్యోగం ఇస్తున్నారు. తెలంగాణ వచ్చాక 2015 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, ఇప్పటివరకు సుమారు 15వేల మంది యువత ఉద్యోగాల్లో చేరారు. విధుల్లో చేరిన నాటి నుంచి మూడేళ్లపాటు పనిచేస్తే వారి ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయి.

వంద మస్టర్లు పడాల్సిందే..

బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరిన కార్మికులకు ఏటా భూగర్భ గనుల్లో అయితే 190 మస్టర్లు, సర్‌ఫేజ్‌లో అయితే 240 మస్టర్లు ఉండాలి. అవి ఉంటేనే వారి ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయి. ఏటా వంద మస్టర్ల చొప్పున మూడేళ్లపాటు 300 మస్టర్లుంటే ఉద్యోగానికి గ్యారంటీ. లేని పక్షంలో యాజమాన్యం నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తుంది. సింగరేణివ్యాప్తంగా 1,890 మంది ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదు. వంద మస్టర్ల లోపు ఉన్న ఉద్యోగులను గుర్తించి నవంబర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా మార్పురాని ఉద్యోగులను తొలగించేందుకు సింగరేణిలోని వివిధ డివిజన్ల పరిధిలోని 105 మందికి డిస్మిస్ పత్రాలను సంస్థ జారీచేసింది. సరైన సమాధానం రాని పక్షంలో ఉద్యోగం నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నారు. 45 రోజుల్లోపు పద్ధతి మార్చుకొని సరైన వివరణ ఇచ్చి విధులకు హాజరై ఉద్యోగాలు కాపాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సీజేకు ఘనంగా వీడ్కోలు



సోమవారం హైకోర్టులో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేకు జ్ఞాపికను అందిస్తున్న జస్టిస్ శామ్ కోషి. చిత్రంలో సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్



పండ్లు అందిస్తున్న జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న జస్టిస్ మౌషుమి భట్టాచార్య



పండ్లు అందిస్తున్న జస్టిస్ వినోద్‌కుమార్



శాలువాతో సత్కరిస్తున్న జస్టిస్ కె.లక్ష్మణ్




పుష్పగుచ్ఛం ఇస్తున్న జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి



సీజేను సన్మానిస్తున్న హైకోర్టు బార్ అసోసియేషన్ చైర్మన్ ఏ. రవీందర్‌రెడ్డి. చిత్రంలో జస్టిస్ సుజోయ్‌పాల్, ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శులు శాంతిభూషణ్, సంజీవ్‌కుమార్, అదనపు కార్యదర్శి నవీన్‌కుమార్ వాసిరెడ్డి తదితరులు



సోమవారం సంధ్యా సమయంలో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద బుద్ధుడు ఇలా కనువిందు చేశాడు



సోమవారం జీడిమెట్లలోని ఫాక్స్‌సాగర్ చెరువులో ఓ చేపను నోట కరుచుకుని ఎగిరిపోతున్న కొంగ



రాజకోటలో అంతఃపురం

చరిత్రకు సజీవ సాక్ష్యం.. రాజకోట

అడుగడుగునా అద్భుత కట్టడాలు

- నిజాం హయాంలో ఎక్కువ రాబడి వచ్చిన సంస్థానం
- శిథిలావస్థకు చేరుతున్న శతాబ్దాల చరిత్ర
- కోటలో పలు సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్ చిత్రీకరణ
- అమలుకాని పర్యాటక హబ్ ప్రతిపాదనలు

యాదగిరిగుట్ట: నిజాం ప్రభువులకు లక్షలాది రూపాయల కప్పం కట్టిన సంపన్న సంస్థానం.. ఒకప్పుడు అద్భుతమైన కట్టడంగా భాసిల్లిన కోట నిర్మాణం.. అదే.. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన రాజకోట. 250 ఏళ్ల చరిత్ర కలిగిన రాతి కట్టడాల నిలయంగా.. రాచరికపు మహోన్నత వైభవానికి.. చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచింది రాజాపేటలోని రాజా వారి కోట. హైదరాబాద్‌కు 90 కిలోమీటర్లు.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. నిజాం రాజ్యంలోని అన్ని సంస్థానాల కన్నా ఎక్కువ రాబడి ఈ సంస్థానం నుంచే వచ్చేదని చరిత్రకారులు చెబుతారు. అంతేకాదు.. గొప్ప కట్టడాలున్న సంస్థానంగా కూడా పేరు ఉండేది. ఇక్కడ చిన్న చిన్న షూటింగ్‌లు, ఫొటో షూట్లు సైతం జరుగుతుంటాయి. కోటలోని అద్భుత శిల్ప కళా సంపద అప్పటి శిల్పుల గొప్పతనాన్ని చాటుతుంది.

కోట చరిత్ర

రాజాపేట గ్రామానికి పడమటి భాగంలో గోపాలపురం అనే గ్రామం ఉండేది. గ్రామం పైభాగంలో చెరువు ఉండేది. ఆ చెరువు వరద ముంపునకు గురైన గోపాలపురం గ్రామం కాలగర్భంలో కలిసిపోయింది. అనంతరం రాజ రాయన్న అనే రాజు 1775లో కోటను నిర్మించి గ్రామాన్ని ఏర్పాటు చేశాడు. రాజ రాయన్న పాలన సాగించిన కోటనే నేడు రాజాపేటగా పిలుస్తున్నారు. రాజాపేట గ్రామం చుట్టూ కందకం తవ్వారు. కోట గోడ ప్రాకారం, ఎత్తయిన రాతి గోడలతో చుట్టూ శత్రు దుర్భేద్యంగా నిర్మించారు. గ్రామం మధ్యలో ఉండేలా.. మూడు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేశారు. ఎగువ పడమటి వైపున్న గోపాల చెరువు నుంచి కందకంలో నీరు పారేలా ఏర్పాట్లు చేసి.. శత్రువులు చొరబడకుండా మొసళ్లను పెంచేవారు. గ్రామం లోపలి ప్రధాన ద్వారం దాటితే రాజ నివాసం, అంతఃపురం, అద్దాల మేడ, అతిథి గృహం, నీటి కొలను, గిరిగిరిమాల్, ఏనుగుల మోట, ఖైదీల కారాగారం, సైనికుల శిక్షణ స్థలం వంటివి కనిపిస్తాయి. శత్రువుల నుంచి కోటను రక్షించేందుకు చుట్టూ నిర్మించిన ఎత్తయిన బురుజులు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తాయి. వారి ప్రాణాలను రక్షించుకునేందుకు కోట నుంచి బయటికెళ్లేందుకు సొరంగ మార్గాలున్నాయి.

పర్యాటకుల తాకిడి.. సినిమా షూటింగ్‌లు..

రాజకోటలో బురుజులు, అంతఃపురం, నీటి కొలను, సైనిక ప్రాంగణం, ఏనుగుల మోట, గిరిగిరిమాల్ తదితర అద్భుత నిర్మాణాలు.. సినిమా షూటింగ్‌లు, ఫొటోషూట్‌కు అనుకూలంగా ఉన్నాయి. యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి 20 కిలోమీటర్ల దూరంలో, సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న, కొండపోచమ్మ ఆలయాలకు వెళ్లే మార్గాల్లో ఈ కోట ఉండటంతో పర్యాటకులు సందర్శించేందుకు వీలుంది.



కోటను సందర్శించిన నటుడు బాలకృష్ణ (ఫైల్)

ఇప్పటికే షార్ట్ ఫిలిమ్స్‌తో పాటు పలువురు ప్రీ వెడ్డింగ్ షూట్లు ఇక్కడ తీస్తున్నారు.

అభివృద్ధికి నోచుకోని గడికోట

రాజకోట రాజవంశీకులు ఈ కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని గతంలో నిర్ణయించారు. దీంతో పర్యాటక శాఖాధికారులు రాజకోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2019 అక్టోబర్ 29న పర్యాటక శాఖాధికారులు గడిని సందర్శించారు. అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం, తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువు, రాజాపేట గడికోట, కొలనుపాకలోని జైన్ మందిర్, సోమేశ్వర ఆలయాలను కలుపుతూ టూరిజం హబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

భావితరాలకు అందించాలి




రాజకోటను తిలకించేందుకు పర్యాటకులు, సినీ నటులు తరచూ వస్తున్నారు. కోటలో ఇప్పటికే పలు సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, ప్రీ వెడ్డింగ్ షూట్లు జరిగాయి. 250 ఏళ్ల చరిత్ర కలిగిన రాజకోటను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దాలి.
- కొత్తకొండ భాస్కర్, రాజాపేట గ్రామస్తుడు

రాజకోటను పరిరక్షించాలి



మా కాలంలో ఈ కోట ఎంతో అద్భుతంగా ఉండేది. కానీ ఇప్పుడు నిరాదరణకు గురైంది. ఎంతో చరిత్ర కలిగిన రాజాపేటలోని రాజకోటను అభివృద్ధి చేయాలి. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన యాదగిరిగుట్ట, కొమురవెల్లి ఆలయాలకు అతి సమీపంలోని ఈ కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.
- పుల్లంగారి సిద్ధయ్య, రాజాపేట



రాజాపేట గ్రామం చుట్టూ బురుజులు



శిథిలావస్థకు చేరుతున్న రాజకోట లోపలి భాగాలు



రాజకోట సైనిక ప్రాంగణం ముందు భాగం



రుయాకు నిర్లక్ష్య రోగం

రాయలసీమకే తలమానికమైన తిరుపతిలోని రుయా ఆసుపత్రికి నిత్యం పలు జిల్లాల నుంచి ప్రజలు వైద్యసేవల కోసం వస్తుంటారు. అయితే వీరికి సేవలందించడంలో ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యం అడుగడుగునా స్పష్టంగా కనిపిస్తుంది. ఇందుకు సోమవారం ఆసుపత్రి ప్రాంగణంలో కనిపించిన ఈ చిత్రాలే నిదర్శనం. సాధారణంగా రోగులను వైద్యం కోసం ఒక వార్డు నుంచి మరో వార్డుకు మార్చేందుకు స్ట్రెక్చర్ లేదా వీల్ చైర్ వినియోగిస్తారు. రోగుల కోసం వినియోగించాల్సిన వీటిని ఇక్కడి సిబ్బంది మందులు, ఖాళీ డబ్బాలు, గోనె సంచులు, ఆసుపత్రి ఫైళ్లు తీసుకువెళ్లేందుకు ఉపయోగిస్తున్నారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను మాత్రం ఆక్సిజన్ సిలెండర్‌తో రోడ్డుపై నడిపించి తీసుకువెళ్తున్నారు. కనీసం జాలి, దయ లేని రుయా సిబ్బంది తీరుపై రోగుల బంధువులు మండిపడుతున్నారు.

– మోహన్‌కృష్ణ కేతారి, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





ఆరు ప్యాకేజీలుగా ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు

సాక్షి, అమరావతి: సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో పోర్టులు కీలకపాత్ర పోషించనున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళగిరిలోని ఏపీ మారిటైం బోర్డు కార్యాలయంలో సోమవారం పోర్టుల అభివృద్ధి–పురోగతిపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈపీసీ పద్ధతిలో చేపట్టిన మూడు పోర్టుల ప్రగతితోపాటు ఫేజ్–1లో చేపట్టిన 4 ఫిషింగ్ హార్బర్లు, ఫేజ్–2లో చేపట్టబోయే ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులపై మంత్రి సమీక్షించారు. ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు గతంలో ఒకే ప్యాకేజ్ కింద టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదని అధికారులు చెప్పగా... వాటిని 6 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలని మంత్రి సూచించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో గోడౌన్లకు సంబంధించి అర్హత కలిగిన వారి లీజులను పొడిగించాలని చెప్పారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్లను పెంచాలి
మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: ఔత్సాహికులకు నైపుణ్య శిక్షణ కోసం ఉద్యమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అధికారులతో ర్యాంప్ ప్రోగ్రామ్ పురోగతిపై సోమవారం మంత్రి సమీక్షించారు. ఈ నెల 27వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు.

సీఎం చేతుల మీదుగా పురస్కారాలు ఇప్పించండి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లకు జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని గతేడాది నవంబర్ 11న విజయవాడలో సీఎం సత్కరించారు. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందన్న కారణంతో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 26 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేయలేదు. వారికి రిపబ్లిక్‌డే పురస్కరించుకుని ఈనెల 26న ఆయా జిల్లాల్లో కలెక్టర్, విద్యాశాఖ అధికారుల ద్వారా పురస్కారాలు అందుకోవాలని ప్రభుత్వం సూచించింది. తమను రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపిక చేసి, జిల్లా స్థాయిలో తీసుకోమనడం భావ్యం కాదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తమకు సీఎం లేదా విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేయాలని మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు.

'యంగ్ ఇండియా' బేడీ కన్నుమూత



పెనుకొండ రూరల్: యంగ్ ఇండియా ప్రాజెక్టును స్థాపించి..గ్రామీణ ఉపాధి హామీ హక్కుల కోసం ఉద్యమించిన నరేంద్ర సింగ్ బేడీ(86) కన్నుమూశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోని యంగ్ ఇండియా ఫారంలోని తన నివాసంలో సోమవారం ఉదయం మృతిచెందారు. కోల్‌కతాకు చెందిన బేడీ కెమికల్ ఇంజినీరింగ్ చదివారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపకల్పనలో తనవంతు పాత్ర పోషించారు. మంగళవారం మధ్యాహ్నం యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ప్రాంగణంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కదలనంటున్న లారీ.. ఉపాధికి ఏది దారి?


సాలూరులో లారీలు

సంక్షోభంలో సాలూరు లారీ పరిశ్రమ

- రాష్ట్రంలో విజయవాడ తరువాత రెండో స్థానం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి
- పన్నుల భారం, నిర్వహణ వ్యయం పెరగడంతో వాహనాలు అమ్ముకుంటున్న యజమానులు

సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు: వేలాది మందికి ఉపాధి కల్పించే పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు లారీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. రాష్ట్రంలో విజయవాడ తర్వాత రెండో అతిపెద్ద లారీ పరిశ్రమగా సాలూరుకి గుర్తింపు ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు పది వేల మందికిపైగా దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాలూరు లారీలది కీలక స్థానం. లోడింగ్, అన్‌లోడింగ్‌లతో యజమానులు, కార్మికులు క్షణం తీరిక లేకుండా గడిపేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. పన్నుల వడ్డింపు, టోల్ బాదుడు, ఇంధన భారం.. వెరసి బళ్లు తీసేందుకే యజమానులు వెనుకాడుతున్నారు. «సాలూరు లారీ పరిశ్రమలో ఒక్క వాహన యజమాని దగ్గర కూడా గ్రాము బంగారమైనా లేదు. అంతా బ్యాంకుల్లో కుదవలోనే ఉంది. నష్టాలతో లారీలను నడపలేకపోతున్నాం. మా దగ్గర పని చేసేవారికి మొన్న సంక్రాంతికి బోనస్ కూడా ఇవ్వలేక, ముఖం చూపించుకోలేకపోయాం.».. ఇదీ ఓ లారీ యజమాని ఆవేదన. ఒకప్పుడు వేలాది మందికి జీవనోపాధి కల్పించిన లారీ మోటారు పరిశ్రమ.. నేడు సంక్షోభంలో కూరుకుపోతోంది.

12 లారీలతో మొదలు..

1960వ దశకంలో ఉపాధి, వ్యాపార అవకాశాలు లేక ఈ ప్రాంతం నుంచి వలసలు అధికంగా ఉండేవి. ఇదే సమయంలో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి విజయనగరం, పార్వతీపురం రైల్వే స్టేషన్లకు ముడి సరుకులు ఎక్కువగా వచ్చేవి. అప్పట్లో వీటిని నాటుబండ్లపై గమ్యస్థానాలకు చేర్చేవారు. లారీలు కొంటే వ్యాపార వృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని కొందరు ఆలోచించారు. కాస్త ఆర్థిక స్థోమత ఉన్న వారు 1960లో తొలుత 12 లారీలు కొన్నారు. మూడేళ్లు తిరిగేసరికి లారీల సంఖ్య 30కి చేరింది. 1963లో సాలూరు లారీ ఓనర్స్ అసోసియేషన్‌గా ఏర్పడింది. ప్రస్తుతం ఇక్కడ 2,800 వరకు లారీలు ఉన్నాయి. లారీ పరిశ్రమను నమ్ముకుని డ్రైవర్లు, క్లీనర్లే కాక.. బాడీబిల్డింగ్, పెయింటింగ్, స్టిక్కరింగ్, టైర్లు, అద్దాలు, వెల్డింగ్ తదితర విభాగాల్లో వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు.

పన్నుల భారం.. ఉపాధి దూరం

ఓవైపు భారీగా పెరిగిన ఇంధన ధరలు.. మరోవైపు పన్నుల పెంపు, దీనికితోడు గ్రీన్ ట్యాక్స్ బాదుడు కారణంగా లారీ యజమానులు కుదేలైపోతున్నారు. 2024 మార్చి తర్వాత వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఒకప్పుడు యజమానులు.. నేడు డ్రైవర్లుగా మారిపోతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక, బంగారాన్ని బ్యాంకుల్లో కుదవ పెడుతున్నారు. 2012 సంవత్సరంలో ఆదాయం ఎలా ఉండేదో.. ఇప్పటికీ అలానే ఉంది. ఇదే సమయంలో ఖర్చులు విపరీతంగా పెరిగాయి. రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను ప్రస్తుతం 25 నుంచి 30 శాతం పెరిగింది. గ్రీన్ ట్యాక్స్ గతంలో రూ.150 ఉండగా ప్రస్తుతం రూ.10 వేలకుపైగా చెల్లించాల్సి వస్తోంది. ఏపీ ట్యాక్స్ ప్రతి మూడు నెలలకోసారి రూ.13,450 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. వాహన బీమా గతంలో థర్డ్ పార్టీకి రూ.4 వేలు చెల్లిస్తే సరిపోయేది. ప్రస్తుతం థర్డ్ పార్టీదే రూ.43 వేలు అయిపోయింది. ఆల్ ఇండియా పర్మిట్ ట్యాక్స్, ఇతర పన్నులు కలిపి మొత్తం ఏడాదికి ప్రభుత్వానికి రూ.2 లక్షల వరకు కట్టాల్సి వస్తోందని లారీ యజమానులు వాపోతున్నారు. దీనికితోడు స్థానిక టోల్‌గేట్ల బాదుడు పెరిగింది. మరోవైపు డీజిల్ ధర పెరుగుతుండటంతో లోడింగ్ చేయగా వచ్చే మొత్తం ఎటూ చాలడం లేదని లారీ యజమానులు చెబుతున్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో లీటరు డీజిల్ ధర రూ.94 ఉందని, కర్ణాటక, తమిళనాడులోనూ తక్కువకే లభిస్తోందని, మన రాష్ట్రంలో మాత్రం డీజిల్ ధర రూ.97.30 ఉందని తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు వెళ్లే సమయంలో ట్రిప్పుకు 4,500 లీటర్ల వరకు డీజిల్ ఖర్చవుతుందని, లీటర్‌కు రూ.4 చొప్పున తగ్గించినా చాలావరకూ ఆదా అవుతుందని యజమానులు పేర్కొన్నారు. గతంలో ఒక లారీకి నెలకు నాలుగైదు ట్రిప్పులు తగిలేవని, అన్ని ఖర్చులు పోనూ ఒక ట్రిప్పుకు రూ. 15 వేలు వరకు మిగిలేదని, ఇప్పుడు రూ. 2 వేలు మిగలడం కూడా కష్టంగా ఉందని వాపోతున్నారు.

కాకినాడ పోర్టు వివాదం తర్వాత..

ఇటీవల కాకినాడ పోర్టు బియ్యం ఎగుమతుల వివాదం తర్వాత లారీ పరిశ్రమ ఉపాధి మరింత తగ్గిపోయింది. 'లోడింగ్ కోసం ఎవరూ మమ్మల్ని సంప్రదించడం లేదు. బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు షిప్‌మెంట్ కోసం వెళ్లిపోతున్నారు. దీని వల్ల మా ఉపాధి పోయింది' అని ఓ లారీ యజమాని తెలిపారు. దీనికితోడు ఈ ఏడాది పంట చేతికి వచ్చే సమయంలో తుపాన్లు రావడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడింది. ఫలితంగా పంట ఉత్పత్తుల రవాణా గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది తగ్గిపోయిందని చెబుతున్నారు. ఇక్కడి లారీలు ఎక్కువగా విశాఖ నుంచి రాయపూర్‌కు ముడి ఇనుము, ఇతర పరిశ్రమల సరకులు తరలిస్తాయి. రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు నిత్యావసరాల రవాణా ఎక్కువగా జరిగేది. ప్రస్తుతం వ్యాపారం సరిగా జరగకపోవడం, పన్నుల భారంతో లారీలన్నీ పక్కన పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని, నెలనెలా వాయిదాలు కూడా చెల్లించలేకపోతున్నామని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పన్నుల భారం తగ్గించకుంటే కష్టమే..



ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే డీజిల్ ధరలు మన రాష్ట్రంలో చాలా ఎక్కువగా ఉన్నాయి. రాయితీ ఇస్తే మమ్మల్ని ఆదుకునేవారవుతారని ఎప్పటి నుంచో కోరుతున్నాం. గ్రీన్ ట్యాక్స్ వెసులుబాటు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నాం. ఒకవైపు పన్నుల భారం, మరోవైపు సరకుల రవాణా తగ్గిపోవడం వల్ల లారీలను అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోంది. చాలామంది యజమానులు తిరిగి డ్రైవర్లుగా మారిపోతున్నారు. ఏటా సంక్రాంతిని ఘనంగా జరుపుకొనేవాళ్లం. డ్రైవర్లకు, క్లీనర్లకు, ఇతర వర్కర్లకు బోనస్‌లు ఇచ్చేవాళ్లం. ఈ సారి వారికి ముఖం కూడా చూపించలేకపోయాం.

– కె.మహేశ్వరరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ డైరెక్టర్, సాలూరు

లారీలు నడపలేకపోతున్నాం..

ఎంతో ఘన చరిత్ర ఉన్న సాలూరు లారీ పరిశ్రమ నేడు కుదేలైపోతోంది. లారీల కొనుగోలు, నిర్వహణకు అప్పులు చేశాం. కిరాయి డబ్బులు కూడా రాక యజమానులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. పన్నుల భారం, నిర్వహణ వ్యయం పెరగడంతో లారీలు అమ్మేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సంక్షోభం నుంచి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వేలాది మందికి ఒక దారి చూపాలి.

– జి.ఎరుకునాయుడు, లారీ యజమాని, సాలూరు

మత్స్య శాఖలో గంగా–మహేశ్వర లీలలు

- పోస్టింగులు లేకపోయినా ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల పెత్తనం
- డిపార్టుమెంట్ లాగిన్స్ అన్నీ మహేష్ అనే వ్యక్తికి అప్పగింత
- ఏడీ నుంచి అదనపు డైరెక్టర్ వరకూ అందరికీ ఆయనే బాస్
- మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

సాక్షి, అమరావతి: మత్స్య శాఖలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఎక్కువైపోయింది. ఎలాంటి పోస్టింగులు పొందకుండానే ఇద్దరు వ్యక్తులు అధికారులు, సిబ్బందిపై అజమాయిషీ చెలాయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1,900 మందికి దిక్సూచిలా ఉండాల్సిన మత్స్య శాఖ కమిషనరేట్ ప్రైవేటు వ్యక్తుల గుప్పెట్లో నలిగిపోతోంది. మంత్రుల అండదండలతోనే ప్రైవేటు వ్యక్తులు రెచ్చిపోతున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. మంత్రి కొల్లు రవీంద్ర సిఫార్సుతో పగ్గాలు చేపట్టిన మత్స్య శాఖ కమిషనర్ అడ్డగోలుగా తీసుకుంటున్న నిర్ణయాలు ఆ శాఖకు శాపంగా మారాయని చెబుతున్నారు. ఈయన బాధ్యతలు చేపట్టిన కొత్తలో ఆయనకు సాయం చేసే నెపంతో వచ్చిన మహేష్ అనే వ్యక్తికి ఆ శాఖలో ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండానే పెత్తనం కట్టబెట్టారు. డిపార్టుమెంట్ లాగిన్స్ అన్నీ మహేష్ తన గుప్పెట్లో పెట్టుకుని ఏడీ నుంచి అదనపు డైరెక్టర్ వరకు అందరిపైనా పెత్తనం చెలాయిస్తున్నారు. ఈయనకు ప్రత్యేకంగా చాంబర్ సైతం కేటాయించడం గమనార్హం. శాఖాపరంగా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, ఏ మెమో జారీ చేయాలన్నా ఏడీ నుంచి అదనపు డైరెక్టర్ వరకు అందరూ మహేష్ చాంబర్ ఎదుటే పడిగాపులు పడుతున్నారు. దీంతో కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు అభద్రతా భావంతో పనిచేయాల్సిన అగత్యం ఏర్పడిందని వాపోతున్నారు.

అడ్డగోలుగా నియామకాలు

మరోపక్క సీడ్ సరఫరా చేసే కాంట్రాక్టర్ గంగాధర్‌కు ఏకంగా స్టేట్ కో–ఆర్డినేటర్ పోస్ట్ కట్టబెట్టారు. మత్స్యకార సొసైటీల బలోపేతం కోసం కేంద్రం రూ.6.30 కోట్లు మంజూరు చేసింది. ఎంపిక చేసిన సొసైటీలను వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రస్థాయిలో ఐదుగురితో ఓ టీమ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, ముందుగా నోటిఫికేషన్ జారీచేసి మత్స్య శాఖ కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ సమక్షంలోనే ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని నియమించుకోవాలి. అలాంటిదేమీ లేకుండానే అడ్డగోలుగా నియామకాలు జరిగాయి. అందులో భాగంగా స్టేట్ కో–ఆర్డినేటర్‌గా సీడ్ కాంట్రాక్టర్‌ను నియమించారు. ఈయన ఏకంగా జిల్లా పర్యటనలు చేస్తూ కలెక్టరేట్ పక్కనే కూర్చుని సమీక్షలు చేస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది. సాధారణంగా అదనపు డైరెక్టర్‌ను ఆప్కాఫ్‌కు ఎండీగా, జాయింట్ డైరెక్టర్‌ను జీఎంగా నియమించాలన్నది నిబంధన. కానీ డిప్యూటీ డైరెక్టర్లకు అడ్డగోలుగా ఆ పోస్టులు కట్టబెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గడచిన 7 నెలల్లో ఒక్క స్కీమ్‌లో కూడా ఒక్క యూనిట్ కూడా గ్రౌండింగ్ చేయలేని దుస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.

ఖైదీలే కర్షకులు

- కారాగారంలో వ్యవసాయం
- మిగులు కూరగాయల విక్రయం

ఆరిలోవ : ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో సుమారు 2 వేల మంది ఖైదీలున్నారు. వీరికి వివిధ వృత్తుల్లో శిక్షణ ఇస్తూనే సాగు పనులకు శ్రీకారం చుట్టారు. కారాగారంలో అనేక పరిశ్రమలున్నాయి. ఆ పరిశ్రమలతో పాటు పశువుల పెంపకం, వ్యవసాయం సాగుపై జైలు అధికారులు దృష్టి సారించారు. ఇక్కడ డెయిరీ, వ్యవసాయం సాగులో ఓపెన్ ఎయిర్ ఖైదీలు పనిచేస్తున్నారు. పలు రకాల కూరగాయలు విరివిగా పండిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో వాటిని పండించి ఖైదీలకు ఆహారంగా అందిస్తున్నారు. మిగులు కూరగాయలను బయటవారికి విక్రయిస్తున్నారు. వాటి నుంచి రూ.వేలల్లో ఆదాయం చేకూరుతోంది. డెయిరీ, వ్యవసాయ క్షేత్రాల్లో సుమారు 30 మంది ఓపెన్ ఎయిర్ ఖైదీలు పనిచేస్తున్నారు. వీటి ద్వారా జైల్‌కు నెలకు రూ.లక్షల్లో ఆదాయం ఆదా అవుతోంది. ఇక్కడున్న 2 వేల మంది ఖైదీలకు రోజుకు వందల కిలోల కూరగాయలు అవసరమవుతాయి. అవన్నీ పండించడం జైల్ శాఖకు కలిసొచ్చింది.

సేంద్రియ పద్ధతిలో సాగు

ఇక్కడ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తున్నారు. నాలుగు గోడల మధ్యలో సాగవుతున్న వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తున్నాయి. ఇక్కడ ఎన్నో రకాల పంటలు పండిస్తున్నారు. జైల్‌కు సంబంధించిన స్థలం సుమారు 110 ఎకరాలు ఉండగా.. 90 ఎకరాల్లో జైల్ నిర్మాణాలు, ప్రహరీ నిర్మించారు. అదే ఆవరణలో మరో 20 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. దీంతో పాటు జైల్ లోపల ఖాళీ స్థలాల్లో మామిడి తోటలు ఉన్నాయి. జైల్ ప్రధాన ప్రహరీ వెలుపల ఖైదీల స్థలంలో వ్యవసాయం, డెయిరీ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఓపెన్ ఎయిర్ ఖైదీలు సీజనల్ పంటలు పండిస్తుంటారు. ప్రస్తుతం శీతాకాలం పంటలు అందుబాటులో ఉన్నాయి. క్యాబేజీ, ఆనబ, మునగ, వంగ, చిక్కుడు, గోంగూర, కొత్తిమీర, ముల్లంగి తదితర కూరగాయల పంటలు పండిస్తున్నారు. వీటితో పాటు జైల్ లోపల మామిడి, కొబ్బరి తోటలు ఉన్నాయి. పండిన పంటలు ఇక్కడ ఖైదీలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. మిగులు కాయగూరలను జైల్ బయట ఏర్పాటు చేసిన సుధార్ కేంద్రంలో బయటవారికి విక్రయిస్తున్నారు. వీటిని పూర్తిగా సేంద్రియ ఎరువులతోనే పండించడం విశేషం.

నీటి సౌకర్యం పుష్కలం

పంటలు పండించడానికి జైల్ ఆవరణలో ఆరు బోర్లు ఉన్నాయి. ఆ నీటిని ఈ పంటలకు వినియోగిస్తున్నారు. దీంతో పాటు ఇక్కడ సీవేజ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఖైదీలు వాడుక నీటిని ఈ ప్లాంట్ ద్వారా శుద్ధిచేసి ఆ నీటిని మామిడి, కొబ్బరి తోటలకు వినియోగిస్తున్నారు. ఈ ప్లాంట్ నుంచి వచ్చిన వేస్టేజీని పంటలకు ఎరువుగా వినియోగిస్తున్నారు.

పాడి పరిశ్రమ: ఇక్కడ 2015లో ఏపీ ప్రిజన్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో అధికారులు పాడి పరిశ్రమ ప్రారంభించారు. ఇందులో మేలు జాతి రకాలకు చెందిన 10 ఆవులు, 15 గేదెలను అప్పట్లో కొనుగోలు చేశారు. వాటి నుంచి వచ్చిన పాలను ఖైదీలకు తాగడానికి, మజ్జిగ, పెరుగు కోసం వినియోగిస్తున్నారు. దీంతో పాటు జైల్లో నిర్వహిస్తున్న బేకరీకి ఈ పాలునే వినియోగిస్తున్నారు. ఈ పాడి పశువుల కోసం సుమారు రెండెకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం పెంపకం చేపడుతున్నారు. ప్రస్తుతం 60కి పైగా ఆవులు, గేదెలు, దూడలు ఉన్నాయి. ఈ డెయిరీలో పశువుల పెంపకానికి కూడా ఓపెన్ ఎయిర్ ఖైదీలు పని చేస్తున్నారు.


ఏపుగా పెరిగిన క్యాబేజీ పంట



జైల్ ఆవరణలో పశువులు

పంటల మార్పిడిపై దృష్టి



జైల్ ఆవరణలో ఖైదీలతో నిర్వహించే వ్యవసాయం సాగు బాగానే జరుగుతోంది. వారిలో సత్ప్రవర్తనకు దోహదపడుతోంది. ఇంత వరకు సీజనల్‌గా అన్ని రకాల పంటలు పండించాం. ఇక నుంచి పంటల మార్పిడిపై దృష్టి పెట్టాం. సీజనల్‌గా పండించే పంటలతో భూమి సారం తగ్గకుండా చర్యలు చేపడుతున్నాం. పంటల దిగుబడి బాగుంటుంది. మిగులు కూరగాయలను సుధార్ కేంద్రంలో ఉంచి విక్రయిస్తున్నాం.

– ఎం.మహేష్‌బాబు, జైల్ పర్యవేక్షణాధికారి



శ్రీవారిని దర్శించుకున్న 70,826 మంది భక్తులు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వైకుంఠ ద్వార దర్శనం ద్వారా 70,826 మంది స్వామివారిని దర్శించుకోగా.. 22,625 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.68 కోట్లు సమర్పించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణి నుంచి నీళ్లతో స్వయంగా అభిషేకాలు చేశారు.


బషీర్‌బీబీ ఉత్సవాలకు సర్వం సిద్ధం

కొత్తపల్లి: హిందూ ముస్లింల సమైఖ్యతకు చిహ్నంగా చెప్పే బషీర్‌బీబీ ఉర్సు ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో జరిగే ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. దూర ప్రాంతాల భక్తులు మూడు రోజుల పాటు దర్గా ప్రాంగణంలోనే ఉండి ఉత్సవాలు పూర్తయ్యాక వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. పొన్నాడలో బషీర్‌బీబీ ఔలియా (బంగారు పాపమ్మ) దర్గాకు ముస్లింలే కాకుండా హిందువులు, క్రైస్తవులు కూడా పాల్గొంటారు. బషీర్ బీబీని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

మృత్యుంజయస్వామికి చందనాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం శాస్త్రోక్తంగా చందనాభిషేకం నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.



ప్రాథమిక విద్యా బోధనకు ప్రాధాన్యమివ్వాలి

కాట్రేనికోన: చిన్నారులకు ప్రాథమిక దశలో ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని కోనసీమ జిల్లా అమలాపురం ఆర్డీవో కె మాధవి, జిల్లా విద్యాశాఖ అధికారి డా.షేక్ సలీం బాషా సూచించారు. కాట్రేనికోన మండలం లోని చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో సోమవారం 8వ దశ శిక్షణా తరగతులను వారు ప్రారంభించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ అవసరం



తిరుపతి సిటీ : విద్యార్థుల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్స్ ఎంతో ఉపకరిస్తాయని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఆమె సోమవారం మహిళా వర్సిటీలో ఏర్పాటుచేసిన విజయ సోపాన యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, ఉపాధి రంగాల్లో మెళకువలు, ఉపాధి నైపుణ్యం, వ్యక్తిగత కౌన్సెలింగ్, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల సమాచారం అందించడంలో విజయ సోపాన యాత్ర ఉపయోగపడుతుందన్నారు.

అటానమస్ హోదాలో తొలి ఫలితం

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్, ఎస్వీ డబ్ల్యూ డిగ్రీ కళాశాలల్లో డిసెంబర్‌లో జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు సోమవారం విడుదల చేశారు. అటానమస్ హోదా పొందిన తర్వాత తొలిసారి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష నిర్వహించిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 1,010 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 838 మంది పాసయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షకు 1,086 మంది విద్యార్థులు హాజరు కాగా 878 మంది పాసయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయణమ్మ తెలిపారు.

హెల్త్



'రుచికరంగా హాయిగా తినేసి పెందలాడే కన్నుమూస్తే మటుకు దేశానికి వచ్చిన నష్టమేంటి? భూమికి భారం తగ్గుతుంది కదా' అంటూ కొందరు వితండవాదం చేస్తుంటారు. ఇక్కడ సమస్య త్వరగా కన్నుమూయడమా లేక చాలాకాలం పాటు జీవించడమా అని కాదు. ఉన్నన్నాళ్లూ ఎవరికీ భారం కాకుండా హాయిగా ఉండటం. ఆరోగ్యం బాగాలేక సుదీర్ఘకాలం మంచం పట్టి ఉండటమూ కోరుకునే అంశం కాదు, అలాగే పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నవాళ్లు త్వరగా పోవడమూ అభిలషణీయం కాదు. అందుకే ఉన్నన్నాళ్లూ ఆరోగ్యంగా, ఎవరికీ భారం కాకుండా, చురుగ్గా హాయిగా ఉండటం అన్నదే ఎవరికైనా కావాల్సింది. అందుకు మంచి ఆహారపు అలవాట్లు బాగా ఉపయోగపడతాయి. అదే చెడు ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం దెబ్బతిని మరణం రాకపోయినా మంచాన పడి నిరర్థకంగా ఉండాల్సి రావచ్చు. అందుకే మంచి ఆహారపు అలవాట్లు ఎల్లవేళలా మంచివే. చెడు ఈటింగ్ హ్యాబిట్స్ ఎప్పుడూ దూరంగా ఉండాల్సినవే. ఈ నేపథ్యంలో మంచి, చెడు ఆహారపు అలవాట్లపై కాస్తంత అవగాహన కోసం ఈ కథనం...

అనారోగ్యానికి 'ఆహారం' కావద్దు!


ఇలా తినండి

లేదంటే మిమ్మల్ని తింటాయి!





మంచి ఆరోగ్యానికి మంచి ఆహారపు అలవాట్లు ఎంతగానో ఉపయోగపడతాయి. వాటివల్ల మంచి వ్యాధి నిరోధక వ్యవస్థ మరింత పటిష్ఠం అవుతుంది. దాంతో అద్భుతమైన వ్యాధి నిరోధకత సమకూరుతుంది. దీని వల్ల కలిగే ఉపయోగాలు తక్షణం బయటకు కనిపించకపోవచ్చుగానీ... మంచి ఇమ్యూనిటీ వల్ల తప్పక మంచి జరుగుతుంది. గతంలో కోవిడ్ సమయంలో వైరస్ తీవ్రంగా ప్రభావం చూపినప్పటికీ వ్యాధి నిరోధక శక్తి పటిష్ఠంగా ఉన్నవారే బతికి బయటపడ్డారు. ఒకవేళ ఆహారపు అలవాట్లు బాగా లేకపోతే ఆ ప్రతికూల ప్రభావాలు వెంటనే కనిపిస్తాయి. ఇటీవల చాలామందిలో పొట్ట ఉబ్బరంగా ఉందనో, రాయిలా మారిందనో, తినగానే కడుపు ఉబ్బిపోయి, తేన్పులు వస్తూ, ఛాతీ మీద చాలా బరువుందనో అంటూ ఉండటం తరచూ చాలా మందిలో కనిపించేదే. ఇవి ఆహారపు అలవాట్లలో తేడా వల్ల కనిపించే తొలి లక్షణాలు. మంచి ఆహారపు అలవాట్లతో కలిగే మేళ్లతో పాటు చెడు ఆహారపు అలవాట్లతో కలిగే దుష్ప్రభావాలను తెలుసుకుంటే చాలాకాలం పాటు పూర్తి ఆరోగ్యంతో, మంచి ఫిట్‌నెస్‌తో జీవించవచ్చు. ఈ సందర్భంగా ఆరోగ్యకరంగా జీవించడానికి మంచి అలవాట్లు ఏమిటో, అనారోగ్యం తెచ్చుకోవడానికి చెడు అలవాట్లు ఏమిటో తెలుసుకుందాం...



మంచి ఆహారపు అలవాట్లివి...



● బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేసుకోకపోవడం

పొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్ మిస్ కానివ్వకపోవడం ఓ మంచి అలవాటు. నిజానికి దీనివల్ల డయాబెటిస్ తేలిగ్గా నివారితమవుతుంది. లేదా కనీసం రావడం చాలా ఆలస్యమవుతుంది. పగటివేళ అందరూ ఐదారు గంటలకొకమారు ఏదో ఒకటి తింటుంటారు. ఉదాహరణకు బ్రేక్‌ఫాస్ట్ అయిన నాలుగైదు గంటల తర్వాత మధ్యాహ్నం లంచ్. అటు తర్వాత రెండు మూడు గంటల తర్వాత సాయంత్రం కొద్దిగా శ్నాక్స్. అటు తర్వాత మళ్లీ నాలుగైదు గంటల తర్వాత రాత్రికి డిన్నర్... ఇలా రోజులో మూడు నుంచి నాలుగుసార్లు ఏదో ఒకటి అందరూ తీసుకుంటుంటారు. కాబట్టి జీవక్రియలకు అవసరమైన ఆహారం అందుతుంటుంది.

కానీ... రాత్రి నిద్రకు ఉపక్రమించాక... మళ్లీ ఉదయం నిద్ర లేచేవరకు... అంటే దాదాపు ఎనిమిది గంటల పాటు జీర్ణవ్యవస్థకు ఆహారం అందదు. ఇలా నిద్రపోయే సమయంలో ఆహారం ఎవరూ తీసుకోరు కాబట్టి దాన్ని 'ఫాస్టింగ్'గా పరిగణించి... దాన్ని బ్రేక్ చేయడానికి తీసుకునే ఆహారాన్ని 'బ్రేక్‌ఫాస్ట్' అంటుంటాం. ఇలా కనీసం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల పాటు శరీర జీవక్రియలకు భోజనం అందకపోవడమూ, అటు తర్వాత మళ్లీ ఓ నాలుగైదు గంటల తర్వాతే భోజనం (లంచ్) తీసుకోవడం జరుగుతుంది కాబట్టి దేహానికి కావాల్సిన శక్తి అవసరాలకు (ఎనర్జీకి), జీవక్రియలకు 'బ్రేక్‌ఫాస్ట్' చాలా అవసరం. ఇలా తీసుకోవడమూ మంచిది. అందుకే చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉండేందుకు 'బ్రేక్‌ఫాస్ట్' మిస్ చేసుకోవడం ఎంతమాత్రమూ మంచిది కాదు. మంచి ఆహారపు అలవాట్లలో భాగంగా బ్రేక్‌ఫాస్ట్ ఎలా ఉండాలో చెబుతూ డాక్టర్లు ఓ సూచన చేస్తారు. అదేమిటంటే 'బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకునే భోజనం రాజులు తినే భోజనంలా ఉండాలి. మధ్యాహ్న భోజనం సామాన్యుడి భోజనంలా ఉండాలి. ఇక రాత్రిభోజనం పేదవాడు తినే భోజనంలా ఉండాలి' అని డాక్టర్లు చెబుతారు. అంటే ఉదయం భోజనం ఘనంగా, మధ్యాహ్నం ఓ మోస్తరుగా, రాత్రి మితంగా తినాలని అర్థం.

● చిన్న మోతాదుల్లో ఎక్కువ సార్లు తినడం

తినే ఆహారాన్ని ఎక్కువ పరిమాణంలో ఏ రెండు పూటలకో పరిమితం చేయకుండా... తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం మంచిది. అంటే ఉదయపు టిఫిన్ (బ్రేక్ ఫాస్ట్), మధ్యాహ్న భోజనం (లంచ్),సాయంత్రపు పలహారం (ఈవినింగ్ శ్నాక్స్), రాత్రి భోజనం (సప్పర్/డిన్నర్) అంటూ ఇలా విభజించుకొని కొద్దికొద్ది మోతాదుల్లో ఎక్కువసార్లు తినడం వల్ల జీర్ణవ్యవస్థపై అంతగా భారం పడదు. పైగా ఇలా తినడం వల్ల దేహానికి అవసరమైన శక్తి (ఎనర్జీ) ఎప్పటికప్పుడు అందుతూ ఉంటుంది.

కొందరు చాలా తక్కువసార్లు... ఎక్కువ పరిమాణంలో ఆహారం తీసుకుంటుంటారు. చాలా బిజీగా ఉండేవారు సమయం లేదనో లేదా తినే సమయంలో మరో పని పూర్తవుతుందనే భావన వల్లనో రెండు పూటలే తింటుంటారు. ఇలా తక్కువసార్లు ఎక్కువ పరిమాణంలో తినడం వల్ల పొట్ట ఉబ్బరంగా మారడం, పొట్ట రాయిలా గట్టిగా అనిపించడం, తినగానే పొట్ట ఉబ్బిపోయి ఎంతగానో అసౌకర్యంగా అనిపించడం (దీన్నే భుక్తాయాసం అని కూడా చెబుతుంటారు), తిన్నవెంటనే భోజనం ఛాతీకి అంటుకునే ఉన్నట్లు అనిపించడం లాంటి ఫీలింగ్, ఛాతీలో మంట, కడుపులో ఒకలాంటి నొప్పి, పుల్లటి తేన్పులు వంటి లక్షణాలు కనిపించడం మామూలే. ఇలాంటి సమస్యలు ఎదుర్కొనేవారు ఇంటికి ఒక్కరైన ఉండటం ఈ రోజుల్లో చాలా సాధారణం. ఇక ఏయే వేళకు తినాల్సిన భోజనాన్ని ఆయా వేళల్లో తినడం, అలాగే రాత్రి భోజనాన్ని చాలా త్వరగా తినేయడంతో పాటు ఒకసారి రాత్రి భోజనం అయ్యాక మెలకువగా ఉన్న సమయంలో మళ్లీ మరేమీ తినకుండా జాగ్రత్త పడటం అవసరం. అలా కాకుండా రాత్రి భోజనం తర్వాత మెలకువగా ఉన్నప్పుడు తినడం వల్ల పొట్ట పెరిగి, అది రోగాల పుట్టగా పరిణమించడంతో పాటు కాస్మెటిక్‌గానూ బాగా కనిపించకపోవచ్చు.

● అన్ని పోషకాలూ లభ్యమయ్యే సమతుల ఆహారం

తీసుకునే ఆహారంలో అన్ని రకాల పోషకాలు ఉండాలన్నది ప్రధానం. అవేమీ లేని భోజనం చాలా పరిమాణంలో తిన్నా అది వృథాయే. అందుకే తక్షణ శక్తినిచ్చే పిండిపదార్థాలూ (కార్బోహైడ్రేట్లు), కణాలూ, కణజాలాలను రిపేర్ చేసి, వాటిని పునర్నిర్మించే ప్రోటీన్లు, దేహానికి అవసరమైన కొవ్వులతోపాటు, ఖనిజలవణాలూ, విటమిన్లు, మళ్లీ ఈ పోషకాల్లోనూ ఎక్కువ మోతాదుల్లో అవసరమయ్యే మ్యాక్రో న్యూట్రియెంట్లు, తక్కువ మోతాదుల్లోనైనా తప్పనిసరిగా కావాల్సిన మైక్రో న్యూట్రియెంట్లు... ఇవన్నీ సమృద్ధిగా ఉండేలా మన భోజనం ఉండాలి. ఇలా అన్నీ సమపాళ్లలో కలిగి ఉండే భోజనాన్ని 'సమతులాహారం' (బాలెన్స్‌డ్) అంటారు. ఇవన్నీ ఉండాలంటే భోజనంలో పిండిపదార్థాలనిచ్చే బియ్యం, గోధుమలు, ప్రోటీన్లకోసం పప్పులు, మాంసాహారం, కొవ్వుల కోసం నూనెలతో పాటు ఆకుకూరలు, కూరగాయలు; విటమిన్లను సమకూర్చే తాజాపండ్లు తీసుకోవాలి. అయితే ఇక్కడ కొవ్వుల కోసం నూనెలు తీసుకునేప్పుడు వాటిని రుచి కోసం కాక దేహ అవసరాల కోసం మాత్రమే... అంటే చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. అలాగే ప్రోటీన్ల కోసం మాంసాహారం మీద ఆధారపడేవారు అంతగా ఆరోగ్యకరం కాని రెడ్ మీట్ (వేట మాసం) కంటే ఆరోగ్యకరమైన వైట్ మీట్ (చికెన్, చేపల వంటివి) తీసుకోవాలి.

● నీళ్లు ఎక్కువగా తాగడం

మానవ శరీరంలో 75 శాతం నీళ్లే ఉంటాయి. శరీరం ద్రవాలను కోల్పోవడాన్ని 'డీ-హైడ్రేషన్'గా చెబుతారు. వేసవికాలంలో వడదెబ్బ వల్ల ఇలా దేహం ద్రవాలను కోల్పవడం జరిగితే ప్రాణాపాయం కూడా కలగవచ్చు. ఇలాంటి అనర్థం జరగకుండా ఉండాలంటే ప్రతిరోజూ ప్రతి ఒక్కరూ కనీసం మూడు లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగడం అవసరం. ఇక మెదడు నుంచి నరాల ద్వారా ఆయా దేహభాగాలకు అందాల్సిన ఆదేశాలన్నీ లవణాల వల్లనే జరుగుతుంది. ఆ లవణాలు అలా చేరవేయడానికి వీలుగా మారడానికి నీళ్లలో కరగడం వల్లనే జరుగుతుంది. అందుకే నీళ్లూ, లవణాలను కోల్పోకుండా ఉంటేనే మెదడునుంచి ఆయా అవయవాలకు అందాల్సిన ఆదేశాలు అందుతూ దేహం సక్రమంగా పనిచేస్తుంటుంది. అందుకే దేహం తాలూకు జీవక్రియలన్నింటికీ అవసరమైనన్ని నీళ్లు తాగుతుండటం అవసరం. మానవులు ఎన్ని నీళ్లు తాగాలనే దానికి ఓ కొండగుర్తు ఏమిటంటే... మూత్రవిసర్జనకు వెళ్లినప్పుడు మూత్రం పచ్చగా, బాగా గాఢంగా లేకుండా వీలైనంతగా నీళ్లలా ఉండాలి. మూత్రం అలా పచ్చగా, గాఢంగా ఉందంటే దేహంలో నీళ్లు తగ్గాయనడానికి నిదర్శనం. మూత్రం అలా ఉందంటే అలాంటప్పుడు తక్షణం శరీరానికి అవసరమైన నీళ్లు తాగాలని, అలా తాగడం ద్వారా దేహానికి అవసరమైనన్ని నీళ్లు (హైడ్రేషన్) సమకూర్చాలని అర్థం.

● తాజాపండ్లు తినడం

ఏ సీజన్‌లో లభ్యమయ్యే పండ్లను ఆ సీజన్‌లో తింటుండటం మంచి ఆహారపు అలవాట్లలో ఒకటి. దీని వల్ల మనకు అవసరమైన విటమిన్లు, ఖనిజ లవణాలు, మ్యాక్రో, మైక్రో న్యూట్రియెంట్లు సమకూరతాయి. అయితే పండ్లను కూడా కొరికి తినలేనివారు మినహా మిగతా వారంతా కొరికి తినడం మంచిది. కేవలం కొరికి తినలేనంత బలహీనంగా ఉన్నవారు మాత్రమే పండ్లతో పళ్లరసాలు చేసుకుని తీసుకోవాలి. ఇక ఆయా పండ్లలో ప్రత్యేకంగా కొన్ని మేలు చేసే గుణాలూ, వాటికే పరిమితమైన పోషకాలు ఉంటాయి. వాటి వల్ల ఆరోగ్యానికి కలిగే మేలు అంతా ఇంతా కాదు.



చెడు ఆహారపు అలవాట్లివి...

అంటే మంచి ఆహారపు అలవాట్లను అనుసరించకపోవడాన్ని చెడు ఆహారపు అలవాట్లుగా చెప్పవచ్చు. అంటే సమతులాహారం తీసుకోకపోవడం, వేళకు తినకపోవడం, తక్కువసార్లు ఎక్కువ పరిమాణంలో తినడం, తాజాపండ్లు తీసుకోకపోవడం, తగినన్ని నీళ్లు తాగకపోవడం ఇవన్నీ ఆహారపరమైన చెడు అలవాట్లు. అయితే ఇవ్వాళ్టి మానవ జీవనశైలిలో ఇలాంటి చెడు ఆహారపు అలవాట్లు కాస్తంత ఎక్కువే. పైగా అవన్నీ ఇవ్వాళ్టి ఆహారపు ఫ్యాషన్లుగా కూడా కొనసాగుతుండటం ఆందోళన కలిగించే అంశం. కొన్ని చెడు ఆహారపు అలవాట్లేమిటో చూద్దాం.

● బ్రేక్‌ఫాస్ట్ తీసుకోకపోవడం

చాలామందిలో ఒక దురలవాటు ఉంటుంది. ఆహారం తీసుకునే సమయాన్ని ఆదా చేయడం కోసం ఉదయం తీసుకోవాల్సిన బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేసి నేరుగా మధ్యాహ్న భోజనం తీసుకుంటుంటారు. రోజువారీ వ్యవహారాలకు అవసరమైన శక్తి అందడానికి ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మంచి అలవాటు అన్నది తెలిసిందే. అందుకే బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేయకూడదు.

● ఎక్కువ పరిమాణాన్ని తక్కువ సార్లు తినడం

ఎక్కువ పరిమాణంలో తక్కువసార్లు తినడం వల్ల జీర్ణవ్యవస్థపై ఎక్కువ ఒత్తిడి పడుతుంది. అలా ఎక్కువ మోతాదుల్లో తక్కువ సార్లు తినడం వల్ల... కడుపులో ఆహారం లేని సమయంలోనూ ఆహారాన్ని అరిగించే ఆమ్లాలు జీర్ణవ్యవస్థ గోడలపైనా, పేగులపైన పనిచేయడంతో ఒక్కోసారి అది అల్సర్స్‌కు కారణం కావచ్చు. అటు తర్వాత ఆ అల్సర్స్ కారణంగా పేగులకు రంధ్రం పడటం వల్ల జీర్ణవ్యవస్థ / కడుపు / పేగుల్లోనే ఉండాల్సిన ఆహారం, జీర్ణ స్రావాలూ దేహ కుహరంలోకి ప్రవేశించడం వల్ల ప్రమాదకరమైన పరిస్థితులకూ దారితీయవచ్చు.

● తగినన్ని మంచినీళ్లు తాగకపోవడం

చాలామంది పనుల్లో పడిపోయి తాగాల్సినన్ని మంచినీళ్లు తాగరు. మరికొందరు ఆఫీసుల్లోని ఏసీ కారణంగా ఆ చల్లటి వాతావరణంలో ఉండటం వల్ల దాహం వేయక తగినన్ని నీళ్లు తాగరు. ఈ రెండు పరిణామాల్లోనూ ఆరోగ్యానికి చాలా అనర్థాలు జరిగే అవకాశం ఉంది. ఉదాహరణకు దేహానికి అవసరమైన నీళ్లు, లవణాలు అందక పిక్కలు పట్టేయడం (మజిల్ క్రాంప్స్)తో పాటు కిడ్నీలో రాళ్లు రావడం వంటి అనర్థాలు చోటు చేసుకునే అవకాశముంది. అందుకే ప్రతిరోజూ ప్రతిఒక్కరూ దేహానికి అవసరమైనన్ని నీళ్లు తాగాలి.

● ఫాస్ట్ ఫుడ్ / జంక్‌ఫుడ్ తినడం

ఆధునిక జీవనశైలిలో పనివేళలూ, పనిగంటలూ పెరగడం, కొత్త తరహా పనులు, వృత్తుల వల్ల జీవితం ఉరుకులు పరుగులతో సాగడం వల్ల సమయం దొరకడం కష్టంగా మారింది. దాంతో మార్కెట్‌లో తేలికగా దొరకడంతో పాటు అప్పటికప్పుడు తినగలిగే జంక్‌ఫుడ్, బేకరీ ఫుడ్ తీసుకోవడం ఓ ట్రెండ్‌గా మారింది. నిజానికి చెడు అలవాట్లలో ఈ ఫాస్ట్‌ఫుడ్ / జంక్‌ఫుడ్ ముఖ్యమైనది. ఈ తరహా ఆహారంలో ఉండే రిఫైన్‌డ్ పిండిపదార్థాల వల్ల డయాబెటిస్ వంటి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అంతేకాదు... వీటికి తోడు చాలాకాలం నిల్వ ఉండటానికి వీలుగా (షెల్ఫ్‌లైఫ్‌ను పెంచడానికి) వీటిలో వాడే ప్రిజర్వేటివ్స్, అనారోగ్యకరమైన నూనెలు, అలాగే ఆహారపదార్థాల్ని ఆకర్షణీయంగా కనిపించేలా చేయడం కోసం వాడే రంగుల వల్ల ఇలాంటి జంక్‌ఫుడ్స్ అనేక రకాల క్యాన్సర్లకు కారణంగా మారుతున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలింది. అందుకే వీలైనంతవరకు జంక్‌ఫుడ్‌ను తీసుకోకపోవడమే మంచిది. మరీ తప్పనప్పుడు ఎప్పుడో ఒకసారి అది కూడా చాలా పరిమితంగా వాటిని తీసుకోవాలి.

● మితిమీరి తీపిపదార్థాలు తినడం

చాలామంది తీపిపదార్థాలనూ, మిఠాయిలను ఇష్టపడతారు. అయితే వీటిని మరీ మితిమీరి తినడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయి. తీపితో వచ్చే నష్టాలు తొలుత నోటిలో నుంచే మొదలవుతాయి. నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే సూక్ష్మజీవులు పెరగడం, వాటితో పళ్లు దెబ్బతినేలా లేదా పుచ్చిపోలాయే దంతక్షయం వంటి నష్టాలు సంభవిస్తాయి. మితిమీరి తీపిపదార్థాలు తినడం క్యాన్సర్‌కు ఒక కారణమంటూ చాలా అధ్యయనాల్లో నిరూపితమైంది. ఇక కొంతమంది తమ అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో భాగంగా టీ, కాఫీలు చాలా ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. రెండు లేదా మూడు కప్పుల పరిమితికి మించి కాఫీ, టీలు తాగడం తాగడం ఒకరకమైన నష్టాన్ని తెస్తే... అందులోని తీపి తినడం వల్ల కూడా ఆరోగ్యానికి చేటుగా పరిణమిస్తుంది. తినడానికి కనీసం అరగంట ముందు గానీ లేదా తిన్న అరగంట తర్వాత గానీ టీ తాగకూడదు. అలా టీ / కాఫీలు తాగితే తిన్న ఆహారంలోని ఐరన్ ఒంటికి పట్టదు.

● కూల్ బీవరేజెస్

చాలామందికి కూల్‌డ్రింకులు, కోలా డ్రింకులు, శీతల పానియాల వంటివి తాగుతుండటం అలవాటు. వీటిని తీసుకోవాల్సి వచ్చినా చాలా చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి ఏమాత్రం మేలు చేయకపోగా, కొన్ని అనర్థాలు కూడా తెచ్చిపెట్టే అవకాశముంది. పైగా వీటిలోని కెఫిన్ రాత్రి నిద్రపట్టకుండా చేసే అవకాశమున్నందున వీటిని రాత్రి నిద్రకు ఉపక్రమించేందుకు అస్సలు తీసుకోకూడదు. వీటివల్ల అసిడిటీ వంటి సమస్యలూ వచ్చే అవకాశముంది. వీటిలోని మితిమీరిన చక్కెరల వల్ల... డయాబెటిస్ మొదలుకొని అనేక సమస్యలు రావచ్చు.

● ఆల్కహాల్ అలవాటుతో అనర్థం

ఆల్కహాల్ ఆరోగ్యానికి చేటు తెచ్చే ప్రమాదకరమైన అలవాటు. దీనికి తోడు కొంతమంది ఆల్కహాల్‌తో పాటు కోలా డ్రింకులు కలుపుకుంటారు. దీంతో రెట్టింపు దుష్ఫలితాలు కలుగుతాయి. ఆల్కహాల్ వల్ల కడుపులోని లైనింగ్స్ దెబ్బతినడంతో పాటు అసిడిటీ, అల్సర్లు వస్తాయి. మద్యం అలవాటు లివర్‌ను దెబ్బతీసి, మొత్తం జీర్ణవ్యవస్థ పనితీరునే దెబ్బతీస్తుంది. ఇక ఆల్కహాల్ తాగే సమయంలో చాలామంది వేపుడు పదార్థాలు ఎక్కువగా తీసుకుంటుంటారు. వాస్తవానికి వేపుళ్లు అంత మంచి ఆహారపు అలవాటు కానే కాదు. ఇలా ఎన్నో ఆరోగ్య అనర్థాలకు దారితీసే ఆల్కహాల్ అలవాటును పూర్తిగా వదిలేయాలి.

ఇక్కడ పేర్కొన్న ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అనుసరిస్తూ, చెడు ఆహారపు అలవాట్లను వదిలేయడం వల్ల చాలాకాలం పాటు ఆరోగ్యంగానూ, మంచి ఫిట్‌నెస్‌తోనూ ఉండటం సాధ్యమవుతుంది.

బిజినెస్ రీల్

ఫిండి చేతికి బ్యాంకిట్



రూ. 162 కోట్ల డీల్

న్యూఢిల్లీ: ఆర్థిక సేవలు అందించే ఆస్ట్రేలియన్ లిస్టెడ్ కంపెనీ ఫైండి తాజాగా భారత్‌కి చెందిన ఫిన్‌టెక్ సంస్థ బ్యాంకిట్‌ను కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ 30 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 162 కోట్లు). తమ అనుబంధ సంస్థ ట్రాన్సాక్షన్ సొల్యూషన్స్ ఇంటర్నేషనల్ (ఇండియా) ద్వారా ఫైండి ఈ ఒప్పందం కుదుర్చుకుంది. గ్రామీణ, సెమీ–అర్బన్ ప్రాంతాల్లో ఆర్థిక సేవలను విస్తరించేందుకు ఇది తోడ్పడుతుందని సంస్థ వివరించింది. నోయిడా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న బ్యాంకిట్‌కి 28 రాష్ట్రాల్లో 1.29 లక్షల అవుట్‌లెట్స్ నెట్‌వర్క్ ఉందని పేర్కొంది.

సెబీకి వినిర్ ఇంజినీరింగ్ ప్రాస్పెక్టస్

న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ వినిర్ ఇంజినీరింగ్ తమ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూకి సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ సమర్పించింది. దీని ప్రకారం ఐపీవోలో భాగంగా 5,33,00,000 షేర్లను కంపెనీ ఆఫర్ చేయనుంది. ప్రమోటర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్ నితేష్ గుప్తా వీటిని ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయించనున్నారు. షేర్ల ముఖవిలువ రూ.2గా ఉంటుంది.

ఆనంద్ రాఠీకి సెబీ చెక్

ఐపీవో ప్రాస్పెక్టస్ వెనక్కి



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా బ్రోకింగ్ కంపెనీ ఆనంద్ రాఠీ గ్రూప్ పబ్లిక్ ఇష్యూ ప్రణాళికలకు చెక్ పెట్టింది. ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ 2024 డిసెంబర్‌లో దాఖలు చేసిన ఐపీవో ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను తిప్పి పంపింది. వీటి ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ ద్వారా ఆనంద్ రాఠీ షేర్ రూ. 745 కోట్లు సమీకరించాలని భావించింది. ఇందుకు ఈక్విటీని తాజాగా జారీ చేయాలని ప్రతిపాదించింది. అయితే కారణాలు వెల్లడించకుండా సెబీ ప్రాస్పెక్టస్‌ను రిటర్న్ చేసింది.

సైయంట్‌కు డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్ కాంట్రాక్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయంట్‌కి జర్మనీకి చెందిన ప్రాంతీయ విమానాల తయారీ సంస్థ డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్ నుంచి కాంట్రాక్టు లభించింది. దీని ప్రకారం డీ328ఈకో రకం 40 సీటర్ల విమానానికి అవసరమైన సాంకేతిక డాక్యుమెంటేషన్ సేవలను అందించాల్సి ఉంటుంది. ఇప్పటికే డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం.. దీనితో మరింత పటిష్టమవుతుందని సైయంట్ తెలిపింది. భారతీయ, యూరోపియన్ ఏరోస్పేస్ రంగాల్లో కార్యకలాపాలను విస్తరించేందుకు తోడ్పడుతుందని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-1-2025

విశాఖ	505-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480-00
వరంగల్	482-00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	1,918.00	9.06
WIPRO	300.5	6.58
BAJFINANCE	7,427.50	3.42
BAJAJFINSV	1,737.00	3.35
NTPC	334.95	2.7

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,497.00	-2.82
TRENT	6,079.95	-2.2
SHRIRAMFIN	516.1	-1.98
HDFCLIFE	633.6	-1.34
ADANIPORTS	1,148.45	-1.29

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,675
ఎన్ఎస్ఈ	91,455
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,63,885
ఎఫ్ఐఐ	- 4,336
డీఐఐ	+ 4,322

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	76.52	$	77.39
బ్రెంట్	80.09	$	80.79

బీమా పరిశ్రమకు ధీమా

- 2024–25లో జీడీపీ 7 శాతం వృద్ధి
- ఇది బీమా కంపెనీలకు అనుకూలం
- ప్రీమియంలో చక్కని వృద్ధి
- రేటింగ్ సంస్థ మూడీస్ అంచనా



న్యూఢిల్లీ: భారత జీడీపీ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ అంచనా వేసింది. 2025–26లో 6.6 శాతంగా ఉండొచ్చని తెలిపింది. ఆర్థిక వ్యవస్థ బలమైన విస్తరణతో బీమా రంగం ప్రయోజనం పొందనున్నట్టు పేర్కొంది. హెల్త్ ఇన్సూరెన్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌తో బీమా కంపెనీలు ప్రీమియంలో స్థిరమైన వృద్ధిని చూడనున్నాయని వివరించింది. అధిక ప్రీమియం ఆదాయం, పెరుగుతున్న ప్రీమియం ధరలు, ప్రభుత్వ సంస్కరణలతో బీమా రంగం లాభదాయకత మెరుగుపడనున్నట్టు అంచనా వేసింది. ''భారత ప్రైవేటు బీమా కంపెనీలు తమ సాల్వెన్సీ పటిష్టం చేసుకోవడం కొనసాగనుంది. కాకపోతే అండర్‌రైటింగ్ ఎక్స్‌పోజర్, నియంత్రణపరమైన మార్పులతో వాటి క్యాపిటల్ అడెక్వెసీపై ఒత్తిళ్లు కొనసాగనున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ 2024–25లో 7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా వేస్తున్నాం. ముందటి సంవత్సరంలో వృద్ధి 8.2 శాతం కంటే కొంత తక్కువ. భారత తలసరి ఆదాయం–కొనుగోలు శక్తి సమానత్వం సైతం వృద్ధి చెందుతోంది. 11 శాతం వృద్ధితో 2024 మార్చి నాటికి ఇది 10,233 డాలర్లకు చేరింది''అని మూడీస్ పేర్కొంది. భారత జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) 2024–25 సంవత్సరానికి జీడీపీ 6.4 శాతం వృద్ధి సాధిస్తుందన్న అంచనా కంటే మూడీస్ అంచనాలు బలంగా ఉండడం గమనార్హం.

భారీ అవకాశాలు..

అధిక సగటు ఆదాయం, వినియోగదారుల రిస్క్ ధోరణి బీమాకు, ముఖ్యంగా ఆరోగ్య బీమాకు డిమాండ్‌ను పెంచుతున్నట్టు మూడీస్ పేర్కొంది. 2024 మొదటి ఎనిమిది నెలల్లో బీమా ప్రీమియం ఆదాయం 16 శాతం పెరిగినట్టు తెలిపింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ప్రీమియంలో 8 శాతం వృద్ధిని అధిగమించినట్టు వివరించింది. ''భారత్‌లో బీమా విస్తరణ రేటు (జీడీపీలో బీమా ప్రీమియంల వాటా) 2024 మార్చి నాటికి 3.7 శాతంగానే ఉంది. యూకే 9.7 శాతం, యూఎస్ 11.9 శాతంతో పోల్చి చూస్తే చాలా తక్కువ. అందుకే భారత బీమా రంగం బలమైన విస్తరణకు పుష్కల అవకాశాలున్నాయి''అని పేర్కొంది.

వచ్చే నెలలో వేదాంతా విడదీత నిర్ణయం

ఫిబ్రవరి 18న వాటాదారులు, రుణదాతల సమావేశం



న్యూఢిల్లీ: విడదీత ప్రణాళికపై వాటాదారులు, రుణదాతలతో ఫిబ్రవరి 18న సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మైనింగ్ దిగ్గజం వేదాంతా వెల్లడించింది. తద్వారా వివిధ బిజినెస్‌లను ప్రత్యేక కంపెనీలుగా విడదీసే ప్రణాళికపై అనుమతిని కోరనున్నట్లు తెలియజేసింది. మాతృ సంస్థ వేదాంతాతో ప్రాథమిక లోహాల(బేస్ మెటల్స్) బిజినెస్‌ను కొనసాగిస్తూ ఇతర విభాగాలను ప్రత్యేక కంపెనీలుగా విడదీసే ప్రతిపాదనను గత నెలలో సవరించింది. దీనిలో భాగంగా వేదాంతా లిమిటెడ్, వేదాంతా అల్యూమినియం మెటల్, తల్వాండీ సాబో పవర్, మాల్కో ఎనర్జీ, వేదాంతా బేస్ మెటల్స్, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ మధ్య ప్రతిపాదిత పథకాన్ని అమలు చేయనుంది. ఎన్‌సీఎల్‌టీ 2024 నవంబర్ 21న జారీ చేసిన ఆదేశాలమేరకు తాజా సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వేదాంతా పేర్కొంది. కాగా.. ఇంతక్రితం కంపెనీ విడదీత ప్రణాళికలో భాగంగా ఆరు స్వతంత్ర సంస్థల ఏర్పాటును ప్రకటించిన సంగతి తెలిసిందే. వేదాంతా అల్యూమినియం, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంతా పవర్, వేదాంతా స్టీల్ అండ్ ఫెర్రస్ మెటల్స్, వేదాంతా బేస్ మెటల్స్, వేదాంతా లిమిటెడ్‌తో జాబితాను ప్రకటించింది. అయితే తదుపరి దశలో ప్రణాళికను సవరించింది. రుణదాతలతోపాటు వాటాదారులతో చర్చల తదుపరి తాజా నిర్ణయాలు తీసుకున్నట్లు వేదాంతా తెలియజేసింది. మరోవైపు బేస్ మెటల్స్‌లో భాగంగా తమిళనాడు, తూత్తుకుడిలోని కాపర్ బిజినెస్‌ను తిరిగి ప్రారంభించేందుకు ప్రత్యామ్నాయ అవకాశాలను అన్వేషిస్తున్నట్లు తెలియజేసింది.

ఎన్ఎస్ఈలో వేదాంతా షేరు 1.35 శాతం బలపడి రూ. 460 వద్ద ముగిసింది.

సుదీర్ఘ పని గంటలు.. ఎవరికి వాళ్లే ఆలోచించుకోవాలి..

ఇన్ఫీ నారాయణ మూర్తి వివరణ

ముంబై: దేశం పురోగమించాలంటే యువత సుదీర్ఘ సమయం పాటు పని చేయాలన్న వ్యాఖ్యలపై దుమారం ఇంకా చల్లారని నేపథ్యంలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి వివరణనిచ్చారు. ఎవరూ ఎవరినీ గంటల తరబడి పని చేయాలని చెప్పరని, ఎవరికి వారే ఆలోచించుకుని, తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. 'నేను పొద్దున్నే ఆరున్నరకి ఆఫీసుకి చేరుకునేవాణ్ని. రాత్రి ఎనిమిదిన్నరకి బైటికి వచ్చేవాణ్ని. ఇలా నేను దాదాపు నలభై ఏళ్లు పని చేసాను. ఇది వాస్తవం. నేను స్వయంగా చేశాను. ఇది తప్పు.. నువ్వు ఇలా చేయాలి.. ఇలా చేయకూడదు.. అని ఎవరూ అనడానికి లేదు. ఇలాంటి వాటిపై చర్చలు, వాదోపవాదాలు అనవసరం. మీకు మీరుగా ఆలోచించుకుని, మీరు కోరుకున్నది చేయడమే' అని కిలాచంద్ స్మారకోపన్యాస కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నారాయణ మూర్తి తెలిపారు. నిరుపేద బాలలకు మెరుగైన భవిష్యత్తును అందించే దిశగా కష్టపడి పనిచేయాలా, వద్దా అనేది ఎవరికి వారు ఆలోచించుకుని, నిర్ణయం తీసుకోవాల్సిన విషయమని పేర్కొన్నారు.

ప్రపంచ ఎకానమీపై ట్రంప్ ఎఫెక్ట్

- భౌగోళిక-రాజకీయ మార్పులు
- 2025లో అనిశ్చితి, అనూహ్య పరిస్థితులు
- కుమార మంగళం బిర్లా వ్యాఖ్యలు





న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తిరిగి పగ్గాలు చేపట్టడమనేది అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయాల్లో మార్పులకు దారి తీయొచ్చని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఎకానమీ, వ్యాపారాలపై గణనీయమైన ప్రభావాలు పడొచ్చని ఆయన వ్యాఖ్యానించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చోటు చేసుకున్న పరిణామాలను విశ్లేషించిన సందర్భంగా బిర్లా ఈ మేరకు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 2025లో ప్రపంచంలో అనిశ్చితి, అనూహ్యమైన, సాంప్రదాయానికి భిన్నమైన పరిస్థితులు నెలకొంటాయని బిర్లా చెప్పారు. ఒకవైపు అవకాశాలు మరోవైపు అనిశ్చితి ఉంటుందన్నారు. భారత్ వెలుపల అమెరికా తమకు అతి పెద్ద మార్కెట్ అని, అక్కడ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నామని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత పటిష్టం కాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు.

అవకాశాలు అందిపుచ్చుకోనున్న భారత్ ..

పుష్కలంగా పారిశ్రామిక సామర్థ్యాలున్నా అంతగా గుర్తింపునకు నోచుకోని భారత్.. ఇప్పుడు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సంసిద్ధంగా ఉందని బిర్లా చెప్పారు. యాపిల్ ఉత్పత్తుల తయారీ భారత్‌కి రావడం మంచి పరిణామమని, త్వరలోనే ప్రపంచంలోనే సావు వంతు ఐఫోన్లు భారత్‌లోనే ఉత్పత్తి చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారతీయ ఆటోమొబైల్, సిమెంటు పరిశ్రమ మొదలైనవన్నీ అంతర్జాతీయంగా ఎదుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ తయారీ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించగలదని పేర్కొన్నారు. 21వ శతాబ్దపు తొలి రెండు దశాబ్దాల్లో టెక్నాలజీ విప్లవం చోటు చేసుకుందని.. దీనితో ప్రయోజనాలు పొందుతున్నప్పటికీ తగు మూల్యం కూడా చెల్లించుకోవాల్సి వస్తోందని తెలిపారు. రాబోయే దశాబ్దంలో ప్రపంచాన్ని ఏకం చేయగలిగే శక్తిగా టెక్నాలజీని వినియోగించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

వోల్టాస్, లుమ్యాక్స్ సంస్థలకు పీఎల్ఐ ప్రోత్సాహకాలు

- వైట్‌గూడ్స్ విభాగంలో 18 సంస్థల ఎంపిక
- జాబితాలో యూనోమిండా, రామ్‌రత్న వైర్స్



న్యూఢిల్లీ: వైట్‌గూడ్స్ విభాగంలో (ఎలక్ట్రికల్ గృహోపకరణాలు) ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం కింద వోల్టాస్, యూనో మిండా తదితర 18 కంపెనీలు ఎంపికయ్యాయి. ఇవన్నీ కలసి రూ.2,299 కోట్ల పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. వైట్‌గూడ్స్ పీఎల్ఐ పథకం కింద గతేడాది అక్టోబర్‌లో మొత్తం 38 సంస్థలు దరఖాస్తు పెట్టుకోవడం గమనార్హం. 11 దరఖాస్తులను నిపుణుల కమిటీ పరిశీలనకు ప్రభుత్వం పంపింది. ''పీఎల్ఐ పథకం కింద మూడో విడత ఆన్‌లైన్ అప్లికేషన్ విండోలో భాగంగా మొత్తం 38 దరఖాస్తులు అందాయి. వీటిని సమీక్షించిన అనంతరం ప్రభుత్వం 18 కంపెనీలను ఎంపిక చేసింది. వీటిల్లో ఏసీ విడిభాగాలు తయారు చేసే 10 కంపెనీలు, ఎల్ఈడీ లైట్లను తయారు చేసే 8 సంస్థలు ఉన్నాయి. ఇవి ఉమ్మడిగా రూ.2,299 కోట్ల పెట్టుబడులకు అంగీకరించాయి''అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రకటించింది. ఇప్పటికే పీఎల్ఐ పథకం కింద ప్రయోజనాలు పొందుతున్న మరో ఆరు సంస్థలను సైతం అధిక పెట్టుబడుల విభాగంలో ఎంపిక చేసినట్టు తెలిపింది. ఈ సంస్థలు రూ.1,217 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు పేర్కొంది. మొత్తం మీద వైట్‌గూడ్స్ రంగానికి సంబంధించిన పీఎల్ఐ పథకం కింద 84 కంపెనీలు రూ.10,478 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు, వీటి ద్వారా రూ.1,72,663 కోట్ల తయారీ ఏర్పాటు కానున్నట్టు వివరించింది.

కంపెనీల వివరాలు..

- వోల్టాస్ కాంపోనెంట్స్ సంస్థ రూ.257 కోట్ల పెట్టుబడితో కంప్రెషర్లను తయారు చేయనుంది.
- మిర్క్ ఎలక్ట్రానిక్స్ సంస్థ రూ.51.5 కోట్ల పెట్టుబడితో ఏసీ మోటార్లు, హీట్ ఎక్స్ఛేంజర్లను తయారు చేయనుంది.
- ఏసీ విడిభాగాల తయారీకి సంబంధించి జూపిటర్ అల్యూమినియం ఇండస్ట్రీస్ రూ.618 కోట్లు, రామ్‌రత్న వైర్స్ రూ.253 కోట్లు, ఎస్ఎంఈఎల్ స్టీల్ స్ట్రక్చరల్ రూ.541 కోట్లు, నెక్స్ జనరేషన్ మాన్యుఫాక్చరర్స్ రూ.121 కోట్ల చొప్పున ఇన్వెస్ట్ చేయనున్నాయి.
- ఎల్ఈడీ విభాగంలో లుమ్యాక్స్ ఇండస్ట్రీస్ రూ.60 కోట్లు, యూనో మిండియా రూ.20 కోట్ల చొప్పున పెట్టుబడి పెట్టనున్నాయి.
- ఇప్పటికే పీఎల్ఐ పథకం కింద లబ్దిదారులుగా ఉంటూ, మరిన్ని పెట్టుబడులకు ముందుకు వచ్చిన వాటిల్లో హిందాల్కో ఇండస్ట్రీస్ (రూ.360 కోట్లు), ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా (రూ.433 కోట్లు), బ్లూస్టార్ క్లైమాటెక్ (రూ.180 కోట్లు, వోల్టాస్ (రూ.200 కోట్లు) ఉన్నాయి.

క్యూ3 ఫలితాలు

ఐడీబీఐ బ్యాంక్ జూమ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఐడీబీఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 31 శాతం జంప్‌చేసి రూ. 1,908 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,458 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,514 కోట్ల నుంచి రూ. 8,565 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం రూ. 3,435 కోట్ల నుంచి రూ. 4,228 కోట్లకు జంప్ చేసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.69 శాతం నుంచి 3.57 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.34 శాతం నుంచి 0.18 శాతానికి తగ్గాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 320 కోట్ల నుంచి రూ. 166 కోట్లకు భారీగా క్షీణించాయి. కనీస మూలధన నిష్పత్తి 21.98 శాతానికి చేరింది. బ్యాంక్‌లో బీమా రంగ పీఎస్‌యూ ఎల్ఐసీ 49.24 శాతం వాటాను కలిగి ఉంది. కాగా.. బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వానికి గల 45 శాతం వాటాను విక్రయించే ప్రణాళికల్లో ఉన్న విషయం విదితమే.


ఐడీబీఐ బ్యాంక్ షేరు ఎన్ఎస్ఈలో 1.6 శాతం లాభంతో రూ. 85 వద్ద ముగిసింది.

ఐవోబీ అప్..

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 21 శాతం జంప్‌చేసి రూ. 874 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 723 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,437 కోట్ల నుంచి రూ. 8,409 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 6,176 కోట్ల నుంచి రూ. 7,112 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.9 శాతం నుంచి 2.55 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.62 శాతం నుంచి 0.42 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 16.97 శాతానికి చేరింది.

ఐవోబీ షేరు ఎన్ఎస్ఈలో 3 శాతం లాభంతో రూ. 52 వద్ద ముగిసింది.

సెంట్రల్ బ్యాంక్ హైజంప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 33 శాతం జంప్‌చేసి రూ. 959 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 718 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,809 కోట్ల నుంచి రూ. 9,139 కోట్లకు జంప్ చేసింది. వడ్డీ ఆదాయం రూ. 7,809 కోట్ల నుంచి రూ. 8,509 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు 4.5 శాతం నుంచి 3.86 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.27 శాతం నుంచి 0.59 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 16.43 శాతానికి చేరింది. ఫ్యూచర్ జనరాలి బీమా సంస్థలలో వాటాల కొనుగోలుకి బిడ్ సొమ్ములో 15 శాతానికి సమానమైన రూ. 508 కోట్లను 2024 నవంబర్ 16న డిపాజిట్ చేసినట్లు బ్యాంక్ వెల్లడించింది. ఫ్యూచర్ జనరాలి ఇండియా ఇన్సూరెన్స్‌లో 24.91 శాతం వాటాను సొంతం చేసుకోనుంది.

సెంట్రల్ బ్యాంక్ షేరు ఎన్ఎస్ఈలో 3 శాతం లాభంతో రూ. 54 వద్ద ముగిసింది.

న్యూజెన్ సాఫ్ట్‌వేర్ ప్రోత్సాహకరం

లాభం రూ. 89 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల కంపెనీ న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 31 శాతం జంప్‌చేసి రూ. 89 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 68 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 18 శాతం ఎగసి రూ. 381 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 324 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. కాగా.. త్రైమాసికవారీగా(క్యూ2) చూస్తే నికర లాభం 27 శాతం వృద్ధి చూపగా.. ఆదాయం 5.5 శాతం పుంజుకున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ దివాకర్ నిగమ్ తెలియజేశారు.

న్యూజెన్ సాఫ్ట్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం తక్కువగా రూ. 1,575 వద్ద ముగిసింది.

ఐఆర్ఎఫ్‌సీ లాభం ఫ్లాట్

రూ. 1,631 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఎన్‌బీఎఫ్‌సీ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 1,631 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,599 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,740 కోట్ల నుంచి రూ. 6,766 కోట్లకు నామమాత్రంగా పుంజుకుంది. మినీ రత్న కంపెనీ మొత్తం వ్యయాలు మాత్రం రూ. 5,141 కోట్ల నుంచి రూ. 5,136 కోట్లకు నామమాత్రంగా నీరసించాయి. 2024 డిసెంబర్‌కల్లా కంపెనీ నెట్‌వర్త్ రూ. 47,443 కోట్ల నుంచి రూ. 52,046 కోట్లకు ఎగసింది. వ్యాపార విస్తరణకు వీలుగా ఈ కాలంలో బాండ్ల జారీ ద్వారా రూ. 6,600 కోట్లు సమీకరించింది.

బీఎస్ఈలో ఐఆర్ఎఫ్‌సీ షేరు 0.3 శాతం బలపడి రూ. 147 వద్ద ముగిసింది.

ర్యాలీస్ ఇండియా డౌన్

రూ. 11 కోట్ల లాభం



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ కంపెనీ ర్యాలీస్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 54 శాతంపైగా క్షీణించి రూ. 11 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 24 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 13 శాతం తక్కువగా రూ. 522 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 598 కోట్ల టర్నోవర్ నమోదైంది. పోటీ తీవ్రమైన నేపథ్యంలోనూ దేశీ బిజినెస్ అమ్మకాల పరిమాణం పుంజుకున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో గ్యానేంద్ర శుక్లా పేర్కొన్నారు. అయితే సీడ్స్ బిజినెస్ 7 శాతం క్షీణించగా.. ఎగుమతులు మరింత అధికంగా 38 శాతం తగ్గినట్లు తెలియజేశారు. దీంతో లాభాలు దెబ్బతిన్నట్లు వెల్లడించారు.

బీఎస్ఈలో ర్యాలీస్ ఇండియా షేరు 7 శాతం పతనమై రూ. 270 వద్ద ముగిసింది.

ఐసీఐసీఐ లాంబార్డ్ లాభం 68 శాతం అప్..

న్యూఢిల్లీ: సాధారణ బీమా సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 724 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నమోదైన రూ. 431 కోట్లతో పోలిస్తే ఇది 68 శాతం అధికం. సమీక్షాకాలంలో స్థూల ప్రత్యక్ష ప్రీమియం ఆదాయం రూ. 6,230 కోట్ల నుంచి రూ. 6,214 కోట్లకు తగ్గింది.



రంజీ బరిలో రోహిత్, యశస్వి

23 నుంచి జమ్మూ కశ్మీర్‌తో ముంబై పోరు

ముంబై: భారత క్రికెట్ కెప్టెన్ రోహిత్ శర్మ చాన్నాళ్ల తర్వాత రంజీ ట్రోఫీ ఆడేందుకు సిద్ధమయ్యాడు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత సీనియర్ స్టార్ దేశవాళీ టోర్నీ బరిలోకి దిగుతున్నాడు. ఈ నెల 23 నుంచి జమ్మూ కశ్మీర్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌లో అతను తన సొంతజట్టు ముంబైకి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ)–బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) గ్రౌండ్‌లో ఇరుజట్ల మధ్య గురువారం నుంచి నాలుగు రోజుల పాటు గ్రూప్ 'ఎ' ఎలైట్ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో భారత యువ సంచలనం యశస్వి జైస్వాల్ కూడా ఆడుతున్నాడు. ఈ యువ క్రికెటర్ ఆడటంలో విశేషమేమీ లేకపోయినా... సీనియర్లు, స్టార్లు మాత్రం ఏళ్లకు ఏళ్ల రంజీ సహా దేశవాళీ టోర్నీల్లో ఆడేందుకు ఏమాత్రం ఆసక్తి చూపడంలేదు. హెడ్ కోచ్ గంభీర్ సిఫార్సుల మేరకు టీమిండియా ప్లేయర్లకు బోర్డు కొత్త ప్రొటోకాల్‌ను అమలు చేస్తోంది. దీని ప్రకారం ఆటగాళ్లంతా రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడాల్సిందేనని సూచించింది. దీనివల్ల విదేశాల్లో సంప్రదాయ టెస్టు క్రికెట్‌లో మన జట్టు ప్రదర్శన మెరుగవుతుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భావిస్తోంది. రోహిత్ జమ్మూతో మ్యాచ్ బరిలోకి దిగుతున్నప్పటికీ కెప్టెన్ మాత్రం కాదు. ఈ సీజన్‌లో ముంబైని నడిపిస్తున్న వెటరన్ బ్యాటర్ అజింక్య రహానే సారథ్యంలోనే 'హిట్‌మ్యాన్' ఆడతాడని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) ఒక ప్రకటనలో తెలిపింది.

ముంబై రంజీ జట్టు: రహానే (కెప్టెన్), రోహిత్, జైస్వాల్, ఆయుశ్, శ్రేయస్ అయ్యర్, సిద్దేశ్ లాడ్, శివమ్ దూబే, హార్దిక్ తోమర్, ఆకాశ్, తనుశ్ కొటియాన్, ములానీ, హిమాన్షు, శార్దుల్, మోహిత్ అవస్తి, సిల్వెస్టర్ డిసౌజా, రోస్టన్ డైస్, కర్ష్ కొఠారి.

నైజీరియా సంచలనం

న్యూజిలాండ్‌కు షాక్ ● మహిళల టి20 అండర్–19 ప్రపంచకప్



నైజీరియా జట్టు సభ్యుల సంబరం

కౌలాలంపూర్: ఈ మెగా టోర్నీతోనే అరంగేట్రం చేసిన ఆఫ్రికా దేశం నైజీరియా యువతుల జట్టు సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఐసీసీ మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్‌లో సోమవారం జరిగిన పోరులో నైజీరియా... న్యూజిలాండ్‌కు ఊహించని షాక్ ఇచ్చింది. మహిళల క్రికెట్‌లో కివీస్ బలమైన జట్టు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లకు ఏమాత్రం తీసిపోని గట్టి ప్రత్యర్థి. అలాంటి జట్టును తాము నిర్దేశించిన 66 పరుగుల సులువైన లక్ష్యాన్ని ఛేదించకుండా నిలువరించడం పెద్ద విశేషం. గ్రూప్ 'సి'లో జరిగిన ఈ మ్యాచ్‌లో నైజీరియా అమ్మాయిల జట్టు 2 పరుగుల తేడాతో కివీస్‌పై గెలుపొందింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌ను 13 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నైజీరియా నిర్ణీత 13 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. కెప్టెన్ లక్కీ పియెటి (25 బంతుల్లో 19; 1 ఫోర్) టాప్‌స్కోరర్ కాగా, లిలియన్ ఉడే (22 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) రెండంకెల స్కోరు చేసింది. ఇంకెవరూ కనీసం పది పరుగులైనా చేయలేదు. తర్వాత స్వల్ప లక్ష్యమే అయినా కివీస్ 13 ఓవర్లలో 6 వికెట్లకు 63 పరుగులే చేసి ఓడింది. అనిక టాడ్ (27 బంతుల్లో 19; 1 ఫోర్), ఇవ్ వొలాండ్ (15 బంతుల్లో 14; 1 ఫోర్) మెరుగ్గా ఆడారంతే! లిలియన్ ఉడే (3–0–8–1) బౌలింగ్‌లోనూ అదరగొట్టింది.

ఆఖరి ఓవర్ డ్రామా...

కివీస్ 57/5 స్కోరు చేసి గెలుపు వాకిట నిలబడింది. ఇక ఆఖరి ఓవర్లో విజయానికి 9 పరుగులు చేస్తే చాలు. కానీ నైజీరియన్ బౌలర్, కెప్టెన్ లక్కీ పియెటి 6 పరుగులే ఇచ్చింది. దీంతో 2 పరుగుల తేడాతో ఊహించని విధంగా న్యూజిలాండ్ కంగుతింది. లక్కీ తొలి నాలుగు బంతుల్లో 4 పరుగులే ఇచ్చింది. ఇందులో రెండో బంతి 'బై' కాగా, నాలుగో బంతి లెగ్‌బై! అంటే బ్యాటర్లు కొట్టింది 2 పరుగులే అన్నమాట! ఐదో బంతికి పరుగే ఇవ్వలేదు. ఇక మిగిలింది. చివరి బంతి... కివీస్ గెలిచేందుకు 5 పరుగులు కావాలి. అయాన్ లంబట్ (6 నాటౌట్) కొట్టిన షాట్‌కు 2 పరుగులే రాగా, మరో పరుగుకు ప్రయత్నించడంతో కెప్టెన్ టష్ వేక్‌లిన్ (18 బంతుల్లో 18; 2 ఫోర్లు) రనౌటైంది.

అ'మెరిక' విజయం

సోమవారమే జరిగిన మరో 'సూపర్ షో' ఈ ప్రపంచకప్‌కు వన్నె తెచ్చింది. అమెరికా యువతుల జట్టు ఐర్లాండ్‌పై మెరిక విజయం సాధించింది. 9.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 9 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. ముందుగా ఐర్లాండ్ 17.4 ఓవర్లలో 75 పరుగులకే ఆలౌటైంది. అలైస్ వాల్ష్ (16; 2 ఫోర్లు), లాలా మెక్‌బ్రిడ్ (13), అబీ హ్యారిసన్ (13), ఫ్రెయా సర్జెంట్ (10) రెండంకెల స్కోర్లు చేశారు. ఇసాని వాఘెలా 3, అదితిబా, రీతూ సింగ్, చేతన ప్రసాద్ తలా 2 వికెట్లు తీశారు. తెలుగు సంతతి అమ్మాయి ఇమ్మడి శాన్వీ ఒక వికెట్ తీసింది. తర్వాత అమెరికా జట్టు 9.4 ఓవర్లలోనే వికెట్ మాత్రమే కోల్పోయి 79 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు దిశా ఢీంగ్రా (33 బంతుల్లో 46; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), తెలుగు సంతతి అమ్మాయి పగిడ్యాల చేతన రెడ్డి (25 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 9.3 ఓవర్లలో 75 పరుగులు జోడించారు. ఆ మరుసటి బంతికే ఇసాని వాఘెలా (4 నాటౌట్) బౌండరీ బాదడంతో ఇంకా 10.2 ఓవర్లు మిగిలుండగానే అమెరికా అమోఘ విజయం సాధించింది. **నేడు జరిగే మ్యాచ్‌ల్లో శ్రీలంకతో వెస్టిండీస్ (ఉదయం 8 గంటల నుంచి); మలేసియాతో భారత్ (మధ్యాహ్నం 12 గంటల నుంచి) తలపడతాయి.**



చేతన రెడ్డి

10 బంతుల్లోనే దక్షిణాఫ్రికా విజయం

అండర్–19 ప్రపంచకప్‌లో సోమవారమైతే 'ఒకటికి మించి మరొకటి' అన్నట్లుగా మ్యాచ్‌లు సంచలన ఫలితాల్ని నమోదు చేశాయి. ఇన్నింగ్స్ బ్రేక్ వెళ్లొచ్చేలోపే దక్షిణాఫ్రికా యువతుల జట్టు మ్యాచ్‌ను ఖతమ్ చేసింది. అదేం 'బ్రేక్... ఇదేం 'ఖతమ్' అంటే మాత్రం సమోవా జట్టుతో జరిగిన మ్యాచ్ స్కోరు బోర్డును ఓసారి చూడాల్సిందే! గ్రూప్ 'సి'లో జరిగిన ఈ మ్యాచ్‌లో సమోవా జట్టు 9.1 ఓవర్లలో 16 పరుగులకే కుప్పకూలింది. ఇన్నింగ్స్‌లో ఐదు సున్నాలు (0), నాలుగు ఒకట్లు (1), రెండు మూడులు (3 పరుగులు) ఉన్నాయంతే! ప్రత్యర్థి బ్యాటర్లు చేసిన పరుగులకంటే సఫారీ నలుగురు బౌలర్లు తీసిన వికెట్లే అంకెల్లో టాప్‌గా ఉన్నాయి. ఎన్‌తబిసెంగ్ నిని 3, ఫే కౌలింగ్, కేలా రేనెకె, శేషిని నాయుడు తలా 2 వికెట్లు తీశారు. తర్వాత దక్షిణాఫ్రికా జట్టు ఓపెనర్లు ఇద్దరే... పలువురు ప్రేక్షకులు బ్రేక్‌కు వెళ్లొచ్చే లోపే 10 బంతుల్లో 17 పరుగులు చేసి 10 వికెట్లతో ఘన విజయాన్ని అందించారు. ఓపెనర్లు సిమోన్ లారెన్స్ (6 నాటౌట్), జెమ్మా బోతా (6 నాటౌట్) 1.4 ఓవర్లలోనే మ్యాచ్‌నే ముగించేశారు.



ఎన్‌తబిసెంగ్

'కొత్తగా నిరూపించుకోవాల్సిందేమీ లేదు'

- వైస్ కెప్టెన్సీతో బాధ్యత పెరిగింది
- ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ వ్యాఖ్య



కోల్‌కతా: భారత్ తరఫున మూడు ఫార్మాట్‌లలో కలిపి 180 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ 184 వికెట్లు తీయడంతో పాటు 1,712 పరుగులు కూడా సాధించాడు. ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరగబోయే టి20 సిరీస్ కోసం అతను తొలిసారి వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సుదీర్ఘ కాలం పాటు తనదైన బౌలింగ్, బ్యాటింగ్ శైలిని పోలిన రవీంద్ర జడేజా నీడలోనే ఉండిపోయిన అతను... ఇటీవలే కొన్ని అత్యుత్తమ ప్రదర్శనలతో తనకంటూ ప్రత్యేకత కనబరుస్తున్నాడు. దాదాపు 11 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో ఎంతో సాధించానని, ఇప్పుడు కొత్తగా తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం లేదని అక్షర్ పటేల్ వ్యాఖ్యానించాడు. 'భారత జట్టుకు సంబంధించి మూడు ఫార్మాట్‌లలో సంధి దశ నడుస్తోందనేది వాస్తవం. అయితే దీనిపై సెలక్టర్లే నిర్ణయం తీసుకుంటారు. నాకు సంబంధించి నేను కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదు. అప్పగించిన పనిని సమర్థంగా చేయడమే నాకు తెలుసు. అలా చేస్తే చాలు జట్టులో స్థానం గురించి చింతించాల్సిన అవసరం ఉండదు. ఫార్మాట్ ఏదైనా అవకాశం లభించిన ప్రతీసారి ఆటను మెరుగుపర్చుకుంటూ ఉత్తమ ప్రదర్శన ఇస్తాను. జట్టులో నా స్థానం గురించి ఎప్పుడూ ఆందోళన చెందను' అని అతను అన్నాడు. తాజాగా వైస్ కెప్టెన్సీతో కొంత బాధ్యత పెరిగిందనేది మాత్రం వాస్తవమని అక్షర్ అభిప్రాయపడ్డాడు. 'టీమ్ నాయకత్వ బృందంలో నాకు కూడా అవకాశం దక్కడం సంతోషం. దీని వల్ల బాధ్యత మరింత పెరుగుతుంది. మన టి20 జట్టు స్థిరంగా ఉంది కాబట్టి కొత్తగా అనూహ్య నిర్ణయాలేమీ ఉండవు. అయితే మైదానంలో వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది' అని అతను చెప్పాడు. భారత జట్టులో ఓపెనర్లకు మాత్రమే వారి స్థానాల విషయంలో స్పష్టత ఉంటుందని, మూడు నుంచి ఏడో స్థానం వరకు బ్యాటర్లు ఎక్కడైనా ఆడేందుకు సిద్ధంగా ఉండాలని అతను అభిప్రాయ పడ్డాడు. 'ఏడాది కాలంగా ఇది కొనసాగుతోంది. 3–7 బ్యాటర్లు మ్యాచ్‌లో ఆ సమయంలో ఉన్న పరిస్థితిని బట్టి ఎక్కడైనా ఆడాల్సి ఉంటుంది. దీని గురించి ఆటగాళ్లందరికీ ఇప్పటికే చెప్పేశాం' అని పటేల్ వెల్లడించాడు. మరోవైపు ఆస్ట్రేలియాతో సిరీస్ కోసం జట్టులో తాను ఎంపిక కాకపోవడంపై ఎలాంటి నిరాశ కలగలేదని... 15 మందిని ఎంపిక చేస్తారని, తనకు చోటు దక్కకపోవడం పెద్ద విషయం కాదని అక్షర్ స్పష్టం చేశాడు. ఆ సిరీస్‌లో భారత జట్టు ప్రదర్శన గురించి ఇప్పుడు చర్చ అనవసరమని, ఇప్పుడు కొత్తగా మళ్లీ మొదలు పెడుతున్నామని ఈ గుజరాత్ ఆల్‌రౌండర్ వ్యాఖ్యానించాడు.

బ్యాడ్మింటన్ కోచ్‌ల వలస!

స్వదేశంలో జీతాలు సరిపోక ఇతర దేశాల వైపు చూపు

- వేతనాలు పెంచే ప్రయత్నంలో 'బాయ్'
- సింగపూర్ కోచింగ్ బృందంలో అనూప్ శ్రీధర్



అనూప్ శ్రీధర్

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ మాజీ నంబర్ వన్, కామన్వెల్త్ క్రీడల కాంస్య పతక విజేత అనూప్ శ్రీధర్ రిటైర్మెంట్ తర్వాత దాదాపు దశాబ్ద కాలంగా కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఇన్నేళ్లలో కోచ్‌గా అతనికి మంచి పేరు ఉంది. ఇటీవలి కాలంలో పీవీ సింధు, లక్ష్య సేన్‌లతో కూడా కలిసి అనూప్ పని చేశాడు. ఇప్పుడు అనూప్ సింగపూర్ జాతీయ జట్టు కోచింగ్ బృందంలో భాగం అవుతున్నాడు. సింగపూర్ టీమ్‌కు అదనపు సింగిల్స్ కోచ్‌గా అతను నియమితుడయ్యాడు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన సాయిప్రణీత్ కూడా ఏడాది క్రితం ఆటకు రిటైర్మెంట్ పలికి అమెరికాలోని ఒక క్లబ్‌కు కోచ్‌గా వెళ్లాడు. కోచ్‌గా వ్యక్తిగతంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని కిడాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్‌లకు మెంటార్‌కు ఎన్నో ప్రతిష్టాత్మక టోర్నీ విజయాల్లో భాగంగా ఉన్న మొహమ్మద్ సియాదతుల్లా కూడా సంవత్సరం క్రితమే అమెరికాలోని ఒరెగాన్ అకాడమీలో కోచ్‌గా చేరాడు. శ్రీధర్, సియాదత్ భారత్‌కు చెందిన అగ్రశ్రేణి ఆటగాళ్లతో పని చేసిన వారే. అయితే ఆర్థికపరంగా భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) నుంచి వీరికి తగినంత మద్దతు లభించలేదు. కోచ్‌లకు 'బాయ్' ఇచ్చే తక్కువ ఫీజుతో పని చేస్తూ వచ్చిన వీరు తగిన అవకాశాల కోసం వలస వెళ్లారు. ఇప్పుడు పారుపల్లి కశ్యప్, గురుసాయిదత్ కూడా ఆడటాన్ని పక్కన పెట్టి కోచింగ్ వైపు వచ్చారు. ఇప్పటికే శ్రీకాంత్, ప్రణయ్, ప్రియాన్షు రజావత్‌లకు ట్రైనర్‌లుగా వ్యవహరిస్తున్న వీరు... చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ మార్గనిర్దేశనంలో యువ ఆటగాళ్లు తరుణ్ మన్నేపల్లి, అన్‌మోల్ ఖర్బ్, అనుపమ ఉపాధ్యాయ, రక్షితలకు శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు మాజీ ఆటగాళ్లు మను అత్రి, సుమీత్ రెడ్డి కూడా కోచింగ్ వైపు వచ్చేయగా... సీనియర్ కోచ్ అరుణ్ విష్ణు భారత జట్టును వీడి నాగపూర్‌లోని సొంత అకాడమీకి వెళ్లిపోయాడు. ప్రస్తుత స్థితిలో శిక్షణకు భారత కోచ్‌లు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నా... 'బాయ్' ఇచ్చే స్వల్ప జీతాల కారణంగా వారు ముందుకు వచ్చి భారత జట్టులో కలిసి పని చేయలేకపోతున్నారు. మాజీ ఆటగాళ్లను చూస్తే అరవింద్ భట్, చేతన్ ఆనంద్, గుత్తా జ్వాల సొంత అకాడమీలు నిర్వహించుకుంటున్నారు. 'భారత కోచ్‌లకు జీతాలు పెంచాల్సిన అవసరం ఉంది. లేదంటే ఎవరూ ఎక్కువ కాలం సాగలేరు. దాదాపు 10 వేల డాలర్ల నెల జీతానికి విదేశీ కోచ్‌లను తీసుకోవడంలో తప్పు లేదు. అయితే వారిలో నాలుగో వంతు కూడా భారత కోచ్‌లకు ఇవ్వడం లేదు. ఇటీవల పారిస్ ఒలింపిక్స్ సమయంలోనే జీతాలు పెంచి రూ.50 వేలు చేశారు. ఇది చాలా తక్కువ మొత్తం. అందుకే భారత జట్టుతో కలిసి పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. భారత కోచ్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవమే. కానీ ఏ అమెరికాలాంటి దేశానికి వెళితే బాగా సంపాదించుకోవచ్చు. సొంత అకాడమీ పెట్టినా మంచి అవకాశాలుంటాయి' అని అరుణ్ విష్ణు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల భారత మహిళల సింగిల్స్ కోచ్‌గా ఇర్వాన్స్యా ఆది ప్రతమ (ఇండోనేసియా), డబుల్స్ కోచ్‌గా టాన్ కిమ్ హర్ (మలేసియా)లను 'బాయ్' నియమించింది. 'సాంకేతిక అంశాలు నేర్పించడం మాత్రమే కోచ్ పని కాదు. టోర్నీలకు సంబంధించి సరైన మార్గనిర్దేశనం, గాయాల విషయంలో జాగ్రత్తలు వంటి అన్ని అంశాలు చూడాల్సి ఉంటుంది. ఇప్పుడైనా మన భారత కోచ్‌లపై విశ్వాసం ఉంచాల్సిన అవసరం ఉంది. రిటైర్డ్ ఆటగాళ్లకు సరైన గుర్తింపు, జీతాలు, అవకాశాలు ఇస్తే మనమూ అత్యుత్తమ ప్లేయర్లను తయారు చేయవచ్చు. ఎంత కాలం విదేశీ కోచ్‌లను తెచ్చుకుంటారు' అని పారుపల్లి కశ్యప్ ప్రశ్నించాడు. తాజా పరిస్థితి వాస్తవమేనని అంగీకరించిన 'బాయ్' కార్యదర్శి సంజయ్ మిశ్రా... దీనిని చక్కదిద్దేందుకు తాము ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. 'నాలుగు నెలల క్రితం భారత జట్టు సహాయక సిబ్బంది జీతాలు పెంచాం. ట్రైనర్లు, ఫిజియోథెరపిస్ట్‌లు అప్పటి వరకు తీసుకుంటున్న మొత్తంతో పోలిస్తే 50–75 శాతం పెంచాం. ఇక తర్వాతి వంతు కోచ్‌లదే. జాతీయ క్యాంప్‌లో ఉన్న కోచ్‌ల జీతాలను త్వరలోనే సవరిస్తాం' అని ఆయన చెప్పారు.



సైనా, కశ్యప్‌లతో కోచ్ సియాదతుల్లా (ఫైల్)

శ్రీకాంత్ సత్తాకు పరీక్ష!



జకార్తా: ఒకప్పుడు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ అందుకొని... ఒకే ఏడాది నాలుగు సూపర్ సిరీస్ టైటిల్స్ సాధించి... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచి... ఓ వెలుగు వెలిగిన హైదరాబాద్ స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ప్రస్తుతం పునర్వైభవం సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు. ఇటీవల వివాహ బంధంలోకి అడుగు పెట్టిన 31 ఏళ్ల శ్రీకాంత్ ఈ ఏడాది తొలిసారి రాకెట్ పట్టి బ్యాడ్మింటన్ కోర్టులో అడుగు పెట్టనున్నాడు. నేటి నుంచి మొదలయ్యే సీజన్ మూడో టోర్నమెంట్ ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నమెంట్‌లో శ్రీకాంత్ క్వాలిఫయింగ్ విభాగంలో పోటీపడనున్నాడు. భారత్‌కే చెందిన ఆయుశ్ శెట్టితో శ్రీకాంత్ క్వాలిఫయింగ్ మ్యాచ్ ఆడతాడు. ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ గెలిస్తే మెయిన్ 'డ్రా'కు అర్హత సాధిస్తాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 45వ స్థానంలో ఉన్న శ్రీకాంత్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో చైనా ప్లేయర్ షి ఫెంగ్ లీతో తలపడే అవకాశం ఉంది. గత ఏడాది శ్రీకాంత్ 14 టోర్నమెంట్‌లలో పాల్గొన్నాడు. స్విస్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరుకొని తన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. మరోవైపు పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో భారత్ నుంచి కిరణ్ జార్జి, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ బరిలో ఉన్నారు. తొలి రౌండ్‌లో కిరణ్ జార్జి క్వాలిఫయర్‌తో... టకుమా ఒబయాషి (జపాన్)తో లక్ష్య సేన్... కొడాయ్ నరోకా (జపాన్)తో ప్రియాన్షు ఆడతారు. తొలి రోజు మంగళవారం సింగిల్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు, డబుల్స్ మెయిన్ 'డ్రా' మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

మహిళల సింగిల్స్ విభాగంలో క్వాలిఫయింగ్‌లో ఇషారాణి బారువా, తాన్యా హేమంత్ పోటీపడనున్నారు. మెయిన్ 'డ్రా'లో పీవీ సింధు, రక్షితశ్రీ, ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ్ బరిలో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో–అశ్విని పొన్నప్ప; పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి; మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్; తనీషా క్రాస్టో–ధ్రువ్ కపిల జోడీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి.

ఫెరారీ కోటలో అడుగు పెట్టిన హామిల్టన్



మారనెల్లో (ఇటలీ): ఫార్ములావన్ దిగ్గజం, బ్రిటన్ రేసింగ్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ కొత్త జట్టు ఫెరారీ చెంత చేరాడు. ఏడుసార్లు ఫార్ములావన్ చాంపియన్‌గా నిలిచిన ఈ 40 ఏళ్ల రేసర్ ఇటీవల జట్టు మారాడు. ఈ సందర్భంగా సోమవారం మారనెల్లో పట్టణంలో ఉన్న ఫెరారీ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లాడు. స్కుడెరియా ఫెరారీ (ఫెరారీ జట్టు పేరు)కి సంబంధించిన ఫియోరానో ట్రాక్‌ను సందర్శించిన హామిల్టన్ గంటలతరబడి గడిపాడు. ఫెరారీ టీమ్ కార్యక్రమంలో రోజంతా భాగమయ్యాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ 'ఎవరికైనా జీవితంలో కొన్ని ప్రత్యేక క్షణాలు, ప్రత్యేక రోజులుంటూ ఉంటాయి. నాకిది ప్రత్యేకమైన రోజు. కొత్త జట్టుతో కొత్త ప్రయాణం సాఫీగా సాగేందుకు తొలి అడుగు వేశాను. ట్రాక్‌లో రెడ్ కారు (ఫెరారీ రంగు)తో కూడా దూసుకెళ్లాలని కలలైతే ఉండేది. ఇప్పుడా కల నిజం కాబోతోంది. ఇది తలచుకుంటుంటే చాలా సంతోషంగా ఉంది' అని అన్నాడు. ఏళ్ల తరబడి మెర్సిడెస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హామిల్టన్ ఏడుసార్లు చాంపియన్‌గా నిలిచి దిగ్గజ ఫార్ములావన్ రేసర్ మైకేల్ షుమాకర్ రికార్డు (7 విజయాలు)ను సమం చేశాడు.

ఇలా మిగిలాం..!



ఇజ్రాయెల్‌-హమాస్‌ కాల్పుల విరమణ ఒప్పందంతో యుద్ధం తాత్కాలికంగా ముగియడంతో గాజాలో దాదాపు ఏడాది అనంతరం సోమవారం ప్రశాంత వాతావరణం సాక్షాత్కరించింది. ఇజ్రాయెల్‌ ఆర్మీ యథేచ్ఛగా సాగించిన దాడులతో పాలస్తీనియన్ల నివాస భవనాలు శిథిలాల కుప్పగా మారాయి. సోమవారం శిథిలాలతో నిండిన వీధిలో కుర్చీలో గాజా వాసి ఒకరు ఇలా నిర్వేదంగా కూర్చున్నారు.

టిక్‌ టాక్‌పై కన్నేసిన
ఎలాన్‌ మస్క్‌!

వాషింగ్టన్‌: చైనాకు చెందిన సోషల్‌ మీడియా వేదిక 'టిక్‌టాక్‌'పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ సానుకూలంగా ఉన్నారు. టిక్‌టాక్‌ను నిషేధిస్తూ జో బైడెన్‌ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని 90 రోజులపాటు ఆయన నిలిపివేయబోతున్నారు. ఈ మేరకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, టిక్‌టాక్‌ విషయంలో ట్రంప్‌ నిర్ణయాన్ని ఆయన మిత్రుడు, టెస్లా సీఈఓ, ఎక్స్‌(ట్విట్టర్‌) అధినేత ఎలాన్‌ మస్క్‌ తప్పుపడుతున్నారు. చైనాలో 'ఎక్స్‌'పై ఎన్నో ఆంక్షలు విధించారని, స్వేచ్ఛగా ఉపయోగించుకొనే పరిస్థితి లేదని, అలాంటప్పుడు అమెరికాలో టిక్‌టాక్‌ను ఎందుకు నిషేధించకూడదని ప్రశ్నిస్తున్నారు. టిక్‌టాక్‌ను నిషేధిస్తూ తీసుకొచ్చిన చట్టాన్ని అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల సమర్థించింది. టిక్‌టాక్‌ను చైనా మాతృసంస్థ మరొకరికి విక్రయించిన పక్షంలో అమెరికాలో యథావిధిగా కొనసాగించవచ్చని సూచించింది. చైనా మాతృసంస్థ ఆధ్వర్యంలోనే ఉంటే అమెరికాలో నిషేధం తప్పదని స్పష్టంచేసింది. అమెరికాలో కోట్లాది మంది టిక్‌టాక్‌ యూజర్లు ఉన్నారు. వారి వ్యక్తిగత సమాచారం చైనాకు చేరుతోందన్న కారణంతో టిక్‌టాక్‌పై బైడెన్‌ ప్రభుత్వం నిషేధం విధించింది. అమెరికాలో టిక్‌టాక్‌ను సొంతం చేసుకోవాలని ఎలాన్‌ మస్క్‌ పట్టుదలతో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మరొకరికి విక్రయిస్తే టిక్‌టాక్‌పై ఎలాంటి నిషేధం ఉండదు కాబట్టి ఆ దిశగా ఆయన ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ ప్రచారాన్ని టిక్‌టాక్‌ యాజమాన్యం ఖండించింది.

ట్రంప్‌ మేనియా



ట్రంప్‌ ప్రమాణ స్వీకార వేళ... ట్రంప్‌ అభిమాని ఒకరు ఇలా ఫ్లెక్సీ ప్రదర్శించారు



ఓ మహిళా అభిమాని లెగ్గింగ్స్‌పై కూడా..



మరొకరి మెడలో ట్రంప్‌ ముఖంతో పెండెంట్‌



ట్రంప్‌ మద్దతుదారులు పంచిన 'ట్రంప్‌ బిల్‌' నకిలీ నోటు

పారిపోవాలనుకున్నాడు

టీవీల్లో తన ఫొటో రావడంతో హతాశుడైన నిందితుడు షరీఫుల్‌

ముంబై: దొంగతనం కోసం బాలీవుడ్‌ నటుడు సైఫ్‌ అలీ ఖాన్‌ ఇంట్లో చొరబడి పెనుగులాటలో ఆయనను పొడిచి పారిపోయిన బంగ్లాదేశ్‌కు చెందిన నిందితుడు షరీఫుల్‌ ఇస్లాం షెహ్‌జాద్‌ మొహమ్మద్‌ రోహిల్లా అమీన్‌ ఫకీర్‌ దాడి తర్వాత తన స్వదేశానికి వెళ్లిపోవాలని భావించాడు. పోలీసులు విచారణలో ఇలాంటి పలు అంశాలు తాజాగా వెల్లడయ్యాయి. గత గురువారం దాడిలో గాయపడిన సైఫ్‌ స్వల్ప శస్త్రచికిత్స తర్వాత కోలుకుంటున్న విషయం తెల్సిందే.

విదేశీయులు, పాస్‌పోర్ట్‌ చట్టాల కింద కేసు నమోదు

తాను ఏడు నెలల క్రితం బంగ్లాదేశ్‌ నుంచి వచ్చినట్లు షరీఫుల్‌ ఒప్పుకున్నాడు. అతని ఒరిజినల్‌ బర్త్‌ సర్టిఫికేట్‌నూ పోలీసులు సంపాదించారు. దాంతో అతని బంగ్లాదేశ్‌లోని ఝలోకతి జిల్లావాసిగా రూఢీఅయింది. అక్రమంగా భారత్‌లో చొరబడ్డ నేరానికి అతనిపై విదేశీయుల చట్టం, పాస్‌పోర్ట్‌ చట్టం కింద సైతం కేసు నమోదుచేశారు. భారతీయ పాస్‌పోర్ట్‌ సంపాదించేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. దీంతో ఎలాగైనా డబ్బు బాగా సంపాదించి స్వదేశం వెళ్లిపోవాలని ప్లాన్‌ వేశాడు. అందుకే ఐదునెలలు ముంబైలో హౌస్‌కీపింగ్‌ వంటి చిన్నాచితకా పనులు చేసిన అతను వాటిని పక్కనబెట్టి దొంగతనాలకు సిద్ధమయ్యాడు. ఇందులోభాగంగానే సైఫ్‌ ఇంట్లో చొరబడ్డాడు. అయితే తాను దాడి చేసింది బాలీవుడ్‌ నటుడిపై అనే విషయం తనకు టీవీల్లో వార్తల్లో చూసేదాకా తెలియదని పోలీసు విచారణలో షరీఫుల్‌ చెప్పాడు. సీసీటీవీ ఫుటేజీలోని తన ఫొటో న్యూస్‌ఛానెళ్లలో ప్రసారం కావడంతో భయపడిపోయాడు. సెలబ్రిటీపై దాడి నేపథ్యంలో పోలీసులు ఎలాగైనా తనను పట్టుకుంటారని భయపడి మళ్లీ బంగ్లాదేశ్‌కు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఈలోపే పోలీసులు పట్టుకోగలిగారు.

ఎలా పట్టుకోగలిగారు?

వర్లీలో గతంలో తాను పనిచేసిన పబ్‌ ప్రాంగణంలో జనవరి 16న నిద్రించిన నిందితుడు ఆరాత్రి హఠాత్తుగా మాయమై నేరుగా సైఫ్‌ ఇంట్లోకి వచ్చి దాడి చేసి తర్వాత బాంద్రా రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. తర్వాత దాదర్‌కు, ఆ తర్వాత వర్లీకి వెళ్లాడు. చివరకు థానే ప్రాంతంలో ఉన్నప్పుడు పోలీసులకు పట్టుబట్టాడు. సైఫ్‌ ఇంటి సమీప ప్రాంతాల్లోని అన్ని సీసీటీవీ కెమెరాలను చూసినా ఇతను ఏ దిశగా వెళ్లాడనే బలమైన క్లూ పోలీసులకు దొరకలేదు. దీంతో పాత సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా జనవరి 9వ తేదీన అంధేరీ వద్ద బైక్‌పై వెళ్తున్న వీడియోలో ఇతడిని గుర్తించారు. బైక్‌ యజమానిని ప్రశ్నించగా బైక్‌పై వెళ్లింది తనకు తెల్సిన ఒక నిర్మాణరంగ మేస్త్రీ దగ్గర పనిచేసిన కూలీ అని సమాధానమిచ్చాడు. దీంతో పోలీసులు ఆ మేస్త్రీని విచారించారు. గతంలో చిన్నాచితకా పనుల కోసం వర్లీ ప్రాంతంలోని మేస్త్రీ దగ్గరకు వచ్చి పని ఉంటే చెప్పాలని తన ఫోన్‌నంబర్‌ ఇచ్చి షరీఫుల్‌ తర్వాత థానె వెళ్లిపోయాడు. ఈ విషయం పోలీసులకు తెల్పి మేస్త్రీని విచారించగా షరీఫుల్‌ మొబైల్‌ నంబర్‌ను అందజేశాడు. తాజాగా శనివారం షరీఫుల్‌ వర్లీ సెంచురీ మిల్‌ వద్ద బుర్జీపావ్‌, వాటర్‌ బాటిల్‌ కొన్నప్పుడు ఈ నంబర్‌తో చేసిన గూగుల్‌పే లావాదేవీతో ఫోన్‌ లొకేషన్‌ను పోలీసులు పసిగట్టారు. అయితే అప్పటికే అతను థానెలోని దట్టమైన మడ అడవుల్లోకి పారిపోయాడని తెల్సి వేట మొదలెట్టారు. చిట్టచివరకు ఆదివారం తెల్లవారుజామున హీరానందానీ ఎస్టేట్‌ దగ్గరి లేబర్‌క్యాంప్‌ సమీప అడవిలో పట్టుకోగలిగారు. ఆరోజు ఘటన తర్వాత దొరక్కుండా తప్పించుకునేందుకు షరీఫుల్‌ వెంటనే దుస్తులు మార్చేశాడు. అయితే వెంట తెచ్చుకున్న బ్యాక్‌ప్యాక్‌ సైతం ఒకరకంగా ఇతడిని పట్టించింది. ఆ ప్రాంతంలో అదే బ్యాక్‌ప్యాక్‌ వేసుకున్న, అదే పోలికలున్న వ్యక్తులను విచారించి షరీఫుల్‌ను పోల్చుకోగలిగారు. దాడి రోజున ఏం జరిగిందో తెల్సుకునేందుకు నిందితుడిని సద్గురుశరణ్‌ బిల్డింగ్‌లోని సైఫ్‌ ఫ్లాట్‌కు తీసుకెళ్లి పోలీసులు అతనితో సీన్‌ రీక్రియేషన్‌ చేయించే వీలుంది.

ముందుగానే చర్చలకు పిలవాలి

కేంద్రానికి రైతు సంఘాల డిమాండ్‌

- దీక్షను విరమించాలని దల్లేవాల్‌కు వినతి

చండీగఢ్‌: రైతు సంఘాలతో సాధ్యమైనంత త్వరగా చర్చలు జరపాలని సంయుక్త కిసాన్‌ మోర్చా(ఎస్‌కేఎం, రాజకీయేతర), కిసాన్‌ మజ్దూర్‌ మోర్చా(కేఎంఎం) కేంద్రానికి విజ్ఞప్తి చేశాయి. అదేవిధంగా, రైతు నేత జగ్జీత్‌ సింగ్‌ దల్లేవాల్‌ నిరశన దీక్షను విరమించాలని కోరాయి. ఈ నెల 21న 101 మంది రైతులతో చేపట్టే ఢిల్లీ చలో మార్చ్‌ని 26వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించాయి. పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించడం వంటి రైతుల డిమాండ్ల సాధన కోసం కేఎంఎం, సంయుక్త కిసాన్‌ మోర్చా(రాజకీయేతర) కలిసి గత 11 నెలలుగా ఖనౌరీ, శంభు సరిహద్దుల్లో ఆందోళనలు సాగిస్తున్నాయి. డిమాండ్ల సాధన కోసం ఎస్‌కేఎం నేత జగ్జీత్‌ సింగ్‌ దల్లేవాల్‌ గతేడాది నవంబర్‌ 26వ తేదీ నుంచి నిరశన దీక్ష సాగిస్తున్నారు. శనివారం ఎస్‌కేఎం, కేఎంఎం నేతలతోపాటు దీక్షలో ఉన్న దల్లేవాల్‌ను కేంద్ర ప్రతినిధి బృందం కలిసి ఫిబ్రవరి 14వ తేదీన చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపాయి. కేంద్ర ప్రతినిధి బృందం వినతి మేరకు దల్లేవాల్‌ వైద్య సాయం తీసుకునేందుకు అంగీకరించారు. సోమవారం ఎస్‌కేఎం, కేఎంఎం నేతలు శర్వన్‌ సింగ్‌ పాంధర్‌, ఎంఎస్‌ రాయ్‌ తదితరులు శంభులోని దీక్షా శిబిరం వద్ద మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో ఎన్నికల నిబంధనావళి ఫిబ్రవరి 9వ తేదీ వరకు అమల్లో ఉంటున్నందున ఫిబ్రవరి 14వ తేదీన చర్చలు జరపాలని నిర్ణయించినట్లుగా కేంద్రం చెబుతుండటంపై వారు అనుమానం వ్యక్తం చేశారు. ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేయడం వంటి కీలక ప్రకటనలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రైతు సంఘాలతో చర్చలకు ఎన్నికల కోడ్‌ అడ్డంకిగా ఎలా మారిందని ప్రశ్నించారు. ఫిబ్రవరి 14వ తేదీ చాలా దూరంగా ఉన్నందున సాధ్యమైనంత త్వరగా ఢిల్లీ వేదికగానే చర్చలు మొదలవ్వాలని వారు డిమాండ్‌ చేశారు. అయితే, ఇది షరతు మాత్రం కాదన్నారు. ఈ నెల 26న ట్రాక్టర్‌ ర్యాలీ సందర్భంగా బీజేపీ కార్యాలయాలు, బడా షాపింగ్‌ మాల్స్‌ వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 గంటల వరకు ట్రాక్టర్లను నిలిపి ఉంచి నిరసన తెలుపుతామన్నారు. అదేవిధంగా, తమకు పెద్ద దిక్కుగా ఉన్న దల్లేవాల్‌ను వెంటనే ఆమరణ దీక్ష విరమించాలని కోరామన్నారు. ఆరోగ్యం మెరుగైతే ఆయన కూడా చర్చల్లో పాల్గొనేందుకు వీలుంటుందని చెప్పారు. ఫ్లూయిడ్స్‌ను ఎక్కువ కాలం కొనసాగించడం ద్వారా జీవిత కాలాన్ని పొడిగించలేమని దల్లేవాల్‌ ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తున్న వైద్యులు సైతం చెప్పారన్నారు. ప్రాణాలకే ప్రమాదం ఉన్నందునే దీక్ష విరమించాలని దల్లేవాల్‌ను కోరినట్లు చెప్పారు.

బద్లాపూర్‌ కస్టడీ డెత్‌..
ఆ ఐదుగురే కారణం

మేజిస్ట్రేట్‌ విచారణలో వెల్లడి ● ముంబై హైకోర్టుకు అందిన నివేదిక

ముంబై: మహారాష్ట్రలో సంచలన రేపిన బద్లాపూర్‌ స్కూల్‌ లైంగికదాడి ఘటనలో నిందితుడి లాకప్‌ మరణంపై మేజిస్ట్రేట్‌ విచారణ పూర్తయింది. నిందితుడు అక్షయ్‌ షిండే లాకప్‌ డెత్‌కు ఐదుగురు పోలీసు అధికారులు బాధ్యులని తేలింది. నకిలీ ఎన్‌కౌంటర్‌లో పోలీసులే తమ కుమారుడు అక్షయ్‌ను చంపేశారని తండ్రి అన్నా షిండే ఫిర్యాదుపై ముంబై హైకోర్టు జస్టిస్‌ రేవతి మొహితె డెరె, జస్టిస్‌ నీలా గోఖలేల ధర్మాసనానికి సోమవారం సీల్డు కవర్‌లో దర్యాప్తు నివేదికను మేజిస్ట్రేట్‌ సమర్పించారు. నివేదిక తమకు అందిందని ధర్మాసనం తెలిపింది. థానె క్రైం బ్రాంచి సీనియర్‌ పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ సంజయ్‌ షిండే, అసిస్టెంట్‌ పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ నీలేశ్‌ మోరె, హెడ్‌ కానిస్టేబుళ్లు అభిజీత్‌ మోరె, హరీశ్‌ తావడెతోపాటు ఒక పోలీస్‌ డ్రైవర్‌ను కూడా కస్టడీ మరణానికి కారణమని అందులో పేర్కొన్నారని చెప్పింది. దీని ఆధారంగా ఈ ఐదుగురిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు జరపాలని ఆదేశించింది. ఫోరెన్సిక్‌ ల్యాబ్‌ నివేదిక(ఎఫ్‌ఎస్‌ఎల్‌) నివేదికను బట్టి చూస్తే మృతుడి తండ్రి ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయని అభిప్రాయ పడింది. ఈ నివేదిక ప్రతిని అన్నా షిండేకు, ప్రభుత్వానికి అందజేయాలని ధర్మాసనం ఆదేశించింది. అసలు ప్రతి, ఆధారాల పత్రాలు, సాక్ష్యుల వాంగ్మూలాలు తమ వద్దే ఉంటాయని స్పష్టం చేశారు. విచారణ చేపట్టేదెవరో రెండు వారాల్లో తమకు తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. బద్లాపూర్‌ స్కూల్‌లో అటెండర్‌గా పనిచేసే అక్షయ్‌ షిండే(24)స్కూల్‌ టాయిలెట్‌లో ఇద్దరు బాలికపై లైంగిక దాడి చేసినట్లు ఆరోపణలు రావడంతో గతేడాది ఆగస్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబర్‌ 23న అతడు చనిపోయాడు. అక్షయ్‌ భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ప్రశ్నించేందుకు తలోజా జైలు నుంచి తీసుకొస్తుండగా పోలీసుల నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపాడని, ఇన్‌స్పెక్టర్‌ సంజయ్‌ షిండే జరిపిన ఎదురు కాల్పుల్లో అతడు మృతి చెందాడని పోలీసులు ప్రకటించారు. ఆ సమయంలో వీరితోపాటు నీలేశ్‌ మోరె, ఇద్దరు హెడ్‌ కానిస్టేబుళ్లు, డ్రైవర్‌ ఉన్నారు.

మొండిఘటం మరో చరిత్ర!

వివాదాలు. విమర్శలు. అభిశంసనలు. కోర్టు కేసులు. రుజువైన క్రిమినల్‌ నేరాలు. సొంత పార్టీలోనే విమర్శలు. మొత్తంగా రాజకీయ భవితవ్యంపైనే నీలినీడలు. హత్యాయత్నాలు. ప్రత్యర్థుల ప్రచార హోరు. వీటన్నింటినీ తట్టుకుంటూ 78 ఏళ్ల వయసులోనూ మరోసారి అమెరికా అధ్యక్షునిగా గెలిచి చూపించిన మొండి ఘటం డొనాల్డ్‌ ట్రంప్‌. ఆ ఘనత సాధించిన అత్యంత వృద్ధునిగా రికార్డు సృష్టించి విమర్శకుల నోళ్లు మూయించారు. రెండుసార్లూ ట్రంప్‌ ఓడించిన డెమొక్రాట్‌ ప్రత్యర్థులు మహిళలే కావడం విశేషం. 2016 అధ్యక్ష ఎన్నికల్లో హిల్లరీ క్లింటన్‌ను ఓడించగా ఈసారి ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై ఆయన ఘనవిజయం సాధించారు.

కష్టకాలాన్ని దాటి...

నిజానికి గత నాలుగేళ్లు ట్రంప్‌కు కష్టకాలంగానే గడిచాయి. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్‌ చేతిలో ఓటమితో ఆయనకు సమస్యలు మొదలయ్యాయి. ఆ ఓటమిని ఒప్పుకోకపోవడమే గాక బైడెన్‌కు అధికార పగ్గాలు అప్పగించేందుకు కూడా ట్రంప్‌ నిరాకరించారు. బైడెన్‌ విజయాన్ని ధ్రువీకరించేందుకు 2021 జనవరి 6న కాంగ్రెస్‌ సంయుక్త భేటీ జరుగుతున్న క్యాపిటల్‌ హిల్‌పైకి మద్దతుదారులను దాడికి ఉసిగొల్పి ప్రపంచాన్నే నివ్వెరపరిచారు. ఆ క్రమంలో చోటుచేసుకున్న హింసాకాండ ఇటీవలి దాకా కేసుల రూపంలో ట్రంప్‌ను వెన్నాడింది. తర్వాత హష్‌ మనీ ఉదంతంలో క్రిమినల్‌ కేసును ఎదుర్కొన్నారు. న్యాయ విచారణకు హాజరైన ఏకైక మాజీ అధ్యక్షునిగా చెత్త రికార్డునూ మూటగట్టుకున్నారు. హష్‌ మనీ కేసులో దోషిగానూ రుజువయ్యారు. అలా నేరస్తునిగా ముద్రపడ్డాక అధ్యక్షుడైన తొలి నేతగా కూడా నిలిచారు! డెమొక్రాట్ల అభ్యర్థిగా బైడెన్‌ తప్పుకుని కమలా హారిస్‌ తెరపైకి రావడంతో పోరు హోరాహోరీగా సాగడం ఖాయమంటూ అంచనాలు వెల్లువెత్తాయి. అందుకు తగ్గట్టే ఆమెతో జరిగిన ఏకైక అధ్యక్ష డిబేట్‌లో ట్రంప్‌ పూర్తిగా తేలిపోయారు. అయినా ఎక్కడా వెనక్కు తగ్గలేదు. అభిమానుల తిరుగులేని మద్దతు ఆయనకు పెట్టనికోటగా నిలిచింది. ప్రచార క్రమంలో పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నం సంచలనం రేపింది. దుండగుని తూటా ఆయన చెవిని గాయపరుస్తూ దూసుకెళ్లడంతో ప్రాణాపాయం త్రుటిలో తప్పింది. అలాంటి సమయంలోనూ పిడికిలి బిగించి 'ఫైట్‌, ఫైట్‌'అని నినదిస్తూ ట్రంప్‌ ప్రదర్శించిన మొక్కవోని ధైర్యం అమెరికన్లను ఆకట్టుకుంది. ఆయన అమెరికా ఫస్ట్‌ నినాదం ఓటర్లను మరోసారి ప్రభావితం చేసింది. వలసలపై ఉక్కుపాదం మోపుతానని, ఆర్థిక అవ్యవస్థను చక్కదిద్దుతానని, చైనాకు ముకుతాడు వేస్తానని, యుద్ధాలకు తెర దించుతానని, మొత్తంగా అమెరికాను తిరిగి గొప్ప దేశంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీలు విపరీతంగా ఆకట్టుకున్నాయి. వాటిముందు హారిస్‌ ఆఫ్రో ఆసియన్‌ మూలాలు, ప్రచార వ్యూహాల వంటివేవీ పని చేయలేదు. గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ట్రంప్‌ ఏకపక్ష విజయం సాధించారు. అమెరికాలో కెనడా 51వ రాష్ట్రంగా మారితే మేలనడం, చైనాపై టారిఫ్‌లు తప్పవని హెచ్చరించడం, గ్రీన్‌లాండ్‌ను, పనామా కాల్వను స్వాధీనం చేసుకుంటానని, గల్ఫ్‌ ఆఫ్‌ మెక్సికో పేరును గల్ఫ్‌ ఆఫ్‌ అమెరికాగా మారుస్తానని ప్రకటించడం ద్వారా తన పాలన ఎలా ఉండనుందో సంకేతాలిచ్చారు. ఈ నేపథ్యంలో అధ్యక్షునిగా రెండో విడతలో ట్రంప్‌ ఏమేం చేస్తారో, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనని ప్రపంచ దేశాలన్నీ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాయి.

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌

ఆది నుంచీ...

ట్రంప్‌ 1946 జూన్‌ 14న న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో మేరీ ఫ్రెడ్‌ దంపతులకు జన్మించారు. ఐదుగురు సంతానంలో నాలుగోవాడు. పెన్సిల్వేనియా వర్సిటీలో ఫైనాన్స్‌లో డిగ్రీ చేశారు. 1971లో తండ్రి నుంచి రియల్టీ వ్యాపార బాధ్యతలను స్వీకరించారు. హోటల్స్‌, రిసార్టులు, నిర్మాణంతో పాటు క్యాసినోలు, గోల్ఫ్‌ కోర్సులు తదితరాల్లోకీ విస్తరించారు. రియాలిటీ టీవీ షో ద్వారా దేశవ్యాప్తంగా పాపులరయ్యారు. ట్రంప్‌కు మూడు పెళ్లిళ్లయ్యాయి. మోడల్‌, క్రీడాకారిణి ఇవానా జెలింకోవాకు 1990లో విడాకులిచ్చారు. వారికి డొనాల్డ్‌ ట్రంప్‌ జూనియర్‌, ఇవాంకా, ఎరిక్‌ జన్మించారు. 1993లో మార్లా మేపుల్స్‌ను పెళ్లాడి టిఫానీకి జన్మనిచ్చారు. 1999లో ఆమెకు విడాకులిచ్చి 2005లో స్లొవేనియా మోడల్‌ మెలానియాను పెళ్లాడారు. వారి సంతానం బారన్‌ విలియం ట్రంప్‌.



చట్టసభల సమావేశాల సంఖ్య పెరగాలి

లోక్‌సభ స్పీకర్‌ ఓం బిర్లా స్పష్టీకరణ

పాట్నా: దేశంలో చట్టసభల సమావేశాల సంఖ్య నానాటికీ తగ్గిపోతుండడం పట్ల లోక్‌సభ స్పీకర్‌ ఓం బిర్లా ఆందోళన వ్యక్తంచేశారు. ఈ అంశంపై సభాపతులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. పార్లమెంట్‌తోపాటు రాష్ట్రాల శాసన సభలు, శాసన మండళ్ల సమావేశాలు సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బిహార్‌ రాజధాని పట్నాలో సోమవారం 85వ ఆలిండియా ప్రిసైడింగ్‌ ఆఫీసర్ల సదస్సు(ఏఐపీఓసీ) ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఓం బిర్లా మాట్లాడారు. పార్లమెంట్‌, అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రణాళిక ప్రకారం అంతరాయాలు సృష్టించే పరిస్థితి నెలకొందని ఆక్షేపించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడేందుకు పటిష్టమైన నియమైన నిబంధనలు రూపొందించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. చట్టసభల గౌరవాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

తల్లి వద్దే అతుల్‌ సుభాష్‌ కుమారుడు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: భార్య వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడిన బెంగళూరు సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ అతుల్‌ సుభాష్‌ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మనవడిని తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ సుభాష్‌ తల్లి అంజూదేవి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. నాలుగేళ్ల బాబును సొంత తల్లి(సుభాష్‌ భార్య) నిఖితా సింఘానియా కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాబును ఆమె వద్దే ఉంచుకోవచ్చని తేల్చిచెప్పింది. అంజూదేవి పిటిషన్‌పై జస్టిస్‌ బి.వి.నాగరత్నం, జస్టిస్‌ సతీష్‌చంద్ర శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. బాలుడితో స్వయంగా మాట్లాడింది. అతడి అభిప్రాయం తెలుసుకుంది. బాలుడు ఎప్పటిలాగే తల్లి వద్దే ఉంచొచ్చని స్పష్టం చేసింది. భార్య వేధింపుల కారణంగా బలవన్మరణానికి పాల్పడుతున్నానంటూ అతుల్‌ సుభాష్‌ గత నెలలో లేఖ రాసి పెట్టి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఐఐటీ బాబాను వెలివేస్తున్నాం: జునా అఖాడా

మహాకుంభ్‌ నగర్‌: ఐఐటీ బాబాగా పేరు తెచ్చుకున్న అభయ్‌ సింగ్‌ను వెలివేస్తున్నట్లు సోమవారం జునా అఖాడా ప్రకటించింది. గురువును తూలనాడిన అతడు ఉన్మాదిగా మారిన విద్యావంతుడని వ్యాఖ్యానించింది. సోషల్‌ మీడియాలో అతడు జునా అఖాడా మహంత్‌ సోమేశ్వర్‌ గురును దూషించాడని తెలిపింది. సాధువుగా మారలేదని, తనను తాను సాధువుగా ప్రకటించుకుని సంచరిస్తున్నాడని జునా అఖాడా ప్రతినిధి శ్రీమహంత్‌ నారాయణ్‌ గిరి ఆరోపించారు. ఐఐటీ–బాంబేలో ఏరోస్పేస్‌ ఇంజినీరింగ్‌ చదువుకున్నట్లు చెబుతున్న అభయ్‌ సింగ్‌ సామాజిక మాధ్యమాల ద్వారా ఐఐటీ బాబాగా వెలుగులోకి వచ్చాడు. జునా అఖాడా మహంత్‌ సోమేశ్వర్‌ గురుతో కలిసి మహా కుంభ్‌మేళాకు వచ్చానని, ఇక్కడికొచ్చాక పరిస్థితి మొత్తం మారిపోయిందని ఇతడు అంటున్నాడు.

ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్‌ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఇద్దరు మహిళా మావోయిస్టులు చనిపోయారు. సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఒక జవాన్‌ తీవ్రగా గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌ –ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో బలగాలు గాలింపు చేపట్టాయి. మైన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందిగా, ఒక జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనాస్థలి నుంచి ఒక రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీలో బీజేపీకి అధికారం అప్పగిస్తే అరాచకమే

'ఆప్‌'అధినేత అరవింద్‌ కేజ్రీవాల్‌ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆమ్‌ ఆద్మీ పార్టీ(ఆప్‌) మళ్లీ అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఆ పార్టీ జాతీయ కన్వీనర్‌ అరవింద్‌ కేజ్రీవాల్‌ ప్రకటించారు. సోమవారం విశ్వాస్‌నగర్‌ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 'జనసభ'లో ఆయన ప్రసంగించారు. తాము చేయబోయే అతిపెద్ద పని ఉద్యోగాల కల్పనే అని స్పష్టంచేశారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎన్నో ఘనతలు సాధించిందని ప్రస్తావించారు. ఢిల్లీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో బీజేపీకి అధికారం అప్పగిస్తే అభివృద్ధి ఆగిపోతుందని, పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందని కేజ్రీవాల్‌ హెచ్చరించారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణిస్తాయని, అరాచకం రాజ్యమేలుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

సాక్షి ప్లస్
మంగళవారం | 21-1-2025

ఇండియన్ నేషనల్ ఆర్మీ ఏర్పాటైన సంవత్సరం?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర – బ్రిటిషర్ల పాలన

వైస్రాయ్‌లు

లార్డ్ చెమ్స్‌ఫర్డ్ (1916-21)

ఇతడి కాలంలో 1916లో కాంగ్రెస్ లక్నో సమావేశంలో అతివాదులు,మితవాదులు,హిందూ – ముస్లింలు ఏకమయ్యారు. 1917లో చంపారన్ సత్యాగ్రహం, 1918లో అహ్మదాబాద్‌లో నూలుమిల్లుల ఉద్యమం జరిగాయి. 1919లో మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటి ద్వారా ద్వంద్వ పరిపాలన (Diarchy) కింద రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలు కల్పించారు. ఆర్థిక వ్యవహారాలు, శాంతిభద్రతలు గవర్నర్ ప్రత్యక్ష ఆధీనంలో (Reserved Subjects); విద్య, ఆరోగ్యం, వ్యవసాయం మొదలైనవి శాసన సంబంధమైన అంశాలు(Transferred Subjects) గా ఉంటాయి. దీని ద్వారా ఎగువసభ, దిగువ సభలు ఏర్పడ్డాయి. చెమ్స్‌ఫర్డ్ కాలంలోనే 1919లో జలియన్ వాలాబాగ్ ఊచకోత జరిగింది. 1919లో ఢిల్లీలో అఖిల భారత ఖిలాపత్ సమావేశం జరిగింది.

1920లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించి పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలను బహిష్కరించారు. గాంధీజీ తనకు ఇచ్చిన కైజర్–ఇ–హింద్ పతకాన్ని తిరిగి ఇచ్చేశారు. 1920లో బాలగంగాధర్ తిలక్ మరణించారు. సి.ఎన్. బెనర్జీ ఇండియన్ లిబరల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఖిలాపత్ ఉద్యమం ప్రారంభమైంది. పుణేలో మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

లార్డ్ రీడింగ్ (1921-26)

ఇతడి కాలంలో అలీగఢ్ జామియా మిలియా ఇస్లామియా (జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయం), బిహార్ విద్యాపీఠ్, కాశీ విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్ తదితర విద్యాసంస్థలను స్థాపించారు. 1921లో పంజాబ్‌లో సిక్కులు గురుద్వారాల నుంచి అవినీతిపరులైన మహంతులను తొలగించడానికి అకాలీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1922లో చౌరీచౌరాలో ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను తగులబెట్టారు. ఈ ఘటనలో 22 మంది పోలీసులు మృతి చెందారు. దీంతో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేశారు.

1922 డిసెంబర్‌లో చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ కలిసి స్వరాజ్య పార్టీని స్థాపించారు. 1921లో ఎం.ఎన్.రాయ్ భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. 1926లో మతకలహాలు చెలరేగాయి. వీటిలో భాగంగా ప్రముఖ నాయకుడు, జాతీయవాది అయిన స్వామి శ్రద్ధానంద్‌ను మతఛాందసవాదులు హత్య చేశారు. కె.బి.హెగ్డేవార్, ఆర్.ఎస్.ఎస్.ను స్థాపించారు.రౌలత్ చట్టాన్ని రద్దు చేశారు.

లార్డ్ ఇర్విన్ (1926-31)

ఇర్విన్ కాలంలో 1928 ఫిబ్రవరిలో సైమన్ కమిషన్ భారతదేశానికి వచ్చింది. ఇందులో భారతీయులెవరికీ సభ్యత్వం కల్పించలేదు. దీంతో ఈ కమిషన్‌కు దేశవ్యాప్తంగా నిరసన ఎదురైంది. 1928 డిసెంబర్‌లో తొలిసారిగా అఖిల భారత యువజన కాంగ్రెస్ సమావేశం జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో రైతులు 1928లో పన్నుల నిరాకరణోద్యమం సాగించారు. 1928లో చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో 'హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' అనే విప్లవ సంస్థ ఆవిర్భవించింది.

భగత్‌సింగ్, బి.కె. దత్తు కలిసి 1929 ఏప్రిల్ 8న కేంద్ర శాసనసభలో బాంబు విసిరారు. ప్రజారక్షణ బిల్లు ఆమోదానికి నిరసనగా వీరు ఈ ఘటనకు పాల్పడ్డారు. 1930లో చిట్టగాంగ్‌లో ప్రభుత్వ ఆయుధాగారంపై దాడి జరిగింది. సూర్యాసేన్ నేతృత్వంలో జరిగిన ఈ దాడిలో మహిళలు సైతం పాల్గొన్నారు. రాజకీయ ఖైదీలను ఉంచే జైళ్లలో దుర్భర పరిస్థితులు ఉండేవి. దీనికి నిరసనగా జతిన్‌దాస్ అనే యువకుడు 63 రోజుల పాటు ఉపవాస దీక్ష చేసి ప్రాణత్యాగం చేశాడు. 1931లో భగత్‌సింగ్, రాజ్‌గురును పోలీసు అధికారుల హత్యకేసుల్లో విచారించి ఉరితీశారు. 1929లో కాంగ్రెస్ పార్టీ లాహోర్‌లో సమావేశమైంది. 'సంపూర్ణ స్వరాజ్యం' కాంగ్రెస్ ఆశయమని ఈ సమావేశంలోనే ప్రకటించారు. అదే ఏడాది త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీజీ 1930 మార్చి 12న దండి సత్యాగ్రహం ప్రారంభించారు. ఇదే ఉప్పు సత్యాగ్రహంగా ప్రసిద్ధికెక్కింది. 1930లో జరిగిన తొలి రౌండ్ టేబుల్ సమావేశానికి భారతీయ నాయకులను ఆహ్వానించారు. కానీ, సైమన్ నివేదికపై చర్యకు నిరసనగా వీరు సమావేశాన్ని బహిష్కరించారు. తర్వాత గాంధీ–ఇర్విన్ సంధి జరిగింది. ఉద్యమాన్ని నిలిపివేశారు.

లార్డ్ వెల్లింగ్‌టన్ (1931-36)

ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయకత్వంలో పఠాన్లు 'ఖుదాయ్ ఖిద్మత్ గార్' అనే సంస్థను ప్రారంభించారు. దీనికి భగవంతుడి సేవకులని అర్థం. వీరినే 'రెడ్ షర్ట్'లు అని కూడా పిలుస్తారు. మణిపూర్ వాసులు జాతీయోద్యమంలో సాహసోపేత పాత్ర పోషించారు. గాంధీజీ పిలుపు మేరకు నాగాలాండ్ వీరనారి 'రాణి గైడిన్‌లియూ' పదమూడేళ్ల వయసులోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. విదేశీ పాలనకు వ్యతిరేకంగా ఆమె తిరుగుబాటు జరిపారు. 1932లో బ్రిటిష్ ప్రభుత్వం రాణికి యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక భారత ప్రభుత్వం ఆమెను విడుదల చేసింది. 1931లో రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి గాంధీజీ లండన్ వెళ్లారు. ఈ సమావేశంలో 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించారు. దీని ప్రకారం మైనారిటీలకు ప్రత్యేక నియోజక వర్గాలు కల్పించారు. దీనికి నిరసనగా గాంధీజీ నిరాహారదీక్ష చేపట్టారు.

నిమ్నజాతులకు కూడా ప్రత్యేక స్థానాలను ప్రకటించారు. గాంధీ–అంబేద్కర్ మధ్య పుణే ఒప్పందం జరిగింది. 1932లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఓటింగ్ అర్హత, ఉమ్మడి నిధులు, రాష్ట్రాల ఆర్థిక వనరుల గురించి ఈ సమావేశంలో చర్చించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించడం, రాష్ట్రాల శాసనసభ్యుల సమాఖ్య, ఎగువసభ, ప్రతినిధులను ఎన్నుకోవడం మొదలైనవి ఈ సమావేశం నిర్ణయించిన నూతన విషయాలు. గాంధీ–ఇర్విన్ ఒప్పందం తర్వాత 1933లో కాంగ్రెస్ అధికారికంగా ఉద్యమాన్ని నిలిపివేసింది. 1935 భారత ప్రభుత్వ రాజ్యాంగ చట్టం ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం దేశంలో ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థ ఏర్పాటైంది. రాష్ట్రాలకు స్వపరిపాలనాధికారం లభించింది. 1935 చట్టంరాజ్యాధికారాలను మూడు రకాలుగా విభజించింది. అవి:

1. సమాఖ్య అధికారాలు
2. రాష్ట్ర అధికారాలు
3. ఉమ్మడి అధికారాలు

తమ అధికార పరిధిలో శాసనాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వాధికారం ఉంటుంది. ఉమ్మడి జాబితాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాసనం చేయవచ్చు. ఏ శాసన్నానైనా వీటో చేసే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. బిల్లులను పునఃపరిశీలించమని సూచించే లేదా బ్రిటిష్ చక్రవర్తి నిర్ణయానికి పంపే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. ఈ చట్టం ప్రకారం ఎగువ సభలో 2/5వ వంతు, దిగువ సభలో 3/5వ వంతు స్థానాలు సంస్థానాధీశులకు కేటాయించారు. భారత్ నుంచి బర్మాను వేరు చేశారు. జయప్రకాశ్ నారాయణ్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. 1936లో ఆలిండియా కిసాన్ సభ ఏర్పాటైంది.

లార్డ్ లిన్‌లిత్ గో (1936-44)

భారత ప్రభుత్వ చట్టం–1935 ప్రకారం 1937 జూలై నాటికి ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలను సాధించి, ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. 1937లో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1936లో తొలి అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించింది. నాటి నుంచి రైతాంగం జాతీయోద్యమంలో క్రియాశీల పాత్ర పోషించింది. 1936 లక్నో కాంగ్రెస్ సమావేశంలో సోషలిజాన్ని ఆమోదించారు.

1938లో జాతీయ కాంగ్రెస్ గుజరాత్‌లోని హరిపూర్‌లో సమావేశమైంది. దీనికి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. 1939లో బోస్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. గాంధీ,నెహ్రూ ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ సుభాష్ చంద్రబోస్ గెలుపొందారు. వర్కింగ్ కమిటీలో గాంధీజీ అనుయాయులు బోస్ పట్ల విముఖత చూపారు. దీంతో ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కొందరు వామపక్ష వాదులతో కలిసి ఫార్వర్డ్ బ్లాక్ అనే కొత్త పార్టీని ప్రారంభించారు. 1927 డిసెంబర్ నాటికే అఖిల భారత సంస్థాన ప్రజాసభ ప్రారంభమైంది. 1939లో నెహ్రూ ఈ సభకు అధ్యక్షుడయ్యాడు. 1939లోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారతీయులను సంప్రదించకుండానే భారత్‌లోని బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధంలోకి అడుగుపెట్టింది. ఈ విషయమై జాతీయ కాంగ్రెస్‌కు లేదా కేంద్ర శాసనసభకు ఎన్నికైన సభ్యులకు మాట మాత్రంగా కూడా చెప్పలేదు. 1940లో ముస్లిం లీగ్ దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. అదే ఏడాది బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టు ఆఫర్ జారీ చేసింది. దీని ప్రకారం మైనారిటీలకు అధిక స్థానాలను కేటాయిస్తారు. యుద్ధం ముగిశాక నూతన రాజ్యాంగంలో ఈ విషయాన్ని పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. 1941లో సుభాష్ చంద్రబోస్ నిర్బంధం నుంచి తప్పించుకొని బెర్లిన్ వెళ్లారు. 1942లో ఆయన ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హిందు ఫౌజ్)ని స్థాపించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం విదేశాల నుంచే బోస్ పోరాడారు. ఆయన 'జైహింద్' అనే నినాదమిచ్చారు.

రెండో ప్రపంచ యుద్ధంలో భారతీయుల పూర్తి సహకారం కోసం బ్రిటన్ ప్రయత్నించింది. ఇందు కోసం 1942 మార్చిలో సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో ఒక రాయబార బృందాన్ని భారత్‌కు పంపింది. క్రిప్స్ బ్రిటిష్ మంత్రివర్గ సభ్యుడు, లేబర్ పార్టీలో రాడికల్ సభ్యుడు. వీలైనంత త్వరగా స్వపరిపాలన ప్రతిపాదించడమే తమ లక్ష్యమని క్రిప్స్ తెలిపారు. కాంగ్రెస్ కమిటీ 1942 ఆగస్టు 8న బొంబాయిలో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించారు. కాంగ్రెస్ పార్టీ, గాంధీజీ నాయకత్వంలో అహింసాయుత ప్రజాపోరాటాన్ని కొనసాగించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని సమర్థవంతంగా అణచివేసింది.

లార్డ్ వేవెల్ (1944-47)

1944లో అట్లీ బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1945లో కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీలు లార్డ్ వేవెల్ సమక్షంలో సిమ్లాలో సమావేశమయ్యాయి. రాజ్యాంగ, మత అడ్డంకులను తొలగించేందుకు ఆ పార్టీలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 1946లో అఖిల భారత తంతి–తపాలా కార్మికులు సమ్మె చేశారు. కౌలు రేట్ల తగ్గింపు కోసం రైతాంగ పోరాటాలు అధికమయ్యాయి. సమ్మెలు, హర్తాళ్లు, ప్రదర్శనలు నిర్వహించడంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించారు. ఈ పరిస్థితుల్లో బ్రిటిష్ ప్రభుత్వం 1946 మార్చిలో కేబినెట్ మిషన్‌ను పంపింది. అధికార బదిలీ గురించి భారత జాతీయ నాయకులతో ఈ మిషన్ సంప్రదింపులు జరిపింది. నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చే దాకా తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బ్రిటిష్ రాయబార వర్గం సూచించింది. 1946 సెప్టెంబర్‌లో నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వం ఏర్పాటైంది. ముస్లింలీగ్ మంత్రి వర్గంలో చేరింది. కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లింలీగ్ 1946 ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటించింది. నేవీ తిరుగుబాటు చేసింది. ఇండియన్ నేషనల్ ఆర్మీ బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించింది.


లార్డ్ మౌంట్ బాటన్ (1947)

మౌంట్ బాటన్ 1947లో భారత వైస్రాయ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన కాంగ్రెస్, ముస్లింలీగ్ నాయకులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయన్న ప్రకటన 1947 జూన్ 3న విడుదలైంది. 1947 ఆగస్టు 14న పాకిస్తాన్ నూతన దేశంగా ఆవిర్భవించింది. అదే రోజు అర్ధరాత్రి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1948 జనవరి 30న గాడ్సే గాంధీజీని కాల్చి చంపాడు.

ముఖ్యాంశాలు

- 1929: లాహోర్‌లో నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమావేశం. 'సంపూర్ణ స్వరాజ్యమే' తమ ఆశయమని ప్రకటన.
- 1930 మార్చి 12: దండి సత్యాగ్రహాన్ని ప్రారంభించిన మహాత్మా గాంధీ.
- 1942 మార్చి: సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో భారత్‌కు రాయబార వర్గం రాక.
- 1942 ఆగస్టు 8: బొంబాయిలో కాంగ్రెస్ కమిటీ సమావేశం, క్విట్ ఇండియా తీర్మానానికి ఆమోదం.
- 1946 మార్చి: కేబినెట్ మిషన్ భారత్ రాక.
- 1946 ఆగస్టు 16: కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లిం లీగ్, ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటన.
- 1947 జూన్ 3: భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయనే ప్రకటన విడుదల.

కోడ్‌లు గుర్తుంచుకుంటే క్యాలెండర్ సమస్యలు సులువు!



క్యాలెండర్

మాదిరి ప్రశ్నలు

మోడల్-1

1. రోహిత్ పుట్టిన తేది 2006 సెప్టెంబర్ 25 అయితే అది ఏ వారం?
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) శనివారం

ఈ తరహా ప్రశ్నలు అడిగినప్పుడు అభ్యర్థులు వారాలు, నెలలు, సంవత్సరాలకు సంబంధించిన కింది కోడ్‌లను తెలుసుకుంటే సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

వారం	కోడ్
శనివారం	0
ఆదివారం	1
సోమవారం	2
మంగళవారం	3
బుధవారం	4
గురువారం	5
శుక్రవారం	6
నెల	**కోడ్**
జనవరి	1
ఫిబ్రవరి	4
మార్చి	4
ఏప్రిల్	0
మే	2
జూన్	5
జూలై	0
ఆగస్టు	3
సెప్టెంబర్	6
అక్టోబర్	1
నవంబర్	4
డిసెంబర్	6
సంవత్సరం	**కోడ్**
1600 నుంచి 1699	6
1700 నుంచి 1799	4
1800 నుంచి 1899	2
1900 నుంచి 1999	0
2000 నుంచి 2099	6
2100 నుంచి 2199	4

సూత్రం: [ప్రశ్నలో ఇచ్చిన తేది + నెల కోడ్ + సంవత్సరాలు (చివరి రెండు అంకెలు) + లీపు సంవత్సరాలు + సంవత్సరం కోడ్] 7
ఇచ్చిన ప్రశ్నలో తేది = 25
లీపు సంవత్సరాలు = ఇచ్చిన సంవత్సరంలోని చివరి రెండంకెలను 4తో భాగిస్తే వచ్చే భాగఫలం

సూత్రం ప్రకారం
= (25 + 6 + 6 + 1 + 6) 7
7)44(6
42
2

∴ శేషం రెండు కాబట్టి వారం – కోడ్ పట్టిక ప్రకారం రోహిత్ పుట్టిన రోజు సోమవారం

2. 1776 జూలై 16న ఏ వారం అవుతుంది?
ఎ) సోమవారం బి) బుధవారం
సి) శనివారం డి) మంగళవారం
జవాబు: డి

3. 1947 ఆగస్టు 15న ఏ వారం?
ఎ) శనివారం బి) శుక్రవారం
సి) గురువారం డి) బుధవారం
జవాబు: బి

4. 2020 ఆగస్టు 15 ఏ వారం?
ఎ) గురువారం బి) శనివారం
సి) శుక్రవారం డి) ఆదివారం
జవాబు: బి

5. 2014 జనవరి 1 ఏ రోజు ?
ఎ) గురువారం బి) మంగళవారం
సి) బుధవారం డి) శుక్రవారం
జవాబు: సి

మోడల్-2

1. 2005 మార్చిలో ఏ తేదీల్లో శుక్రవారాలు వస్తాయి.
ఎ) 3, 10, 19, 23 బి) 4, 11, 18, 25
సి) 1, 8, 15, 22 సి) 2, 9, 16, 23
జవాబు: బి

వివరణ: 1-3-2005 న వచ్చే వారం
1 + 4 + 5 + 1 + 6 7 = 3
అంటే 1-3-2005 – మంగళవారం
4-3-2008 – శుక్రవారం
కాబట్టి 4, 11, 18, 25 తేదీల్లో శుక్రవారాలు వస్తాయి.

2. 2016 నవంబర్‌లో శుక్రవారాలు ఎప్పుడు వస్తాయి?
ఎ) 1, 8, 15, 22, 29 బి) 3, 10, 17, 24
సి) 5, 12, 19, 26 డి) 4, 11, 18, 25
జవాబు: డి

3. 1994 ఏప్రిల్‌లో ఏ తేదీల్లో బుధవారం వస్తుంది?
ఎ) 3, 10, 17, 24 బి) 4, 11, 18, 25
సి) 12, 19, 26 డి) 7, 18, 21, 28
జవాబు:ఎ

మోడల్-3

1. 2003 సంవత్సరం క్యాలెండర్ కిందివాటిలో ఏ సంవత్సరం క్యాలెండర్‌ను పోలి ఉంటుంది?
ఎ) 2005 బి) 2009 సి) 2014 డి) 2004
జవాబు: సి

వివరణ: 2003 నుంచి మొత్తం విషమ రోజులు సున్నా వచ్చే వరకు లెక్కించాలి. సున్నా వచ్చిన తర్వాత సంవత్సరం మొదటి క్యాలెండర్‌ను పోలి ఉంటుంది.

సంవత్సరం	విషమ రోజులు
2003	1
2004	2
2005	1
2006	1
2007	1
2008	2
2009	1
2010	1
2011	1
2012	2
2013	1

మొత్తం రోజులు
= 1+ 2 + 1 + 1 + 1+ 2+ 1+1 +1 +2 + 1 = 14
విషమ రోజు = 14/7 = 0
2003 క్యాలెండర్
2014 క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.

2. 2007 క్యాలెండర్ ఏ సంవత్సరం క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.
(Communications S.I. -2012)
ఎ) 2013 బి) 2018
సి) 2008 డి) 2010
జవాబు: బి

3. 2002 సంవత్సరం క్యాలెండర్ ఏ సంవత్సరం క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.
(Deputy Jailor-2012)
ఎ) 2003 బి) 2008
సి) 2030 డి) 2013
జవాబు: డి

మోడల్ : 4

1. 2006 సెప్టెంబర్ 25 సోమవారం రోహిత్ పుట్టినరోజు అయితే 2014లో రోహిత్ పుట్టినరోజు ఏ వారం?
ఎ) సోమవారం బి) గురువారం
సి) శనివారం డి) ఆదివారం
జవాబు: బి

వివరణ: 2006 సెప్టెంబర్ 25
2007 సెప్టెంబర్ 25 1 (విషమ రోజులు)
2008 సెప్టెంబర్ 25 2 (విషమరోజులు)
2009 సెప్టెంబర్ 25 1
2010 సెప్టెంబర్ 25 1
2011 సెప్టెంబర్ 25 1
2012 సెప్టెంబర్ 25 2
2013 సెప్టెంబర్ 25 1
2014 సెప్టెంబర్ 25 1
మొత్తం రోజులు 10
విషమ రోజులు 3
అంటే సోమవారం + 3 = గురువారం

2. 2012 మార్చి 6 ఆదివారం అయితే 2016 మార్చి 6 ఏ వారం అవుతుంది?
(Communications S.I. -2012)
ఎ) శుక్రవారం బి) సోమవారం
సి) శనివారం డి) గురువారం
జవాబు: ఎ

3. 2006 జనవరి 1 ఆదివారం అయితే 2010 జనవరి 1 ఏ వారం అవుతుంది?
(Communications S.I. -2012)
ఎ) సోమవారం బి) శనివారం
సి) మంగళవారం డి) శుక్రవారం
జవాబు: డి

మోడల్- 5

1. 1999 డిసెంబర్ 5 ఆదివారం అయితే 2000 మార్చి 20 ఏ వారం అవుతుంది?
ఎ) సోమవారం బి) ఆదివారం
సి) మంగళవారం డి) బుధవారం
జవాబు: ఎ

వివరణ:
1999 డిసెంబర్ 5 నుంచి 2000 మార్చి 20 సంవత్సరం మొత్తం రోజులు:
డిసెంబర్ నెలలో 5వ తేదీ తర్వాత మిగిలిన రోజులు (31–5) = 26 రోజులు
2000 సంవత్సరంలో
జనవరి = 31రోజులు
ఫిబ్రవరి = 29రోజులు
మార్చి = 20 రోజులు
మొత్తం రోజులు = 106 రోజులు
అంటే విషమ రోజుల సంఖ్య = 1
∴ 2000 మార్చి 20 → ఆదివారం + 1
= సోమవారం

2. 2013 జనవరి 1 మంగళవారం అయితే 10 అక్టోబర్ 2013 ఏ రోజు అవుతుంది?
(General SI- 2012)
ఎ) గురువారం బి) శుక్రవారం
సి) మంగళవారం డి) శనివారం
జవాబు: బి

ముఖ్యాంశాలు

- 2003 సంవత్సరానికి ముందు లీపు సంవత్సరం వచ్చి మూడేళ్లు అయితే అలాంటి సంవత్సరం కావాలంటే 2003+11= 2014
- లీపు సంవత్సరం తర్వాత 2 సంవత్సరాలు అయితే 2006 లాంటి సంవత్సరం కావాలంటే + 11 సంవత్సరాలు చేయాలి. ఉదా. 2006 + 11 = 2017 2006 లాంటి కాలెండర్ 2017.
- లీపు సంవత్సరం వచ్చి 1 సంవత్సరం అయింది. ఉదాహరణకు 2013 లాంటి సంవత్సరం కావాలంటే + 6 సంవత్సరాలు చేయాలి. 2013+ 6 = 2019 2013 క్యాలెండర్ 2019 ఒకటే.
- లీపు సంవత్సరం అయితే + 28 సంవత్సరాలు చేయాలి ఉదా. 2012 + 28 = 2040 2012 క్యాలెండర్ 2040 క్యాలెండర్ ఒకటే.

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్‌లో 350 ప్రొబేషనరీ ఇంజనీర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. ప్రొబేషనరీ ఇంజనీర్(ఈ–2 గ్రేడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 350.
» **పోస్టుల వివరాలు:** ప్రొబేషనరీ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)–200, ప్రొబేషనరీ ఇంజనీర్(మెకానికల్)–150.
» **అర్హత:** బీఈ/బీటెక్/బీఎస్సీ (ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ /కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్ /మెకానికల్) బ్రాంచ్‌లతో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు పాసైతే సరిపోతుంది. ఇవే బ్రాంచ్‌లతో ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ/జీఐఈటీఈ పూర్తిచేసిన వారు, బీఈ/బీటెక్/బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు దరఖాస్తుకు అర్హులు. డ్యూయల్ స్పెషలైజేషన్లు చేసిన వారు దరఖాస్తు చేయడానికి అనర్హులు.
» **వేతనం:**నెలకు రూ.40,000 నుంచి 1,40,000
» **వయసు:** 01.01.2025 నాటికి 25 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ(ఎన్‌సీఎల్), మాజీ సైనికోద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

హెచ్‌యూఆర్‌ఎల్‌లో 51 పోస్టులు


నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని హిందూస్తాన్ ఉర్వరక్ రసాయన లిమిటెడ్ (హెచ్‌యూఆర్‌ఎల్).. ఐవోసీఎల్, ఎన్‌టీపీసీ, సీఐఎల్, ఎఫ్‌సీఐఎల్ అండ్ హెచ్‌ఎఫ్‌సీఎల్ కంపెనీలతో కలిసి వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 51.
» **పోస్టుల వివరాలు:** వైస్ ప్రెసిడెంట్–02, ఇంజనీర్, సీనియర్ ఇంజనీర్–41, మేనేజర్–01, డిప్యూటీ మేనేజర్–02, అసిస్టెంట్ మేనేజర్–03, ఆఫీసర్–02.
» **విభాగాలు:** ప్రొడక్షన్/ఆపరేషన్స్ , కెమికల్(అమ్మోనియా/యూరియా/ఓ అండ్ యూ), మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫైనాన్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి.
» **వయసు:** వైస్ ప్రెసిడెంట్ పోస్టులకు 53 ఏళ్లు, ఇంజనీర్, సీనియర్ ఇంజనీర్ పోస్టులకు 30 నుంచి 32 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 37 ఏళ్లు,మేనేజర్‌కు 40 ఏళ్లు,అసిస్టెంట్ మేనేజర్‌కు 35ఏళ్లు,ఆఫీసర్‌కు 30ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.01.2025
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**29.01.2025
» **వెబ్‌సైట్:** https://hurl.net.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఇది నా గొడవ అనే పేరుతో ఉన్న ఆత్మకథ ఎవరు రచించారు?

అరుదైన కోవకు చెందిన మన తరం మహానుభావుడు కాళోజీ. ఆయన నిజాయతీగా మాట్లాడారు. అనుకున్నది కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు. ప్రభుత్వంతో ఏనాడూ రాజీపడలేదు. పదవుల కోసం పాకులాడలేదు. సామాన్య ప్రజలను మర్చిపోలేదు. ఎల్లప్పుడూ ప్రజల పక్షం వహించి అనేక ప్రజాసమస్యలపై పోరాడారు. ప్రజల గొడవ.. తన గొడవగా, జనం వాణి.. తన బాణీగా వినిపిస్తూ.. నిరంతరం ఉద్యమాన్ని నడిపించారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణను ఉద్దేశించి కాళోజీ 'పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది' అని పేర్కొన్నారు. ఈ మాటలు ఆయనకూ వర్తిస్తాయి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

కాళోజీ నారాయణరావు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న జన్మించారు. ఈయన కుటుంబం కర్ణాటకలోని బీజాపూర్ నుంచి తెలంగాణాలోని వరంగల్ జిల్లాకు వలస వచ్చి మడికొండ గ్రామంలో స్థిరపడింది. కాళోజీ తల్లిదండ్రులు రంగారావు, రమాబాయమ్మ. ఈయన హైదరాబాద్‌లోని చౌమొహల్లా పాఠశాల, సిటీ కాలేజీలో విద్యాభ్యాసం చేశారు. 1939లో హైదరాబాద్ హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ భాషల్లో ప్రముఖ కవిగా గుర్తింపు పొందారు. కాళోజీ జాతీయోద్యమాల్లో చురుగ్గా పాల్గొని అనేక పర్యాయాలు జైలుకు వెళ్లారు. నిజాం ప్రభుత్వ కాలంలో తన రచనల ద్వారా తెలంగాణా ప్రజల్లో దేశభక్తి రేకెత్తించారు. సామాన్య ప్రజలను విశేషంగా ఆకర్షించడం ఈయన కవిత్వానికి ఉన్న ప్రత్యేకత. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండున్నరేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన వందేమాతరం ఉద్యమంలో పాల్గొనడం వల్ల బహిష్కరణకు గురైన విద్యార్థులను నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేర్పించారు.

అన్యాయాన్ని ఎదిరిస్తూ కలమెత్తిన ప్రజాకవి..

కాళోజీ 1948 భారత విలీనోద్యమంలో ఏడు నెలల పాటు వరంగల్, గుల్బర్గా జైళ్లలో శిక్ష అనుభవించారు. వరంగల్‌లో నిజాం రజాకార్లు జాతీయవాది అయిన మొగులయ్యను హత్య చేసినప్పుడు కాళోజీ రాసిన గేయం ప్రజలను కదిలించింది. నిజాం ప్రధానమంత్రి మీర్జా ఇస్మాయిల్ వరంగల్ సందర్శించినప్పుడు 'ఎన్నాళ్ల నుండియో..' అనే గేయం రాశారు. 'అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు సకిలించు ఆంధ్రుడా.. చావవెందుకురా', 'అతిథివోలె వుండి.. అవని విడిచి వెళ్లుతాను' లాంటి కాళోజీ కవితా పంక్తులు ప్రసిద్ధి చెందాయి. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి కాళోజీ వరంగల్‌లో గణపతి ఉత్సవాలు నిర్వహించారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందుకు ఆయన్ని నగరం నుంచి బహిష్కరించారు. హైదరాబాద్‌లో 'ఆంధ్ర సారస్వత పరిషత్' స్థాపకుల్లో ఒకరైన కాళోజీ తెలంగాణా రచయితల సంఘం ఏర్పాటులోనూ ప్రముఖపాత్ర పోషించారు. కేంద్ర ప్రభుత్వం కాళోజీ సేవలను గుర్తించి 1992లో పద్మవిభూషణ్ బిరుదునిచ్చి సత్కరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు 'ప్రజాకవి' బిరుదు ఇచ్చింది. 1992లో వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం కాళోజీకి గౌరవ డాక్టరేట్ బహూకరించింది.

రచనలు

కాళోజీ 'మనమే నయం', 'తెలియక ప్రేమ.. తెలిసి ద్వేషం', 'విభూతి లేక ఫేస్ పౌడర్' తదితర శీర్షికలతో కథలు రాశారు. వ్యంగ్యం, అధిక్షేపాలను కలగలిపి వీటిని రచించారు. సమాజంలో నిరుపేదలు, కష్టజీవుల బతుకులు దుర్భరంగా ఉన్నాయనే వాస్తవికతను కాళోజీ ఈ కథల్లో వ్యంగ్యంగా చిత్రీకరించారు. కె.సి. గుప్తా 1943లో సుల్తాన్ బజార్‌లోని ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీ తరఫున 'అణా గ్రంథమాల' ప్రచురణల వరసలో 24వ గ్రంథంగా 'కాళోజీ కథలు' పేరుతో పుస్తకాన్ని ముద్రించాడు. అప్పట్లో దీని వెల ఒక కల్దారు అణా మాత్రమే. నాడు హైదరాబాద్ రాష్ట్రంలో హాలీ చిక్కాలు (నాణేలు) అమల్లో ఉన్నప్పటికీ దీని ధరను కల్దారులో ప్రకటించారు. 'సుభాష్ చంద్రబోస్' అనే గ్రంథాన్ని ప్రచురించినందుకు ప్రభుత్వం కె.సి. గుప్తాకు ఒక నెల కఠిన శిక్షతో పాటు రూ. 250 జరిమానా, రచయితకు 18 నెలల కఠిన శిక్ష విధించింది. అల్లూరి సీతారామరాజుపై వెలువరించిన గ్రంథాన్ని కూడా నిషేధించింది. ఇలాంటి స్థితిగతులూ, ప్రభుత్వ నిర్బంధ విధానాలు ఉన్నప్పటికీ కాళోజీ ధైర్యంగా తన కలాన్ని కదిలించారు. కాళోజీ 1941లో 'అణా కథలు', 1946లో 'కాళోజీ కథలు', 1953లో 'నా గొడవ' రచించారు. 1969-70లో తెలంగాణా ఉద్యమ కవితలు రచించారు. కాళోజీ ఆత్మకథ 'ఇది నా గొడవ'. దీన్ని 1995లో రచించారు. కాళోజీ నారాయణరావు 2002 నవంబర్ 13న మరణించారు. ఆయన తన దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేశారు.

తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఈ కళాశాల పేరును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చారు.రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ నారాయణరావు జయంతిని 'తెలంగాణా భాషా దినోత్సవం'గా ప్రకటించింది. 2015 సెప్టెంబర్ 9న తొలిసారిగా తెలంగాణా భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ స్మారక పురస్కారం అందించారు. దీన్ని మొదటిసారిగా ప్రముఖ కవి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్‌కు 2015 సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో ప్రదానం చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఏ సంవత్సరంలో జన్మించారు?
   1) 1914 సెప్టెంబర్ 9
   2) 1923 నవంబర్ 10
   3) 1925 అక్టోబర్ 1
   4) 1910 డిసెంబర్ 12
2. 'అణా గ్రంథమాల' సంపాదకుడి పేరు?
   1) వట్టికోట ఆళ్వార్ స్వామి
   2) అడవి బాపిరాజు
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కె.సి.గుప్తా
3. 'ఇది నా గొడవ' అనే పేరుతో కాళోజీ నారాయణరావు ఆత్మకథ ఏ సంవత్సరంలో రచించారు?
   1) 1946 2) 1941
   3) 1995 4) 1953
4. కాళోజీ నారాయణరావు స్మారక ప్రథమ పురస్కార గ్రహీత ఎవరు?
   1) డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్
   2) డాక్టర్ ఎన్. గోపి
   3) డాక్టర్ వల్లూరి శివారెడ్డి
   4) అందెశ్రీ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1.

ఆచార్య సి. నారాయణ రెడ్డి



"తెలుగు కళ్ళకు తెలుసు
నా లలిత కళా రూపం
తెలుగిళ్ళకు తెలుసు
నా కల గీతికా దీపం"

ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి (సినారె) ఈ శతాబ్దపు మహాకవుల్లో ప్రముఖులు. దాదాపు ఐదు దశాబ్దాలుగా సినారెకి తెలుగు సాహి తీవనంలో ప్రత్యేక స్థానం ఉంది. ఈయన తెలంగాణలోని కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా హన్మాజీపేటలో 1931 అక్టోబర్ 29న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు సింగిరెడ్డి బుచ్చమ్మ, మల్లారెడ్డి. సిరిసిల్ల, కరీంనగర్‌లో సినారె ప్రాథమిక, మాధ్యమిక విద్య అభ్యసించారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ., ఎం.ఎ. పట్టాలు పొందారు. 1962లో 'ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు-ప్రయోగాలు' అనే సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ గ్రంథాన్ని 20వ శతాబ్ద పూర్వార్ధ ప్రామాణికమైన సాహిత్య చరిత్రగా పేర్కొనవచ్చు. ఆయన కవిత్వాన్నే ఎన్నుకొని అయా నవీన కవితారీతులు సమగ్రంగా విశ్లేషించి ఆధునిక సాహిత్య నేపథ్యాన్ని సమన్వయించి చూపారు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడ, గిడుగు కృషి వల్ల నూతన సాహిత్య పోకడలు ఆవిష్కృతమయ్యాయి. సాహిత్యంతోపాటు కళాత్మక విలువలు కూడా పెంపొందాయి. కవితా మాధ్యమం, శిల్పమూ, ఛందమూ నూతన అందాలు సంతరించుకున్నాయి. ఈ శతాబ్దంలో మాత్రా ఛందస్సులు, గీతికలు, గేయాలు, రొమాంటిసిజంతో కాల్పనిక కవులు, రచయితలు ప్రభావితులయ్యారు. వారిలో ఆచార్య సినారె కూడా ఒకరని చెప్పుకోవచ్చు.

సాహిత్యం

ఆచార్య సి. నారాయణ రెడ్డి తెలుగు భాషకు సమగ్రపుష్టి. ప్రధానంగా ఈయన నాదకవి. సినారె రచనల్లో అనేక ప్రక్రియలు కనిపిస్తాయి. గీతికలు, గేయాలు, అభినవ కవితలు హృదయాన్ని హత్తుకుంటాయి. ఈయన రచించిన 'దివ్వెల మువ్వలు' లాంటి ముక్తకాల నుంచి 'నాగార్జున సాగరం', 'కర్పూర వసంతరాయలు' లాంటి కథా కావ్యాలు, 'నవ్వని పువ్వు', 'రామప్ప విశ్వదీపం' తదితర సంగీత రూపకాల వరకూ ఈయన కవితా రచనలో నాద తరంగిణి వినిపిస్తుంది. ఈయన స్వయంగా కర్పూర వసంతరాయలు కావ్యం గానం చేస్తుంటే హృదయం పులకరిస్తుంది. ఐదు దశాబ్దాలపాటు సినారె కొన్ని వందల గేయాలు, గీతాలు రచించారు. అనేక సినిమా పాటలు కూడా రాశారు. ఆధునిక సాహిత్యంలో గేయరచనకు స్థిరస్థానం కల్పించారు. డా. సి. నారాయణరెడ్డి పేరు వినగానే కర్పూర వసంతరాయలు, నాగార్జున సాగరం, విశ్వంభర మొదలైన గేయ కథాకావ్యాలు గుర్తుకు వస్తాయి. 'తెలుగు గజళ్లు', 'ప్రపంచ పదులు' లాంటి వినూత్న రచనలు ఆయన ప్రతిభకు తార్కాణాలు. 'విశ్వంభర', 'మట్టీమనిషీ ఆకాశం' లాంటి దీర్ఘకావ్యాలు సినారె తాత్త్వికతకు నిదర్శనాలు. 'మట్టీ మనిషీ ఆకాశం' హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువాదమైంది. ఇవే కాకుండా ఎన్నో వచన కవితలు, గీతాలు, గజళ్లు, ప్రపంచ పదులు, ద్విపదలు రచించారు. సినారె కవిత్వం ఒక నిరంతర ప్రస్థానం. ఎల్లలెరుగని విశ్వమానవీయత ఆయన తత్వం. అనాదిగా మానవ జీవితం విశ్వంలో ఏ విధంగా ప్రతిస్పందిస్తుందీ, విశ్వంతర ప్రకృతిలో మానవ మహితాత్మ ఎలా నిరంతర యాత్ర సాగిస్తోందీ.. అనే విషయాలను తన విశ్వంభర సుదీర్ఘ కావ్యంలో ప్రతిపాదించారు. ఈ కావ్యం సినారెను ఆధునిక భారతదేశ సాహిత్య చరిత్రలో మహాకవిగా, ఆధునికాంధ్ర సార్వభౌముడిగా నిలబెట్టింది. 1988లో 'జ్ఞానపీఠ్ పురస్కారం' సాధించిపెట్టింది. 1990-91లో యుగోస్లేవియాలో జరిగిన 'విశ్వకవి' సమ్మేళనంలో సినారె పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నలభై దేశాలు, నలభై భాషల కవులు పాల్గొన్న సమ్మేళనంలో మనదేశం తరఫున భారతీయ భాషల ప్రతినిధిగా నారాయణరెడ్డిని భారత ప్రభుత్వం పంపించింది. ఈ శతాబ్ద సాహిత్యమూర్తుల్లో విలక్షణ వ్యక్తిత్వం నారాయణ రెడ్డిది. కవితా తాత్త్వికుడిగా, కళావేత్తగా, గాన, సాహిత్యవేత్తగా పేరొందారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రసారస్వత పరిషత్తు అధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. ఈయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

మాదిరి ప్రశ్నలు

1. ఆచార్య సి. నారాయణరెడ్డి తెలంగాణలో ఏ జిల్లాలో, ఎక్కడ జన్మించారు?
   1) కరీంనగర్ జిల్లా-హన్మాజీ పేట
   2) వరంగల్ జిల్లా- హనుమకొండ
   3) మహబూబ్ నగర్ అలంపురం
   4) నల్లగొండ జిల్లా - కొలనుపాక
2. ఆచార్య సి. నారాయణరెడ్డికి ఏ గ్రంథానికి 1988లో జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది?
   1) కర్పూర వసంతరాయలు
   2) నాగార్జున సాగరం
   3) మట్టీ మనిషీ ఆకాశం
   4) విశ్వంభర గేయ కథాకావ్యం
3. కిందివారిలో ఎవరు నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, లాంటి రచనలు చేశారు?
   1) విశ్వనాథ సత్యనారాయణ
   2) డా. సి. నారాయణ రెడ్డి
   3) తిరుమల రామచంద్ర
   4) గుంటూరు శేషేంద్రవర్మ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2.

A European visitor to the..

BANK EXAMS

GENERAL ENGLISH



Model Questions

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)
2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3) / is not possible. (4)/ No error (5)
3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)
4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)
5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study <u>any books</u> on Freud before writing a paper on psychoanalysis.
   1) Much books 2) few books
   3) some books 4) more books
   5) No correction required
7. A European visitor to the Far East must accommodate <u>self from</u> the habits of life that may seem very strange to him.
   1) Himself to 2) his self to
   3) himself for 4) his self from
   5) No correction required
8. He joined postgraduate course in the same college in which he had studied <u>for the three previous years.</u>
   1) from previous three years
   2) during the previous three years
   3) three years previous
   4) during the three previous years
   5) No correction required
9. She always <u>manage</u> to hurt her mother's feelings.
   1) do manage
   2) does manage
   3) did manages
   4) do managed
   5) No correction required
10. It is the people <u>who matters</u> in a democracy.
    1) whom matters
    2) whose matters
    3) whose matter
    4) who matter
    5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
    1) dissent 2) decent
    3) descent 4) dissuade
    5) dispute
12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
    1) Fight, draw
    2) Position, aspect
    3) Plight, drain
    4) Struggle, issue
    5) Rank, exhaust
13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
    1) proper, for
    2) correct, along
    3) suitable, among
    4) valid, from
    5) compelling, counter
14. The modern ______ of communication have ______ distance.
    1) ways, deep
    2) methods, destroyed
    3) paths, shortened
    4) means, annihilated
    5) gadgets, developed
15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
    1) apposite, position
    2) opposite, fact
    3) relevance, media
    4) significance, party
    5) applaudable, generation

Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1)A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with ____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously ______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed ____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the ______ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another ______ (28) member of the unit, Salah Abdelslam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above 4) always 5) alone
22. 1) lost 2) last 3) late 4) lastly 5) lasted
23. 1) urge 2) urging 3) urged 4) pledged 5) plead
24. 1) tight 2) treat 3) tread 4) tough 5) track
25. 1) hate 2) hurt 3) heat 4) hurt 5) hunt
26. 1) thought 2) thinking 3) think 4) thinned 5) thanked
27. 1) from 2) with 3) for 4) form 5) firm
28. 1) suspense 2) suspect 3) suspected 4) suspecting 5) suspects
29. 1) convicted 2) allowed 3) acquitted 4) arrested 5) prosecuted
30. 1) are to 2) will be 3) will been 4) have been 5) were

KEY

1) 3;	2) 2;	3) 4;	4) 5;
5) 4;	6) 3;	7) 1;	8) 2;
9) 2;	10) 4;	11) 3;	12) 3;
13) 4;	14) 4;	15) 1;	16) 4;
17) 1;	18) 5;	19) 1;	20) 3;
21) 1;	22) 2;	23) 3;	24) 4;
25) 5;	26) 1;	27) 2;	28) 3;
29) 4;	30) 5.		

విద్య, ఉద్యోగ సమాచారం

జేఎన్‌పీఏ, ముంబైలో వివిధ ఉద్యోగాలు

ముంబైలోని జవహర్ లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ(జేఎన్‌పీఏ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ఎస్టేట్ కన్సల్టెంట్-01, ఎస్టేట్ కన్సల్టెంట్-01, అనలిస్ట్ కమ్ ప్రోగ్రామర్-01, కంప్యూటర్ ఆపరేటర్-02.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.20,000 నుంచి రూ.65,000.
» **వయసు:** కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు 30 ఏళ్లు, మిగతా పోస్టులకు 58 ఏళ్లు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.02.2025.
» **వెబ్‌సైట్:** https://www.jnport.gov.in

రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలో 23 స్పోర్ట్స్ కోటా పోస్టులు

కపుర్తలా(పంజాబ్)లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సీఎఫ్)లో లెవల్-1, టెక్నీషియన్-3 స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన పురుష, మహిళా క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
» **విభాగాలు:** రెజ్లింగ్, హాకీ, ఫుట్‌బాల్, క్రాస్ కంట్రీ, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్ బాల్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ, యాక్ట్ అప్రెంటిస్ కోర్స్, నేషనల్ అప్రెంటిస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు నోటిఫికేషన్ ప్రకారం అవసరమైన సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జతచేసి ఆఫీస్ ఆఫ్ ది మేనేజర్, రిక్రూట్‌మెంట్ సెల్, రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తల, పంజాబ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 03.02.2025.
» **వెబ్‌సైట్:** https://rcf.indianrailways.gov.in